
ఆంధ్రప్రదేశ్

మే, జూన్ 1968

★

30 పైసలు



ఆంధ్రప్రదేశ్ ను గురించి...

విస్తీర్ణం	1,06,286 చ. మై.
జిల్లాలు	20
తాలూకాలు	189
గ్రామాలు	28,997
పట్టణాలు, నగరాలు	212
మొత్తం జనసంఖ్య (1961) . . .	359.83 లక్షలు
జన సాంద్రత (1961)	339 చ. మై. కి.
అక్షరాస్యులు (1961)	76 27 లక్షలు
షెడ్యూల్డు కులాలవారు(1961)	49 71 లక్షలు
షెడ్యూల్డు తెగలవారు(1961)..	13 24 లక్షలు
నమోదైన కర్మాగారాలు	3,928
విశ్వవిద్యాలయాలు	4
పంచాయతీలు	15,266
పంచాయతీ సమితులు	321
ఆంధ్రప్రదేశ్ నుండి పార్లమెంటు సభ్యులు .	61
విధానసభ సభ్యులు ..	288
శాసనమండలి సభ్యులు ..	90

ఆంధ్ర ప్రదేశ్

సంపుటి: 12]

మే-జూన్ – 1968

వైశాఖ–ఆషాఢ – 1890 శా.శ.

[సంచిక: 7 & 8

ప్రధాన సంపాదకులు

వి. యస్. రామన్, ఐ. ఎ. యస్.

సంపాదకులు

ఎస్. వి. గోపాలశాస్త్రి

ఈ సంచికలో...

పేజీ

మొదటి అట్ట : ఆంధ్రప్రదేశ్ గవర్నరుగా శ్రీ ఖండూభాయ్ దేశాయ్ ఏప్రిల్ 10 న నగరానికి విచ్చేసినప్పుడు ముఖ్యమంత్రి హృదయపూర్వక స్వాగతం చెప్పినప్పటి చిత్రం

మూడవ అట్ట : హిందుస్థాన్ నౌకా నిర్మాణ కేంద్రంలో నిర్మించిన నలభయ్యవ వాణిజ్య నౌక 'విశ్వశక్తి' జల ప్రవేశం ఏప్రిల్ 15 న ముఖ్యమంత్రి జరిపారు.

నాలుగవ అట్ట : దేశోద్ధారకుని శతజయంత్యుత్సవం సందర్భంగా రవీంద్రభారతిలో ఏర్పాటు చేయబడిన షోడశ వీణా వాద్యకచేరీ

[ఈ సంచికలోని రచయితల అభిప్రాయాలు ప్రభుత్వానికి సంబంధించినవి కావు. సం॥]

****

నెహ్రూజీ ఆశయాలకు మనం పునరంకితులం కావాలి

****



జవహర్‌లాల్ నెహ్రూ స్మృతి చిహ్నాలు ఎన్నిటినో నిర్మించుతున్నాం. అయితే నిజమైన స్మృతి చిహ్నం వేరేవుంది. అది–మన హృదయాలలో నిర్మించుకోవలసిన చిహ్నం. నెహ్రూ ఆశయాలకు వాస్తవ రూపకల్పన చేసేందుకు, సుందర భవిష్య ద్భారతావనిని నిర్మించుకునేందుకు మనం దృఢచిత్తులం కావాలి. అదే ఆయనకు మనం మన హృదయాలలో శాశ్వతంగా నిర్మించే స్మృతి చిహ్నం.

జాతీయ సమైక్యత, పార్లమెంటరీ ప్రజాస్వామ్యం, సాంఘిక సమానత, ఆర్థిక ప్రగతి, శాస్త్రీయ సాంకేతికాభివృద్ధి, సామ్యవాద సిద్ధాంతాల వ్యాప్తి, మతరహిత వ్యవస్థ, అంతర్జాతీయ సత్సంబంధాల వికాసం–వీటికొరకే ఆయన అర్ధ శతాబ్దికి పైగా అవిరళ కృషిచేశారు. ఇవే ఆయన సిద్ధాంతాలలోని మూలస్తంభాలు వీటిమీదే పటిష్ఠమైన భారతదేశం రూపొందుతుంది.

ఈనాడు వారు శారీరకంగా మన మధ్య లేకపోవచ్చు. కాని వారి ఆత్మ మనముందు ఎప్పుడూ మార్గదర్శకంగా నిలుస్తూనేవుంటుంది. ఒక కొత్త శకానికి నాంది జరిగిన వర్తమాన వ్యవస్థలో, మనం ఆయన ఆశయాలకు రూపకల్పన చేసేందుకు కంకణం కట్టుకోవాలి.

మన జాతి పురోభివృద్ధి చరిత్ర

గత రెండు దశాబ్దాలుగా భారత దేశంలో జరుగుతున్న అభివృద్ధి మందకొడిగా వుంటున్నదని విమర్శిస్తున్నవారు, దేశానికి స్వాతంత్ర్యం లభించినప్పుడు జాతి నిర్మాతలు బృహత్తర కార్య భారాన్ని ఎదుర్కొనవలసివచ్చినదనే విషయాన్ని విస్మరిస్తున్నారు.

ప్రణాళికా ప్రగతి

1951 నుంచి 1966 వరకు గడిచిన 15 సంవత్సరాల కాలంలో దేశంలో సాధించిన ప్రగతిని గురించి తెలుసుకుందాం.

ఈ కాలంలో తలసరి సగటు ఆదాయం 1960_61 ధరలను బట్టి రూ. 275ల నుంచి రూ. 325 లకు పెరిగింది. నాలుగవ ప్రణాళిక ముగింపు నాటికి ఇది రూ. 417 లకు పెరిగే అవకాశం వుంది. దేశం సాధించిన ప్రగతిని మదింపు వేయడానికి సాధారణంగా తలసరి సగటు ఆదాయాన్ని కొలమానంగా తీసుకుంటారు.

బొగ్గు, జలవిద్యుచ్ఛక్తి, పెట్రోలియంతోసహా వివిధ శక్తి సంపన్నమైన వనరుల అభివృద్ధి గణనీయంగా జరిగింది. స్థాపిత విద్యుదుత్పాదకశక్తి 2.3 మిలియన్ కిలోవాట్ల నుంచి 1966 నాటికి 10 మిలియన్ కిలోవాట్లకు పెరిగింది. వచ్చే అయిదు సంవత్సరాలలో యిది బహుశః 20 మిలియన్ కిలోవాట్లకు పెరుగుతుంది. ఎన్నో భారీ నదీలోయ ప్రాజెక్టుల నిర్మాణం పూర్తయింది, కొన్నిటి నిర్మాణం చురుగ్గా జరుగుతున్నది. దాదాపు 55,000 పట్టణాలకూ, గ్రామాలకూ విద్యుచ్ఛక్తి సౌకర్యాలు కల్పించబడినవి.

స్వాతంత్ర్యానికి పూర్వం దేశం, పెట్రోలియం ఉత్పత్తుల కొరకు దాదాపు పూర్తిగా విదేశాలపై ఆధారపడవలసి వచ్చింది. కాని తరువాత చమురు అన్వేషణ కార్యక్రమాలను పెద్ద ఎత్తున ముమ్మరంగా చేపట్టిన ఫలితంగా అస్సాం, గుజరాత్ ప్రాంతాలలో క్రొత్త చమురు నిక్షిప్తాలు బయల్పడ్డాయి. క్రూడ్ ఆయిల్ ఉత్పత్తి 1951వ సంవత్సరంలో సుమారు 60,000 టన్నులు వుండగా 1966 నాటికి యిది దాదాపు 5,00,000 టన్నులకు హెచ్చింది. ప్రభుత్వ ప్రైవేటు రంగాలలో ఆరు నూనెశుద్ధి కర్మాగారాలను స్థాపించడం వల్ల దేశంలో నూనెను శుద్ధిచేసే శక్తి సుమారు 12 మిలియన్ టన్నులకు పెరిగి విదేశీ మారకం ఆదాకు అవకాశం ఏర్పడింది.

ఇతర ప్రాతిపదిక పరిశ్రమల పురోగతి కూడా యిదే మాదిరిగా సంతృప్తికరంగా వుంది. ముడి ఇనుము, ఉక్కు వుత్పత్తి అయిదు మొదలు ఆరు రెట్లు పెరిగింది. పారిశ్రామిక యంత్రపరికరాల వుత్పత్తిలో గణనీయమైన అభివృద్ధి సాధ్యమైంది.

ఆవిరి, డీసెల్, విద్యుచ్ఛక్తితో నడిచే యంత్రాలను, రైలు వ్యాగన్లను, మోటార్లను, కొన్ని విడిభాగాలను తప్ప ఇప్పుడు దేశంలోనే తయారుచేస్తున్నారు. దేశం స్వయం సమృద్ధతను సాధిస్తున్నకొద్దీ ఈ విడిభాగాల దిగుమతి సైతం క్రమేపీ తగ్గిపోతున్నది. యంత్ర పరికరాల ఉత్పత్తి బాగా పెరిగింది.

వినియోగ వస్తువులకు దేశంలో మంచి మార్కెటు వుంది. వస్త్రాలు, బైసికిళ్లు, కుట్టుమిషన్లు, రేడియో సెట్లు, విద్యుత్ పంఖాలు, రేజర్ బ్లేడ్లు, వాచీలు, సబ్బులు మొదలైన వినియోగ వస్తువులలో దేశీ వుత్పత్తుల వాడకం బాగా పెరిగి దిగుమతులు తగ్గిపోయాయి. విటమిన్లు, హార్మోన్లు, ఏంటీబయాటిక్స్‌తో సహా అన్నిరకాల ఆధునిక ఔషధాలూ ఇప్పుడు దేశంలోనే తయారవుతున్నాయి. వీటిలోకొన్ని విదేశాలకు ఎగుమతి కూడా అవుతున్నవి.

వ్యవసాయానికి అధిక ప్రాధాన్యం

దేశంలో ఆహార పరిస్థితి క్లిష్టంగా వున్నప్పటికీ వ్యవసాయోత్పత్తి రంగంలో కూడా దేశం అభివృద్ధి సాధించింది.

పపంచ ప్రమాణాల దృష్ట్యా దేశంలో దిగుబడి స్థాయి తక్కువగా వున్నా ఆహారధాన్యాల వుత్పత్తి మొత్తంమీద 1950 నుంచి బాగా పెరిగింది. ముఖ్యంగా 1964-65 లో దాదాపు 60 శాతం హెచ్చింది.

దేశ జనాభాలో 70 శాతం మంది వ్యవసాయంపై ఆధారపడడం వల్లనూ, సుస్థిర ఆర్థిక వ్యవస్థకు యిది పునాది కావడం వల్లనూ అన్ని ఆర్థికాభివృద్ధి ప్రణాళికలలోను ఈ రంగానికి అధిక ప్రాధాన్యం లభిస్తున్నది.

వ్యవసాయ రంగాన్ని అభివృద్ధిపరిచి, ఆహార విషయంలో దేశాన్ని సాధ్యమైనంత శీఘ్రంగా స్వయం సమృద్ధం చేయడానికి దేశ వ్యాప్తంగా కృషి జరుగుతున్నది. రైతులకు కొత్త విత్తనాలను, ఎరువులను, క్రిమి సంహారక పదార్థాలను సరఫరా చేయడంద్వారానూ, తగినంత నీటిని అందించడం ద్వారానూ, సాంకేతిక సలహాలు యివ్వడంద్వారానూ తీవ్రతర సేద్యాన్ని ప్రోత్సహించి ఆహారోత్పత్తిని అధికం చేయడానికి ప్రయత్నం జరుగుతున్నది. ప్రస్తుతం సుమారు 5 మిలియన్ల ఎకరాలలో తీవ్రతర వ్యవసాయం సాగుతున్నది. ఈ విస్తీర్ణంలో ఎక్కువ దిగుబడి నిచ్చే వరి, గోధుమ వంగడాలు వేశారు. నాలుగవ ప్రణాళిక ముగింపు నాటికి 32 మిలియన్ల ఎకరాలకు తీవ్రతర సేద్యాన్ని విస్తృతీకరించ దలచారు.

1951 వరకు దేశంలో రసాయనిక ఎరువుల వుత్పత్తి జరిగేది కాదు. అయితే యిప్పుడు యిచ్చట యేటా 3,00,000 టన్నులకుపైగా రసాయనిక ఎరువుల వుత్పత్తి జరుగుతున్నది. 1970 నాటికి వుత్పత్తి 8 రెట్లకు పెరుగుతుంది.

నీటి పారుదల జరిపే పంపులు, ట్రాక్టర్ల వుత్పత్తి హెచ్చింది. త్వరితంగా చేపట్టడానికి వీలైన చిన్న తరహా నీటి పారుదల పథకాలకు హెచ్చు ప్రాధాన్యం యిస్తున్నారు. వ్యవసాయ విద్య, పరిశోధనలు విస్తృతీకరించబడుతున్నవి.

రైతుకు సాంకేతిక సలహాలు, సహాయం కంటే కూడా ముఖ్యంగా కావల్సింది ప్రోత్సాహం, పరపతి సౌకర్యాలు. సేద్యం చేసే రైతులకు భూములపై యాజమాన్యాన్ని సంక్రమింప జేయడానికి ఉద్దేశించిన భూ సంస్కరణలను యిప్పుడు అనేక రాష్ట్రాలలో ప్రవేశపెట్టారు. వ్యవసాయోత్పత్తుల ధరల సంస్థ సిఫార్సుల ననుసరించి రైతులకు లభించేవిధంగా వివిధ ముఖ్య వ్యవసాయోత్పత్తులకు అప్పుడప్పుడు కనీస ధరలను స్థిరీకరిస్తున్నారు. సహకార పరపతి సంఘాలద్వారా రైతాంగానికి వడ్డీ వ్యాపారుల బెడద లేకుండా చేయడం జరుగుతున్నది. ఇట్టి సంఘాలు 3,50,000 వరకు వున్నాయి.

ముందు పేర్కొన్న వివిధ చర్యలవల్ల భారత వ్యవసాయ రంగం అభివృద్ధి శీఘ్రగతిని సాధ్యమవుతుంది. ఇందువల్ల వ్యవసాయోత్పత్తి బాగా పెరిగి దేశ ఆహార సమస్య పరిష్కారం కావడమే గాక మొత్తం మీద దేశ ఆర్థిక వ్యవస్థకూడా మెరుగు పడుతుంది. గ్రామాలలో ఆదాయం పెంపొందడంతో ఫ్యాక్టరీ వుత్పత్తులకు గిరాకీ హెచ్చి పారిశ్రామికోత్పత్తికి ప్రోత్సాహం లభిస్తుంది. ఇతోధికంగా ఆహార ధాన్యాలు మార్కెటులోనికి రావడంతో ధరలు అదుపులోనికి వస్తాయి ద్రవ్యోల్బణ ఒత్తిడులు సమసిపోతాయి.

అయితే జనాభా పెరుగుతూ పోయినట్లయితే ఆహార రంగంలో సాధించిన అభివృద్ధికీ, దేశఆర్థిక వ్యవస్థలో సాధించిన ప్రగతికీ విఘాతం ఏర్పడుతుంది. ప్రస్తుతం దేశ జనాభా 2.5 శాతం చొప్పున పెరిగిపోతున్నది. అంటే ఈ పెరుగుదల ప్రతి సంవత్సరం సుమారు 12 మిలియన్ల చొప్పునవుంది. దేశ సర్వతోముఖాభివృద్ధికి కుటుంబ నియంత్రణ కీలకం అనే అంశాన్ని గుర్తించి ప్రభుత్వం దేశ వ్యాప్తంగా కుటుంబ నియంత్రణ కార్యక్రమాన్ని అమలు జరుపుతున్నది. వివిధ ప్రదేశాలలో ముఖ్యంగా గ్రామాలలో 16,000 లకు పైగా కుటుంబ నియంత్రణ కేంద్రాలను నెలకొల్పడం జరిగింది. వెయ్యికి 40 చొప్పున వున్న జననాల రేటును సాధ్యమైనంత త్వరలో 25 కు తగ్గించడం లక్ష్యంగా పెట్టుకొనబడింది

సాంఘిక పరివర్తన

స్వాతంత్ర్యోద్యమం అనంతరం దేశంలో సాంఘికమైన, మానసికమైన, రాజకీయమైన పరివర్తన వచ్చింది వయోజన ఓటింగు పద్ధతి రావడం వల్ల, విద్యావ్యాప్తి జరగడం వల్ల వ్యక్తిగత హక్కుల పట్ల చైతన్యం పెరిగింది.

పద్దెనిమిది మాసాల స్వల్ప వ్యవధిలో యిద్దరు ప్రధాన మంత్రుల నిర్యాణం జరిగినప్పుడు కొత్త నాయకుని ఎన్నిక సాఫీగా సాగిపోవడం ద్వారా భారత ప్రజాస్వామ్యం శక్తి ప్రదర్శితమైంది. గత రెండు దశాబ్దాలుగా దేశం రాజకీయంగా సుస్థిరంగా వుంది

దేశ చరిత్రలో 20 సంవత్సరాలు దీర్ఘకాలం కాదు. ఎన్నో అవరోధాలు, ఇబ్బందులు, పరీక్షలు ఎదురైనప్పటికీ భారత దేశం ఈ కాలంలో అనేక రంగాలలో అప్రతిహతంగా పురోగమించింది. అశేష ప్రజానీకానికి సుఖ సంతోషాలకు యితోధికంగా అవకాశాలు కలిగించి పరిపూర్ణ జీవితాన్ని ప్రసాదించ డానికి దేశం నిర్మాణాత్మకంగా కృషి సాగిస్తున్నది. (వి. ఎస్. నందా "స్పేన్"లో వ్రాసిన వ్యాసంలోని భాగాలు)

పంచాయతీ విషయాల ప్రత్యేక కమీషనరు

పంచాయతీరాజ్ శాఖలో ఒక ప్రత్యేక కమీషనరును ఏర్పాటు చేయడం జరుగుతుంది. పంచాయతీరాజ్ శాఖ ప్రస్తుత కార్యదర్శికిగల పరిపాలనాధికారాలు ఈ కమీషనరుకు వుంటాయి రాష్ట్ర మంత్రి మండలి మే 4 న ఈ నిర్ణయాన్ని తీసుకుంది.

రెవెన్యూ బోర్డు సభ్యులలో ఒక సభ్యుని పంచాయతీరాజ్ కమీషనరుగా నియమించాలనీ, పంచాయతీరాజ్ సెక్రటేరియట్‌ను ప్రణాళికా శాఖకు సంబంధించిన కార్యదర్శి అధీనం క్రింద ప్లానింగ్ సెక్రటేరియట్‌తో విలీనం చేయాలనీ నిశ్చయించబడింది. ప్రస్తుతం పంచాయతీరాజ్ శాఖ కార్యదర్శి పంచాయతీరాజ్ అదనపు కమీషనరుగా వ్యవహరిస్తున్నారు. కమీషనరుగా వ్యవహరించ బడుతున్న రెవెన్యూబోర్డు సభ్యుడే జిల్లా పరిషత్తులను తనిఖీ చేసేవారు. వీరికి నిర్వహణాధికారాలు వుండేవి కావు.

పరిపాలనా విషయాల సంస్కరణల సంఘం చేసిన సిఫారసుల మేరకు ప్రభుత్వం యీ నిర్ణయం తీసుకుంది ప్రస్తుతం వున్న పంచాయతీరాజ్ సెక్రటేరియట్ సిబ్బందిని సెక్రటేరియట్, కమీషనర్ కార్యాలయాల మధ్య పంపిణీ చేస్తారు. కమీషనర్ కార్యాలయానికి కేటాయించిన సిబ్బంది ప్రస్తుతం వారు తీసుకుంటున్న జీతాన్నే పొందుతుంటారు. వారికి డిప్యుటేషన్ అలవెన్సు యివ్వబడదు. వారున్నూ, సెక్రటేరియట్‌లో వుంటున్న సిబ్బందిన్నీ సెక్రటేరియట్‌లో ప్రమోషన్ల విషయంలో ఒక యూనిటుగా వ్యవహరింపబడతారు. ఈ కొత్త పథకంవల్ల అదనంగా సిబ్బందిని ఏర్పాటు చేయడం గానీ, ఉన్న సిబ్బందిని తగ్గించడం గాని జరగదు.

ఏజెన్సీ ప్రాంతాభివృద్ధికై ప్రణాళిక

రాష్ట్రంలో ఏజెన్సీ ప్రాంతాల సమగ్రాభివృద్ధికీ ఆ లక్ష్యసాధనకూ తీసికోవలసిన సమగ్రమైన చర్యలను గూర్చి ఏప్రెల్ 16వ తేదీన ఉన్నత స్థాయి సమావేశ మొకటి చర్చించింది.

రెవిన్యూ మంత్రి శ్రీ వి. బి. రాజు అధ్యక్షత వహించారు. దాదాపు 5 లక్షల గిరిజన జనాభా కలిగివున్న శ్రీకాకుళం, విశాఖపట్నం, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఖమ్మం, వరంగల్, ఆదిలాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాల కలెక్టర్లు ఈ సమావేశానికి హాజరయ్యారు. రాష్ట్రంలో దాదాపు 13 లక్షల గిరిజనులున్నారు. పై ఎనిమిది జిల్లాలలోను నోటిఫైడ్ గిరిజన (షెడ్యూలు) ప్రాంతాలున్నాయి. వీటిలో 4,455 గ్రామాలలో 11,600 చ. మై. విస్తీర్ణం గల షెడ్యూలు ప్రాంతాలున్నాయి

రెవిన్యూ బోర్డు సభ్యులు, ఛీఫ్ ఇంజనీర్లు, అడవుల ఛీఫ్ కన్సర్వేటరు, కార్యదర్శులు, గిరిజనాభివృద్ధి కార్పొరేషన్ అధికార్లు, గిరిజన సంక్షేమశాఖ డైరెక్టరు ఈ సమావేశానికి హాజరయ్యారు. విద్య, సాంఘిక సంక్షేమం, నీటిపారుదల, కమ్యూనికేషన్ల మంత్రులు చర్చలలో పాల్గొన్నారు.



గిరిజన ప్రాంతాలలో జన, నైసర్గిక సాధన సంపత్తుల్ని అభివృద్ధి పరచేందుకు దీర్ఘకాలిక, సత్వర చర్యాత్మక సమగ్ర పథకాన్ని తయారు చేయ వలసిందిగా ముఖ్యమంత్రి సమావేశాన్ని కోరారు. ఈ విషయమై చేయవలసిన వివిధ చట్టాలను అనుసరింపవలసిన క్రమబద్ధమైన పద్ధతులను పరిశీలించవలసిందిగా కూడా వారు కోరారు. గిరిజనులకు సాగుకు లాయికమైన భూములను యిప్పించే అవసరాన్ని ఉద్ఘాటిస్తూ, గిరిజనేతరులు గిరిజన భూముల్ని కలిగివుండ కూడదనే అంశను తీవ్రంగా అమలు జరిపించాలన్నారు. వ్యావసాయకంగా లాభదాయకమైన కార్యక్రమాల్ని చేపట్టేందుకై గిరిజనులకు పెద్దఎత్తున పరపతి సహాయాన్ని అందజేయాలని అన్నారు..

షెడ్యూలు ప్రాంతాలలో ఒకే రకమైన కాలపరిమితి కలిగిన భూమి కౌలు విధానం లేదన్నారు, రెవిన్యూశాఖా మంత్రి. ముత్తదారి, మాల్గుజారి, జమీందారీల వంటి పద్ధతులకు చెందిన మధ్యవర్తులుంటున్నారనీ, రాష్ట్రపతి ఉత్తర్వుమీద ఈ విధానాలను రద్దు చేయవలసిన అవసరమున్నదని అన్నారు.

రద్దు విషయమై సుముఖత

ఈ విధానాలను సత్వరమే తొలగించివేయాలని సభ్యుల ఏకాభిప్రాయం. సత్వరమే సెటిల్‌మెంట్ పనులు జరిపిస్తే రైతు

వారి గిరిజన ప్రాంతాలలో భూముల కేటాయింపు జరగ గలదని మంత్రి అన్నారు.

రాజ్యాంగ చట్టం ప్రారంభించక పూర్వమే చాలాముందుగా తెలంగాణా ఏజెన్సీ ప్రాంతంలో సర్వే, సెటిల్‌మెంట్, పంపిణీ వగైరాలు జరిగాయి. ఆదిలాబాద్, వరంగల్లు, మహబూబ్‌నగర్ జిల్లాలలోను, ఖమ్మం జిల్లాలోని తెలంగాణా ప్రాంతంలోను ఈ సమస్య అంత తీవ్రంగా లేదన్నారు. సమావేశంలో ఈ క్రింది విషయాలపై చర్చ జరిగింది. మధ్యవర్తుల విధానాన్ని రద్దు పరచడం, గిరిజనులకు భూముల సెటిల్‌మెంట్ జరిపించడం, గతంలో జరిగిన భూముల పంపిణీపై నిషేధముంచడం—వంటివిషయాల్లో ఉత్తరువులు జారీచేయడం, సవరణలు జరిపించి పూర్తినిషేధాన్ని అమలు జరిపించడం చేయాలి

ఈ క్రింది అంశాల పై సమావేశం 4 భాగాలుగా విభజింప బడింది.

(అ) భూముల పంపిణీ, (ఆ) గిరిజనాభ్యుదయం_పరపతి, (ఇ) సాంఘికసేవలు _ రవాణావారసౌకర్యాలు, (ఈ) నీటి పారుదల_విద్యుచ్ఛక్తి.

ఏప్రిల్ 17వ తేదీన సమావేశంలో చర్చించేందుకై ఈ బృందాలు తమ తమ నివేదికలను సమర్పించడం జరిగింది.

స్థానిక ఉత్పత్తులను ప్రభుత్వం కొనుగోలు

తమకు అవసరమైన వస్తువులను స్థానిక ఉత్పత్తిదార్ల నుండి కొనుగోలు చేయాలని ప్రభుత్వం అన్ని శాఖలకు ఆదేశాలు జారీచేసింది. స్థానిక పరిశ్రమలకు ప్రోత్సాహం కలిగించడానికి యీ చర్య తీసుకోబడింది.

వివిధ ఉత్పత్తుల రకాలకు దిగువ తెల్పిన ధరల ప్రాధాన్యతను అనుమతించబడింది.

1. దిగుమతి చేయబడిన వస్తువులకన్నా దేశీయ వస్తువులకు 15 శాతం ధరల ప్రాధాన్యత,

2. ఇతర భారతీయ ఉత్పత్తులకన్నా, రాష్ట్రంలో తయారైన వస్తువులకు 5 శాతం ధరల ప్రాధాన్యత.

3. కుటీర, లఘు పరిశ్రమల ఉత్పత్తులకు 10 శాతం ధరల ప్రాధాన్యత.

4. సహకార సంఘాలు తయారుచేసిన ఉత్పత్తులకు 5 శాతం ధరల ప్రాధాన్యత.

5. ఐ. ఎస్. ఐ. మార్కుతో ఉన్న రాష్ట్రంలో తయారైన వస్తువులకు, ఐ ఎస్. ఐ స్థాయిలో లేని యితరవస్తువులకన్నా 2 శాతం ధరల ప్రాధాన్యత యివ్వబడుతుంది. పైన పేర్కొన్నధరల ప్రాధాన్యతలకు తోడు అదనంగా యిది ఉంటుంది.

అన్ని ప్రభుత్వ శాఖలు కేవలం ఐ. ఎస్ ఐ. మార్కుగల వస్తువులనే కొనుగోలు చేయడానికి ప్రభుత్వం 53 అంశాలను రిజర్వు చేసింది.

ఈ వస్తువులను లఘు పరిశ్రమలనుండి మాత్రమే కొనుగోలు చేయాలనీ పైన తెల్పిన ధరల ప్రాధాన్యతలను విధిగా పాటించాలనీ అన్ని శాఖలకు ప్రభుత్వం ఆదేశించింది. ఈ ఆదేశాలను పాటింపజేసే బాధ్యత పరిశ్రమల శాఖ డైరెక్టరుపై ఉంది. ఈ సందర్భంలో సహాయం అభిలషించే పారిశ్రామికవేత్త పరిశ్రమల శాఖ డైరెక్టరును సంప్రదించవచ్చు.

శాసనపర్వం

రాబడి పెంపుదలకు ఇటీవల తీసుకున్న శాసన చర్యలు

మోటారు శకటాల పన్ను, అమ్మకం పన్నులను పెంచడంద్వారా ఎక్కువ ఆదాయం పొందడానికై ప్రభుత్వం, ఇటీవల ముగిసిన బడ్జెటు సమావేశంలో రెండు శాసనాలు ప్రవేశపెట్టింది.

1963 వ సంవత్సరపు ఆంధ్రప్రదేశ్ మోటారు శకటాల చట్టంలోని షెడ్యూలును సవరించడంద్వారా మోటారు పన్నును హెచ్చించడానికి ఉద్దేశించారు. హైదరాబాదు, సికిందరాబాదు మునిసిపల్ హద్దులు, లేక పట్టణ మునిసిపల్ ప్రాంతాలు మినహా యితర ప్రదేశాలలోని రూట్లలో ఆరుగురికంటే ఎక్కువమంది ప్రయాణీకులను తీసుకొనివెళ్లే మోటారు వాహనాలపైన పైన తెలిపిన సవరణననుసరించి పన్నురేటు పెరుగుతుంది. దీని ప్రకారం ఇప్పటివరకు, మూడు నెలలకు రూ. 60.50ల చొప్పున చెల్లిస్తున్న శకటాలకు ఇప్పుడు రూ.121.00ల చొప్పున, అలాగే రూ. 67.50లు చెల్లిస్తున్న శకటాలకు రూ. 135 00ల చొప్పున చెల్లించవలసి వుంటుంది. రాష్ట్రంలో మొత్తం 4110 స్టేజి క్యారేజీలూ, రవాణా శకటాలూ వున్నట్లుగానూ, వాటిలో రోడ్డు రవాణా కార్పొరేషనుకు చెందినవి 1900 వున్నట్లుగానూ అధికారికంగా వెల్లడించారు.

డీసెల్ ఆయిల్, పెట్రల్ ధరలు, నిర్వహణ వ్యయం, వేతనాలూ పెరగడంవల్ల ఇటీవలి సంవత్సరాలలో రవాణా సాధనాల ఖర్చు హెచ్చిందనడంలో సందేహంలేదు. పైన పేర్కొన్న హెచ్చింపువల్ల బహుశః రూ.2.5 కోట్లు మొదలు రూ.3 కోట్లవరకు ఆదాయం లభిస్తుంది. ఈ రాబడివల్ల వంతెనలు, కల్వర్టులు మొదలైన నిర్మాణాలు చేపట్టడానికీ, రోడ్లను సరిఅయిన స్థితిలో నిర్వహించడానికీ, రాకపోకలను మెరుగుపరచడానికి వీలు కలుగుతుంది.

అమ్మకం పన్ను బిల్లు

ఆంధ్రప్రదేశ్ అసాధారణ గెజెటు 4_ఏ భాగం 2_2_1968 తేదీ సంచికలో ప్రచురింపబడి, 22_3_1968 తేదీన శాసనసభచే ఆమోదించబడిన ఆంధ్రప్రదేశ్ సాధారణఅమ్మకం పన్ను[సవరణ] బిల్లు, కొన్ని వస్తువుల పైన అమ్మకం పన్నును హెచ్చించడానికి

ఉద్దేశించబడింది. అమ్మకం పన్ను చట్టాన్ని మోటారు స్పిరిటుకు వర్తింపజేయడానికి, 1960 వ సం. పు మోటారు స్పిరిటు పన్ను చట్టాన్ని రద్దుపరచడానికి కూడా యిది ఉద్దేశించబడింది.

బెల్లం అమ్మకంపైన, 1963 ఆగష్టు 3 వ తేదీనుంచి, ప్రతి రూపాయి టర్నోవరకూ 3 పైసల చొప్పున మల్టీపాయింటు టాక్సు విధించడానికి 3 వ సెక్షను అవకాశం కలిగిస్తున్నది.

చక్కెర, పొగాకు, ప్రత్తి, వస్త్రాలు, రేయాన్, కృత్రిమ పట్టువస్త్రాలు, ఉన్ని వస్త్రాలపైన అదనంగా ఎక్సైజు సుంకం విధించడానికి 1957 వ సం. పు అదనపు ఎక్సైజు సుంకాల (ప్రత్యేక ప్రాముఖ్యంగల వస్తువులు) చట్టం కేంద్రప్రభుత్వానికి అధికారం యిస్తున్నది. అదనపు ఎక్సైజు సుంకాల దృష్ట్యా ఈ వస్తువులు ఆంధ్రప్రదేశ్ సాధారణ అమ్మకం పన్ను విధింపునుంచి మినహాయించబడినాయి. కనుక ప్రభుత్వవిధానం రెట్టింపు పన్నును దేనిమీదా విధించరాదన్న సిద్ధాంతానికి అనుగుణంగా వుంది.

5 (1-ఏ) వ సెక్షను, దుకాణాల తనిఖీలను చాలా పటిష్ఠం చేయడానికీ, పన్నుల ఎగవేతను నిర్మూలించడానికీ తోడ్పడుతుంది. దుకాణాల తనిఖీల సందర్భంలో వివరాలతో కూడుకొని లేనట్టివిగా కనుగొనబడిన అమ్మకాలకు సంబంధించిన లెక్కలను ఈ సెక్షను క్రింద అధికార్లు అసమగ్రమైనవిగానూ, తప్పుడువిగానూ పరిగణించవచ్చు. ఇటువంటి అమ్మకాల విషయంలో తమ విచక్షణాను సారం మదింపులు చేయడానికి అధికార్లకు ఈ నిబంధన అవకాశం కలుగజేస్తుంది. వర్తకులు నిర్ణీత గడువులోపుగా అమ్మకాలకు సంబంధించిన వివరాలను దాఖలు చేయని సందర్భంలోనూ, లేదా తనిఖీ తరువాత అక్కౌంట్లు, రిజిష్టర్లు తదితర పత్రాలను అందజేసిన సందర్భంలోనూ, చట్టంక్రింద పన్ను విధించబడవలసి వుండి అమ్మకంపన్నుశాఖ జాబితాలలో పేర్లు లేనటువంటి వర్తకులపైన పన్ను విధించడానికి కూడా ఈ నిబంధన అవకాశం కలుగజేస్తుంది.

ఆరవ సెక్షను, వ్యాపారం నిలిపివేసిన, లేక ఎత్తివేయబడిన సంస్థ, లేక హిందూ అవిభాజిత కుటుంబం టర్నోవరు మదింపుకు సంబంధించినది. ఏడవ సెక్షను పన్ను చెల్లింపు గడువుకు సంబంధించినది.

సకాలంలో చెల్లించని పన్నులను భూమిశిస్తు బకాయీల మాదిరిగా వసూలు చేయడానికి 8 వ సెక్షను అవకాశం యిస్తుంది. 9 వ సెక్షను ననుసరించి చెక్‌పోస్టులను నెలకొల్పడానికీ, నిర్బంధాలు విధించడానికీ రెవిన్యూబోర్డు (వాణిజ్య పన్నులు) కు కూడా అధికారం వుంటుంది కొన్ని సందర్భాలలో పన్ను వసూళ్ళను 30 ఏ సెక్షను నిషేధిస్తుంది. ఈ సెక్షను నిబంధనలను ఉల్లంఘించిన వారికి 30 బి సెక్షను ప్రకారం పెనాల్టీ విధించవచ్చు పెనాల్టీ విధించిన కారణాలనే పురస్కరించుకొని ప్రాసిక్యూట్ కూడా చేయడాన్ని 30 (బి) (4) సెక్షను నిరోధిస్తుంది.

నిబంధనద్వారా ఒకే అపరాధానికి రెండు పర్యాయాలు శిక్షించరాదన్న న్యాయసూత్రాన్ని ప్రభుత్వం పాటించింది.

దిగువ పేర్కొన్న వస్తువులపై పన్నురేట్లను హెచ్చించడానికి వీలుగా చట్టంలోని మొదటి షెడ్యూలును సవరించడానికి 12 వ సెక్షను ఉద్దేశించబడింది :-

(1)	రబ్బరు, లేక యితర పదార్థంతో తయారు చేయబడిన టైర్లు, ట్యూబులు, తదితర ఉపకరణములు.	మొదట అమ్మకం జరిగినప్పుడు	రూపాయికి 9 పైసలు
(2)	ఏవియేషన్ టర్బైన్ ఇంధనం	..	రూపాయికి 6 పైసలు
(3)	టర్బైన్ ఇంధనం కాక ఏవియేషన్ మోటారు స్పిరిట్	..	రూపాయికి 5 పైసలు
(4)	ఏవియేషన్ మోటారు స్పిరిట్ కాక పెట్రోలు	..	రూపాయికి 10 పైసలు
(5)	డీసెల్ ఆయిల్	..	రూపాయికి 10 పైసలు
(6)	వెదురు బొంగులు	..	రూపాయికి 3 పైసలు
(7)	కృత్రిమ పట్టుదారం	..	రూపాయికి 3 పైసలు

శాసనసభలో జరిగిన చర్చ సందర్భంలో కొంతమంది సభ్యులు ఈ శాసన చర్యలపట్ల, యివి ప్రజలపై అధికభారం వేస్తున్నాయనే కారణంతో అభ్యంతరం తెలియజేశారు. ఈ అభ్యంతరంవల్ల న్యాయసంబంధమైన, లేక రాజ్యాంగ సంబంధమైన అంశమేదీ వుత్పన్నంకాదు పన్నుల హెచ్చింపుకు ప్రత్యామ్నాయంగా మద్యనిషేధాన్ని ఎత్తివేయడం మంచిదనికూడా శాసనసభలో సూచన చేయడం జరిగింది. ప్రజల సహకారంతో మద్యనిషేధాన్ని కఠినంగా అమలు పరచడమే తమ విధానమైనట్లు ప్రభుత్వం ఇదివరకే ప్రకటించింది.

రాష్ట్రంలో అభివృద్ధిపథకాలను అమలుపరచడానికై యితోధికంగా ఆర్థిక వనరులను సమకూర్చుకోవడానికి ఉద్దేశించిన అభ్యుదయకరమైన చర్యగా ఈ శాసన చర్యలను పేర్కొనవచ్చు. శాసన సభకు రాజ్యాంగ బద్ధంగా లభించిన న్యాయసమ్మతమైన అధికారాల పరిమితిలోనే యివి జరిగినవి. తమ అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించుకోవడానికి స్వంత వనరులపైననే ఆధారపడవలసిందిగా రాష్ట్రాలను కేంద్రం పదే పదే కోరుతున్న ఈ రోజులలో ఇటువంటి శాసనచర్యలు అనివార్యమైనవి. అభ్యుదయకరమైన ఈ చర్యలను సకాలంలో, శీఘ్రంగా ప్రవేశపెట్టినందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని అభినందించాలి ఆశించిన అభివృద్ధి కార్యక్రమాలు నిరాటంకంగా సాగడానికై ఆదాయ వనరులను పెంపొందించే నిమిత్తం ప్రభుత్వంచేస్తున్న ప్రయత్నాలకు ప్రజలు నిస్సంకోచంగా చేయూత నివ్వగలరని ఆశించబడుతున్నది.

—పి. యస్

కొత్త సహకారసంఘం రిజిస్ట్రేషను

పి. శేషాద్రి

1964వ సంవత్సరపు ఆంధ్రప్రదేశ్ సహకారసంఘాల చట్టం 6వ సెక్షను క్రింద, సంఘాల రిజిస్ట్రేషను కొరకు సహకారసంఘాల రిజిస్ట్రారుకు దరఖాస్తులు దాఖలు చేయవలసి వుంటుంది. ఈ విధంగా దరఖాస్తు పెట్టుకున్నప్పుడు అందుకు సంబంధించిన సంఘాన్ని రిజిస్టరు చేయడం, లేదా చేయకపోవడం సహకారసంఘాల రిజిస్ట్రారు నిర్ణయానుసారం జరుగుతుంది. సంఘం రిజిస్ట్రేషన్ను ఒక హక్కుగా కోరే అధికారం ఎవ్వరికీ వుండదు చట్టం నియమ నిబంధనల క్రింద షరతుల నన్నింటినీ పూర్తి చేసినప్పటికీ అటువంటి సంఘాన్ని రిజిష్టరు చేయవలసిన నిర్బంధం రిజిస్ట్రారుకు వుండదు

భీమునిపట్నం సహకారభూమి తనఖా బ్యాంకు అధ్యక్షునికీ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికీ మధ్య హైకోర్టులో నడిచిన వ్యాజ్యంలో కొత్త సంఘాన్ని రిజిస్టరు చేయడం, ప్రస్తుతం పనిచేస్తున్న సంఘం అధికార పరిధిలోని ప్రాంతాన్ని విభజించడమే అవుతుందా ? అన్న ప్రశ్న ఉత్పన్నమైంది. పై చట్టం 15 (1)వ సెక్షను మేరకు, సంఘాల సమ్మేళన, లేక విభజన తల పెట్టబడినప్పుడు, రిజిస్ట్రారు ఈ సెక్షనులో నిర్దిష్టపరచబడిన విధానాన్ని మాత్రమే అనుసరించవలసి వుంటుంది.

విశాఖపట్నం జిల్లా భీముని పట్నంలో కొత్తగా నెలకొల్పిన సహకార భూమి తనఖా బ్యాంకు రిజిస్టరు చేయ బడింది. ఇది స్థాపించబడని పూర్వం భీముని పట్నం ప్రాంతం విజయనగరం సహకార భూమి తనఖా బ్యాంకు అధికార పరిధిలో వుండేది కొత్తగా బ్యాంకును స్థాపించడాన్ని ఇదివరకే పని చేస్తున్న పాత బ్యాంకు సవాలు చేసింది.

కొత్త సంఘాలను సామాన్యంగా రిజిస్టరు చేయడానికి సంబంధించిన కేసులు, "ప్రస్తుత సంఘాల సమ్మేళనం, లేక విభజన" క్రిందికి రావని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు అభిప్రాయ పడింది. అంటే కొత్త సంఘాల రిజిస్ట్రేషనూ, ప్రస్తుత సంఘాల సమ్మేళనం, లేక విభజన ఒక్కటి కావన్నమాట. కొత్త సంఘం రిజిస్ట్రీకి, పై చట్టం 6, 7వ సెక్షను నిబంధనలను పూర్తి చేస్తే చాలు. 15వ సెక్షను వర్తించే ప్రశ్న ఉదయించదు.

విజయనగరం బ్యాంకుకు లేక మరేదైనా బ్యాంకుకు ఏదైనా ప్రదేశంపైన హక్కు వుండడానికి పై చట్టం, లేక నిబంధనావళి క్రింద ఎట్టి అవకాశమూ లేదని హైకోర్టు పేర్కొన్నది. ఇప్పుడు భీమునిపట్నం ప్రాంతాన్ని తన అధికార పరిధిలోనుంచి తొలగించివేస్తారన్నది విజయనగరం బ్యాంకు ఫిర్యాదు. అయితే ఈ వాదం న్యాయబద్ధమైనది కాదు భీముని పట్నం ప్రాంతంపై ఎవ్వరికీ గుత్తాధిపత్యం లేదు సౌలభ్యం దృష్ట్యా అధికార్లు చట్టం క్రింద పరిధిని మార్పు చేయవచ్చునని కూడా హైకోర్టు పేర్కొన్నది. దీని దృష్ట్యా, కొత్త సంఘాన్ని రిజిస్టరుచేయడం ప్రస్తుత సంఘం విభజనకు దారి తీయదనే అంశం స్పష్టమవుతున్నది. సంఘానికి రిజిస్ట్రేషన్ను ఆమోదించడానికి కానీ, లేక నిరాకరించడానికి కానీ రిజిస్ట్రారుకు అధికారం వుంది. రాష్ట్రంలో సహకారోద్యమాన్ని పెంపొందించాలన్న విధానానికి అనుగుణంగా తమ అధికారాలను వినియోగించుకోవడానికి భీమునిపట్నం కేసు విషయంలో యిచ్చిన తీర్పు ప్రభుత్వాధికార్లకు బాగా తోడ్పడుతుంది.

కృష్ణా జలాల వివాదం

వావిలాల గోపాలకృష్ణయ్య

భారతదేశం 1947 ఆగస్టు 15 న స్వాతంత్ర్యం ప్రకటించుకుంది. 1950 జనవరి 26 న ఇండియన్ రిపబ్లిక్‌గా అవతరించింది. దానితో నూతన రాజ్యాంగం అమలుకు వచ్చింది. రిపబ్లిక్ అవతరణతో భారత దేశాభివృద్ధి ప్రణాళికా బద్ధంగా జరుగవలెనని అందుకు భారత ప్రభుత్వం ప్లానింగు కమీషన్ను వేసింది. ప్లానింగు కమీషను ప్రథమ పంచవర్ష ప్రణాళికను సిద్ధం చేయ సంకల్పించింది.

ఈ ప్రణాళికల నిర్ణయంలో ఆయా నదుల, ఖనిజ సంపదల వివరాలు పరిశీలన చెయ్యడం, భవిష్యత్తు ప్లానింగుకు తగిన ఆలోచనలు సాగించడం జరిగింది. నదులపై నీటి పారుదల ప్రాజెక్టులు నిర్మాణం చేయవలసవుంది. అందుకు ఆయా రాష్ట్రాల నీటి వనరులు నదులు ఆ నదులకు ఆయా రాష్ట్రాలకు ఆయా నదులలోని జలాల వాటాలు నిర్ణయించవలసి వచ్చింది

ఆ వుద్దేశంతో ప్లానింగు కమీషను తమ ఆధ్వర్యం క్రింద కృష్ణా, గోదావరీ నదీ జలాలకు సంబంధించిన రాష్ట్రాలతో ఒక సమావేశం న్యూఢిల్లీలో 1951 జులై 27, 28, తేదీల్లో జరిపారు. ఆ సమావేశానికి ప్లానింగు కమీషను సభ్యుడు శ్రీ వి. టి. కృష్ణమాచారి అధ్యక్షత వహించారు. ప్లానింగు కమీషను తరఫున శ్రీ జి. ఆర్. గార్గు, శ్రీ కె. ఎస్. ఎస్. మణి హాజరైనారు బొంబాయి, మద్రాసు, హైదరాబాదు, మధ్యప్రదేశ్, మైసూరు రాష్ట్రాల తరఫున మంత్రులు, అధికారులు హాజరయినారు కేంద్ర జల విద్యున్మండలి అధ్యక్షులు ఎస్ ఎస్. కోస్లా డైరెక్టరు డా॥ కె. ఎల్. రావు, శ్రీ గాడ్‌ఖరే, శ్రీ సి. ఎస్. పార్థసారథిలు హాజరైనారు కేంద్ర ప్రభుత్వ మంత్రి శ్రీ ఎ. ఎస్. గాడ్గిల్ ప్రత్యేక ఆహ్వానంపై హాజరైనారు.

27 వ తేదీ కృష్ణా జలాల విషయం, 28 ఉదయం గోదావరి జలాల విషయం చర్చించారు. చివరకు ఇంజనీర్లు అంతా కలిసి చర్చించి ఒక నిర్ణయంచేసి అంగీకారానికి రావలసిందిగా కోరారు. వారంతా చర్చించి ఒక అంగీకారానికి వచ్చి ఆ ఒడంబడిక తయారుచేసి సమావేశానికి అందించారు బొంబాయి రాష్ట్రంలో వున్న కర్నాటక ప్రాంతంలోని కరువు ప్రాంతమగు బిజాపూరుకు అవసరమని మరి నాలుగు శాతం జలం అదనంగా యివ్వవలసిందిగా శ్రీ గాడ్గిల్ కోరారు. మద్రాసు, హైదరాబాదులు తమ వాటాలోనుంచి చెరి రెండు శాతం తగ్గించుకొని వారి కిచ్చారు. మైసూరు ముఖ్యమంత్రి శ్రీ కె సి. రెడ్డి మైసూరు, మద్రాసు, హైదరాబాదు రాష్ట్రాలు కృష్ణ (తుంగభద్ర) నీటి విషయంలో ఇదివరకే ఒడంబడికలు చేసుకొని వున్నవి గనుక వాటిని మన్నించవలసిందిగా కోరారు. మైసూరు మరో శాతం యివ్వవలెనని కోరారు. ఆ శాతం మద్రాసులో తగ్గించుకోనివ్వడానికి అంగీకరించారు. (మద్రాసు అంటే అప్పటికి ఆంధ్రరాష్ట్రం లేదుగా, అంతా ఆంధ్ర భాగమే నన్నమాట.) ఒడంబడిక స్థిరపడింది.

1951 ఒడంబడిక

ఈ ఒడంబడిక మూడు భాగాలుగావుంది ఒకటి కృష్ణా జలాల విషయం, రెండు గోదావరీ జలాల విషయం. మూడు షరతులు.

1. కృష్ణానది (1) కృష్ణానదిలో విజయవాడవద్ద ప్రవాహపు అంచనాలను బట్టి 1715 శతకోటి ఘనపుటడుగుల నీరు వుందన్నారు అప్పటి మద్రాసు ఛీఫ్ ఇంజనీరు శ్రీ వెంకటాచారి ప్రవాహంలో ఇంకా అదనంగా 8 శాతం ఉంటుందన్నారు. 2. అప్పటికి అమలులో వున్న ప్రాజెక్టులక్రింద బొంబాయి రాష్ట్రంలో 176, హైదరాబాదులో 180, మైసూరులో 985, మద్రాసులో 290_ మొత్తం 744 5 శ కో ఘ అ నీరు వాడుకుంటున్నారనీ, పోగా మిగిలిన 970.5ను వెయ్యిగా అంచనావేసి పంపకం చేయబడవలెనని, ఆ విధంగా పంచినప్పుడు బొంబాయికి 24 శాతం లేక 240, హైదరాబాదుకు 28 శాతం లేక 280, మైసూరుకు 1 శాతం లేక 10, మద్రాసుకు 47 శాతం లేక 470 శ. కో ఘ అ నీరుకి వాటాలుగా నిర్ణయించారు ఈ 1000 పైగా ప్రవాహం వుంటే వానిలో బొంబాయికి 30 శాతం, హైదరాబాదుకి 30 శాతం, మైసూరుకు 1 శాతం (తాత్కాలికంగా) మద్రాసుకు 39 శాతం వంతున కేటాయించబడవలెనన్నారు. 4. ఈ కేటాయింపులలో 67.5 శ. కో. ఘ. అ నీటికన్నా కొయినా ప్రాజెక్టునుండి పశ్చిమానికి మళ్ళించకూడదని అన్నారు

2. గోదావరి 1. ధవళేశ్వరంవద్ద తీసిన లెక్కలను బట్టి గోదావరి నదిలో 2500 శ కో ఘ అ. నీరు వుందని నిర్ణయించారు. 2. అందులో యిప్పుడు వాడుకుంటున్నది, నిర్మాణం నడుస్తున్న ప్రాజెక్టులకు రెంటికీ కలిపి బొంబాయికి 57, హైదరాబాదుకు 208, మధ్యప్రదేశ్ 30, మద్రాసు 300, మొత్తం 595 శ. కో. ఘ. అ. నీరు అంగీకరించారు. 3. మిగిలిన 1905 లో బొంబాయికి 3.3 శాతం అంటే 57, హైదరాబాదుకు 26 శాతం అంటే 494, మధ్యప్రదేశ్‌కు 24 శాతం అంటే 456, మద్రాసుకు

47 శాతం, అంటే 393 శ. కో. ఘ. అ. నీరు కేటాయించారు. ప్రవాహంలో అదనంగా వచ్చినదైనా ఈ శాతంలోనే వుండాలి.

3. షరతులు : 1. కృష్ణా, గోదావరీ జలాలు వార్షిక ప్రవాహాలపై ఆధారపడి కేటాయించడంలో జరిగింది. అదనపు నీటి విషయంలో సర్దుబాటు ఇప్పుడున్న నీటి వాడుకకు యిప్పుడు అంగీకరించిన కేటాయింపులకు లోనై ఉండాలి. (2) ఒక రాష్ట్రానికి కేటాయించిన నీరు మరో రాష్ట్రంలోని రిజర్వాయరుదాకా పోవలసివుంటే ఆ రిజర్వాయరు నుండి తామునిర్దేశించిన నీరు మరో రాష్ట్రం అంగీకారంతో విద్యుచ్ఛక్తి ప్రాజెక్టు తప్ప వాడుకోరాదని (ఈ మాదిరి ఒడంబడిక సాధారణంగా అకారణంగా మరో రాష్ట్రం తిరస్కరించరాదు) (3) మొదటి రెండు భాగాలలోని ఒడంబడిక 25 సంవత్సరాల తరువాత పునరాలోచించవలెనని పూర్తిగా పరిశీలన చేసి, అవసరమయిన అంచనాలు తయారుచేసి, వాటిని పరిశీలన చేయనిదే ఏ నూతన ప్రాజెక్టును ప్రారంభించరాదు.

ఈ ఒడంబడికను అన్ని రాష్ట్రాలకు ధృవీకరణకై ప్లానింగు కమీషను ది. 31-7-1951 న పంపింది. అందుపై మద్రాసు ప్రభుత్వం ది. 17-8-1951 నను, బొంబాయి ప్రభుత్వం 30-8-51 నను, హైద్రాబాదు ప్రభుత్వం ది 23-8-1951 నను, మధ్యప్రదేశ్ ప్రభుత్వం ది. 8-9-51 నను, మైసూరు ప్రభుత్వం 24-9-51 నను మరియు 1-12-1951నను ఒడంబడికను అంగీకరిస్తూ ధృవపరుస్తూ వ్రాశారు ఇదీ 1951 ఒడంబడిక కథ.

ఖోస్లా కమిటీ

కృష్ణా, గోదావరీ నదులను పరిశీలన చేయడానికి 1951 లో ఈ ఒడంబడిక అనంతరం ఖోస్లా కమిటీని ప్లానింగు కమీషను నియమించింది. 1952 ఫిబ్రవరిలో ఈ కమిటీ ఆంధ్రప్రాంతాలకు వచ్చారు. ఆంధ్రప్రజలు పులిచింత అంటున్న రోజులవి. హైదరాబాదు రాష్ట్రం నందికొండ (6 లక్షల ప్రాజెక్టు) ప్రాజెక్టును కోరుతున్నది. అయితే, ఈ కమిటీ వచ్చేటప్పటికి ఆంధ్ర ప్రజానీకం నందికొండ ప్రాజెక్టునే కోరింది. ఈ కమిటీ ఈ రెండు ప్రాజెక్టులను పరిశీలన చేసింది. ఆంధ్రలో ప్రజలు, హైదరాబాదులో ప్రభుత్వం నందికొండపై కేంద్రీకరించారు. మద్రాసు ప్రభుత్వం వైముఖ్యం చూపినా, కావలసిన సమాచారం అధికార పూర్వకంగా అందివ్వకపోయినా స్వయంగా చూచినందున ఖోస్లా కమిటీ నందికొండ ప్రాజెక్టును నిర్మించుటకే సిఫారసు చేసింది.

గోదావరినదికి ఇచ్చంపల్లి నుండి కాల్వదారా కృష్ణానదికి నీరు తరలించవలసిందిగా ఖోస్లా కమిటీని మాజీ మద్రాసు ముఖ్యమంత్రి శ్రీ ఓమండూరు రామస్వామిరెడ్డి కోరారు. అందుపై అది సాధ్యమయ్యేదికాదని ఆర్థికంగా వృథాఅని, అంతేకాక మధ్యలో మైళ్ళ తరబడి సొరంగాలు త్రవ్వవలసి వుంటుందని, లాభంలేదని త్రోసివేశారు.

మద్రాసు ప్రభుత్వం ఈ ప్రాజెక్టు యెడ చూపిన వైముఖ్యముపై ప్రతీకారంగా ఆంధ్రప్రజలు స్వంత రాష్ట్రం కావలెనని తేల్చుకొన్నారు. తీవ్రాందోళన ప్రారంభించారు. అంతవరకు కలిగిస్తూ వస్తున్న అవరోధాలు అమరజీవి పొట్టి శ్రీరాములు ఆత్మ బలిదానంతో కొట్టుకు పోయినవి. 1953 అక్టోబరు 1 వ తేదీ ఆంధ్రరాష్ట్ర అవతరణ జరిగింది. మద్రాసు ప్రభుత్వంతో ఈ ప్రాజెక్టుకు సంబంధం వదిలిపోయింది. ఆంధ్ర ప్రభుత్వం, హైద్రాబాదు ప్రభుత్వాలు కలిసి నందికొండ ప్రాజెక్టుకు రూపురేఖలు దిద్దారు. నాగార్జునకొండ శిల్ప శిథిలాలు మునిగిపోతున్నందున ఆ మహనీయుని నామం శాశ్వతంగా వుండుటకు నందికొండ ప్రాజెక్టు నాగార్జున సాగర్ ప్రాజెక్టు నామం దాల్చింది. పండిత జవహర్‌లాల్ నెహ్రూ 1955 డిసెంబరు 10 వ తేదీన పునాది వేశారు. కుడికాల్వ 21000 క్యూసెక్కుల ప్రవాహంతో నిర్మించాలని ఆనాటి కేంద్రప్రభుత్వ నీటిపారుదల మంత్రి శ్రీ జి. ఎల్. నందా ది. 12-9-1956 న ఆదేశించారు. ఇందులో పులిచింతల బ్లాకు మినహాయించవలెనన్నారు. ఎడమ కాల్వ 15000 క్యూసెక్కుల ప్రవాహంతో నిర్మించారు.

బొంబాయి ప్రభుత్వం కొయినాపై విద్యుచ్ఛక్తి ప్రాజెక్టు నిర్మాణం సాగించింది. అరేబియన్ సముద్రంలోకి నీరు మళ్ళించి విద్యుచ్ఛక్తి ఉత్పత్తి చేయదలిచారు. 1951 ఒడంబడిక ననుసరించి 67.5 శ. కో. ఘ. అ. ల. నీరు కన్నా అదనంగా మళ్ళించకూడదు. బిజాపూరు కరువు ప్రాంతమని కోరిన కృష్ణా జలంలోని 40 శ. కో. ఘ. అ. నీరు ఈ 67.5 లోనే సముద్రపరం అయిపోయింది. అంతే కాదు, 120 వరకు మళ్ళిస్తున్నారు.

ఇంతలోకి అన్ని రాష్ట్రాలు భాషా ప్రయుక్తంగా నిర్మాణం కావలెననే ప్రజల వాంఛ 1-11-56 న యీడేరింది. హైదరాబాదులో వున్న కర్నాటక, మద్రాసులోని కర్నాటక ప్రాంతాలు అన్నీ కలిసి మైసూరురాష్ట్రం విస్తృతం అయింది. హైదరాబాదులోని తెలంగాణాలోని ఆంధ్రతో కలిసి ఆంధ్రప్రదేశ్ అయింది. హైదరాబాదులోని మరాట్వాడా బొంబాయిలో కలిసింది. బొంబాయి కూడా కొన్నాళ్ళకు గుజరాతుతో విడివడి మహారాష్ట్ర అయింది.

బొంబాయిలో వున్నప్పుడు బొంబాయిలో వున్న బిజాపూరుకు నిర్దేశించిన కృష్ణ నీరు 40 శ. కో. ఘ. అ నీటిని కొయినాకు వాడుతున్నారు. ఈ నీటి విషయం మైసూరు ప్రభుత్వం బొంబాయి ప్రభుత్వాన్ని అడిగింది. అందుపై ఈ రెండు రాష్ట్రాల ఇంజనీర్ల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి బొంబాయి తరపున ఛీఫ్ ఇంజనీరులుగా శ్రీ జి. ఎస్. పండిట్, శ్రీ డి. బి. ఆనంద్‌లు హాజరైనారు. (శ్రీనందా ఆనాడు కేంద్ర జల విద్యుత్మండలి అధ్యక్షుడనేది గుర్తుంచుకోవాలి). మైసూరు, మహారాష్ట్ర ఇంజనీరులు కొయినాలోకి కూడా వాడుకున్నది కృష్ణ నుండి మైసూరుకు వచ్చిన వాటా జలమేనని 30-7-58 సమావేశంలో అంగీకరించారు. మైసూరు ఇంజనీరు తమకు రావలసిన బిజాపూరు ప్రాంతాల తరపు కరువు నివారణకు వాడుకోవలసిన జలాన్ని తీసుకున్నందుకు ఈ జలం అరేబియా సముద్రానికి మళ్ళించబడుతున్నందున తమకు కలిగే నష్టాన్ని గురించి ప్రతి ఘటన అయినా తెలియజేయకనే తమ వాటాకు బదులు విద్యుచ్ఛక్తి యిస్తారా, ధనం యిస్తారా తేల్చండి అని కోరారు. ఇది తేలనేలేదు. అయితే, మైసూరు ప్రభుత్వం సుల్తానాబాద్ వద్ద తాము నిర్మించ

దలచిన ఎగువ కృష్ణా ప్రాజెక్టుకు ఈ నీరు అందించవలసినదిగా కోరారు. ఎగువ కృష్ణా ప్రాజెక్టు బొంబాయి రాష్ట్రం ఉద్దేశించిన ప్రాజెక్టు కాదు కావున ఆ విషయం ఆలోచించడానికే వీలులేదన్నారు. పడమరకు మళ్ళించారు. బిజాపూరు 40 శ. కో. పోయింది. 67.5 కాక 120 సముద్రానికి మళ్ళిస్తున్నారు. ఇంజనీరులు అంగీకరించారు. ఇది తర్వాత బయట పడింది. జరిగిన నష్టం బోధపడే వుంటుంది. అయితే, అధికారులు అంగీకరించారు కావున కాదనలేక దిగ్భ్రమింగారు.

గాడ్గిల్ కమిటీ

ఇదే సమయంలో కొయినా ప్రాజెక్టు, నాగార్జునసాగర్ ప్రాజెక్టుల పరిశీలనకు శ్రీ గాడ్గిల్ అధ్యక్షతన ప్లానింగ్ కమీషన్ 13_5_1958న ఒక కమిటీని వేసింది. ఈ కమిటీ ఒక కొయినా రిపోర్టులో బిజాపూరు నీరును కొయినా వాడుకోవడానికి రెండు ప్రభుత్వాలు అంగీకరించిన వన్నారు. 1951 ఒడంబడికలో మద్రాసు, మైసూరు, మహారాష్ట్ర, హైద్రాబాదు రాష్ట్రాలుండినవని ఇప్పుడు కృష్ణా, గోదావరి జలాలకు సంబంధించి మైసూరు, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలే వున్నవని, అంతకు ముందున్న రాష్ట్రాలలోని ప్రాంతాల పునర్నిర్మాణం దృష్ట్యా ఆయా రాష్ట్రాల వాటాలు నిర్మించవలె నన్నారు. (పుట 19). అందుపై కేంద్ర జల విద్యున్మండలి సమగ్ర పరిశీలన జరిపి ప్లానింగ్ కమీషన్‌కు తెలియజేసింది. అందుపై ప్లానింగ్ కమీషన్ 4_6_60న రాష్ట్రాల పునర్నిర్మాణం దృష్ట్యా వచ్చిన ప్రాంతీయ మార్పుల వల్ల ఆంధ్రప్రదేశ్‌కు 983, మైసూరుకు 475, మహారాష్ట్రకు 286 శ.కో.ఘ అ. నీరు కృష్ణా నదిలోని జలాల వాటాగా నిర్ణయించారు.

ఈ నిర్ణయాలు ఆయా రాష్ట్రాలకు తెలియజేయడం జరిగింది. మహారాష్ట్ర కోరిక తనకు 120 మళ్ళింపుకు అనుమతి సాధించాలెనని వుంది. మైసూరుకు పోయిన 40 ఎట్లా వస్తవా అని వుంది. అందుకె వాటా అంగీకరించజాలమని పాత రాష్ట్రాలు పోయినవి గనుక కొత్త రాష్ట్రాలకు పాత రాష్ట్రాలతో సంబంధం లేదని, 1951 ఒడంబడిక పాత రాష్ట్రాలు చేసుకున్నవి గనుక చెల్లవని, కొత్తగా కృష్ణా జలాల పంపిణీ జరుగవలెనని కోరారు. 4_6_1960 నాడు ప్లానింగ్ కమీషన్ నిర్ణయాన్ని అంగీకరించం అన్నారు. తిరుగుబాటు చేశారు.

కేంద్రం మహారాష్ట్ర, మైసూరులచేత తమ నిర్ణయాన్ని ఒప్పించలేకపోయింది. ఈ సమయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వివాదాన్ని నదీజలాల ట్రిబ్యునల్‌కుపంపవలసిందిగా కోరి వుండవలసింది. కేంద్ర ప్రభుత్వం తమన్యాయమైన కోరికను అంగీకరింప జేస్తుందని ఆశ పడ్డారు.

గుల్హాతీ కమీషన్

మైసూరు, మహారాష్ట్ర ప్రభుత్వాలు ఈ జలాల వివాదం సవ్యంగా నిర్ణయించాలెనని, అందుకు ముందు జలాలు ఎంత వుందీ పరిశీలన చెయ్యవలెనని కోరారు. వారి కోర్కెమేర కేంద్ర ప్రభుత్వం గుల్హాతీ కమీషన్ను వేసింది. ఈ కమీషన్ను వేయడమే తప్పు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ కమీషను నియామకాన్ని ప్రతిఘటించవలసింది. ఆంధ్ర నాయకులు కోరారు కానీ తీరా వేసింతర్వాత చేసేది లేకపోయింది నదీ జలాలు 86 శాతం మీద ఆధారపడవలెనా, 75 శాతంపై ఆధారపడవలెనా, మరేవిధంగా ఆధారపడాలెనో తెల్పమని కృష్ణా, గోదావరి జలాలలో ఎంత నీరు వుందో తేలవలెనని కోరారు. 100 సంవత్సరాల ప్రవాహంలో జలాధారం 86 సంవత్సరాల మీద ఆధారపడటం బదులు 75 సంవత్సరాల జలాల మీద ఆధారపడితే ప్రతి నాలు సంవత్సరాలలో ఒక సంవత్సరం పంట ఉండదు అన్నమాట. మహారాష్ట్ర ప్రభుత్వం నియమించిన బార్వే కమీషను, వారి రాష్ట్రంలో 50 సంవత్సరాల ప్రవాహంపై ఆధారపడి ప్రాజెక్టులు నిర్మించవలసిందిగా సిఫారసు చేశారు. అంటే, ప్రతి మరు సంవత్సరం పంట ఆశ వుండదన్నమాట. అందుకే 86 సంవత్సరాల ప్రవాహంపై ఆధారపడి 1951లో ఒడంబడిక చేయబడింది ప్రవాహం అధికంగా వున్న సంవత్సరాలను వరుసగా వేసుకుని లెక్కలు గణించారు. ఎక్కువ నీరున్నట్లు చూసి వాటాలు పంచితే తక్కువ నీరు వచ్చిన సంవత్సరం పై రాష్ట్రాలవారు వారి వాటా ప్రకారం నిల్వఉంచుకుంటే ఇక నుండి వారికి ఏమీ రాకుండా పోతుంది. అందుకై పైరాష్ట్రాలవారు ఆ పద్ధతి కోరేది.

గుల్హాతి కమీషను కృష్ణా, గోదావరీ ప్రాంతాలలో ఒకసారికి మూడుమారులు పర్యటించారు. ఎన్నో లెక్కలు తీయించారు. ఏమిచేసినా 1951 ఒడంబడిక నాటికి ఉన్నదని తలంచిన నీటికన్నా ఒక్క బొట్టుకూడా అదనంగా ఉన్నట్లు తేలలేదు. అందుచే వేరే మార్గం లేక అనేక కేంద్రాలలో కృష్ణా, గోదావరులపై పది సంవత్సరాలకు పై జల ప్రవాహాల లెక్కలు తయారుచేయవలసిందని, అంతవరకు ఏమీతేలలేదని తేల్చిచెప్పారు.

ఆంధ్రకు అన్యాయం

అయినా కేంద్ర ప్రభుత్వం మైసూరు, మహారాష్ట్ర ప్రభుత్వాల వత్తిడికి లోనై ఆనాటి నీటిపారుదల మంత్రి శ్రీ హాఫీజ్ మహ్మద్ ఇబ్రహీం ది. 23_3_1963 తేదీన ఒక ప్రకటనచేస్తూ రానున్న నాల్గవ, అయిదవ ప్రణాళికల కాలంలో వాడుకోవడానికి మహారాష్ట్రకు పశ్చిమంలోనికి అదనంగా (అం. 367.5 కు మించకుండా) పశ్చిమంలోకి మళ్ళించకుండా 400, మైసూరుకు 600, ఆంధ్రప్రదేశ్ 800 శ. కో. ఘ. అ. నీరును వాడుకోవలసినదిగానూ, శ్రీశైలం, నాగార్జునసాగర్‌లను 264 శ.కో ఘ. అ నీరును ఉపయోగించుకో వచ్చునని కృష్ణానదికి సంబంధించినంతవరకు సూచన చేశారు. దీనితో 1951 ననుసరించి, 1960 లో వచ్చిన వాటాల ననుసరించి మైసూరుకు 475 బదులు 600 వచ్చింది. అంటే 125 పెరిగింది. మహారాష్ట్రకు 286 బదులు 400 వచ్చింది. అంటే 114 పెరిగింది. ఆంధ్రప్రదేశ్‌కు 983 బదులు 800. అంటే 183 తగ్గింది. ఆంధ్రప్రదేశ్ చాలా నష్టపడింది. ఇది తప్పు అని అప్పుడైనా ట్రిబ్యునలుకు పోవలసింది. ప్రతిఘటిస్తూ అంగీకరిస్తున్నాం అన్నారు. మైసూరు, మహారాష్ట్రాలు 1951 ప్రాతిపదిక

త్రోసివేయడం జరిగింది కనుక తమ యిష్టంవచ్చిన ఫలితాలు సాధించడానికి కేంద్రంను వత్తిడి చేయించగలమని ఆశిస్తున్నారు.

వితండవాదం

నాగార్జునసాగర్ డాము 560 అ. కు నిర్మించుకోవచ్చు దానికి 264 శ. కో. ఘ. అ. నీరుకు లోబడివాడుకోవచ్చు. ఆ డాములోని నీరును ఏ విధంగా వాడుకోవలెననేది డాము, ఆనకట్టా, తలుపులు అనేది ఆయా రాష్ట్రాలకు సంబంధించిన సమస్య. తమ రాష్ట్రంలో అదే చేసుకుంటున్నారు, కేంద్రంతో వాదిస్తున్నారు. కాని ఆంధ్ర ప్రదేశ్‌కు వచ్చేటప్పటికి అది వీలులేదని, అసలు నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిర్మాణం ఆపివేయవలెనని, అసలు నిధులే కేంద్ర ప్రభుత్వం యివ్వకూడదని, తలుపులు నిలుపు చేయవలెనని వితండవాదం ప్రారంభించారు. మహారాష్ట్ర, మైసూరులు సముద్రంలోకి పోయే నీటిని ఆకట్టుకొంటాం అంటే నిజంగా సముద్రుడు అడగించవలసిందిపోయి మైసూరు, మహారాష్ట్ర ప్రభుత్వాలు అడ్డగించడం ఆశ్చర్యం వేస్తుంది గొర్రెపిల్ల, పెద్ద పులి కథ జ్ఞప్తికి వస్తున్నది.

కృష్ణా బ్యారేజిక్రింద సాగయ్యే 10 లక్షల ఎకరాలకు జూన్ నెలలో నీరు వస్తుంది కొయినా మూలంగా ఆ నీరు ఆలస్యమయి పోయింది అందుకు ఇక్కడ నిల్వ లేకపోతే జూన్ పంట దాదాపు నెల ఆలస్యం అయిపోతుంది. పంట తరిహా మారిపోతుంది. క్రింద ప్రవహించే నీరుకు వారి అడ్డమేమిటో. మైసూరుగాని, మహారాష్ట్రగానీ, సముద్రానికి మళ్ళించకుండా ఎన్ని ప్రాజెక్టులు కట్టుకున్నా ఇంతవరకు అభ్యంతరమే చెప్పడంలేదు మనం. మహారాష్ట్ర 67.5 కన్నా అదనంగా సముద్రానికి మళ్ళించితే వీలులేదంటున్నాం 1963లో కేంద్రం కూడా ఈ మాటే అన్నది. అయినా దానిని కనుక్కొనే నాధుడే లేడు. అసలు లెక్కలే ఇయ్యడం మానేశారు. కేంద్ర ప్రభుత్వం కూడా అడిగి అడిగి విసిగి పోయింది. వడ్డించే వాడు మనవాడైతే కడ పంక్తిన కూర్చున్నా ఫరవా లేదు అన్నట్లుంది కేంద్ర ప్రభుత్వం విధానం. మహారాష్ట్ర, మైసూరుల విషయం మొగుణ్ణి కొట్టి మొగసాల కెక్కినట్లుంది, నాగార్జున సాగర్ పని ఆపివేయమని కేంద్రంపై వత్తిడి చెయ్యడం.

ప్రధాని శ్రీమతి ఇందిరా గాంధి ఈ విషయం పరిష్కరించుటకు కొంత ప్రయత్నం చేసింది. అందుకై క్రిందటి సంవత్సరం మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశాలు రెండు మారులు జరిపారు. అసలు వివాదం ఏమిటో తేల్చమన్నారు 1951 నాటి ఒడంబడిక కాదంటారు. ఎందుకు? అంతకన్నా నీరు వున్నదని రుజువుకాపలేకదా గుల్హాతీ చెప్పలేదు, ఏ రాష్ట్రంకూడా ఆనాటి నీటి కన్నా అదనంగా వుందని అనడానికి ఆధారం వుండాలికదా? 1951 నీరే అయితే అందుపై ఒడంబడిక ఉండనేవుంది. ఇక నాగార్జున సాగర్ డాముకు తలుపులు పెట్ట వద్దంటారా? ఇక్కడ తలుపులు పెట్టుతున్నారు. మహారాష్ట్రడాము కట్టుకున్నారు మరొకరు ఆనకట్ట కట్టుకుంటాం అనవచ్చు. అది రాష్ట్రాలకు సంబంధించినది. ఈ తలుపుల వల్లగానీ, మరే విధంగా కాని ఆంధ్రప్రదేశ్ 800 మించి వాడుకున్నా, నాగార్జున సాగర్ క్రింద 265 కు మించి వాడుకున్నా, వివాదం చేయవచ్చు పైగా ఈ డాము చివరి డాము. ఇకనీరు సముద్రంలో కలిసేదేకదా? బంగాళా ఖాతం, తనలో కలియవలసిన నీటిని నాగార్జున సాగర్‌లో ఆపుతున్నారంటే అర్థం వుంటుందేమో గాని, పై రాష్ట్రాలు వివాదం చెయ్యడంలో అర్థం కనుపించలేదు. తనకు వచ్చిన 40 మహారాష్ట్ర కిచ్చి, చేయికాలిన పిల్లివలే మైసూరు, తన కిచ్చిన నీటికన్నా అదనంగా వాడుకుంటూ దానిని కప్పిపుచ్చి మహారాష్ట్ర, వివాదంచేసి, కేంద్రం నిస్సహాయంగా వుండి పోతున్నది. అదనంగా మహారాష్ట్ర నీరు వాడుతుందంటే అంకెలు యివ్వరు. మరింత అడిగితే కేంద్ర మంత్రి ఆంధ్రుడు, ఆంధ్రాభిమాని అంటారు. మనం జారిపోతున్నాం. మహారాష్ట్ర, మైసూరులు సాగించు కుంటున్నారు.


కేంద్రంపై వత్తిడి

మహారాష్ట్ర, మైసూరులు ఈ వివాదాన్ని 1956 సం.రం నీటి వివాదాల చట్టంక్రింద ట్రిబ్యునలుకు పంపవలెనని కేంద్రాన్ని వత్తిడి చేస్తున్నారు నష్టపడుతున్నది ఆంధ్ర ఎక్కడి న్యాయం? ఇప్పటికైనా చొరవతీసుకుని 20-4-68 న ఈ వివాదాన్ని ట్రిబ్యునలుకు పంపవలసిందిగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వాన్ని కోరడం కొంతలో కొంత హర్షించవలసిన విషయమే.

ఆయా రాష్ట్రాలకు సంబంధించిన నీటి పారుదల వివాదం కేంద్రం పరిష్కరించలేనిచో విధిగా ట్రిబ్యునలుకు పంపాలి. ఆ విధంగా ట్రిబ్యునలుకు పంపడానికి నిశ్చయించుకున్నప్పుడు ఒక జడ్జీని ట్రిబ్యునలుగా నియమించవలసిందిగా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని కేంద్ర ప్రభుత్వం కోరాలి. వారు జడ్జీని నియమిస్తారు. ఈ ట్రిబ్యునలులో ఒకరు కాకుండా ముగ్గురు సభ్యులు వుంటే మరింత ప్రయోజనకరం. ఆ విధంగా శాసనం మార్చడం అవసరం. ఆయనకు యిద్దరు అసెసర్లను కూడా యిస్తారు వారికి రాష్ట్రాలు తమ తమ వాదాలను వినిపించుకోవాలి అందుపై వారు తీర్పు యిస్తారు. ఆ తీర్పులో యదార్థాలమీద తేడాలుంటే మరల ఆయా రాష్ట్రాలు తెలుపుకోవచ్చు అందుపై తీర్పు ఆలోచించవచ్చు ఈ తీర్పుపై అపీలు లేదు. అది ఆఖరు నిర్ణయం. ఆంధ్రప్రదేశ్ ట్రిబ్యునలుకు పంపవలసిందిగా కోరింది. మైసూరు, మహారాష్ట్రలు కూడ కోరుతామంటున్నారు.

ఏమైనా ట్రిబ్యునలుకు చేరక తప్పదు మన కేసు బలంగలదే. మన వాదన కూడా బలంగా ఉన్నది, ఉన్నట్లు చెప్పకోవడంలో మన విజయం ఆధారపడి ఉంటుంది. ★

శ్రీ నాగేశ్వరరావు పంతులుగారి సారస్వతసేవ



దివాకర్ల వేంకటావధాని

శ్రీ నాగేశ్వరరావు పంతులుగారి దివ్యనామము స్మృతి తగులఁగనే ఒక మహాదాత, ఒక కళాప్రపూర్ణుఁడు, ఒక దేశోద్ధారకుఁడు, ఒక విజ్ఞాన సంపన్నుఁడు, ఒక సారస్వతోపాసకుఁడు, ఒక రాజకీయవేత్త, ఒక సంస్కర్త, ఒక ఔదార్య మూర్తి, ఒక భక్త పుంగవుడు, ఒక పరిపూర్ణ మానవ శేఖరుఁడు—ఏకైక రూపముతో సాక్షాత్కార మొసంగుదురు. అందుకు కారణ మా గుణ విశేషములన్నియు వారి యందు పుంజీకృతములై యుండుటయే. లోకమున సద్గుణ సంపన్నులనేకులుందురు. కాని శ్రీపంతులుగారి వలె నన్ని సద్గుణములను తమలో నిమిడించుకొన్న వారరుదుగాకన్పింతురు. ఆధునికాంధ్ర దేశమందలి యన్ని రంగములందు మహౌదార్య సంపన్నులు, సర్వ సమన్వయ సంధానదక్షులునైన శ్రీ పంతులుగారి ప్రభావము గోచరించును. వారు జీవించి యున్న కాలమునందాంధ్ర దేశమున వారి త్యాగవైభవమును చవిచూడని కళా కారుఁడు లేఁడు, వారి ప్రేరణ ప్రోత్సాహములందని సంస్థ లేదు, వారిచేయూత కాంక్షింపని యుద్యమము లేదు. నాఁటి ఆంధ్ర దేశ కళా సాంఘిక మత రాజకీయ జీవితమునకు వారు చేకూర్చిన వన్నె యింతింతన రానిది

సార్థకనాముడు

శ్రీ పంతులుగారికి విశ్వదాత, దేశోద్ధారకుఁడు, కళాప్రపూర్ణుఁడు అను బిరుదములున్నవి. ఈ బిరుదములన్నియు వారి యందు మిక్కిలి యన్వర్థములైనవి. వారు సర్వమును సర్వార్థి జనుల కొసంగి విశ్వ దాతృ శబ్దమునకుఁగల యర్థ ద్వయమునకు సార్థక్యము కలిగించినారు. ఒక వంక భారత దేశమునకును, ఇంకొక వంక నాంధ్ర దేశమునకును అభ్యుదయము చేకూర్చుటకై వారు నిరంతర కృషి సాగించి నిజముగా దేశోద్ధారకులై నెగడినారు. వారు సంగీత సాహిత్యములకేకాక శిల్ప చిత్ర లేఖనాద్యన్య కళలకుఁగూడ కావించిన దోహదము నారసి ఆంధ్ర విశ్వవిద్యాలయము. వారికి కళా ప్రపూర్ణ సార్థక బిరుదము నొసంగి తనుఁదా గౌరవించుకొన్నది. సాధారణముగా బిరుదములన్నను పొగడ్తలన్నను వైముఖ్యము ప్రదర్శించుచుండిన గాంధి మహాత్ముఁడాంధ్ర దేశమున సంచారము చేయు తఱి శ్రీ పంతులుగారు వివిధ వ్యక్తులకును, వివిధ సంస్థలకును గావించిన దాన ధర్మములను; కళా, దేశాభ్యుదయములకై వారు కావించిన యనితర సామాన్యమైన త్యాగమునువిని, చూచి, వారికిఁగల బిరుదము లత్యంత సార్థకములని ప్రశంసించి యుండెను. అమృతాంజనము వలన వారు సంపాదించిన ధనము నంతను వారు దేశ సేవ, దీన మానవ సేవలకే వినియోగించి యుండిరనుటలో నత్యుక్తి లేదు.

శ్రీ పంతులుగా రౌదార్యమూర్తులు. "అయం నిజః పరోవేతి గణనా లఘుచేతసాం, ఉదార చరితానాంతు వసుధైవకుటుంబకమ్" మ్మను సూక్తియందలి యుత్తరార్థమునకు పరమోదాహరణమని చెప్పఁదగిన వారు శ్రీ పంతులుగారు. కుల మత వర్గ వివక్ష లేకుండ విశాల దృష్టితో వారు దాన ధర్మములు సాగించియు, నాదర ప్రోత్సాహములు ప్రదర్శించియు తమ మాటలలో, చేఁతలలో, చేతములో సంకుచితత్వమునకు చోటీయక వసుధైక కుటుంబులై విరాజిల్లఁజాలినారు.

సాహిత్యసేవ

శ్రీ పంతులుగారాంధ్ర సారస్వతమునకు గావించిన సేవ అసాధారణమైనది వారు పెక్కు పూర్వ గ్రంథములను ప్రచురించియు, పలువురు కవి పండితుల నాదరించి వారిచే సద్గ్రంథములు వ్రాయించియు, స్వయముగా పెక్కు గ్రంథములను వ్యాసములను రచించియు నాంధ్ర సారస్వతమున కపారమైన సేవ గావించి యుండిరి ఆంధ్ర పత్రిక, భారతీ పత్రికలద్వారా వారాంధ్ర దేశమునకు గలిగించిన రాజకీయ సారస్వత చైతన్య మపూర్వమైనది. ఆంధ్ర పత్రిక నెఱుంగని అక్షరాస్యుడాంధ్ర దేశమున నుండడనుట సత్యదూరముకాదు కష్టనష్టముల కోర్చి శ్రీ పంతులుగారాపత్రికను స్థాపించి, తరువాత దానిని దిన పత్రికగా నొనర్చి, ఆంధ్ర లోకమునం దొనర్చిన విజ్ఞాన ప్రచాలన మమోఘమైనది. అనవసర దూషణ భూషణముల జోలికి పోక యథార్థములైన వార్తల నతి సమరస భావముతో నాంధ్రజనుల కందిచ్చు నుత్తమాంధ్ర దిన పత్రికలలో నిప్పటికిని దానికే అగ్రతాంబూలము సారస్వతానుబంధములలో నాంధ్ర పత్రిక ప్రచురించిన వ్యాసములెంత అసంఖ్యాకములో అంత అమూల్యములైనవి. సర్వాంధ్ర విఖ్యాతములు, ఆంధ్ర వచన వాఙ్మయమున కలంకారములునైన పానుగంటి వారి సాక్ష్యుపన్యాసములకు రంగమా అనుబంధములే యని చెప్పినచో వాని ప్రాశస్త్యమును వేరుగా వివరింప వలసిన పనియుండదు అట్లే ఆంధ్ర పత్రిక ఉగాది సంచికలు కవితా పాండితీ పరిశోధనలకు పట్టుగొమ్మలు. ఆంధ్ర కవితా పాండితీ విమర్శల పరిణామ పాటవముల నెరుంగుట కవి ప్రశస్తములైన యాధారములు. భారతి యాంధ్ర మాస పత్రికలకు తలమానికము. అది ఆంధ్ర కవి పండితుల కొక వంకను, ఆంధ్ర కళా సారస్వతముల కింకొక వంకను గలిగించిన అభ్యుదయ మింతింతనరానిది. అది పద్యములు ప్రకటించినది. నూత్న కవితోద్యమమునకు చేయూత నిచ్చినది. విమర్శలు వెలయించినది, వ్యాసములు విరజిమ్మినది. శాసనముల నావిష్కరించినది, చరిత్ర నిర్మాణమునకు చక్కని రాచబాట చూపినది, చిత్ర లేఖనములు సవరించినది. విజ్ఞాన పిపాసువులకు వివిధ రీతుల నానందము చూరనిచ్చినది. ఈ దిన మాస పత్రికలద్వారా శ్రీ పంతులుగారాధునికాంధ్ర సారస్వతమున కందచందము లలవరించి యాకృతిని దిద్దిరనుటలో నతిశయోక్తి లేదు

ఆంధ్ర గ్రంథమాల

శ్రీ పంతులుగారు స్థాపించిన ఆంధ్ర గ్రంథమాల ఆంధ్ర లోకము నపూర్వ గ్రంథ కుసుమముల యామోదముచే గుబాళింపజేసినది శైవవాఙ్మయమునకును, ఆంధ్ర ద్విపద సారస్వతమునకును అది చేకూర్చిన వన్నె అత్యంత శ్లాఘనీయమైనది ఆంధ్రమున శైవమత ప్రచారమునకే కాక ద్విపదకవితా శాఖకును ఆచార్య పీఠమని చెప్పఁదగినవాఁడు పాల్కురికి సోమనాథుఁడు. అతఁడు రచించిన బసవ పురాణ పండితారాధ్య చరిత్రములు ద్విపద వాఙ్మయమునకు రత్నాలంకారములు. అందతఁడు ప్రదర్శించిన కవితా కౌశలము, మత ప్రబోధము, భాషా ప్రయోగ పాటవము, పాండితీ శౌండీర్యము, దేశి కవితా ధౌరంధర్యము అపూర్వములైనవి. మతద్వేషకారణములచే నామహా కావ్యములు మహనీయములయ్యును చిరకాలము మఱుగునపడి యుండిపోయినవి. శ్రీ పంతులుగారు వానిని సుప్రసిద్ధ పండిత విమర్శకులచే పరిష్కరింపజేసి విపుల పీఠికా సహితముగా నాంధ్ర గ్రంథమాలా కుసుమములుగా నావిష్కరించి యుండిరి వాని ప్రకటనముచే నాంధ్ర వాఙ్మయమునకును, శైవమతమునకును గలిగించిన పుష్టి యపారమైనది. శ్రీ పంతులుగారే చేపట్టక యుండినచో నా యప్రతిమాన కావ్యకుసుమములు తాళీదళ సంపుట ప్రకరములలో నడఁగి వాడి వత్తలై యుండెడివే. శతక మంజరి భక్తి సంపుటమాంధ్ర గ్రంథమాల యందలి ప్రథమ కుసుమము దీనిని ప్రథమకుసుమముగా గ్రహించుట పంతులు గారికి శతకముల యెడను భక్తి ప్రపత్తుల యెడనుగల యపారాదరమును చెప్పక చెప్పుచున్నది. శ్రీ కురుగంటి సీతారామయ్య గారి తంజాపురాంధ్రనాయక చరిత్రము, శ్రీ వేటూరి ప్రభాకర శాస్త్రిగారి నీతినిధి, శ్రీ వేలూరి శివరామ శాస్త్రి గారనువదించిన మహాత్ముని ఆత్మకథ ఆంధ్ర గ్రంథమాల యందలి సురభి వాసనా శోభితములైన యితర కుసుమములు. అవి చరిత్రకు, నీతికి, వచన రచనా రామణీయకమునకు ప్రసిద్ధి నందిన యుత్తమ గ్రంథ రత్నములు. ఇట్లే ఆంధ్ర గ్రంథమాల యందు సరి గ్రుచ్చఁబడిన యితర కుసుమములు కూడ నొకొకక్కటి యొక్కొక్క అమూల్యరత్నము.

ఆంధ్ర వాఙ్మయ సూచిక

ఈ సందర్భమున శ్రీ పంతులుగారు ప్రకటించిన ఆంధ్ర వాఙ్మయ సూచికను గూర్చి ప్రత్యేకముగా చెప్పవలసి యున్నది. అందు సుమారు వేలమంది గ్రంథకర్తలు రచించిన పదునాలుగు వేల ముద్రితాముద్రిత గ్రంథములు సూచింపఁబడినవి శ్రీ పంతులుగారు మహారాష్ట్ర భాషలో శ్రీ కేత్కర్ గారు ప్రకటించిన మహారాష్ట్ర వాఙ్మయ సూచిని చూచి అట్టి దాంధ్రమునఁ గూడ ప్రచురింపవలెనని సంకల్పించి శ్రీ కొమఱ్ఱాజు వారి తోడ్పాటుతో నా గ్రంథమును రూపొందించిరి " ఆంధ్ర వాఙ్మయ స్వరూప స్వభావములను ప్రత్యక్షముచే వాఙ్మయ వికాసమున కవసరమైన విధానమును నిర్ణయించుట కాంధ్ర వాఙ్మయ సూచి ప్రచురింపఁబడినదని యందలి పీఠికలో వారు తత్ప్రకట నోద్దేశమును తేటతెల్లము కావించిరి ఆ గ్రంథము వాఙ్మయ చరిత్ర కారులకే కాక పరిశోధన పరాయణుల కందఱికిని పరమోపకారియని చెప్పఁదగినది. ఆంధ్ర భాషలో నేయేరచయిత లెప్పుడెప్పుడేయే గ్రంథములు రచించిరో, యందెన్నినామమాత్రావశేషములై పోయినవో దాని వలన చక్కగా నెఱుంగ వచ్చును శ్రీ పంతులుగారాంధ్ర గ్రంథ మాలలో ప్రచురింపక పోయినను ధన సాహాయ్యముచేసి కవి పండితులచే ప్రకటింప జేసిన గ్రంథము లసంఖ్యాకములు ఆరోజులలో వారి సాహాయ్య మేదో విధముగా పొందియుండని రచయిత లేడనుట సర్వ విదితము

శ్రీ పంతులు గారు ప్రచురించిన గ్రంథములన్నిటిలో పరిమాణము చేతను, ప్రామాణ్యము చేతను, విజ్ఞాన ప్రబోధ సామ

శ్రీము చేతను ముందెన్నదగినది విజ్ఞాన సర్వస్వము. కొమర్రాజు వేంకట లక్ష్మణరావుగారు ప్రయత్నము నారంభించి యతి కష్టముతో రెండు సంపుటములు ముద్రింపించి అది ముగియకుండగనే దివంగతులైరి. వారు దానిపై పడిన క్లేశము, చేసిన కృషి యింతింతన రానివి. "నహి జ్ఞానేన సదృశం పవిత్ర మిహ దృశ్యతే" అను నాశయముతో శ్రీపంతులుగారా ప్రయత్నమును కొనసాగింప నిశ్చయించి శ్రీ మల్లంపల్లి వారి సాహాయ్యముచే దానిని పెంపొందించి క్రొత్త ఆరోపములు చేర్పించి చిత్రపటములతోఁగూడ దట్టమైన అట్టతో, మృదువైన కాగితములపై అత్యంత సుందరముగా రెండు సంపుటములు ముద్రింపించిరి. వానిని ప్రకటించుటకైన వ్యయ ప్రయాసములతో పోల్చి చూచినచో వానికి నిర్ణయింపబడిన వెల కేవలము నామ మాత్రమైనదే. తరువాత నాంధ్రమున వెలువడిన విజ్ఞాన సర్వస్వములకు ప్రాతిపదికయు, మార్గదర్శకమును అదియే. విజ్ఞానమును సర్వాంధ్ర జన సులభము కావించుటకై శ్రీ పంతులుగారు పొందిన యుత్కంఠకది శాశ్వత నిదర్శనము.

అమూల్యమైన పీఠికలు

శ్రీ పంతులు గారు పత్రికా గ్రంథ ప్రకటనము చేతనే కాక స్వయముగా ననేక రచనలు కావించుటచేకూడ నాంధ్ర వాఙ్మయమున కపారమైన సేవ కావించిరి. వారు పెక్కు గ్రంథములకు పీఠికలు రచించిరి. విషయ గంభీరములైన వ్యాసములు వెలయించిరి, వ్యాఖ్యానములు సంతరించిరి. గ్రంథములు ప్రకటించిరి. వారు వివిధ రచయితల గ్రంథములకు రచించిన పీఠికలు వారి సమరస భావమును, విజ్ఞాన వైవిధ్యమును ప్రకటించును. వారాంధ్ర వాఙ్మయ సూచికి వ్రాసిన పీఠిక కేవల మొక పీఠికయే కాక సమగ్ర వాఙ్మయ సమీక్షయని చెప్పదగినది. అదే తరువాత ఆంధ్ర వాఙ్మయ చరిత్ర మను పేర ప్రత్యేకముగా ప్రకటింపబడినది. ఇందు వారాంధ్ర వాఙ్మయ స్వరూపమును తేటతెల్ల మొనరించుటయే కాక దాని భవిష్య దభ్యుదయమునకుఁగూడ మంచి మార్గములు సూచించిరి. వారు బసవ పురాణమునకు ప్రస్తావనగా వ్రాసిన పీఠిక వేదకాలము నుండి వివిధ మతముల పరిణామమును సూచించుచు, వీరశైవము యొక్కయు, వీరశైవాగమ వేదాంత మంత్ర శాస్త్రముల యొక్కయు తత్త్వమును వివరించుచు గంభీరమైన వారి విజ్ఞానమును వేయి విధముల ప్రకటము చేయుచున్నది. ఆంధ్ర గ్రంథమాల యందలి కుసుమములకు వారు చక్కని పీఠికలు రచించిరి. అందు నీతినిధికిని, శతక మంజరికిని, తంజా పురాంధ్ర నాయక చరిత్రకును వారు వ్రాసిన పీఠికలు ప్రశంసనీయములై యున్నవి. శ్రీ దుగ్గిరాల రాఘవ చంద్రయ్య గారు రచించిన "అష్టాదశ మహాపాపియగు బ్రాహ్మణునితో సహాయ నిరాకరణ మొనర్పు" మను గ్రంథమునకు శ్రీ పంతులు గారు వ్రాసిన పీఠిక వారి సమరస భావమునకు నిదర్శనము.

శ్రీ పంతులు గారాంధ్ర విజ్ఞాన సర్వస్వమునకు స్వయముగా వ్రాసిన వ్యాసములు కొన్ని యున్నవి. అందు అల్లమ ప్రభువు, అపర్ణోశాను భూతి, అజంతా విహారములు, అనాహతము, అనుభవ సారము అను వానిని గూర్చి వారు రచించిన వ్యాసములు సమగ్ర విషయ సంపన్నములై వారి పరిశోధన పాండితీ పాటవమును ప్రకటించు చున్నవి. ఇవి గాక వారెడనెడ ఆంధ్ర పత్రికకు రచించిన సంపాదకీయములును, ఉగాది సంచికల పీఠికలును, భారతీ పత్రిక యందలి సాభిప్రాయ విశేషములును అనేకములున్నవి. వారి భగవద్గీతా భాష్యము స్వానుభవ పూర్వకముగా రచింపఁబడిన దగుటచే కేవల గీతా పరమార్థమునే గాక వారి అనుభవ సంపదను గూడ చక్కగా వ్యక్తము చేయుచున్నది. శ్రీ పంతులు గారు వ్యాసములు, పీఠికలు, సంపాదకీయములు, గ్రంథములు ఏవి వ్రాసినను వానినన్నిటిని గ్రాంథిక భాషలోనే రచించి యుండిరి. వారికి వ్యావహారిక భాష యెడ వైముఖ్యము లేదు అందు రచనలు కావించిన వారినికూడ వా రాదరించిరి కాని వారి గ్రాంథిక భాషాసక్తి సలక్షణము, ససంప్రదాయమునైన జీవిత ప్రవృత్తిపై వారికిఁగల మక్కువకు చిహ్నము మాత్రమే.

ఈ విధముగా శ్రీ పంతులుగారు స్వహస్తపరహస్తములతో నాంధ్రవాణి కపూర్వాలంకృతు లెన్నో వెలయించిరి. వారిది నిస్స్వార్థము, నిర్మలము, నిరాడంబరమునైన జీవితము. వారు కావించిన సేవయు నట్టిదే భారత మాతృ దాస్య శృంఖలా విచ్ఛేదమునకై సర్వస్వత్యాగము చేసిన దేశభక్త పుంగవులలో వలెనే ఆంధ్రరాష్ట్ర సంపాదనముకును, ఆంధ్ర శారదా భ్యుదయమునకును నిరంతర కృషి సాగించిన నిర్మల దీక్షా పరతంత్రులలో వారి నామము సువర్ణాక్షరములతో లిఖింపఁదగినది.

> "చంద్రునికి నూలుపోగన్న చందమునను
> శతజయంత్యుత్సవమ్మను సలుపు నాంధ్ర
> జనుల దివినుండి దీవింపు — జాతికెపుడు
> వెలుగు నిడుఁగాత నీయాత్మ విశ్వదాత!"

వ్యవసాయ రంగంలో విప్లవాత్మకమైన మార్పులు

పూర్వకాలంలో రైతులు ఎలా వుండేవారో ఊహించుకుంటే వారి దీనస్థితి అవగతమవుతుంది చేసేదిలేక వీరు దీనంగా ప్రకృతిపై ఆధారపడవలసి వచ్చేది ప్రకృతి ఆగ్రహావేశాలు, ఆనందాతిశయాల ననుసరించి వీరు జీవితంలో ఆటుపోటులను ఎదుర్కొంటూ వుండేవారు. బ్రతికి బయటపడటానికికూడా వీరు రోజంతా ఇరవై నాలగు గంటలూ పనిచేయవలసి వచ్చేది నారులేని భూమి, సామాన్యరకపు గింజలు, పాతకాలపు పరికరాలు – ఒక్కటీ వీరికి అనుకూలంగా వుండేదికాదు

ఇటీవలి కాలంలో వీరికి ఈ పోరాటానికై ఎక్కువ హంగులు యేర్పడినాయి. వ్యవసాయంలో ఉపయోగించే వస్తువులను సంఘటితపద్ధతిని సరఫరా చేయడానికి ఈ రోజున కొత్తవిధానాన్ని అనుసరించటంలో వీరిలో ఉత్సాహం పెరిగి శక్తిసామర్థ్యాలు ఇనుమడించాయి. ప్రస్తుతం వ్యవసాయోత్పత్తి పెరుగుదల దీని ఫలితమే. ఇది ఆనందించవలసిన విషయమే అయినప్పటికీ, మనలో పట్టుదల సడలరాదు ఈ విషయం వ్యవసాయదారునకు తెలిసినంతగా మరెవ్వరికీ తెలియదనే చెప్పవచ్చు. ఉత్పత్తి అధికంచేసే విషయంలో వ్యవసాయదారుని శక్తిసామర్థ్యాల్ని పెంచేందుకుగాను తగు చర్యలు తీసుకునేందుకై కార్యక్రమం రూపొందించబడింది.

అధిక దిగుబడి రకాలు

1966–67 లో సుమారు 46 లక్షల 6 వేల యెకరాల భూమిలో ఎక్కువ దిగుబడినిచ్చే జొన్న, రాగి, మొక్కజొన్న, వరి విత్తనాలు ఉపయోగించబడినాయి. 1967–68 లో సుమారు 59 లక్షల యెకరాల భూమి ఈ పథకం క్రిందకు తీసుకురాబడినట్టు అంచనా. ప్రస్తుత సంవత్సరంలో (1968–69) సారవ, దాళ్వ పంటలు రెంటికీ కలిపి, మొత్తం కోటి 50 లక్షల యెకరాల భూమిలో ఈ రకపు విత్తనాలను ఉపయోగించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ లక్ష్య సాధనకు పూర్తి అవకాశాలున్నాయి. ఎక్కువ దిగుబడినిచ్చే విత్తనాలను ఉత్పత్తిచేయటానికి, అటువంటి రకరకాలైన విత్తనాలను తయారు చేయటానికిగాను కేంద్రప్రభుత్వ క్షేత్రాలనూ, రాష్ట్రప్రభుత్వ క్షేత్రాలనూ యేర్పాటు చేస్తున్నారు.

రసాయనిక ఎరువులు

రసాయనిక ఎరువుల వినియోగంకూడా బాగా పెరుగుతున్నది. 1968–69 లో 17 లక్షల టన్నులు నత్రజని ఎరువులు, $6\frac{1}{2}$ లక్షల టన్నులు భాస్వరపు ఎరువులు, $4\frac{1}{2}$లక్షల టన్నులు ఇతర ఎరువులు వినియోగించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. 1967–68 లో $11\frac{1}{2}$ లక్షల టన్నులు నత్రజని ఎరువులు, 4 లక్షల టన్నులు భాస్వరపు ఎరువులు, 2 లక్షల టన్నులు ఇతర ఎరువులు వినియోగించబడగలవని అంచనా.

క్రిమిసంహారకాలు

క్రిమిసంహారక పదార్థాలుగా వినియోగించే రసాయనిక వస్తువులను రూపొందించి తయారుచేయటానికి అధిక ప్రాధాన్యమివ్వబడుతున్నది. క్రిమిసంహారక పదార్థాలను రూపొందించటానికి అవసరమైన సాంకేతిక వస్తువులనూ, స్థానికంగా వాటిని తయారుచేయటానికి అవసరమైన ముడిపదార్థాలనూ దిగుమతి చేసుకోటానికి ప్రభుత్వం ఉదారంగా విదేశ మారక ద్రవ్యాన్ని సమకూరుస్తున్నది. విద్యుచ్ఛక్తి సహాయంతో పనిచేసే (మందులు మొదలైనవి చల్లటానికి ఉపయోగపడే) యంత్రాలను ఈ దేశంలో తయారుచేయటాన్ని ప్రోత్సహిస్తున్నారు. మొక్కల రక్షణలో ఈ దేశం దాదాపు స్వయంసమృద్ధిని సాధించింది. క్రిమిసంహారక పదార్థాల విషయంలో, అవసరమయ్యే పరికరాల విషయంలోనూ కొరత యేర్పడినట్టుగా గడచిన రెండేళ్ళలోనూ ఫిర్యాదులేమీ అందలేదు. క్రిమిసంహారక మందులు మొదలైనవి ఎంత అవసరమయ్యేయో ముందుగానే నిర్ణయించుకొని అవసరాలకు తగినట్లుగా అవి సరఫరా అయ్యేట్టు జాగ్రత్త పడుతున్నారు.

వ్యవసాయ పారిశ్రామిక సంస్థలు

అస్సాం, బీహార్, ఉత్తరప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, మద్రాసు, మైసూరు, మహారాష్ట్ర, పంజాబ్, హర్యానావంటి వ్యవసాయ రాష్ట్రాలలో పరిశ్రమల సంస్థలు యేర్పాటు చేయబడినాయి. వ్యవసాయ పారిశ్రామిక రంగానికి ఆర్థికసహాయం, ఆ రంగంలో వస్తువుల ఉత్పత్తి, పంపిణీ మొదలైన బాధ్యతలన్నిటినీ ఈ సంస్థలు నిర్వహిస్తాయి పంపుసెట్లు, ట్రాక్టర్లు, ఇతర వ్యవసాయ యంత్రాల విషయంలో అద్దె కొనుగోలు పథకాలకు ప్రాముఖ్యమివ్వబడుతున్నది. జెటార్ 2011 ట్రాక్టర్ల పంపిణీ బాధ్యత పూర్తిగా వ్యవసాయ పరిశ్రమల సంస్థలకే వదిలివేయబడింది. ఈ సంస్థలకు మూలధనాన్ని కేంద్ర ప్రభుత్వం, రాష్ట్రప్రభుత్వాలు దాదాపు సమానంగా సమకూరుస్తాయి త్వరలో ఎక్కువ రాష్ట్రాలలో ఇటువంటి సంస్థలు యేర్పాటు చేయబడవచ్చును. వ్యవసాయ కార్యకలాపాలు మొదలైన వాటి విషయంలో సమర్థతతో పనిచేసే యంత్రాలను, పరికరాలను అధికంగా వినియోగించటంలో ఈ వ్యవసాయ పరిశ్రమల సంస్థ దోహదకారి కాగలదని ఆశించబడుతున్నది.

ట్రాక్టర్లను వ్యవసాయ యంత్రాలను ఇతర పరికరాలను నిర్ణీత మొత్తం చెల్లించే ప్రాతిపదికమీద అద్దెకు తీసుకోటానికి అవకాశం కలిగేందుకు గాను సాటి వస్తుకేంద్రాలను యేర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటున్నారు పంపుసెట్లు, ట్రాక్టర్లు మొదలైన వాటికి మరమ్మత్తులు మొదలైనవి జరపటానికై కేంద్రాలను యేర్పాటు చేయటానికి పథకాలు రూపొందించబడినాయి. ఉత్పత్తి పెంచటానికి సమర్థవంతమైన పద్ధతులను రైతులు అనుసరించేట్టు ప్రోత్సహించటమే ఈ పథకాల్ని యేర్పాటు చేయటంలో ఉద్దేశం.

వ్యవసాయోత్పత్తి, క్రయ సౌకర్యాలు, భూమి అభివృద్ధి మొదలైనవాటికి పరపతి సమకూర్చేందుకు ఉద్దేశించిన వ్యవస్థను విస్తృతపరచటం, రకరకాలు పరపతి అందేట్టు చేయటం జరిగింది. సహకార పరపతి సంస్థలను బలపరచటం వాటికి ఆర్థికంగా సహాయం సమకూర్చటం జరుగుతున్నది సహకార పరపతి సంస్థలద్వారా క్రమక్రమంగా అధికంగా పరపతి సమకూర్చబడుతున్నది వ్యవసాయ పెట్టుబడులకు పరపతి సమకూర్చే విషయంలో కూడా అభివృద్ధి సాధించబడుతున్నది. 1963 లో ప్రభుత్వం యేర్పాటుచేసిన ఎగ్రికల్చరల్ రిఫైనాన్స్ కార్పొరేషన్ వ్యవసాయాభివృద్ధికి సహాయపడుతున్నది.

ఇప్పుడు భారతదేశంలో రైతుల పరిస్థితి బాగా మారిపోయి ఎంతో మెరుగుపడింది ఇప్పుడు వారు తలవంచుకొని దీనంగా కనిపించనవసరంలేదు ఎప్పుడూ వారు పోరాటానికి వెనుదీయరు వారు వీరులు. ఈ రోజున వారికి పోరాటం కొనసాగించటానికి మంచి ఆయుధాలు సమకూరుతున్నాయి.

క్రమబద్ధం చేయబడిన మార్కెట్లు

భారతదేశం వంటి వ్యవసాయ ప్రధానమైన దేశంలో ఆర్థికాభివృద్ధిని సాధించాలంటే, వ్యవసాయోత్పత్తులను విక్రయించటానికిగాను తగు సౌకర్యాలు కలగచేసేందుకు సమర్థవంతమైన విధానం ఒకటి అమలులోవుండటం అవసరం వ్యవసాయదారుల భాగ్యభోగ్యాలమీదనే దేశం సిరిసంపదలుకూడా ఆధార పడుతాయి తాను పండించిన పంటలను లాభసాటిగా విక్రయించగలిగినపుడే వ్యవసాయదారుడు భాగ్యవంతుడు కాగలుగుతాడు వ్యవసాయదారుడు ఎక్కువగా పండించేట్టుగా ప్రోత్సహించాలంటే, అతడు పండింపుకి ప్రతిదానికి తగిన ధర లభించేట్టు చేయటం, పండించిన వస్తువులను విక్రయించటానికి తగు సౌకర్యాలు కలుగచేయటం అవసరమౌతుంది.

వ్యవసాయోత్పత్తుల మార్కెట్ల చట్టాలక్రింద క్రమబద్ధం చేయబడిన వ్యవసాయ మార్కెట్లు, దేశం మొత్తంమీద 1800 పైగా వున్నాయి. వ్యవసాయదారుడు పండించిన వస్తువులను విక్రయించటానికిగాను మార్కెట్ సమకూర్చటంద్వారా ఇవి వ్యవసాయదారునికి తగు ప్రోత్సాహం సమకూరుస్తున్నాయి. వ్యవసాయదారుడు ఈ మార్కెట్లలో నమ్మకంతో ధైర్యంగా ప్రవేశించవచ్చును. వీటిలో అతనికి తాను పండించినదానికి తగిన ప్రతిఫలం లభించగలదు.

ఉత్పత్తిదారులకు లాభాలు

క్రమబద్ధంచేయబడిన మార్కెట్లు రైతుల పాలిట వరప్రసాదంగా రూపొందాయి. దీనివలన కలిగిన లాభాలు అనేకం, పోటీపడి వస్తువుల కొనుగోలుచేసే విధానాన్ని ప్రవేశపెట్టటం, చెడు పద్ధతులను రూపుమాపటం, ప్రమాణ పూర్వకమైన తూకాలు, కొలతలు వినియోగించేటట్టు చేయటం, విక్రయదారులు కొనుగోలుదారుల మధ్య వివాదాలను పరిష్కరించటానికి తగు యంత్రాంగాన్ని రూపొందించటం మొదలైనవి దీనివలన కలిగిన లాభాలేను.

వస్తువులను ఉత్పత్తిచేసి విక్రయించే వారికి క్రమబద్ధం చేయబడిన మార్కెట్ల ఫలితంగా ఆర్థికంగా లాభాలు కలగడానికి తోడు, ఇతర ప్రయోజనాలు కూడా చాలా సమకూడుతున్నాయి ఈ ప్రయోజనాలు కూడా చాలా ముఖ్యమైనవనే చెప్పాలి. బహిరంగంగా వేలం వేసి వస్తువుల విక్రయించటం, అమ్మకంలో వచ్చిన డబ్బును వెంటనే చెల్లించటం, మార్కెట్లను గురించిన తాజా సమాచారాన్ని సమకూర్చటం మొదలైన వాటివలన ఉత్పత్తిదారులలో నమ్మకం పెంపొంది, క్రమబద్ధమైన మార్కెట్లలో విక్రయాలు పెరగటానికి అవకాశం యేర్పడింది.

వ్యవసాయదారులు బసచేసి, తమ వస్తువులను చక్కగా ప్రదర్శించటానికి ఈ మార్కెట్ ప్రాంతాలలో తగిన సౌకర్యాలు కలుగచేయబడుతాయి. బండ్లు వుంచుకోటానికీ, పశువులకు నీరు పెట్టుకోటానికీ వీటిలో ప్రత్యేకంగా యేర్పాట్లు చేయబడుతాయి. ఇందువలన వ్యవసాయదారుడు తన వస్తువులను హడావిడిగా ఏదో ధరకు విక్రయించి వెంటనే తిరుగు ప్రయాణం కట్టవలసిన అవసరం వుండదు.

క్రమబద్ధం చేయబడిన మార్కెట్ల క్రిందకువచ్చే ప్రాంతాలలో ఉత్పత్తి అయిన వ్యవసాయ వస్తువులలో నూటికి 90 వంతులకు పైగా విక్రయించటానికి ఈ మార్కెట్లకే తీసుకురాబడుతున్నట్టు అంచనా వేయబడింది. మార్కెట్లను క్రమపద్ధతిని యేర్పాటు చేయటం వలన ఆర్థికంగా లాభాలు కలగటమేకాకుండా ఉత్పత్తిదారులలో గట్టినమ్మకం కూడా యేర్పడినట్టు, వస్తువిక్రయ పద్ధతిలో వచ్చిన ఈ మార్పును బట్టి తెలియగలదు.

వినియోగదారులకు లాభాలు

వస్తువు కొనేటప్పుడు వినియోగదారుడు వస్తువు నాణ్యాన్ని గురించి, దాని ధర విషయంలోనూ జాగ్రత్తవహిస్తాడు క్రమపద్ధతిన యేర్పాటు చేయబడిన మార్కెట్లు ఈ రెండు విషయాలలోనూ గొప్పగా ఉపయోగపడగలవని రుజువు అయింది. క్రమపద్ధతిన యేర్పాటుచేయబడిన మార్కెట్లవలన ఉత్పత్తిదారునకు

తగు ప్రతిఫలం సమకూడేట్లు చేయడమేగాకుండా వినియోగదారు లకు కూడా సరసమైన ధరకు వస్తువు లభించేట్లు చేయటానికి వీలౌతున్నది.

మార్కెట్లను క్రమబద్ధం చేయడమన్నది 19వ శతాబ్దం ఆఖరి దశాబ్దపు ఆరంభంలోనే ప్రారంభమైనప్పటికీ, దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ప్రణాళికా సంఘం ప్రథమ పంచవర్ష ప్రణాళికలో మార్కెట్లను క్రమబద్ధంచేసే విషయానికి ప్రాధాన్యమిచ్చి, మార్కెట్ క్రమీకరణకు సంబంధించిన చట్టం అమలులోలేని రాష్ట్రాలలో అటువంటి చట్టాలను ప్రవేశపెట్టాలని చెప్పినపుడే, ఈ ఉద్యమానికి బలం చేకూరి ఇది ముందుకు పురోగమించింది.

దేశంలో వివిధ ప్రాంతాలలోని హోల్‌సేల్ మార్కెట్లను ఒక చట్టం కిందకు తీసుకువచ్చే విషయంలో క్రమాభివృద్ధి సాధింప బడుతున్నది. దేశంలో వున్న యీ ముఖ్యమైన హోల్‌సేల్ మార్కెట్లలో 1,800 పైగా మార్కెట్లను వ్యవసాయోత్పత్తుల మార్కెట్ల చట్టం క్రిందకు తీసుకురాబడినాయి. పశ్చిమ బెంగాల్, అస్సాం, కేరళ రాష్ట్రాలు తప్ప మిగిలిన రాష్ట్రాలన్నీ ఈ శాసనాన్ని చేసి అమలుపరిచాయి ఈ మూడు రాష్ట్రాలు కూడా ఈ శాసనాన్ని చేయటానికి చర్యలు తీసుకుంటున్నాయి చతుర్థ పంచవర్ష ప్రణాళిక అంతానికి దేశంలో పెద్ద మార్కెట్లన్నిటిని క్రమబద్ధం చేయ డము జరగగలదని అనుకుంటున్నారు

క్రమబద్ధం చేయబడిన మార్కెట్లు ప్రజాస్వామ్య సూత్రాల పైన పనిచేసాయి సక్రమంగా యేర్పాటు చేయబడిన మార్కెటు సంఘాలు మార్కెట్ల నిర్వహించే బాధ్యతవహిస్తున్నాయి. ఈ మార్కెట్ సంఘాలలో ఉత్పత్తిదారులకు, వ్యాపారస్థులకు ప్రాతినిధ్యం వుంటుంది. ఈ సంఘాలలో ఉత్పత్తిదారుల ప్రతినిధుల సంఖ్య సామాన్యంగా అధికంగా వుంటుంది చాలా ప్రాంతాలలో వారినే అధ్యక్షుడుగా ఎన్నుకోటం కూడా జరిగింది. మార్కెట్ చట్టాలలోని నిబంధనలను, ఆ చట్టాలక్రింద యేర్పాటుచేయబడే ఇతర సూత్రాలను అమలుపరచడం ఈ సంఘాల బాధ్యతై వుంది

మార్కెట్ సంఘానికి ఆదాయం, మార్కెట్ వినియోగ దారులు చెల్లించే రుసుము నుంచీ, మార్కెట్‌కు తీసుకురాబడే వస్తువులపై వేసే పన్ను నుంచీ లభిస్తుంది సామాన్యంగా ఈ సంఘాలు స్వయం పోషకత్వ పద్ధతిన పని చేస్తుంటాయి. అయితే ఆరంభదశలో మొదటి మూడేళ్లు ఈ సంఘాలకు రాష్ట్రప్రభుత్వాల నుంచి ఆర్థిక సహాయం లభిస్తుంది.

న్యాయనిబంధనల ప్రకారమూ, స్వచ్ఛంద కృషిలోనూ, క్రమ పద్ధతిన మార్కెట్లను అభివృద్ధిపరచటానికి శిక్షణ పొందిన సిబ్బంది ఎక్కువగా అవసరమౌతుంది ఈ సిబ్బందికి శిక్షణ యివ్వటానికిగాను భారత ప్రభుత్వం ఒక పథకాన్ని ఆమోదించింది మొదటి శిక్షణ తరగతులు 1956 ఆగస్టు 1వ తేదీన ప్రారంభించబడినాయి వ్యవసాయవస్తువుల విక్రయానికి సంబంధించిన వివిధ అభివృద్ధికార్యకలాపాలను నిర్వహించగలిగేట్టుగా ఈ అధికారులకు తగిన హంగులన్నీ యేర్పాటు చేయడమే ఈ పథకం ఉద్దేశం.

శిక్షణ

మార్కెట్లను నిర్వహించటానికి అవసరమైన సిబ్బందికి హైదరాబాద్, లక్నో, సాంగ్లిలోని శిక్షణ కేంద్రాలలో శిక్షణ యివ్వబడుతున్నది. అదే విధంగా నాగ్‌పూర్, మద్రాసులోని కేంద్రాలలో 'గ్రిడర్ల' 'ఎససర్లకు శిక్షణ యిస్తున్నారు. చతుర్థ పంచవర్ష ప్రణాళికలో శిక్షణ పొందిన సిబ్బంది ఎక్కువగా అవసరమౌతుంది కాబట్టి అందుకు అనుగుణంగా ఈ శిక్షణ సౌకర్యాలను పెంచుతారు. చతుర్థ పంచవర్ష ప్రణాళికా కాలంలో విస్తరణ కార్యక్రమాన్ని అమలుపరచటానికి 200 మంది మార్కెటింగ్ అధికారులు, ఇనిస్పెక్టర్లు, 600 మంది మార్కెట్ కార్యదర్శులు, 900 మంది 'గ్రిడర్లు' ఎససర్లు, అవసరమౌతారని అంచనా వేయ బడింది

చతుర్థ పంచవర్ష ప్రణాళిక కాలంలో మార్కెట్లను క్రమ బద్ధంచేసే పథకాన్ని విస్తృత పరచటానికి తోడుగా ఎక్కువ వస్తువులు, విక్రయ సౌకర్యాలకు సంబంధించి ఎక్కువ అంశాలు ఈ పథకం కిందకు వచ్చేట్టుగా దీన్ని పెంచాలని కూడా తల పెట్టారు.

పులివెందల కాల్వ పథక సమావేశం

ముఖ్యమంత్రి శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి ఏప్రిల్ 27 వ తేదీన పులివెందల కాల్వ పథకానికి సంబంధించిన సమావేశానికి ప్రారంభోత్సవం జరిపారు. సహకార శాఖామంత్రి శ్రీ విజయ భాస్కరరెడ్డి అధ్యక్షత వహించారు పులివెందల తాలూకాలో 55,000 ఎకరాలు లాభపడేందుకు, తుంగభద్ర ఎగువకాల్వలో భాగమైన పులివెందల కాల్వ పని త్వరలో చేపట్టి నిర్వహించ బడుతుందని ముఖ్యమంత్రి హామీయిచ్చారు. ఈ తాలూకాలో ప్రజల పట్ల గల బాధ్యత ప్రభుత్వానికి తెలుసునని, ప్రభుత్వం ఈ పనిని నిర్వహించే నిమిత్తం ఈ పథకాన్ని నాల్గవ పంచవర్ష ప్రణాళికలో చేర్చాలని నిర్ణయించిందని కూడా చెప్పారు.

ముందుగా అభివృద్ధి పన్నును వసూలుచేసే విషయమై గల విమర్శను ప్రస్తావిస్తూ, ప్రస్తుతం ఎదుర్కొంటున్న ఆర్థిక యిబ్బందులదృష్ట్యా ఈ పన్ను కోరవలసి వచ్చిందని ముఖ్యమంత్రి అన్నారు. ఈ పన్ను వసూలు నిబంధనపైనే కృష్ణా డెల్టా ప్రాంతంలో 20 కోట్ల రూపాయలు విలువజేసే మురుగునీటి కాల్వపథకం మంజూరు చేయబడిందని చెప్పారు అడ్వాన్సుగా ఈ పన్ను చెల్లించడానికి రైతులు ముందుకువచ్చి తద్వారా ప్రభుత్వం ఈ పథకాన్ని అమలుజరిపేందుకు కట్టుబడేలా

చేస్తున్నారని కూడా అన్నారు. ఏవైపు నుండి కూడా ఈ ప్రతిపాదనకు ఎదురుమాటలేదని వారు అన్నారు.

అదనపు విస్తీర్ణాన్ని సాగు క్రిందికి తీసికొని వచ్చేందుకై ఏలేరు రిజర్వాయరు పథకం, గోదావరి బేరేజి, నిజాంసాగర్ ప్రాంతాలలో రైతులు కూడా యిదే విధంగా అడ్వాన్సు బెటర్ మెంటులెవీ చెల్లించడానికి ముందుకు వస్తున్నారని అన్నారు.

ఈ ప్రాంతంలో క్షామాన్ని నిర్మూలించేందుకు, ఒక ప్రత్యేకమైన పథకం యొక్క ఆవశ్యకతను, కేంద్ర ప్రభుత్వం, ప్రణాళికా సంఘం గుర్తించేలా ఈ సమావేశం చేయకలిగినందుకు హర్షాన్ని వెలిబుచ్చారు. క్షామ నివారణార్థమై ప్రణాళికా సంఘం నాల్గవ పంచవర్ష ప్రణాళికలో, రూ 40 కోట్లు విలువ జేసే ఒక ప్రత్యేక పథకాన్ని చేర్చింది.

రైతుల పంచాంగం

ఐ ఆర్. 8, తైచుంగ్ నేటివ్–1. సంకరజాతి జొన్న, మొక్కజొన్న, సజ్జల వంటి అధిక దిగుబడినిచ్చే పంటల సాగు పద్ధతుల వివరాలను తెలుపుతూ రైతుల ఉపయోగార్థం, తేలికైన తెలుగు భాషలో రైతుల పంచాంగం అనే ఒక క్రొత్త పంచాంగాన్ని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రచురించింది. పంటలు విత్తనాల మడుల్ని కట్టడం, తయారు చేయడం, ఎరువులు వాడడం, పంటలు కోయడం, నూర్పిడి, తదితర అంశాలమీద సమాచారాన్ని ఈ పంచాంగం అందజేస్తుంది. రైతులకు పంటల సాగు విషయంలో తాజా పద్ధతులపై సమాచారాన్ని అందజేసి అధిక వ్యవసాయోత్పత్తికి ఈ పంచాగం దోహదకారి కాగలదని ఏప్రిల్ 3వ తేదీన విశ్వవిద్యాలయవైస్‌-ఛాన్సలర్ శ్రీ ఒ. పుల్లారెడ్డి అన్నారు.

ఏప్రిల్ 3 వ తేదీన వ్యవసాయ మంత్రి శ్రీ పి. తిమ్మారెడ్డి విడుదల చేసిన పంచాంగం కూడా, కోళ్ళపెంపకం, గొఱ్ఱెలు తదితర జంతువుల పోషణపై సమాచారాన్ని అందిస్తుంది.

నీటిపారుదల, విద్యుచ్ఛక్తి పథకాలకు ప్రాధాన్యత

వరంగల్ జిల్లా అభివృద్ధి సంఘం ఘానాపూర్‌లో ఏప్రిల్ 3 వ తేదీన సమావేశమైంది. కలెక్టర్ శ్రీ యమ్ ఎ హలీమ్ సమావేశాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ, నీటిపారుదల, విద్యుచ్ఛక్తి పథకాలకు అధిక ప్రాధాన్యత యివ్వబడుతున్నదని, నరసంపేటకు రూ. 50 లక్షలు, మహబూబాబాద్‌కు రూ 55 లక్షలు, జనగామకు రూ. 85 లక్షల విలువజేసే పథకాలు ఆమోదించబడ్డాయని చెప్పారు.

గుంటూరు ప్రాంతానికి నీటి పారుదల పథకాలు

గుంటూరు జిల్లా కలెక్టర్ శ్రీ యమ్. వెంకటరత్నం, మే 10 వ తేదీన వేటపాలెం పంచాయితీ సమితి సభ్యుల నుద్దేశించి ప్రసంగిస్తూ, వర్తమాన సంవత్సరంలో 2 కోట్ల రూపాయల విలువచేసే, మురుగునీటి కాల్వలు చిన్న నీటి వనరులు, లిఫ్టిరిగేషన్ పథకాలను, గుంటూరుజిల్లా అభివృద్ధి సంఘం చేపట్ట నున్నదని చెప్పారు.

అధికాహారోత్పత్తికి జిల్లా ప్రణాళిక

వ్యవసాయం శాస్త్రీయ పద్ధతుల పై నిర్వహించే ఉద్దేశంతోనూ, తద్వారా సాధన సంపతులు, అవసరాల దృష్టిలో వుంచుకుని హైదరాబాదు జిల్లాలో, 28, 272 టన్నుల మేరకు ఆహారోత్పత్తిని పెంచే నిమిత్తం గ్రామ గ్రామానికి, సమితి సమితికి ఒక ప్రణాళిక తయారు గావించబడింది.

పశుగ్రాస మిశ్రమ యంత్రానికి ప్రారంభోత్సవం

భువనగిరి వద్ద ఏప్రిల్ 21 వ తేదీన ముఖ్యమంత్రి శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి పశుగ్రాస మిశ్రమ యంత్రానికి ప్రారంభోత్సవం చేశారు. నల్గొండ జిల్లా పరిషత్ అధ్యక్షులు శ్రీ రామకృష్ణారెడ్డి అధ్యక్షత వహించారు. ×

విద్యుచ్ఛక్తి

విద్యుచ్ఛక్తి యూనిటుకు ప్రారంభోత్సవం

నాగార్జునసాగర్‌లోని 100 కె వి. 132 కె వి ట్రాన్స్‌ఫార్మర్ రెండవ యూనిటును ఏప్రిల్ 16వ తేదీన వినియోగం లోనికి తెచ్చారు. దీనివల్ల ప్రస్తుతపు 100 ఎం వి ఏ ట్రాన్స్‌ఫార్మర్‌పైన ఒత్తిడి తగ్గి తాడేపల్లి, హైదరాబాదులకు విద్యుచ్ఛక్తి సరఫరా పరిస్థితి మెరుగు పడుతుంది. కొత్తగూడెం థర్మల్ కేంద్రం నుంచి శ్రీశైలంమీదుగా కర్నూలుకు నేరుగా విద్యుచ్ఛక్తి సరఫరా చేయడానికికూడా యిందువల్ల వీలుకలుగుతుంది

గ్రామీణ విద్యుచ్ఛక్తి సరఫరా పథకం

గత సంవత్సరం 23,400 సేద్యపు నీటి బావులకు విద్యుచ్ఛక్తి సరఫరా చేసినట్లుగానూ, ఈ యేడాది సుమారు 30,000 బావులకు విద్యుచ్ఛక్తి యివ్వడానికి తలపెట్టినట్లుగానూ రాష్ట్ర విద్యుచ్ఛక్తి బోర్డు అధ్యక్షుడు శ్రీ సి. నరసింహం, మే 7వ తేదీన హైదరాబాదు జిల్లా పరిషత్తు సభ్యుల సమావేశంలో ప్రసంగిస్తూ తెలిపారు. దాదాపు 1,526 గ్రామాలకు కొత్తగా విద్యుచ్ఛక్తి సౌకర్యాలు కల్పించడానికి తలపెట్టబడిందనీ వాటిలో హైదరాబాదు జిల్లాకు చెందిన గ్రామాలు 58 వుంటాయని కూడా ఆయన వెల్లడించారు. హైదరాబాదు జిల్లాలోగల 958 గ్రామాలలో యిప్పటివరకు 221 గ్రామాలకు విద్యుచ్ఛక్తి యివ్వడం జరిగింది. గ్రామాలకు విద్యుచ్ఛక్తి సరఫరా చేయడానికి సంబంధించిన పథకాలకు యిప్పటివరకు రూ. 53 కోట్లు ఖర్చు చేశారు. ×

సంక్షేమ రాజ్యంలో నేర నిరోధం

ప్రొఫెసర్ వి. జగన్నాథమ్

సంక్షేమ రాజ్యంలో దారిద్ర్య నిర్మూలనం జరిగి, ప్రజల స్థితిగతులు మెరుగు అవుతాయి. కనుక నేరాలు చాలావరకు తగ్గిపోగలవని కొందరి అభిప్రాయం కాని జాగ్రత్తగా పరిశీలించిన మీదట ఇది వాస్తవంకాదని తేలింది. నేరాల స్వభావ స్వరూపాలు మారవచ్చు నేరాలు జరగడానికి కారణాలు భిన్నమైనవి కావచ్చును కాని నేరాలసంఖ్య చెప్పుకో తగినంతగా తగ్గకపోవచ్చును

ప్రభుత్వ నిబంధనలు, శాసనాలు ఉల్లంఘించడం, బాధ్యతలు నెరవేర్చక పోవడం వంటి నేరాలు సంక్షేమరాజ్యంలో పూర్వంకంటె ఎక్కువకావచ్చును సంక్షేమరాజ్యంలో ప్రభుత్వ బాధ్యతలు పెరగడం, ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు జరపడం, జరిగినప్పుడు ప్రభుత్వ నిధులమూలంగా అధిక ప్రయోజనాలు పొందాలని ప్రజలు నిబంధనలను, శాసనాలను ఉల్లంఘించవచ్చును. వారికి అటువంటి అత్యాశ కలిగే అవకాశం ఎక్కువగా ఉండవచ్చును సంక్షేమ రాజ్యంలో ప్రభుత్వం విధించిన నియమ నిబంధనలు, చేసిన శాసనాలు తమకు వర్తించకుండా తప్పించుకొని తిరగాలని ప్రజలు ఎక్కువగా ప్రయత్నించవచ్చును. నియమ నిబంధనలు ఎక్కువ అయినకొద్దీ వాటినుంచి తప్పించుకోడానికి, ఉల్లంఘించడానికి వారి ప్రయత్నాలు ఎక్కువకావచ్చును. సంక్షేమరాజ్యంలో-సంక్షేమ కార్యక్రమాలు సరిగా అమలు జరపకపోవడం, పన్నులు ఎగవేయడం, రహదారులలో మోటారు వాహనాలు మొదలైనవాటిని నడపడంలో నిబంధనలను అతిక్రమించడం వటిపీ చిన్న పిల్లలు సిగరెట్లు త్రాగడం, మధుపానీయాలు సేవించడం, అక్రమ సంబంధాలు పెట్టుకొని శీలం పాడు చేసుకోవడంవంటి రకరకాల నేరాలు జరిగే అవకాశం ఉన్నది. ఆస్తి, ప్రాణనష్టం కలిగించే పెద్ద నేరాలు ఎక్కువగా జరుగకపోవచ్చును కాని పైన పేర్కొన్న చిన్న నేరాలు జరుగుతూనే ఉంటాయి అందువల్ల సంక్షేమ రాజ్యంలో నేరాలు అసలు జరగవనీ కానీ, వాటి సంఖ్య బాగా తగ్గిపోతుందని కానీ అనడానికి ఎంతమాత్రం వీలులేదు. నూతన సామాజిక వ్యవస్థలలో క్రొత్త రకాల నేరాలు ఎలా జరుగుతూంటాయో తెలుసుకొని ఆ దృష్ట్యా నేర నిరోధానికి కృషి చేయవలసి ఉన్నది.

అనేక సంక్షేమ రాజ్యాలలో సాంకేతిక అభివృద్ధి సాధింపబడుతుంది ఫలితంగా నేర పరిశోధనకు దోహదం కలుగుతుంది. పూర్వంకంటే సులభమైన పద్ధతిలో నేరస్తులను పట్టుకోడానికీ, నేరం నిరూపించడానికీ అవకాశం కలుగుతుంది. అయితే మరొక వంక ఈ సాంకేతికాభివృద్ధి, నేరస్తుల కూడా ఉపయుక్తం అయ్యే ప్రమాదం ఉండనే ఉంది వారు ఇతరులు కనిపెట్టడానికి వీలు లేని పద్ధతులు అవలంభించడానికి, నేరంచేసి శిక్ష పడకుండా తప్పించుకొనేందుకు వీలుగా సాక్ష్యాధారాలు మాపుచేయడానికి ప్రయత్నించే అవకాశాలు ఎక్కువ అవుతాయి. ఈవిషయం గమనిస్తే సంక్షేమ రాజ్యంలో నేరాలు జరుగకుండా పూర్తిగా నివారించ లేకపోయినా కనీసం వాటి సంఖ్య తగ్గించడానికి రకరకాల నేరాల స్వభావ స్వరూపాలను గురించి ఎంత జాగ్రత్తగా పరిశీలించవలసిన అవసరం ఉన్నదో స్పష్టం అవుతుంది.

నేరాలు తరచు జరగకుండా నివారించడానికి; పూర్తిగా, లేదా ఎక్కువగా ప్రభుత్వ యంత్రాంగంపై ఆధారపడితే సరిపోదు. పౌరులు ఈ విషయం శ్రద్ధ వహించాలి ప్రజలలో ఎక్కువ మంది మనకెందుకులే అని పట్టించుకోకపోతే చాలా నేరాలు బయట పడవు అందువల్ల ప్రజలకు ఈ విషయమై శ్రద్ధాసక్తులు పెరిగేలా చెయ్యాలి. అయితే ఇందులో కొన్ని ఆటంకాలు ఉన్నాయి. సంక్షేమ రాజ్యాలలో ప్రభుత్వ విధానాలు మారటంవల్లా, ప్రజలు ఎక్కువగా సొంత వ్యవహారాలలో, వృత్తి ఉద్యోగాలలో మునిగి ఉండడంవల్లా ఇటువంటి విషయాలపట్ల శ్రద్ధ సన్నగిల్లి పోతుంది. నేరం జరిగిందని అధికారులకు తెలియ జేయడంలోనూ, తెలియజేసినతర్వాత కొన్ని యిబ్బందులూ, స్వల్పమైన చికాకులు ఉంటాయి. అందువల్ల వారు ముందుకు రావడానికి జంకుతారు దీనికి తోడు నేరం చేసినవారు తమ్ము ఏమి బాధిస్తారో అని మరో భయం నేర నిరోధానికి అవకాశాలు పెంపొందింప చేయాలంటే ముందు ఇటువంటి చికాకులు, భయ సందేహాలు నివారించి ప్రజలకు ఈ విషయమై ఎక్కువ శ్రద్ధ కలిగేలా చెయ్యవలసిన అవసరం ఎంతైనావున్నది

సాంఘిక మర్యాదలు, పూర్వపు సాంప్రదాయాలు అతి శీఘ్రంగా మారిపోతున్నాయి. పూర్వపు విలువలే మారిపోతున్నాయి ఇటువంటి పరిస్థితులలో నేరనిరోధం విషయంలో ప్రభుత్వం, మరొక వంక ప్రజలు గురుతరమైన బాధ్యత నిర్వహించ వలసి వస్తున్నది.

నేరంచేస్తే పాపం వస్తుందనీ, భగవంతుని ఆగ్రహానికి గురి కావలసివస్తుందనీ భయం చొప్పున పూర్వ ప్రజలు నేరాలు చేసేవారు కారు. ప్రభుత్వం విధించే శిక్షలకంటె ఈ భయం వారికి అధిగమింపరాని అవరోధంగా కన్పించేది. పాతకాలపు విశ్వాసాలు పోతున్నాయి. మత ప్రాబల్యం దైవభీతి, పాపభీతి సన్నగిల్లిపోతున్నాయి. పూర్వం ఇళ్లల్లో, పాఠశాలల్లో, అటు తర్వాత సంఘ జీవితంలో పిల్లలకు, యువకులకు నైతికవిలువలు మత సంప్రదాయాలకు సంబంధించిన విలువలు బోధించేవారు అందువల్ల వారికావిలువలు ఉగ్గుపాలతోనే అబ్బేవి సంఘంలో పెద్దలు పిన్నలకు ఆదర్శప్రాయులుగ ఉండేవారు. ఈ పరిస్థితి క్రొత్త నాగరికత పెంపొంది నగర జీవితంలో కుటుంబానికి ఆయా వ్యక్తులపై ఎక్కువ అధికారాలు లేకపోవడంవల్లా, మహా

పట్టణంలో ఎవరు ఎవరో తెలియక వ్యక్తిత్వం పట్ల గౌరవం పోవడంవల్లా- క్రమంగా మారిపోయింది. ప్రభుత్వ నిబంధనలు, శాసనాలు కట్టుదిట్టంగా అమలు పరచి నేర పరిశోధన జాగ్రత్తగా జరిగేలా చెయ్యడం అవసరమే. కాని నేర నిరోధానికి అంత మాత్రమే చాలదు. పౌరవిధులు, నైతిక విలువలు, మత విశ్వాసాలపట్ల ప్రజలకు భక్తి శ్రద్ధలు కలిగేలా చెయ్యడానికి క్రొత్త పద్ధతులు అవలంబించవలసి ఉన్నది ఇందు నిమిత్తం క్రొత్త సంస్థలను ఏర్పాటు చేయవలసి ఉన్నది.

సంక్షేమ రాజ్యంలో ఆశయాలు, లక్ష్యాలు నెరవేరకపోవడం వల్ల, ఆయా పథకాలమూలంగా ఆశించిన ఫలితాలు తమకు అందక పోవడవల్ల ప్రజలలో అసంతృప్తి ప్రబలి నేరాలకు అవకాశం కలుగుతుంది ఉత్పత్తి పెరిగినా నిత్యావసర వస్తువులు, ఆహార ధాన్యాలు లక్షలాది ప్రజలకు అందకపోతే తీవ్ర అసంతృప్తి, నిస్పృహ కలుగుతాయి. ఈ పరిస్థితుల మూలంగా నేరాలకు అవకాశం కలుగుతుంది. అందువల్ల ఈ పరిస్థితిని ముందుగా సరిదిద్దవలసి ఉన్నది.

మారిన ప్రపంచ పరిస్థితులకూ, విజ్ఞానసాంకేతిక అభివృద్ధికీ, నవ మానవ సామాజిక వ్యవస్థలకూ, అనుగుణంగా నైతిక మత సిద్ధాంతాలనూ, విలువలనూ మలచి, కొత్త అర్థాలు చెప్పి ప్రజలకు ప్రబోధించవలసిన అవసరం కూడా ఉన్నది.

మన దేశ పరిస్థితులు ఇంకా ఎంతో మెరుగు కావలసి ఉన్నది. మనం పెట్టుకొన్న లక్ష్యాలు ఆదర్శాలు అత్యుదాత్తమైనవి. కాని మనకు ఉన్న వసతులు చాలా పరిమితం. ఆశయ సాధనలో వైఫల్యం మనదేశంలో నేరాలు జరగడానికి కారణభూతం అవుతున్నది. దానికి తోడు సాంకేతిక అభివృద్ధి సాధించకపోవడంవల్లా, పరిశోధనకూ, సిబ్బంది నియామకానికి పెద్ద మొత్తాలు ఖర్చుచేయలేకపోవడం వల్లా మనదేశంలో నేర నిరోధ, చోర నివారణ పద్ధతులు ఆధునిక స్థాయికి రాలేదు ఈ పరిస్థితి మెరుగై ప్రజలకు ఈ విషయంలో శ్రద్ధాసక్తులు పెరిగి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతోటి స్థానిక పరిపాలనాశాఖ అధికారులు మరింత గట్టిగా కృషిచేస్తే ముమ్ముందు మనదేశంలో నేర నిరోధానికి ఎక్కువ అవకాశం కలుగుతుంది. ★

అగ్నిప్రమాదాల నివారణ - కొన్ని ముఖ్యాంశాలు

అగ్ని ప్రమాదాల మూలంగా దేశంలో ఏటా రూ. 31 కోట్ల విలువచేసే ఆస్తి నష్టం అవుతోంది. షుమారు 1500 మందికి ప్రాణ నష్టం కలుగుతున్నది. దాదాపు పదివేల పశువులు అగ్నికి ఆహుతి అవుతున్నాయి. ఇలా లెక్కకురాని నష్టం ఇంకా ఎంతో ఉండవచ్చు. లోకంలో ప్రాణికోటి జీవించడానికి అగ్ని అత్యంత ఆవశ్యకం. అగ్ని ఎంత అవసరమో అంత వినాశహేతువు కూడానూ. కన్ను మూసి కన్ను తెరిచేలోపల ఒక చిన్న నిప్పురవ్వ మూలంగా ఎంత పెద్ద ప్రమాదం సంభవించగలదో, చూస్తుండగానే అగ్ని చెలరేగి మంటలు మింటనంటుకొని పరిస్థితి ఎంత భీభత్సంగా తయారవుతుందో అందరికీ తెలిసిన విషయమే.

పరిశ్రమలు నానాటికి అభివృద్ధిచెంది ఫ్యాక్టరీలు, ప్రాజెక్టులు మొదలైన వాటి పరిసరాలలో, వసతి వాడలలో జనసాంద్రత పెరగడంతో అగ్ని ప్రమాదాలు తరచు జరుగుతున్నాయి. అగ్ని ప్రమాదాలు నివారించడం ఆనాటికానాడు మరింత కష్టతరం అవుతున్నది. ఇటువంటి బాధ్యతలు నిర్వహించే వారికి శరీరదార్ఢ్యం, గుండెనిబ్బరం ప్రత్యేక ప్రావీణ్యంతోపాటు పదార్థ విజ్ఞానశాస్త్రం, రసాయన శాస్త్రం వంటి శాస్త్ర పరిజ్ఞానంకూడా ఎంతో అవసరం అవుతున్నది వారికి అగ్ని ప్రమాదాలు జరగకుండా నివారించడానికి, ప్రమాదం జరిగినపుడు మంటలు చల్లార్చడానికి సంబంధించి అధునికమైన, శాస్త్రీయమైన పద్ధతుల విషయంలోనూ, ఆపదలో చిక్కుకొన్న వారిని, వారి వస్తువులనూ సురక్షిత ప్రాంతాలకు చేరవేసే విషయంలోనూ, ఆధునికమైన అగ్నిమాపక యంత్రసాధనాలు వినియోగించడం విషయంలోనూ గట్టి శిక్షణ ఇవ్వవలసి ఉన్నది. అగ్నిమాపక దళ సభ్యులకు ఇటువంటి శిక్షణ ఇచ్చే నిమిత్తం నాగపూర్‌లో ఒక జాతీయ కళాశాల నెలకొల్పబడింది. పరిశ్రమలు, నౌకలు, విమానాలు మొదలైన వాటిలో అగ్ని ప్రమాదాలు నివారించడానికి, భద్రతా ఏర్పాట్లు చెయ్యడానికి ఈ కళాశాలలో ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. అగ్నిమాపక దళం తాలూకు ఇంజనీర్ల శిక్షణ సంస్థ ఒకటి ఏర్పాటు చేయాలని కూడా ఉద్దేశిస్తున్నారు.

విద్యుచ్ఛక్తి వాడకం విషయంలో సరియైన జాగ్రత్త వహించకపోవడంవల్లా, అగ్గి పుల్లలతో పిల్లలను ఆడుకోనివ్వడం వల్లా, కుంపట్లు, స్టౌలు మొదలైనవాటిని వంటవార్పు అయ్యాక ఆర్పకుండా వదలి వెయ్యడంవల్లా, సిగరెట్ల పీకలు ఆర్పకుండా ఇష్టం వచ్చినట్లు పారేయడంవల్లా, సిగరెట్టు వెలుగుతుండగానే ఎక్కడో పడుకొని నిద్రపోవడం వంటి అజాగ్రత్త పనుల వల్లా అగ్ని ప్రమాదాలు సంభవించడం, సామాన్య ప్రజలు తీవ్ర నష్టాలకు గురికావడం జరుగుతున్నది. అగ్నిప్రమాదాలు జరగకుండా నివారించడానికి, అటువంటి ప్రమాదాలు జరిగితే వెంటనే మంటలు ఆర్పడానికి సంబంధించిన ప్రాథమిక అంశాలు ప్రజలకు తెలిస్తే ప్రాణ నష్టం, ఆస్తినష్టం చాలావరకు తప్పించవచ్చును. ఇందుకు సంబంధించిన వివిధ విషయాలు ప్రజలకు వివరంగా తెలియచేయడానికి అగ్ని ప్రమాదాల నివారణకు సంబంధించి శిక్షణ ఇవ్వడానికిగాను యేటా ఏప్రిల్ 14వ తేదీన అగ్ని ప్రమాదాల నివారణ జాతీయ దినోత్సవం జరుపుతున్నారు. 1944లో బొంబాయిలో రేవు ప్రాంతంలో ఘోర అగ్ని ప్రమాదం జరిగినప్పటినుంచి ఇటువంటి దినోత్సవం ఏటా జరుపుతున్నారు.

అగ్ని ప్రమాదాల నివారణ కృషి పౌరరక్షణ కార్యక్రమంలో ఒక భాగం. యుద్ధ సమయంలో ప్రమాదకరమైన పరిస్థితులను ఎదుర్కోడానికి అగ్ని మాపక దళాలను మరింత విస్తరింపచేసి, ఈ దళాలకు అత్యంత ఆధునికమైన సాధనసామగ్రులు సమకూర్చి పౌరరక్షణ దళాలు, అగ్నిమాపక దళాలమధ్య మరింత అధికంగా సహకారం నెలకొనేందుకు కృషి చేయవలసి ఉన్నది. ★

జనాభా సమస్య-అంతర్జాతీయ దృక్పథం

—గోవింద నారాయణ్

మానవుడు గగన విహారం చేస్తున్న ఈ రోజుల్లో సమస్యలు వేటినైనా ఆయాదేశాల దృష్ట్యానేకాక అంతర్జాతీయ దృక్పథంనుంచి కూడా పరిశీలించ వలసి యుంటుందని చెపుతారు. అది ఎంతైనా నిజం. జనాభా పెరుగుదల విషయంలో మరీను, ఈ సమస్యకు గల ప్రాధాన్యాన్ని గుర్తించే ప్రపంచ ఆరోగ్య సంస్థ కుటుంబ నియంత్రణకు సంబంధించి పూర్వా పరాలను తెలుసుకొని తగు సలహాలను పొందడానికి అనువైన సమాచారాన్ని వివిధ దేశాల ప్రభుత్వాలకు సమకూర్చాలని తీర్మానించింది. జనాభా పెరుగుదల సమస్య అన్నది కేవలం ఆయా దేశాలకు మాత్రమే పరిమితమై లేదు ఈ నాడు.

జాతీయ దృక్పథం

జాతీయ దృక్పథం నుంచి పరిశీలించినట్లయితే, జనాభా ఆనాటి కానాడు పెరిగి పోతూండటం మనదేశానికి చాలా గడ్డు సమస్యగా తయారయింది. జననాల రేటును సాధ్యమైనంత త్వరలో సగానికి తగ్గించే నిమిత్తం సాధన సంపత్తి అంతటినీ సమీకరించు కుంటున్నాము. కుటుంబ నియంత్రణకు సంబంధించి ప్రజలకు తగు సలహాల నివ్వటానికీ, ఇతర రకాల సహాయాన్ని అందచేయడానికీ అవసరమైన యంత్రాంగాన్ని రూపొందించుకున్నాము. ఈ సందర్భంలో కావలసిన వైద్యులనూ, వైద్య సంబంధమైన పనులు చేసే ఇతర సిబ్బందినీ తర్ఫీదు చేసుకునేందుకు మరింత ముమ్మరంగా కృషి జరుపు తున్నాము. కుటుంబం చిన్నదిగా ఉండటమే శ్రేయస్కరమన్న సూత్రాన్ని ప్రజలకు నచ్చ చెప్పి. అందుకు వారు పూనుకునేట్లు చేయడానికి భారీ ఎత్తున కార్య క్రమాన్ని చేపట్టడంకూడా జరిగింది.

ఈ సమస్య యావత్తూ చాలా బ్రహ్మాండమైనది. సున్నితమయినది కూడాను. వ్యక్తుల వైఖరిలో, మనస్తత్వంలో, ఒకరికీ మరొకరికీ మధ్య సన్నిహిత సంబంధ బాంధవ్యాలలోనే తగిన మార్పు తేవడం అవసరమయ్యే సమస్య ఇది. ఈ కార్యక్రమానికి సంబంధించిన కార్య కర్తలు ఈ అంశాన్ని దృష్టిలో ఉంచుకొని, నేర్పుగా, ఎదుటివారి మనస్సును నొప్పించకుండా వీలైనంత త్వరలో పని సానుకూల పడేటట్లు చూడవలసి ఉంటుంది.

కార్యక్రమ ప్రభావం

జనాభా పెరుగుదల తీరు తెన్నుల మీద అప్పుడే కుటుంబ నియంత్రణ కార్య క్రమ ప్రభావం వ్యక్తమవుతూ ఉన్నట్లు పరిశీలనలవల్ల తేలింది. జననాల రేటు తగ్గు ముఖం పట్టే సూచనలు కన్పిస్తున్నాయి.

దేశంలో జనాభా సమస్య పట్ల ప్రజలు అంతకంతకు హెచ్చుగా శ్రద్ధాసక్తులు కనబరుస్తూ, సమస్యా పరిష్కారానికి వేర్వేరు సూచనలు కూడా చేస్తూండటాన్ని బట్టికూడా కుటుంబ నియంత్రణ కార్య క్రమ ప్రభావం సమాజంపై ప్రసరిస్తున్నదని చెప్పవచ్చు.

ఈ వ్యవహారాన్ని ప్రజల ఇష్టా యిష్టాలకు వదిలివేయాలని కొందరూ, నిష్కర్షగా గట్టి చర్యలు తీసుకోవాలని మరి కొందరూ వాదిస్తూండగా మధ్యేమార్గాన్ని అనుసరించాలని ఇంకా కొందరు అభిప్రాయ పడుతున్నారు.

అంతర్జాతీయ దృక్పథం

అంతర్జాతీయ దృక్పథం నుంచి పరిశీలించి నట్లయితే, మిగతా ప్రాచ్య దేశాలలో మాస్తరే మనదేశంలో జనాభా ఆనాటి కానాడు పెరిగి పోతూండటంచేత, శ్రేయోభివృద్ధి కృషి కుంటుపడుతున్నది. ఇక పశ్చిమ రాజ్యాలకు సంబంధించినంతవరకు, ఈ జనాభా పెరుగుదల వల్ల, అక్కడి ఉన్నత జీవన ప్రమాణాలకు భంగం కలిగే ప్రమాదం ఏర్పడుతున్నది. అంచేత కొన్ని దేశాలలో ఇప్పుడున్న ఉన్నత జీవన ప్రమాణాలు పడిపోకుండానూ, ఇతర దేశాలలో జీవన ప్రమాణాలు కూడా ఈ స్థాయిని చేరుకోవటం సాధ్య పడేట్లు గానూ జనాభా సమస్యను పరిష్కరించ వలసి ఉన్నదన్నమాట

విజ్ఞాన శాస్త్ర రంగంలో సాధించిన పురోభివృద్ధి మూలంగానూ, ఇదివరలో కంటె అతి వేగంగా రాకపోకలు సాగించడానికీ, రకరకాల సందేశాలు పంపుకోటానికీ సదుపాయాలు ఏర్పడటం వల్లనూ, ప్రపంచ ప్రజానీకం ఒకరికొకరు ఎంతో చేరువకు వచ్చారీనాడు. ఫలితంగా విభిన్న దేశాలవారిలో, ప్రజల జీవన ప్రమాణాలలో తారతమ్యాలు ఎంతగానో ఉన్నట్లు గ్రహించారు. ఇందువల్ల పొరుగు దేశాలవారు వెలిబుచ్చే ఆకాంక్షలోనూ, అనుసరించే విధానాలలోనూ, చేపట్టే కార్య క్రమాలలోనూ చెప్పుకోదగిన మార్పు వ్యక్తం కాజొచ్చింది.

పరస్పర సహాయ సహకారాలు

కొన్ని కొన్ని దేశవాసులలో ఈ నాడు ఒక విధమైన అసంతృప్తి వ్యక్తమవుతున్నది అంటే, ఆయా దేశాలలో సహజ

సంపదలు పరిమితమైనవి కావడమూ, అక్కడి ప్రజలు ఇతర దేశాలలో ఉన్నస్థాయికి తమ జీవన ప్రమాణాలను పెంపొందించు కోవాలని అభిలషించటమూ, అందుకు కారణంగా చెప్పకోవచ్చు. అందుచేత జనాభా, వారికి అందుబాటులోగల సాధన సంపత్తి అన్న వాటిని కేవలం ఆయాదేశాల దృష్ట్యానేగాక యావత్ప్రపంచం దృష్ట్యా పరిశీలించవలసి ఉంటుందన్నమాట విభిన్న దేశాలలో ఒక దానిపై ఒకటి ఆధార పడుతూఉండటం, ఏవైనా రెండు దేశాలు కలిసి ఒప్పందాలు కుదుర్చుకుని ప్రణాళికలను చేపట్టి అమలు జరుపుతూ ఉండటం బట్టి ఈ విషయాన్ని గ్రహించవచ్చు.

వర్ధమాన దేశాలు

విదేశాల ఆధిపత్యం నుంచి విముక్తి పొందిన దేశాలు కొన్ని అభివృద్ధిని సాధించడానికి సాధన సంపత్తిచాలా అవసరంగా ఉంటున్నది. కాగా, ఈ దేశాల్లో ఉత్పత్తి తగ్గిపోకుండానూ, జీవన ప్రమాణాలకు భంగం కలగకుండానూ చూడడానికై, బాగా అభివృద్ధి చెందిన దేశాలు మిగులుగా ఉన్న రకరకాల సాధన సంపత్తిని వర్ధమాన దేశాలకు తరలించవలసిఉంది. అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని సహితం సమకూర్చటం అవసరం

అయితే ఈ సాంకేతిక సహాయానికి, ధనసహాయానికి కూడా పరిమితి అంటూ లేకపోలేదు. కుటుంబ నియంత్రణ కార్యక్రమాల విషయంలో కొన్ని దేశాలు ఇతర దేశాలకు సహాయపడటమన్నది, జనాభాను అపరిమితంగా పెరగనిచ్చినట్లయితే ఏర్పడగల ప్రమాదాన్ని ఇటు సహాయంచేసే దేశాలూ, అటు సహాయాన్ని స్వీకరించే దేశాలూ ఎంతవరకు గుర్తించాయి అన్నదానిని బట్టి ఆధారపడి ఉంటుంది.

సహాయానికిగల ప్రాధాన్యం

జనాభా పెరుగుదలను అదుపులో ఉంచవలసిన ఆవశ్యకతను గుర్తించే ఐక్యరాజ్య సమితి సర్వ ప్రతినిధి సభ, ఈ వ్యవహారంలో సహాయాన్ని ఆపేక్షించిన వివిధ దేశాలకూ, ఆ దేశాలలో వేర్వేరు ప్రాంతాలకూ అవసరమైన సేవా సహాయాలను కల్పించవలసిందనీ, పరిశోధనలు జరపడంలో తోడ్పడవలసిందనీ, తగు సమాచారాన్ని అందచేయవలసిందనీ ప్రపంచ సంస్థలూకు వేర్వేరు ప్రత్యేక సంస్థలను కోరుతూ 1966 డిసెంబర్‌లో ఒక ప్రత్యేక తీర్మానం ఆమోదించింది. ఈ రకమైన సహాయ సహకారాలను కల్పించే సందర్భంలో ఒక్కొక్క దేశంలోనూ, ప్రాంతంలోనూ ఉన్న జనాభా సమస్య ప్రత్యేక లక్షణాలనూ, అందువల్ల ఏర్పడే అవసరాలనూ దృష్టిలో ఉంచుకోవాలని కోరింది


వర్ధమాన దేశాలలో వ్యవసాయమూ, పరిశ్రమలూ అభివృద్ధి చెందడానికి, జనాభా పెరుగుదలను అదుపులో పెట్టడానికి గాను అంతర్జాతీయ సహాయంలభిస్తూండటం ముదావహం. జనాభా సమస్యను పరిష్కరించడంలో అంతర్జాతీయంగా ఈ నాడు కృషి జరుగుతున్నదంటే స్వచ్ఛంద సంస్థలు వహిస్తున్న పాత్రే అందుకు చాలావరకు కారణమనవచ్చు. ఈ సంస్థలు మొదట పూనుకుని తొలి తతంగం చాలావరకు జరిపిన మీదటనే చాలా దేశాల ప్రభుత్వాలు కార్యక్రమాలను చేపట్టాయి.

భారత దేశం, అంతర్జాతీయ సహాయ సహకారాలను అపేక్షించి స్వీకరించింది కనుక, మనం పని జరుపుతున్న తీరును ఇక్కడి ప్రజలే కాక ప్రపంచంలో ఇతరులు కూడా గమనిస్తూండటానికి ఆస్కారం ఏర్పడింది మనం ఇతరులెవరికీ సంజాయిషీచెప్పకోవలసి వస్తున్నదని కాదు; సమస్యను పరిష్కరించుకోడానికి మనకు గల శక్తిసామర్థ్యాలేపాటివి, ఏవిధంగా సమస్యను పరిష్కరించుకో జూస్తున్నాము అన్నవి ముఖ్యం. మనం కార్యక్రమాన్ని ఏరకంగా రూపొందించుకుని అమలు జరుపుకుంటున్నామో, ప్రజలు స్వచ్ఛందంగా పూనుకుని ఎంతవరకు ఈ ఉద్యమానికి చేయూత నిస్తున్నారో అని విదేశాలవారెందరో గమనించిచూస్తున్నారు. ఈ వ్యవహారం అనుకున్న ప్రకారం పరిష్కారమవాలీ అంటే ప్రజల మన సత్వంలోనే, వైఖరిలోనే, నమ్మకాలలోనే మార్పురావాలి. పరిమిత కుటుంబాలు తమకే కాక యావత్తుదేశానికి, ఆ మాటకొస్తే యావత్ప్రపంచానికీ శ్రేయస్కరమన్న సంగతి వారు గుర్తించి తదనుగుణంగా నడచుకోవాలి

జనాభా పెరుగుదల మన ప్రగతికి గొడ్డలిపెట్టు

పశు పరిగణనం, 1966

కొన్ని వివరాలు



జాతీయ ఆర్థిక వ్యవస్థలో పశు సంపదకుగల ప్రాధాన్యతను గురించి పూర్వ కాలం నుంచి అందరూ ఎరిగినదే. అయితే ఈ శతాబ్ది మొదటి దశాబ్దంలో మాత్రమే పశు పోషణ పశు వైద్య శాఖలను ఏర్పాటు చేయడం, పశువుల సంఖ్యకు సంబంధించిన వివరాలను సేకంరిచ వలసిన అవసరాన్ని గుర్తించడం జరిగింది.

భారత దేశంలో 1920 వ సంవత్సరంలో మొదటి సారిగా పశు పరిగణనం. అంటే-పశువుల సంఖ్యకు సంబంధించిన వివరాల సేకరణ జరిపారు. పూర్వపు బ్రిటిష్ ఇండియా భాగాలు, కొన్ని సంస్థానాలతో సహా దేశంలోని సుమారు నాలుగవ వంతు భాగంలో పరిగణనం జరిగింది. మొదటి పరిగణనమునకు సంబంధించిన షెడ్యూలులో ఆవులు, ఎద్దులు, బర్రెలు, దున్నపోతులు, గొర్రెలు, మేకలు, గుర్రాలు, తట్టు గుర్రాలు, గాడిదెలు, ఒంటెలకు చెందిన 17 అంశాలను చేర్చారు. అయిదు సంవత్సరాల కొక పర్యాయం పశు పరిగణనం జరిపారు. క్రమ క్రమంగా ఈ కార్య క్రమ నిర్వహణలో అభివృద్ధిని తీసుకొని వచ్చారు. అయితే రిఫరెన్సు గడువును మాత్రం దేశమంతటా ఒకే విధంగా పాటించ లేదు.

దేశం స్వాతంత్ర్యం పొంది సంస్థానాలు భారత యూనియన్‌లో విలీనమైన తరువాత మొదటి సారిగా 1951 వ సంవత్సరంలో ఏడవ పశు పరిగణనం జరిగింది. దేశమంతటా ఒకే పద్ధతిలో వివరాలను సేకరించడం అప్పటి నుంచే ప్రారంభ మైంది, ప్రతిసారీ కొన్ని అభివృద్ధి కరమైన మార్పులను ప్రవేశ పెట్టడం జరుగుతూ వచ్చింది. 1966 వ సంవత్సరంలో జరిగిన 10 వ పశు పరిగణనం సందర్భంలో పశువులు కోళ్ల లింగ భేదానికీ, వయస్సుకూ, జాతికి సంబంధించి, వ్యవసాయ పనిముట్లు, జాలరి వృత్తి ఉపకరణములకు సంబంధించికూడా సమగ్ర సమాచారాన్ని తీసుకోవడం జరిగింది. కాగా వీటిలో చివర పేర్కొన్న రెండు అంశాలను 10 వ పరిగణనం (1966) లోనే మొదటి సారిగా ప్రవేశ పెట్టడ మైంది

ఆర్థిక, గణాంకముల శాఖ డైరెక్టరు రాష్ట్ర పశు పరిగణన అధికారిగా వ్యవహరించారు. కలెక్టర్లు ఇందుకు సంబంధించిన జిల్లా అధికార్లుగానూ, తహశీల్దార్లు తాలూకా అధికార్లుగానూ వ్యవహరించారు. తమ తమ ప్రాంతాలలో ఈ కార్యక్రమం విజయవంతంగా సాగించడానికి నగరాల మునిసిపల్ కమీషనర్లనూ, పట్టణాల ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లనూ, జిల్లా అటవీ శాఖాధికార్లనూ బాధ్యులను చేయటం జరిగింది.

ప్రతి తాలూకాలోనూ తగు సంఖ్యలో సూపర్ వైజర్లనూ, వివరాల సేకరణోద్యోగులనూ నియమించారు. గ్రామాలలో ఈ పనులను చాలా వరకు పట్వారీలు. కరణాలు నిర్వహించారు. కొన్ని గ్రామాలలో ఉపాధ్యాయులు, పోలీసు మాలీ పటేళ్లనుకూడా ఇందుకు వినియోగించారు. పట్టణ ప్రాంతాలలో ప్రజారోగ్య శాఖ ఉద్యోగులు, ఉపాధ్యాయులు వివరాల సేకరణ జరపగా అటవీ ప్రదేశాలలో ఫారెస్ట్ గార్డులు ఈ పని నిర్వహించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో కలిపి మొత్తంమీద 25,000 మంది ఈ పని చేశారు. రెవిన్యూ ఇన్‌స్పెక్టర్లు తాలూకా స్టాటిస్టికల్ అసిస్టెంట్లు, ప్రోగ్రెస్ అసిస్టెంట్లు, గ్రామ సేవకులు పర్యవేక్షకులుగా వ్యవహరించారు. వివరాలను సేకరించిన ఉద్యోగులు తమ తమ ప్రాంతాల వివరాలను అందజేయగా, పర్యవేక్షకులు తమ అధీనంలోని గ్రామాలకు కలిపి టోగట్టా సిద్ధం చేశారు. తహశీల్దార్లు, తాలూకా స్టాటిస్టికల్ అసిస్టెంట్లు, ప్రభృతుల సహాయంతో ఈ వివరాలను ఫిర్కాల వారీగానూ, తాలూకా వారీగానూ తయారుచేసి వాటిని కలెక్టర్లకు పంపించారు కలెక్టర్లు జిల్లా స్టాటిస్టికల్ ఆఫీసర్ల సహాయంతో జిల్లాల వారీ వివరాలను సిద్ధం చేశారు. కలెక్టర్లు అంద జేసిన వివరాలను ఆర్థిక, గణాంకముల శాఖవారు క్రోడీకరించి రాష్ట్ర మంతటికీ ఒక నివేదికను తయారుచేసి కేంద్ర ఆహార, వ్యవసాయ, సమాజాభి వృద్ధి, సహకార మంత్రిత్వశాఖకు పంపించారు.

1966 లో జరిగిన పశుపరిగణనం సందర్భంగా దిగువ పేర్కొన్న అంశాల విషయంలో టోగట్టా సేకరించే నిమిత్తం పోస్ట్ సెన్సెస్ సాంపిల్ సర్వే చేపట్టారు :-

వయస్సు వారీగా వివరాలు, జాతివారీ విభజన, పాడి వివరాలు, రిండెర్‌పెస్టు వ్యాధిరాకుండా నిరోధించబడిన పశువుల వివరాలు, వివిధరకాల పనులుచేసే పశువుల వివరాలు.

పశుపరిగణనం వల్ల పశుపోషణ, పశుగణాభివృద్ధి కార్యక్రమాలను రూపొందించడానికీ, మదింపు జేయడానికీ వీలుగలుగుతుంది. పశు సంవర్ధకరంగం నుండి లభించే జాతీయాదాయాన్ని అంచనా వేయడానికికూడా యిది తోడ్పడుతుంది. జనాభా లెక్కల సేకరణ ప్రతి పది సంవత్సరాలకు ఒక పర్యాయం జరగ్గా పశుపరిగణనం ప్రతి అయిదు సంవత్సరాలకు ఒకసారి జరుగుతుంటుంది. యిందుకు గల ముఖ్య కారణాలు ఇవి :-

పశువుల సగటు జీవనప్రమాణం దృష్ట్యా పది సంవత్సరాలకాలం చాలా దీర్ఘమైనది. పశువుల విషయంలో ముఖ్యంగా కోళ్ళ విషయంలో మార్పులు చాలా త్వరితంగా సంభవిస్తుంటాయి.

1966 సంవత్సరంలో జరిగిన పశు పరిగణనంలో వెల్లడయిన కొన్ని ముఖ్య వివరాలు ప్రక్క పుటలో పొందు పరచబడినవి :-

వివరణము	వర్గం	1966 లో	1961 లో
3 సంవత్సరాలు పై బడిన	ఎద్దులు	54,07,050	52,78,908
,,	ఆవులు	41,53,853	40,75,775
దూడలు ...	....	27,80 986	29,90,777
3 సంవత్సరాలు పై బడిన	దున్నపోతులు	14,60,392	14,08,551
,,	బర్రెలు	32,18,658	31,50,924
దూడలు	....	21,11,679	23,89,477
గొర్రెలు .		80,03,869	83,63,148
మేకలు		37,58,‘39	42,46,717
గుర్రాలు, తట్టు	గుర్రాలు	48,896	62,689
గాడిదలు	.	67,450	82,172
కంచర గాడిదలు	....	705	809
ఒంటెలు .	..	643	286
మొత్తం పశువులు	....	3,'5,94 491	3,26,42,987
మొత్తం కోళ్లు ..	.	1,47,14,683	1,62,48,132
సేద్యపు నీటిపారుదలకు ఉపయోగించే పంటలుగల			
	ఆయిల్ ఇంజన్లు	46,741	33,940
విద్యుచ్ఛక్తి పంపుసెట్లు		57,225	17,024
ట్రాక్టర్లు ..		2,911	1,762

1966 పశు పరిగణనం ప్రకారం దేశంలోని మొత్తం పశువుల సంఖ్య 316 లక్షలు. యిది దేశ జనాభాలో సుమారు నాలుగింట మూడు వంతులకు సమానం మొత్తం పశువుల సంఖ్య ఎద్దులు, ఆవులు, బర్రెలు, దున్నపోతులు, మేకలు, గొర్రెలు, కలిపి 98 శాతం వరకు వున్నాయి. వివిధ పశువులలో ఎద్దులు, ఆవులది అగ్రస్థానం. ఇవి 39 శాతం వరకు వున్నాయి ఆ తరువాతి స్థానం బర్రెలు, దున్నపోతులది వీటి శాతం 22. మొత్తం పశువుల సంఖ్యలోనూ, ఎద్దులు, ఆవులు, బర్రెలు, దున్నపోతుల ఉమ్మడి సంఖ్యలోనూ రాష్ట్రంలో నెల్లూరు జిల్లాది మొదటి స్థానం. ఎద్దులు, ఆవుల సంఖ్యలో చిత్తూరు జిల్లా మొట్టమొదటిది కాగా మహబూబ్‌నగర్ జిల్లా రెండవది. మూడు సంవత్సరాలు పై బడిన ఎద్దులు ఆవులలో ఎద్దులు అధిక సంఖ్యలో వుండగా ఇదే వయః వర్గంలోని బర్రెలు, దున్నపోతులలో బర్రెలు హెచ్చుగా వున్నాయి. పరిగణనం సందర్భంలో, ప్రతి మూడు ఆవులలోనూ ఒక ఆవు, ప్రతి రెండు బర్రెలలోనూ ఒక బర్రె పాలు యిచ్చేవిగా వున్నాయి. గుర్రాలు, తట్టు గుర్రాల పెంపకానికి ప్రోత్సాహం లేకపోవడంచేత వాటి సంఖ్య చాలా తగ్గిపోయింది. ట్రాక్టర్లు, ఆయిల్ ఇంజన్లు, విద్యుచ్ఛక్తి పంపుసెట్ల సంఖ్యలో చాలా పెరుగుదల ఏర్పడింది.

అఖిలభారత పాలదిగుబడి పోటీలు

'గో సంవర్ధన' కేంద్ర సమితివారు 1966_67లో పాలదిగుబడి పోటీ ు గిర్, కన్క్రాజ్, ఒంగోలు, హరియానా, సాహివాల్ సింధి జాతి ఆవులకు వేర్వేరుగాను, గేదెలకు ఒకే రకంగాను నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్, బీహార్, గుజరాత్, మహరాష్ట్ర, హరియాన, పంజాబు రాష్ట్రాలు పోటీలో పాల్గొన్నాయి. ఫలితాలను దిగువ చదవండి.

	జాతి	యజమాని	పాలదిగుబడి కి.గ్రా.	బహుమతి రొఖం	
1.	గిర్	1 పింజ్రాపోల్ _ నాశిక్ జిల్లా, మహరాష్ట్ర	26.10	2,000	యోగ్యతాపత్రం
		2 లోక్ భారతి గోశాల, శానోసార_భావనగర్ జిల్లా_గుజరాత్	20.47	1,000	,,
		3 శ్రీ భీమాభాయ్ భీమ్జీ, భాయ్‌పటేల్, సవరకుండ్ల భావనగర్ జిల్లా_గుజరాత్	16.60	500	,,
2.	కన్క్రాజ్	1 శ్రీమతి మనెక్‌బా, వినయవిహార్, గోశాల అడలాజ్, గాంధినగర్ జిల్లా, గుజరాత్	22 72	2,000	,,
		2 శ్రీ మోహన్‌లాల్ జే. పటేల్ _ అసర్వా, అహమదాబాద్ జిల్లా, గుజరాత్	22.12	1,000	,,
		3 శ్రీ మోహన్‌లాల్ దేవనదాస్ పటేల్, వాదవస్వామి తాల్‌కలూల్, మెహసానజిల్లా, గుజరాత్	21.67	500	,,
3.	ఒంగోలు	1 శ్రీ వాసిరెడ్డి రాధాకృష్ణయ్య_గుంటూరు_ఆంధ్రప్రదేశ్	12.86	1,000	,,
		2 శ్రీ పి వి. బ్రహ్మారావు, నూజెళ్ళ_క్రిష్ణాజిల్లా, ఆం. ప్ర.	12.80	500	,,
4.	హర్యానా	1 శ్రీ గంగ గోశాల, కట్రాస్ కేర్‌కండ్_ధన్‌బాద్ జిల్లా _ బీహారు	24.13	2,000	,,
		2 జగేరామ్, (పోస్టు) రసివాస్, సవప్పార్, హర్యానా	21.95	1,000	,,
		3 శ్రీ మాలిక్ కృష్ణలాల్, భవానీ స్టాంక్, రొహటక, హార్యానా	16.61	500	,,
		4 శ్రీ కితాబ్ సింగ్ ప్రోకనిభేరి, హిస్సార్ జిల్లా, హర్యానా	13 81	250	,,

(తరువాయి 40వ పుటలో)

మహాభారతము

తెలుగంటుల లక్ష్మణశాస్త్రి

17

దుర్యోధనుని అవమానము

దుర్యోధనుడు శకునితోపాటు మయసభను పరిశీలించుచుండెను. అందలి అపూర్వ విచిత్రములను జూచి ఆశ్చర్యపడెను స్పటిక స్థలమును జలమని తలచి వస్త్రములను పైకెత్తుకొని నడచెను. జలమును స్థలమని తలచి నీటిలో పడెను. అదిచూచి భీమసేనుడు నవ్వి సుయోధనునకు పొడి బట్టలను పంపెను. అట్టి వానిని చూచి భీమార్జునులు నవ్విరి. ఆ యవమానములను దుర్యోధనుడు సహించలేకుండెను. మూయబడిన స్పటికద్వారము తెరువబడినదని తలచి ప్రవేశింపబోయి తలకు దెబ్బ తగిలి క్రింద పడెను. అలాగే తెరవబడిన ద్వారము మూయబడినదని తలచి తొలగిపోయెను. ఇట్లు అనేక విధములుగా ఆ మయసభలో భ్రాంతి పడుచున్న దుర్యోధనుని జూచి జనులు నవ్విరి.

అట్లు అవమానపడి అతడు హస్తిపురికి వెడలిపోయెను. ఏకాంతమునందు శకునితో "పాండవుల సమృద్ధిని ఓర్వలేకున్నాను. నిద్ర, ఆహారము లేక బాధపడుచున్నాను. పురుషుడును, స్త్రీయును కాక నపుంసకునివలె జీవించి యున్నాను. వారి సభను, వారి యజ్ఞమును, వారి సంపదను, వారు నాకు మయసభలో చేసిన పరిహాసమును తలచుచు నిరంతరము నామనస్సు పరితపించుచున్నది. నేను జీవించలేకున్నాను. మరణించుటకు ఆజ్ఞనిమ్ము. నా బాధను ధృతరాష్ట్రునకు తెలుపుము" అని చెప్పెను. ఆ మాటకు శకుని ఇట్లు బదులు చెప్పెను.

"దుర్యోధనా ! నీవు ధర్మరాజునుగూర్చి అసూయ పడకూడదు. పాండవులు మొదటినుండికూడ తమ అదృష్టము ప్రకారమే అన్నియు అనుభవించుచు వచ్చుచున్నారు. వారిని వశపరచుకొనవలెనని నీవు అనేక యుక్తులను పన్నితివి కాని, వశపరచుకొనజాలక పోయితివి. నీవు పెట్టిన సంకటములన్నియు వారి అదృష్ట వశమున వారు తప్పించుకొనుచు పోయిరి. ద్రౌపదిని వివాహము చేసికొనిరి. ఆమె పితృ బాంధవులందరు వారి కాపులైరి. శ్రీకృష్ణుని సహాయముచేత సమస్త భూమండలమునకు వారిపుడధిపతులైరి. రాజ్యములో వారి తండ్రి భాగమును వారు పొందిరి. ఇంతియేకాక దిగ్విజయములు చేసి కురురాజ్యమును విస్తీర్ణ పరచిరి. అందుకొఱకు నీవు చింత పడనక్కరలేదు. అగ్నిదేవుడు సంతుష్టుడై అర్జునునకు గాండీవ ధనుస్సు, అక్షయములైన అంబుల పొదులు, దివ్యాస్త్రములు ప్రసాదించెను. వాటి సహాయముతో అతడు సమస్త రాజులను వశపఱచుకొనెను. అతని వలన ప్రాణరక్షణను పొందిన మయుడు సభను నిర్మించి ఇచ్చెను. అందుకు నీవు దుఃఖించవలసిన యవసరములేదు. దుర్యోధనా ! నీవుగూడ అసహాయుడవు కావు. నీ తమ్ములు నీ ఆజ్ఞలో ఉండి నీ సమస్త విజయములు సాధించి పెట్టగలరు. ద్రోణాచార్యులు, అశ్వత్థామ, కృపాచార్యులు, కర్ణుడు, నేను, భూరిశ్రవుడు ఇంతమందిమి నీకు సహాయము చేసి సమస్త భూమండలము పైన విజయమును సాధించి పెట్టెదము".

అని శకుని చెప్పగా దుర్యోధనుడు "పాండవులను జయించి వారి సంపత్తినంతయు నీ సహాయముచే నా ఆధీనము చేసికొనెదను" అని చెప్పెను. ఆ మాటకు శకుని "పాండవులను, శ్రీకృష్ణుని, ద్రుపదాదులను యుద్ధములో దేవతలుగూడ జయింపలేరు. వారిని మనమెవరము ఎదిరించలేము. కనుక ధర్మరాజును ఓడించి వశపఱచుకొనుటకు ఒకటే ఉపాయము గలదు. అది యేమనగా, ధర్మరాజునకు జూదము ఆడుట మిక్కిలి ప్రియము. కాని అతనికి ఆడు పద్ధతి సరిగా తెలియదు. జూదమునకు పిలువగనే వెనుకాడక వచ్చును. నేను జూదక్రీడలో మిక్కిలి నిపుణుడను. మూడు లోకములలోను నన్ను ఆ యాటలో జయించువాడు లేడు. కనుక యుధిష్ఠిరుని జూదమాడుటకు పిలువుము. అతనిని ఓడించి అతని రాజ్యలక్ష్మినంతను నీ వశము చేసెదను. సంశయింపకుము. దీనికి నీ తండ్రి ఆజ్ఞగొనుము" అని చెప్పెను. ఆ మాటకు దుర్యోధనుడు "మామా ! నీవే పోయి ధృతరాష్ట్ర మహారాజునకు ఉచిత పద్ధతిలో ఈ విషయమును తెలిపి ఆయనను ఒప్పింపుము. నేను స్వయముగా ఆ మహారాజునకు ఈ విషయమును తెలుపజాలను" అని చెప్పెను.

ఆ మాటవిని శకుని దుర్యోధనునితోపాటు ధృతరాష్ట్రుని వద్దకు పోయి యిట్లనెను "మహారాజా! దుర్యోధనుడు కాంతి విహీనుడై, దుర్బలుడై చాల దీనుడుగా చింతలో మునిగి ఉన్నాడు. అతనికి శత్రువుల వలన సంకటము ప్రాప్తించినది. అతనిని విచారించి, అతని కష్టములను పోగొట్టి విచారమును మాన్పుము"

ఆ మాటకు ధృతరాష్ట్రుడు దుర్యోధనునితో విట్లనెను. "నాయనా! నీ దుఃఖమునకు కారణమేమి? నీకు సంపూర్ణమైన ఐశ్వర్యమున్నది. తమ్ములు, బంధువులు నీకు హితులై యున్నారు. నీకు ఏ లోపము లేనప్పుడు ఇట్లు దీనుడవుగా ఎందుకున్నావు?"

అది విని దుర్యోధనుడిట్లనెను "తండ్రీ! నాకు ఏ లోపమును లేదు. శత్రువులపైన ఈర్ష్య ఉన్నది. వారిపై విజయమును సాధించినవాడే పురుషుడనిపించుకొనును. సంతోషము, సంపద, దయ, భయము-ఇవి పురుషుని అభిమానమును నశింపజేయును. ఇవి గల మనుష్యుడు ఎప్పుడుగూడ ఉన్నత పదవిని అందుకొనలేడు. యుధిష్ఠిరుని రాజ్యలక్ష్మినిచూచి నేను సహించలేక అన్నము, నిద్ర వదిలినాను. ఇదియే నా వివర్ణతకు కారణము. యుధిష్ఠిరుని యింటిలో ప్రతిదినము పదివేలమంది బ్రాహ్మణులు స్వర్ణపాత్రములలో భోజనము చేయుచున్నారు. అనేక రాజులు అనేక వస్తువాహనాదులను సమర్పించి అతనికి వశులై ఉన్నారు. అతడిప్పుడు అనుభవించుచున్న వైభవమును నేనెప్పుడుగూడ చూచి యుండలేదు. ప్రజలు లక్షలాది ధనమును కానుకగా తెచ్చి ఇచ్చిరి. యుధిష్ఠిరుడు చేసిన రాజసూయమునందు ఒక లక్ష బ్రాహ్మణులు భోజనము చేయగనే శంఖధ్వనిచేయు నేర్పాటు చేయబడియుండెను. అట్టి శంఖధ్వనులు ప్రతిదినము మాటిమాటికి నాకు వినపడుచుండెను విని చాల పరితపించుచుంటిని. రాజులు వైశ్యులవలె నడుమువంచి అభిమానమును పోగొట్టుకొని బ్రాహ్మణులకు వడ్డించుచుండిరి. అట్టి మహావైభవమును చూచి ఈర్ష్యచేత నా హృదయము దహించుచున్నది"

అప్పుడు శకుని "యుధిష్ఠిరునిసంపద నంతయు జూదములో గెలిచి నీకు సమర్పించెదను" అని దుర్యోధనునితో ననెను. దుర్యోధనుడు, "ధర్మరాజుతో శకుని జూదమాడి ఆ సంపద నంతయు నాకు సమర్పించుటకు అంగీకరించుము" అని తండ్రిని వేడుకొనెను.

అదివిని ధృతరాష్ట్రుడు, "బుద్ధిమంతుడైన విదురుడు నాకు మంత్రిగానుండి ఉచితమైన మార్గమును తెలుపుచుండును. కనుక అతనితో యోచించి నా నిశ్చయమును తెలిపెదను. అతడు ఇరు పక్షములవారికిని హితమగు ధర్మమును బోధించును" అని అనెను. దానికి దుర్యోధనుడు ఇట్లనెను. "తండ్రీ! విదురుడు అవశ్యముగా నన్ను జూదమునుండి మాన్పించును. అప్పుడు నాకు మరణమే శరణము. నాయనంతరము విదురునితో సుఖముగా రాజ్యమును అనుభవించుము."

పుత్రుడు పలికిన దుఃఖవచనములు విని ధృతరాష్ట్రుడు పుత్రప్రేమచేత అతని కోరికను అంగీకరించి విశాలము, సుందరమునైన యొక్క ద్యూతభవనమును నిర్మింపజేసెను. విదురుని పిలిపించి ఆసమాచారమును అతనికి తెలిపెను. విదురుడు "కౌరవ పాండవ భేదకారణమగు జూదము వంశవినాశకరమగును. కనుక అదికూడదు" అని అనెను. ఆ మాటకు ధృతరాష్ట్రుడు విదురునితో "దైవానుకూల్యము ఉండినచో కౌరవపాండవులకు కలహము సంభవించదు. శుభాశుభములను, హితాహితములను చింతించక సుహృద్ద్యూతము జరిపింపవలసినదే. నేను, ద్రోణుడు, భీష్ముడు, నీవు సన్నిహితులమై ఉండగా ఏవిధమైన అవినీతికి తావుఉండదు. కనుక నీవు వెంటనే రథములో ఖాండవ ప్రస్థమునకుపోయి నాయాజ్ఞగా యుధిష్ఠిరుని తోడుకొనిరమ్ము. దైవప్రేరణ చేతనే జూదమాడజేయు తలంపు నామనస్సులో కలిగినది" అని చెప్పెను. ఆమాట విని విదురుడు మనస్సులో దుఃఖించుచు ఏమియుతోచక వెడలిపోయెను.

తరువాత ధృతరాష్ట్రుడు దుర్యోధనునితో "నాయనా! విదురుని మాటవినుము. అతడు హితమును, ధర్మమును బోధించును. జూదము మహానర్థకరము. కనుక అది మానుట మంచిది" అని అనేక విధముల ఉపదేశించెను. అది విని దుర్యోధనుడు తండ్రి మాటను అంగీకరించక ధర్మరాజునకు గల రాజ్య వైభవమును గూర్చి, అతడు మహావైభవోపేతముగా జరిపిన రాజసూయ యాగమునుగూర్చి, ఆ యాగములో సమస్తదేశములరాజులు సమర్పించిన ధనరాసులను గూర్చియు వర్ణించిచెప్పి అది యంతయు చూచినా మనస్సు మిక్కిలి పరితపించుచున్నది. విదురుడు పాండవ పక్షపాతియై మనకు అహితమును బోధించును. పూర్వ రాజులుగూడ జూదమాడుట వినియున్నాను దానిలో దోషములేదు. యుద్ధములేకుండ రాజ్య సంపద మనకు చెందును అని చెప్పెను. ధృతరాష్ట్రుడు జూదము అధర్మమని తెలిసియు పుత్రప్రేమచే దానిని అంగీకరించవలసిన వాడాయెను.

విదురుడు ధర్మరాజును ద్యూతమునకై పిలుచుటకు ఇంద్రప్రస్థమునకు పోయెను. ధర్మరాజునకు ధృతరాష్ట్రుని ఆజ్ఞను వినిపించెను. జూదమాడుట అధర్మమని తెలిసినను, శకునివంటి కపటితో జూదమాడుట యిష్టము లేకున్నను యుధిష్ఠిరుడు దైవప్రేరితుడై ధృతరాష్ట్రుని ఆజ్ఞను మీరలేక హస్తిపురికి కుటుంబ పరివారసహితముగాపోయెను. అక్కడ భీష్మాదులైన పెద్దలను దర్శించి నమస్కరించెను. ధృతరాష్ట్రుడు అతనిని చేరదీసి ఆదరించెను. దుర్యోధనాదులు జూదము జరుగుట తథ్యమని సంతసించిరి.

జూదములోని ధర్మాధర్మములను గూర్చియు, యుద్ధములో గెలుచుటలోను, జూదములో గెలుచుటలోను గల తారతమ్యమును గూర్చియు శకునికి, యుధిష్ఠిరునకు విశేషముగా వాదవివాదములు జరిగెను. చివరకు యుధిష్ఠిరుడు అధర్మమైనను, జూదమాడుటకు పిలిచినప్పుడు నిరాకరించి వెడలుట తన మతముకాదని, నిర్ణయించుకొని శకునితో ద్యూతక్రీడకు ఉపక్రమించెను. ద్యూత సభలో భీష్మద్రోణాదులైన పెద్దలందరు ఆసీనులైయుండిరి.

తొలియాటలో యుధిష్ఠిరుడు అనేక మణికనకరత్న రాసులను ఓడిపోయెను. క్రమముగా సమస్త సంపదను, వస్తు, వాహనాదులను ధర్మరాజు ఓడుచువచ్చెను.

విదురనీతి

జూదములో జరుగుచున్న యధర్మమును జూచి విదురుడు ధృతరాష్ట్రునితో నిట్లనెను:-రాజా! మరణించు వానికి ఔషధము రుచించనట్లు నా మాటలు ఇప్పుడు నీచెవికి ఎక్కవు. ఐనను, నేను చెప్పుమాటలను శ్రద్ధగా వినుము. పుట్టినప్పుడే జంబుక, గార్ధభ స్వరములతో నేడ్చిన దుర్యోధనుడు మీకులమును నశింపజేయును అని తలచితిని. మద్యసేవనమునందు ఆసక్తుడైన పురుషుడు ఎత్తైన చెట్టునెక్కి అచటి మధువును పానముచేసి యచటనే స్మృతి తప్పిపడును. లేదా చెట్టునుండి క్రిందనైన పడును. అతనికి రెండేగతులు. అలాగే యిప్పుడు దుర్యోధనుడు చేయుచున్నాడు.

రాజా ! పూర్వము భోజవంశరాజు ప్రజాహితముకొరకు దుష్టుడగు తన కొడుకును విసర్జించెను. అలాగే యాదవులు దుష్టుడగు కంసుని త్యజించిరి. అప్పుడు కృష్ణుడు కంసుని చంపుటచే ప్రజలు, బంధువులు సుఖముగా జీవించిరి. అలాగే నీవుగూడ ఇప్పుడు అర్జునునకు ఆజ్ఞయిచ్చినయెడల ఒక్క క్షణములోనతడు దుర్యోధనుని బంధించివేయును. దానివలన అందరు సుఖింతురు.

కాకి వంటి దుర్యోధనుని విడిచి మయూరమువంటి పాండవులను చేరదీయుడు. నక్కను విడిచి శార్దూలములను ఆదరించుము. ఈ విధముగా దుఃఖ సముద్రములో పడిమునుగకుము. కులమును రక్షించుటకు ఒక పురుషుని, గ్రామరక్షణార్థమై యొక కులమును, దేశమును కాపాడుటకు గ్రామమును, ఆత్మరక్షణము కొరకు సమస్త భూమండలమును విడువవలెనని పెద్దలు చెప్పుదురు.

పూర్వం శుక్రాచార్యులు జంభాసురుని త్యజించునపుడీకథ చెప్పెను. వినుము:— పూర్వకాలమునందు ఒక రాజు రాజ్యములో ప్రతిదినము బంగారమును ఉమియు పక్షులుండెను. అవి ఉమియు బంగారమును ఆరాజు దినదినము తీసుకొనుచుండెను. ఒకనాడు గూండ్లలోనున్న పక్షులన్నింటిని చంపి మొత్తము బంగారమును ఒకసారియే గ్రహింప దలచి యట్లు చేసెను. దాని వలన ఆ రాజు తత్కాల నష్టమునే కాక భవిష్యత్తులో గూడ కలుగు లాభమును గోల్పోయెను. అలాగే యిప్పుడు నీ పుత్రుడు చేయుచున్నాడు. రాజా! పాండవులకు ద్రోహము చేయకుము. పిదప సువర్ణము నుమియు పక్షులను చంపిన రాజువలె నీవు గూడ మిగుల పశ్చాత్తాపపడవలసి వచ్చును. కనుక రాజా ! పాండవ వృక్షములను నీస్నేహజలముచే తడుపుచు వారినుండి ఉత్పన్నమగు ధన పుష్పములను స్వీకరించి తోటమాలివలె సుఖపడుము. పాండవులను ఉద్రిక్తులను చేసినచో పుత్ర మిత్ర సహితముగా నీ కులమును వారు నశింపజేయుదురు. వారు ఏకమైనచో నింద్రాది దేవతలు గూడ వారి నెదిరించజాలరు.

"రాజా ! కలహమునకు మూలము జూదము. దుర్యోధనుని యీ ద్యూత ప్రవృత్తివలన నీ పూర్వులగు శంతనుడు మొదలగు రాజులు ఘోరమగు సంకటములో పడగలరు. పడవ నడుపువాడు మూర్ఖుడైనప్పుడు పడవలోని వారందరు నదిలో పడునట్లు ఒక్కని వలన నీ వంశస్థులందరు నశింతురు. జూదములో నేటి గెలుపు రేపు మహా సంకటమునకు హేతువగును. ఇది చివరకు యుద్ధముగా పరిణమించగలదు. రాజులారా ! మూర్ఖుడగు ఈ దుర్యోధనుని అనుసరించుచు పాండవ వైరాగ్నిలో శలభములు కాకుండ ఉందురుగాక ! పాండవులు క్రోధవశులై మీపై బడినప్పుడు మిమ్ము రక్షించు వారెవరును ఉండరు. ధృతరాష్ట్రా ! పాండవులు ధనస్వరూపులు. వారిని చేరదీసినచో నీకు కావలసినంత ధనము వారివలన లభించును. కనుక అల్ప ధనార్థమై సర్వదా ధనమును ఉత్పత్తిచేయువారి నేల బాధ పెట్టెదవు. శకుని యీ యిరు వర్గముల వారికిని క్రోధమును ఉద్దీపింపజేయు జూదమును ప్రారంభించెను. ఇతనిని ఇక్కడినుండి వెడలదరువుము. దాని వలన నీ వంశమునకు క్షేమము కలుగును."

విదురుని మాటలకు దుర్యోధనుడు "నీవు ఎల్లప్పుడు మా శత్రువులనే పొగడుచుందువు. నీకు ఎవరిపైన ప్రేమ ఉన్నదో మాకు బాగుగా తెలియును. మమ్ము మూర్ఖులనుగా తలచి అవమానము చేయుచుందువు. నీకు ఆశ్రయమిచ్చిన శ్రేష్ఠ పురుషులను ఈ విధముగా ద్వేషించకుము. ఒడిలో సర్పమువలె నున్నావు. పిల్లివలె పోషించు వానినే హింసించుచున్నావు. నీవు స్వామి ద్రోహివైనను ప్రజలు నిన్ను పాపి అనుట లేదు. ఇది విచిత్రము. నీకు పాపభీతి కించిత్తైనను లేదు. మేము శత్రువులను జయించి ధనరాసులను పొందినాము. మాకు వ్యతిరేకముగా మాట్లాడు నీవు కూడ మా శత్రు కోటిలో చేరినావు. నిర్లజ్జుడవై మా పనికి అడ్డము తగులుచు నోటికి వచ్చినట్లెల్ల మొఱుగుచున్నావు.

విదురా ! పెద్దలవద్ద నీతి నేర్చుకొని మెలగుచు నీ మానమును రక్షించుకొనుము. మా పనిలో జోక్యము కలిగించుకొనకుము. నిన్ను ఇక్కడ ఎవరును సలహా కోరలేదు. మేము ఓర్చుకొని పోయినట్లెల్ల నీవు మితి మీరి మాట్లాడుచున్నావు. ప్రపంచమునంతటిని శాసించువాడు ఒక్కడే ఉన్నాడు. తల్లి కడుపులోని శిశువును మొదలుకొని వృద్ధుని వఱకు అతడే శాసించును. జగత్తునంతటిని నియమించు ఆ శాసకుని ప్రేరణపైననే నేను ఈ పనిని చేయుచున్నాను. దాని ప్రకారమే నేనును నడుచుకొనుచున్నాను.

శత్రు పక్షపాతివగు నిన్ను మా యింటిలో ఉంచుకొనకూడదు. కనుక నీవు ఇష్టమైన చోటికి పొమ్ము. కులటకు ఎన్ని మంచి మాటలు చెప్పి సమాధాన పఱచినను అది చివరకు పతిని విడిచిఉపపతినే ఆశ్రయించును కదా !"

ఆమాటలు విని విదురుడు దుర్యోధనునితో నిట్లనెను. "నీవు మందబుద్ధివి. నీవే పండితుడవు అనుకొనుచున్నావు. రాజా! నీవు తాత్కాలికముగా ప్రియములగు మాటలనే వినదలచి నచో ప్రియములనేపలుకు స్త్రీలతోను, మూర్ఖులతోను, కుంటి, గ్రుడ్డివారితోను సంప్రతించి సలహా చేయుము. వారు స్వార్థపరులై నీకు మధురమైన మాటలు చెప్పుచుందురు. కటువైనను హితము చెప్పుట కష్టము అట్లు హితము చెప్పువారే నిక్కముగా మిత్రులు.

"మానస రోగములను పోగొట్టుచు, వినునప్పుడు చేదుగను, తీక్ష్ణములుగను, సంతాపదాయకములుగను, కీర్తి నాశకములుగను పైకి గోచరించుచు, దుష్టులకు పానము చేయుటకు అశక్యమై కేవలము సత్పురుషుడు మాత్రమే పానముచేసి జీర్ణించుకొనదగిన క్రోధము నీవుకూడ మ్రింగి అణచుకొని ఉండుము. దానివలన నీకు హితము కలుగును నేను సర్వదా మీ కులముయొక్క హితమును కోరుచుందును. కనుక దుర్యోధనా! శాంతించిన సర్పములవలె నున్న పాండవులకు ఈ జూదముద్వారా ఉద్రేకము కలిగించి వంశనాశనమునకు ఒడిగట్టకుము" ఆ వివాదము తరువాత తిరిగి జూదము మొదలాయెను. అప్పుడు,

శకుని:_ యుధిష్ఠిరా! చాలవరకు మీ ధనమును ఓడిపోయితివి. మీ యధీనములో ఇంకేదైన ధనమున్నచో ఒడ్డుము.

యుధి:_ శకునీ? నావద్ద అసంఖ్యాకముగా ధనము ఉన్నది. దాని నంతటిని ఒడ్డి జూదమాడెదను (అని ఆ ధనము నంతయును క్రమముగా ఒడ్డి ఓడిపోయెను).

శకుని:_ ఇంక నేమున్నది నీవద్ద ఒడ్డుటకు?

యుధి:_ బాహుబల సంపన్నుడు, తరుణుడు నగు నా తమ్ముని నకులుని ఒడ్డుచున్నాను.

శకుని:_ (పాచిక వేసి) నీకు ప్రియుడైన నకులుడు మా వశమయ్యెను.

యుధి:_ ధర్మోపదేశకుడును, పండితుడును నగు సహదేవుని, అతడు ఒడ్డబడుటకు అర్హుడు గాకున్నను, ఒడ్డుచున్నాను.

శకుని:_ (పాచిక వేసి) సహదేవుడును మావశమయ్యెను. మాద్రీ పుత్రుల నిద్దరను ఓడితివి. భీమార్జునులు నీకు గౌరవ పాత్రులు కనుక వారిని ఒడ్డుటకు నీవు ఇష్టపడకున్నావనుకొనెదను.

యుధి:_ శకునీ! నీవు మిక్కిలి అధర్మపరుడవు. పరిశుద్ధ హృదయులగు నా తమ్ములలో భేదభావమును కల్పించుటకు ప్రయత్నించుచున్నావు.

శకుని:_ రాజా! ధనలోభముచేత అధర్మము నాచరించు మనుష్యుడు నరకకూపములో పడును. అధికముగా ఉన్మత్తుడైనవాడు శుష్కమైన స్థాణువుగా నగును రాజా! నీవు పెద్దవాడవు. గుణాధికుడవునై కూడ ఇట్లు మాట్లాడుచున్నావు. నీకొక నమస్కారము. జూదరి జూదమాడునప్పుడు పిచ్చివాడై నోటికి వచ్చినట్లెల్ల వదరుచుండును. ఆ మాటలు, జాగ్రదవస్థలోగాని, స్వప్నావస్థలోగాని అనుభవమునకు రావు.

యుధి:_ శకునీ! యుద్ధ సముద్రమునుండి మమ్మందరను గట్టెక్కించి శత్రువులపై విజయమును సాధించు వీరరాజకుమారుడగు అర్జునుని, అతడు ఒడ్డబడుటకు అర్హుడుగాకున్నను, ఒడ్డుచున్నాను.

శకుని:_ (పాచిక వేసి) రాజా! మహా వీరుడగు నర్జునుడు గూడ మాకు వశమయ్యెను. ఇప్పుడు జూదములో నొడ్డుటకు భీముడు దప్ప వేరు ధనము మిగిలియుండలేదు.

యుధి:_ గదాధరులలో అగ్రగణ్యుడై, శత్రువులను అణగద్రొక్కగల సామర్థ్యముగల మహా బలశాలి భీమసేనుని ఒడ్డు చున్నాను.

శకుని:_ (ఆయాటలో భీముని గూడ గెలిచికొని) రాజా! ధనమునంతయు, సోదరుల నందరను జూదములో ఓడితివి. ఇప్పుడు నీ వద్ద ఓడబడకుండ నుండు ధనమేదైన నున్నచో చూపుము.

యుధి:_ తమ్ములందరకు ప్రియుడను, సర్వజ్యేష్ఠుడనునగు నేను నన్ను ఒడ్డుచున్నాను. నేను ఓడబడినచో, దాసునివలె ఊడిగము చేసెదను.

శకుని:_ (పాచిక వేసి ధర్మరాజును గూడ గెలుచుకొని) రాజా! నిన్ను నీవు ఒడ్డి ఓడిపోయితివి. ఇది చాల అధర్మము. ఇంకను నీ వద్ద ధనము మిగిలియుండగా నిన్ను నీవు ఓడుట మహా పాపము. రాజా! ద్రౌపది యింకను మిగిలినది. ఆ ధనమును నీవు ఇంతదాక ఓడలేదు. ఆమెను గూడ ఒడ్డుము.

యుధి:_ పురుషుడు అభిలషించు సర్వ గుణములు గలిగి, పురుషునకు ధర్మార్థ కామసిద్ధిని గలిగించునదై, స్త్రీ రత్నములలో శ్రేష్ఠమై యొప్పు పాంచాల రాజపుత్రిని ఒడ్డుచున్నాను.

శకుని:_ (పాచికలు వేసి) నేను ఈ పందెమును గూడ గెలుచుకొన్నాను.

(సశేషము)

ఆంధ్రోద్యమ చరిత్ర | విద్యాశాఖ మంత్రి విజ్ఞప్తి

స్వతంత్ర భారత దేశంలో భాషా రాష్ట్రాల కృషికి జరిగిన ఉద్యమంలో ఆంధ్రోద్యమం నిర్వహించిన పాత్ర అందరికీ సుపరిచితమే. (1) అప్పటి మద్రాసు ప్రెసిడెన్సీ నుండి ఆంధ్ర జిల్లాల వేర్పాటు (2) అప్పటి హైదరాబాదు రాష్ట్రాన్ని విభజించి ఆంధ్ర, తెలంగాణా ప్రాంతాల ఏకీకరణ అనే రెండు లక్ష్యాలతో యీ ఉద్యమం కొనసాగింది. ఈ ఉద్యమానికి 50 సంవత్సరాల అపూర్వమైన, ఘనమైన చరిత్ర ఉంది. రక్తపాతానికి తావులేని విధంగా, అహింసా శాంతియుత మార్గాలలో రాజ్యాంగబద్ధంగానూ, జాతి సమైక్యతకు విఘాతం కలుగనీతీరుగానూ, పొరుగు రాష్ట్రాల ప్రజలతో సత్సంబంధాలకు భంగంలేని రీతిగానూ యీ ఉద్యమం నిర్వహించబడింది. ఈ విధంగా సంస్కృతి, భాషా ప్రాతిపదికపై ఒక రాష్ట్రం ఏర్పడినప్పుడు, దాని ప్రభావం దేశంలోని యితర రాష్ట్రాలపై కూడ పడింది. ఇటువంటి ఉద్యమానికిచెందిన చరిత్రను వ్రాసి, ముందు తరాలవారి నిమిత్తం భద్రపర్చడం అత్యంతావశ్యకమని నేను భావిస్తున్నాను.

ప్రజల కోర్కెలను మన్నించి ప్రభుత్వం, యీ ఉద్యమానికి సంబంధించిన చరిత్రను తయారు చేయడానికి ఒక సంఘాన్ని ఏర్పాటుచేసిందని తెల్పడానికి నేను సంతోషిస్తున్నాను.

ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటుకు సంబంధించి, ఆంధ్ర, తెలంగాణా ప్రాంతాలలో జరిగిన ఉద్యమం అంశాలతోకూడిన చరిత్ర రచనతోపాటు ప్రధానంగా దిగువ తెల్పిన అంశాలను ఈ సంఘం సేకరిస్తుంది:—

1. ఆంధ్రుల సమైక్యతకు విచ్ఛిత్తి ఏర్పడి, అప్పటి హైదరాబాదు రాష్ట్రం, మద్రాసు ప్రెసిడెన్సీల ఏర్పాటుకు దారితీసిన పరిస్థితులు, సంగ్రహచరిత్ర.
2. అప్పటి బెంగాలు విభజనకు వ్యతిరేకంగా 1905_10లో జరిగిన స్వదేశీ, "వందేమాతరం" ఉద్యమం, ఆంధ్రులపై వాటి ప్రభావం.
3. 1913లో ఆంధ్ర మహాజన సభ ఏర్పాటు _ మహాసభ లక్ష్యాలు, ఉద్దేశాలు, 1920లో దాని కృషి.
4. 1920_35లో జరిగిన ఆందోళన.
5. 1935_1953లో జరిగిన ఆందోళన, ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు.
6. రాయలసీమ ప్రజల దృక్పథం, 1935వ సంవత్సరం బాగ్ ఒప్పందం.
7. తెలంగాణాలో ఆంధ్రోద్యమం.
8. తెలుగు మాట్లాడే ప్రజల ఏకీకరణ _ తెలంగాణా రక్షణలు.
9. భావసమైక్యత, పరిపాలనా ఏకీకరణ.
10. సరిహద్దు సమస్యలు, రాష్ట్రేతర ఆంధ్రుల సంక్షేమం.
11. 1956 నుండి రాష్ట్ర అభివృద్ధి, రాష్ట్రంలోని అల్ప సంఖ్యాక వర్గాల సమస్యలు
12. అఖిల భారత దేశంలో జాతీయ సమైక్యతను పెంపొందించాల్సిన అవసరం.

ఈ సంఘం అనేక క్లిష్టసమస్యలను ఎదుర్కొనాల్సి ఉంది వీరు తమ కార్యక్రమాన్ని సక్రమంగాను, జయప్రదంగాను నిర్వహించడానికి ప్రజలు తోడ్పడాలని నేను విజ్ఞప్తి చేస్తున్నాను. ఈ ఉద్యమంలో పాల్గొన్న నాయకులు, వార్తా పత్రికలు, కార్యకర్తలు, పత్రికలు, గ్రంథాలయాలు తమవద్ద ఉన్న ఉద్యమ వివరాలను యీ సంఘానికి అందజేసి తమ అమూల్యమైన సహకారాన్ని యిస్తూ తద్వారా ఈ సంఘం కృషిని సుగమం చేయాలని కోరుతున్నాను. ప్రత్యేకంగా ఆంధ్ర మహాసభ, తెలంగాణా ఆంధ్ర మహాసభ జరిపిన అనేక సమావేశాలు, సభలు, తీర్మానాలు, అధ్యక్షోపన్యాసాలు, ఆహ్వానసంఘం అధ్యక్షుల ప్రసంగాల ప్రతులు, ఫొటోలు మొదలైన వాటిని పంపవచ్చు. వాటన్నిటికి యీ గ్రంథంలో కృతజ్ఞతలు తెల్పడం జరుగుతుంది. వివరాలన్నిటిని దిగువ చిరునామాకు పంపాలి

శ్రీ జి. వి. సుబ్బారావు, సంపాదక_కార్యదర్శి,
ఆంధ్రోద్యమ చరిత్ర రచనా సంఘం,
అమలాపురం (తూర్పు గోదావరి).

సంఘం సభ్యులు

1. విద్యాశాఖ మంత్రి ... అధ్యక్షులు_ఎక్స్అఫీషియో
2. డా. మారేమండ రామారావు ... గుంటూరు.
3. శ్రీ దేవులపల్లి రామానుజరావు ఆంధ్రసారస్వతపరిషత్తు ... హైదరాబాదు.
4. శ్రీ కాళోజి నారాయణరావు ... వరంగల్లు.
5. శ్రీ పప్పూరి రామాచార్లు ... అనంతపురం.
6. శ్రీమతి కె. రామసుబ్బమ్మ ... కడప.
7. శ్రీ ఎం. ఆర్. అప్పారావు, ఎం. ఎల్. ఎ. ... నూజివీడు.
8. శ్రీ జి వి. సుబ్బారావు, గోష్ఠి సంపాదక_కార్యదర్శి... అమలాపురం

సంపాదక వర్గం

1. శ్రీ జి. వి. సుబ్బారావు
2. డా. మారేమండ రామారావు.

సహాయ సంపాదకులు

1. శ్రీ మల్లెల శ్రీరామమూర్తి ... విజయవాడ.

యువతరం బాధ్యత

దేశంలోని యువతరంపై నాకు చాలా ఆశ ఉంది. క్రమశిక్షణా యుతమైన జీవితంమాత్రమే వారినీ, దేశాన్నీ అధోగతినుండి రక్షిస్తుందనే విషయాన్ని వారు అవగతం చేసుకోవాలి.

విద్య ప్రయోజనం

విద్య విముక్తి కలిగిస్తుందనే ప్రాచీన నానుడి యీనాడు కూడా శిరోధార్యమే. ఇక్కడ విద్య అంటే ఆధ్యాత్మిక విద్యఅనీ, విముక్తి అంటే మరణం తర్వాత లభించే ఆత్మ విముక్తి అనీ భావించరాదు. మానవ సేవకు ఉపయుక్తమయ్యే శిక్షణ ప్రతీదీ విజ్ఞానమే ప్రస్తుత జీవితంలో ఎదురయ్యే అన్నివిధాలైన బానిసత్వాలనుండి లభించే స్వేచ్ఛ మాత్రమే విముక్తి. బానిసత్వం, రెండువిధాలుగా వుంది. పైవారి ఆధిపత్యంవల్ల కలిగిన బానిసత్వం మన కృత్రిమ అవసరాలకు మనం బానిసలంకావడం. ఈ ఆదర్శాల అనుసరణలో లభించే విజ్ఞానం వాస్తవిక అధ్యయనం అవుతుంది.

మానవుని పాశవిక ప్రకృతిని, ఆటవిక ధర్మాన్నిగూర్చిగాక మానవుని ఔన్నత్యాన్నిగూర్చి అధ్యయనం చేయాలి. మతకలహాలను రెచ్చగొట్టేవారు పిచ్చాసుపత్రులలో ఉండాల్సినవారు. ఇతరులను నొప్పించకుండా దేశస్వాతంత్ర్యానికి తమ ప్రాణాలను అర్పించినవారినిగూర్చి అధ్యయనంచేయాలి. మానవుని ప్రేమ తత్వాన్ని, మహోన్నత ప్రకృతిని అధ్యయనంచేయాలి. ఆ తర్వాత మీరు ఎదిగినతర్వాత ఆ వారసత్వాన్ని అభివృద్ధిచేయాలి. వివిధ సమస్యల పరిష్కార మార్గాలను పరిశీలించడం విద్యార్థులవిధి. అధ్యయనం పూర్తి అయిన తర్వాత ఆచరణ, కృషి ఆరంభమవుతుంది.

నడవడిక పునాది

విద్యార్థులు తమ వ్యక్తిగత నడవడికనుగూర్చి ఆత్మ పరిశీలన చేసుకోవాలి. విజ్ఞానార్జన అంతిమ ధ్యేయం నడవడికను రూపొందించుకోవడం కావాలి.

ఆత్మ పరిశుద్ధతను చేకూర్చలేని వేదపఠనం, సంస్కృత, లాటిన్, గ్రీక్ భాషావిజ్ఞానం, ఇతర చదువులు అన్నీ వ్యర్థం.

మీ ఆలోచనలు, కార్యాచరణలపై మీరు సంపూర్ణ స్వాధీనత సాధించనప్పుడు, షేక్స్పియర్, వర్డ్స్‌వర్తుల అధ్యయనం పాండిత్యం అన్నీ వృథా. ఆత్మ సంయమనం, ఉద్వేగ ఉద్రేకాలపై అదుపు సాధించి నప్పుడు నిస్పృహకు తావుండదు.

ఆధ్యాత్మిక చింతన

నేటి ఆధునిక విద్య, ఆధ్యాత్మిక చింతననుండి దృష్టిని దూరంచేస్తున్నది. ఆవిధంగా ఆధ్యాత్మికత మనను ప్రభావితులను చేయడంలేదు. తత్ఫలితంగా మనం అశాశ్వతమైన భౌతిక వాంఛలకు బానిసల మవుతున్నాము.

నా లక్ష్యాలలో నాకు అకుంఠితమైన విశ్వాసంవున్నది నా అనుభవం, నా సహచరుల అనుభవాల ఆధారంగా యీ విశ్వాసం ఏర్పడింది. ఓర్పు పరిశోధనా ఉత్సుకతగల ప్రతి విద్యార్థి తనకు తాను యీ అనుభవాన్ని పొందగలుగుతాడు.

1. కేవలం సంఖ్యా వివరాలు నిష్ప్రయోజనం.
2. ఆత్మరహితమైన అన్నిశక్తులు తాత్కాలికమైనవి వృథా.

పైన పేర్కొన్న అంశాలు నిజమని తెలుసుకున్న ప్రతి విద్యార్థి ఆత్మపరిశుద్ధత, స్వయం క్రమశిక్షణలద్వారా ఆధ్యాత్మిక చింతనను అలవరచుకోవాలి.

మీరు (విద్యార్థులు) ఖురాన్, బైబిల్‌లను పఠించడాన్ని నేను అన్నివిధాల హర్షిస్తాను. అయితే 'గీత'ను కూడ పఠించాలని హిందూ విద్యార్థులను కోరుతున్నాను విద్యార్థులలో సాంప్రదాయ గతమైన ఆలోచనలు, అలవాట్లు కొరవడినందుననే విద్యార్థుల అశ్రద్ధ, అనాసక్తత, అపరిశుద్ధత ప్రబలినాయి.

మతబోధనా విషయాలలో అన్ని విశ్వాసాలకు సంబంధించి ప్రబోధించాలి విశాల హృదయంతోను, గౌరవ భావంతోను, సహనంతోను ప్రపంచంలోని వివిధ మత విశ్వాసాలను అవగాహన చేసుకునే విధంగా విద్యార్థులకు శిక్షణ యివ్వాలి.

క్రమశిక్షణ

యవ్వనంలో ఉద్రేకాలను, వాంఛలను అదుపులో పెట్టుకోలేనివ్యక్తి, వృద్ధాప్యంలోకూడా వాటిని నిరోధించలేడు. అంతమాత్రాన యువకులకు ఆటపాటలు అవసరంలేదని నేను అనలేను. ప్రతి ఆట, ప్రతి పని క్రమజీవితాన్ని అలవరుచుకునే ఉన్నత లక్ష్యంతో ఉండాలి. భగవంతుని సామీప్యానికి చేర్చాలి.

అవరోధాలు, రౌడీజం వంటివి కేవలం దౌర్జన్యచర్యలు. విద్యార్థులలో నాకు కొంత పలుకుబడి, ప్రభావం ఉందనేభావం ఉంది. ఆవిధమైన ప్రభావమే ఉంటే మనసా, వాచా, కర్మలలో అహింసను ఆచరించాలని వారిని అడుగుతున్నాను.

దేశసేవ

స్వచ్ఛంద క్రమశిక్షణ అలవరచుకోవడం ద్వారా విద్యార్థులు దేశసేవకు వివిధ రంగాలలో నాయకత్వం వహించే శక్తిని సంపాదించాలి.

విద్య పూర్తి అయిన తర్వాత ధనార్జనయే ధ్యేయంగా గాక జాతిసేవయే లక్ష్యంగా ఉండాలి.

(తరువాయి 48 పుటలో)

అతిత్వరితంగా ప్రగతి ప్రమాణాలు నెలకొల్పుతున్న
అనాథల సేవాసదనం

నిస్సహాయులకు, నైతికంగా పతనం చెందిన స్త్రీలకు పునరావాసం కల్పించే నిమిత్తం, అనంతపురం పొలిమేరలలో ఒక దశాబ్దం క్రితం యధాశక్తి ప్రారంభింపబడిన 'సేవాసదనం' అతి వేగంగా విస్తృతం చెంది రాష్ట్రమంతటిలోకీ ప్రధానమైన సంఘసేవా కేంద్రంగా రూపొందుతూంది.

ఏప్రిల్ 28 వ తేదీన సేవాసదనం నూతన భవనానికి ముఖ్యమంత్రి శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి ప్రారంభోత్సవం చేశారు. సాంఘిక సంక్షేమ శాఖామంత్రి శ్రీ అరిగె రామస్వామి అధ్యక్షతవహించారు.

లక్ష్యాలు

5 వ తరగతి కనీస విద్యార్హత కలిగి, 16-35 సంవత్సరాలమధ్యవయస్సుగల నిస్సహాయులైన స్త్రీల పోషణ, విద్య పునరావాసం కల్పించే లక్ష్యంతో ఈ సేవాసదనం 1959 మే 13 వ తేదీన ప్రారంభించబడి పనిచేయడం మొదలు పెట్టింది.

ఆరోగ్య విషయమై అర్హత గల్గిన డాక్టర్ల చేతను, రెవెన్యూ అధికారుల చేతను యివ్వబడిన యోగ్యతాపత్రాల ప్రాతిపదికపై జిల్లా మహిళా సంక్షేమాధికారిణులు చేసే సిఫారసులపై సాధారణంగా ఈ సేవా సదనంలో ప్రవేశం లభిస్తుంది.

మామూలుగా, 3 సం॥ గరిష్ఠ కాలపరిమితి మించకుండా ఈ సదనంలో వుండవచ్చు. పోషణ, నివాస వసతి, వైద్య సహాయం, పరీక్ష రుసుముల క్రింద అయ్యేఖర్చు రాష్ట్ర ప్రభుత్వం భరిసుంది ఈ సదనానికి అనుబంధంగా ఒక బాలల విభాగం కూడావుంది. దీంట్లో సేవాసదనంలో నివసించే స్త్రీల పిల్లలుగాని, అనాథ బాలలుగాని 7 సం॥లకు లోబడి వున్నవారికి ప్రవేశం దొరుకుతుంది బడియీడు పిల్లల్ని దగ్గరవున్న ప్రాథమిక పాఠశాలలకు పంపుతారు. 5 సం॥ లోబడివున్న బాలలకు, సాంకేతికంగా ప్రీ-బేసిక్ అర్హత యోగ్యతలు కల్గిన ఉపాధ్యాయినిచే శిక్షణ యిప్పించబడుతుంది.

మేజోళ్ళ తయారీ, ఆట బొమ్మల తయారీ, గుడ్డబొమ్మల తయారీ, కుట్టుపనులు అనే నాల్గు విభాగాలు కలిగిన శిక్షణ ఉత్పత్తి కేంద్రమొకటికూడా ఈ సేవాసదనంలో ఒక భాగంగా పని చేస్తున్నది. రాష్ట్రంలో ప్రప్రథమంగా మేజోళ్ళ తయారీ కేంద్రం యిక్కడే ప్రారంభించబడింది. విద్యార్థులు, పోలీసులు, నర్సులు, పౌరుల అవసరాలకు చాలినన్ని నూలు మేజోళ్ళు, నైలాన్ మేజోళ్ళు, మఫ్లర్లు, బనియన్లు ఈ కేంద్రంలోనే తయారవుతుంటాయి.

ఆటవస్తువుల తయారీ కేంద్రం ఊగుడుగుఱ్ఱాల వంటి కొయ్యబొమ్మలను, బాతులను, యితర ఆటవస్తువులను ఉత్పత్తి చేస్తుంది.

గుడ్డ బొమ్మల తయారీ కేంద్రంలో చిత్రమైన బొమ్మలు, కుందేళ్ళు, ఏనుగులు మొదలైనవి చౌకగా ఎక్కువకాలం మనకలిగేటట్లుగా యిక్కడ తయారు చేస్తుంటారు.

కుట్టుపని విభాగంలో దిండుగలేబులు, దోరు కర్టనులు, చిత్రమైన దుస్తులు, చిన్నపాపల గౌన్లు, ఆధునిక గృహిణులకు ఉపయోగపడే తదితర అల్లిక పరికరాలు తయారు చేయబడుతున్నాయి.

విద్యావిషయంలో ఎక్కువగా ఆసక్తిలేని సదనవాసులకు ఈ పనులందు శిక్షణనిస్తారు. అయితే యింకా ఎక్కువ విజయవంతంగా పునరావాస కల్పనకు పథకం రూపొందించ వలసివుంది.

సదనం ప్రారంభించి నప్పటినుండి సదనవాసులకు సాధారణ విద్య గరపబడుతూంది. ప్రైవేటుగా స్కూల్ ఫైనల్ పరీక్ష వ్రాసేందుకు ప్రతి సంవత్సరం వారికి తగు శిక్షణ యివ్వబడుతుంది.

ఆంధ్ర, వెంకటేశ్వర విశ్వవిద్యాలయాలు ప్రైవేటుగా బాలికలను మెట్రిక్యులేషన్ పరీక్ష వ్రాయడానికి అనుమతించిన కారణంగా, సదనవాసులను పై పరీక్షకు కూర్చొనుటకు వీలుగా శిక్షణ యిచ్చే సదుపాయాలు కలుగ చేయుటకు ప్రతిపాదనలు వున్నాయి.

ప్రస్తుతం లభ్యమైన పరికరాలతోను, సదుపాయాలతోను, సాలుకు 6 వేల రూపాయల అదనపుగ్రాంటుతోను, మెట్రిక్యులేషన్ తరగతులు నిర్వహించ వచ్చునని భావించబడుతున్నది.

37 మంది వరకు హయ్యర్ గ్రేడ్ ఉపాధ్యాయులు, 75మంది అగ్జిలరీ నర్సులు, 37 మంది మేట్రన్లు, కండక్ట్రెస్సులు, సేవికలు 12 మంది మంత్రసానులు మున్నగువారికి ఇంతవరకు పునరావాసం కల్పించబడింది దాదాపు 125 మంది సదనవాసులు E.S.L.C. పరీక్షలో ఉత్తీర్ణులయ్యారు. సేవాసదన కృషిఫలితంగా 33 మంది హిందీ పరీక్షలోను, ముగ్గురు కుట్టుపని పరీక్షలోను నెగ్గారు.

భవనము

నివాస వసతి యిబ్బందులను గమనించి, సేవాసదనం సమర్పించుకున్న విజ్ఞాపనలను మన్నించి 1964 లో జిల్లా కలెక్టరు,

(తరువాయి 38వ పుటలో)

భాగ్యచక్రం

ఆరెకపూడి కౌసల్యాదేవి

జరిగిన కథ

జయశ్రీ గర్విష్ఠి. బావ శ్రీనగేష్ అంటే ఆమెకు చిరాకు. అతని మీద కక్షకొద్దీ, అతనివద్ద అసిస్టెంటుగా వున్న శ్రీకాంత్‌ను పెళ్ళిచేసుకుంది. చివరకు తను మోసపోయానని తెలుసుకుంది. భర్త చేసిన అఘాయిత్యాల్ని నౌకర్లు ఆమెకు వినిపిస్తున్నారు.

నౌకర్లు వారి వారి ఫిర్యాదుల్ని జయశ్రీకి విన్నవించుకున్నారు.

"స్నానానికి నీళ్ళు అందరికీ ఉంచినట్లే ఉంచుతున్నానమ్మా, ఒకపాత్రలో వేడినీరు మరోపాత్రలో చన్నీరు సమపాళ్ళలో కలపడం రాదా వెధవా_అని వేడివేడి నీళ్ళు నానెత్తిన పోశారమ్మా పొద్దున్న. ఎంత కూటికి లేకపోయినా, బానిసలలాగా బ్రతకలేమమ్మా ఈ రోజుల్లో. రోజులు మారాయి" అని మరో నౌఖరు ఫిర్యాదు.

"ఏమోనమ్మా." చేతులు త్రిప్పుకుంటూ వచ్చింది పనిమనిషి. "ఇలాంటి పద్ధతి ఎక్కడా ఎరగం. ఇన్నేళ్ళనుంచి మీ యింట్లో పాచిపని చేస్తున్నాను. ఈ పని యిలా చెయ్యి ఆ పని అలా చెయ్యి - అని మగవాళ్ళెవరూ నాకెప్పుడూ చెప్పిన పాపాన లేదు. ఈ నెల్లాళ్ళ నుంచే ఈ పద్ధతి చూస్తున్నాను. పెద్దయ్యగారు కనీసం పిచ్చిలోనైనా ఎప్పుడూ యిలా చేయలేదమ్మా." బాంబులాంటి మాట వదిలేసి వెళ్ళిందది

జయశ్రీకి తల కొట్టేసినట్లైంది. ఛీ ఛీ, చేతిక్రింద బ్రతికే వాళ్ళ నోటినుండి ఎటువంటి మాటలు వినవలసివచ్చింది!

"మాకీ గతిమాలిన నౌఖరీవద్దు తల్లీ. మమ్మల్ని పంపించేయండి." వంటవాడు మరోసారి హెచ్చరించాడు.

కోపం, అసహ్యం, నిస్సహాయత పెనవేసుకు పెల్లుబికాయి జయశ్రీ లో. "పోతేపోండిరా. అందరూ కట్టగట్టుకుపోండి. ఏం, బెదరిస్తారా? ఏం, చేయించుకొనేవాళ్ళు ఆ మాత్రం అనకుండా వుంటారా? పోండి, మిమ్మల్ని నేనుగాని బ్రతిమాలేదిలేదు." హఠాత్తుగా కుర్చీలోంచి లేచి బీర్వాలోని నోట్లకట్ట ఒకటి తీసి వాళ్ళముందుగా విసిరేసింది. ఎంత యిస్తూన్నదో, ఏమి మాట్లాడుతూన్నదో ఏమి చేస్తున్నదో ఆమెకే తెలియకుండావుంది ఆ రోషావేశంలో.

•

నౌకర్లు మొదట విస్తుపోయారు తర్వాత వాళ్ళలోనూ కొంచం పౌరుషం రేగింది. "బాగుందమ్మోయ్, మాది మాకు పారేయడానికేనా యింత యిది? పోకపోతే యింకా వుంటామా, యింతోటి గ్రుడ్డినౌకరీలో?"

ఎంతకాలంనుండో అక్కడే సేవ చేస్తూన్న ఒక్క ముసలి నౌఖరు మినహాగా అందరూ వెళ్ళిపోయారు, తమతమ జీతాలు తీసుకుని.

"ఏం నువ్వు పోవేం?" కసరినట్టు అడిగింది.

అతడు కళ్ళొత్తుకుంటూ అన్నాడు· "ఇన్నాళ్ళూ యిక్కడ సుఖంగా బ్రతికి ఈనాడు పోయేంత విశ్వాసం లేనోడిని కానుతల్లీ, కోపంతో పొమ్మన్నావు కాని నువ్వుమాత్రం నిజంగా అన్నావా? నీకెంత కష్టమొచ్చిందో, ఈ పెళ్ళి చేసుకుని నువ్వెంత బాధపడుతున్నావో నేనెరుగుదును తల్లీ"

కాలిన పుండుపైన మంచి మందు రాసినా భగభగ మండినట్లుగా ఆ ఉపశమన వాక్యాలు తన మానసిక బాధను మరింత అధికం చేయడంతో వినలేక, లేచి అక్కడినుండి పైఅంతస్థుకు పారిపోయింది జయశ్రీ కాని అక్కడకూడా ఆమె బాధ తాత్కాలికంగానైనా విస్మరింప బడలేదు నౌఖర్లందరూ ఏక సమూహంగా ఇల్లు వదలి గేటునుదాటి పోతూండడం ఆమె కంటికి కన్పించింది కిటికీలో నుండి చూస్తూంటే 'హు! వాళ్ళు నౌఖర్లు గనుక పోతున్నారు. నువ్వెక్కడికి పోతావ్? నీయిల్లేనీకు త్రిశంకు స్వర్గమైనదే జయా! మనస్సురోదించింది.

• • •

"ఏరీ. నౌఖర్లంతా చచ్చిపోయారా?" రాత్రి పన్నెండు గంటలకువచ్చి శ్రీకాంత్ అరుస్తున్న అరపులకు ఉలికిపడి నిద్ర నుంచి లేచింది జయశ్రీ నిద్ర కళ్ళతో నున్న ఆమెకు వెంటనే విషయం అర్థం కాలేదు. "ఏమిటీ అర్ధరాత్రి అంకమ్మ శివాలు?" అన్నది విసుగ్గా.

''నోర్మూయ్. మొగుడు వచ్చాడా చచ్చాడా......తిన్నాడా లేదా అనిలేకుండా పడుకుని నిద్దరోతున్నావ్! అన్నం పెట్టు.'' మత్తుగా మొద్దుగా మాట్లాడుతూన్న అతడిని తేరిపార చూస్తూ కోపంగా, చికాకుగా అన్నది, ''నౌఖర్లు కట్టుకున్న పెళ్ళాలు కాదు—త్రాగి వచ్చి తందనాలాడినా, నోటి కొచ్చినట్టు మాట్లాడినా భరించటానికి. వాళ్ళకెంత జీతమిచ్చినా తిడితేనూ కొడితేనూ పడరు!"

''పోనీయ్, శనివ్విరగడైంది. నీకేం పనుంది_నువ్వున్నావ్‌గా! పద. అన్నం పెట్టు!"

అలాగే కదలక బింకంగా నిలబడింది జయశ్రీ. "నాకు రాదు. నాకు పదిమంది నౌఖర్లచేత చేయించు కోవడమే తెల్సు కాని చేయ డం యింత వఱకూ తెలియదు."

"అబ్బో అమ్మాయిగారి వ్యవహారం చాలా గట్టిగా వుందే! పెళ్ళికాక ముందు తెలియనివి అనేకం పెళ్ళయ్యాక తెలియడం లేదూ ?" కరకరా నవ్వాడు.

అసలే సహనం అంతంత మాత్రమైన జయశ్రీకి పిచ్చికోపం వచ్చింది. "ఏం ఇంత వఱకూ ఆ త్రాగుడు దొరికినచోట అన్నం మాత్రం దొరకలేదా ? తిండికి యిల్లు కావలసి వచ్చిందా ?" అర చింది.

త్రాగుడు మైకంలో తేలిపోతున్న కనులనూ, శరీరాన్నీ వికృతంగా త్రిప్పుతూ, వికటంగా నవ్వుతూ వాగసాగాడు శ్రీకాంత్, "దొరక్కేం, అన్నం దొరుకుతుంది; అంగనా దొరుకు తుంది; అన్నీ దొరుకుతాయి, అభ్యంతరం చేకపోతే...ఇంతకూ నేను త్రాగానన్న కోపంతోనా అలా వాగుతున్నావ్ ? దానికేముంది నువ్వూ త్రాగు. చక్కగా వుంటుంది బుద్ధిమంతురాల వౌతావ్. ఇదం." ప్యాంటు జేబులోంచి సీసా తీసి మూత విప్పి భార్య నోటి కందించాడు.

"ఛీ ఛీ. త్రాగుబోతుకు ప్రపంచమంతా త్రాగుబోతుల్లాగా, వాగివదరే వాడికి లోకమంతా వదరుతూన్నట్లూ కన్పిస్తారట నానా తిరుగుళ్ళూ తిరిగి చెడి యింటికి జేరడమే గాక పెళ్ళాన్ని కూడా త్రాగమనడమా ? ఏం మగజన్మ ?" అతడు అందిస్తూన్న సీసాను విసురుగా త్రోసేసింది. నేలపాలై భళ్లున బ్రద్దలైన ఆ సీసాను చూస్తూ ఉగ్రుడైపోయాడు శ్రీ కాంత్. "ఎంత పొగరే నీకు ?" అంటూనే చెంతనే టేబుల్ పైనున్న ఫ్లవర్‌వాజ్ తీసి ఆమె ముఖాన కోపంగా విసిరేశాడు.

"అమ్మా !" నుదుట తగిలిన దెబ్బకు బాధతో మంచంపై కూలబడిపోతూ అంతలో రోషం రగుల్కొగా పళ్ళు పట పట కొరుకుతూ అంది. "పశువా ! నువ్వే భర్తవా, రాక్షసుడవుకాని ! ఛీ. ఈ నాటితో నీకూ నాకూ చెల్లు." అంటూండగానే శ్రీకాంత్ నిర్లక్ష్యంగా నవ్వుతూ అక్కడి నుండి మరో గదిలోకి వెళ్ళి పోయాడు. రభసవిని వచ్చిన తండ్రిని చుట్టివేసుకుని బావురు మన్నది జయశ్రీ "మోసపోయాను నాన్నా" అని.

"నీ గొంతు కోశాను తల్లీ, ఎందుకో దైవం మనల్ని సుఖ పడనీయడం లేదు. నీ మీదైనా నా ఆశలు తీర్చుకుందామను కున్నాను కదే ;" పసిపిల్లవాడి మాదిరిగా దుఃఖించాడు శ్రీపతి కుమార్తెను పట్టుకొని.

"లేదు నాన్నా ఏడవకు", అంతలోనే కళ్ళు తుడుచుకుని ఒక్క క్షణ కాలం ఆలోచించి తీక్షణదృక్కులతో—స్వరంతో అన్నది జయశ్రీ "ఈ యిల్లు నీది, ఈ భాగ్యం నీది ఈ బిడ్డ నీది. నీ ఆశలు నేను తీరుస్తాను నిన్నేడిపించను. ఇదంతా ఎవడి నెత్తినోకట్టి వాడికి లేని పెద్దరికం అంటగట్టి, మధ్యన మనం బాధ పడటం ఏమిటి ? మధ్యనవచ్చిన వాడు మధ్యనే పోతాడు నీ ఆశలు నేను తీరుస్తాను. నువ్వు ధైర్యంగా వుండు."

"అమ్మాయ్ !" తృళ్ళిపడిన శ్రీపతి ఏదో చెప్పబోయాడు.

"అదంతే !" ఖండితంగా అన్నది జయశ్రీ "మరేం చెప్పకు నాన్నా. నువ్వు ఆధైర్యపడి నన్ను అధైర్యపెట్టకు ఇంత వఱకూ అన్నీ తెలివి తక్కువ పనులే చేస్తాం నీ తెలివి మీద నాకేం నమ్మకం లేదు ఇంతవఱకూ నేను అవివేకంగానే బ్రతి కాను. ఇక ఆ అవివేకాన్ని సమాధి చేయదలచుకున్నాను. ఈ మిగిలిన జీవితమైనా లక్షణంగా, ఉపయోగకరంగా బ్రతకదలచు కున్నాను. ఇదేమీ పూర్వకాలం కాదు – ఆడదానికి వివాహ సూత్రం ఉరిత్రాడు కావడానికి. లజ్యాన్ని వదలి, ఇష్టంలేని సంసా రం ఈ రోజుల్లో ఎవరూ చేయనక్కర లేదు"

"భగవంతుడా !" ఎటూ మాట్లాడలేని శ్రీపతి రెండు చేతు లతో తల పట్టుకున్నాడు.

మానవుడెంత బలవంతుడైనా, ఎంతటి విజ్ఞానవంతు డౌతున్నా, మరెన్ని అసాధ్యాలను సుసాధ్యాలను చేస్తూన్నా, అతడు అల్పుడే. మానవ నిర్ణయంపై దైవ నిర్ణయం ఎప్పుడూ వుంటుం దని అడుగడుగునా – అతి చిన్న విషయాలలో కూడా నిర్ధారణ అవుతూనే వుంటుంది

* * *

భర్తనుంచి విడిపోవడానికి ప్లీడర్ సలహాకోసం బయలు దేరింది జయశ్రీ.

"వివాహమైన రెండు నెలలకే విడిపోవడం – చాలా ఆలో చించవలసిన విషయమమ్మా. ఎన్నో కారణాలను సిగ్గు విడచి బహిరంగంగా కోర్టులో చెప్పుకోవాలి అదీ కాక ఈ రోజుల్లో విడాకులు పొందడం కూడా అంత సులభం కాదు. ఏమో. ఈ రోజున ఆవేశంలో వున్నావ్, ఈ భర్త వదనుకున్నావ్ మరో నెల తిరిగేసరికి, దూరంగా వుండేటప్పటికి, ఏమో అతడి మీదే మళ్ళీ మనసు మరలు కొంటుందేమో ! అందుకే సంసారాలు విచ్ఛినం కాకుండా వుండడానికి ప్రభుత్వంవారు ఆ మధ్యన ఈ విడాకుల చట్టాన్ని సవరించారు......." అంటూ విడాకుల కేసు లోని సుఖవు బలువులూ, కష్ట సుఖాలూ అన్నీ వర్ణించి వర్ణించి, "అయినా......అయినింటి స్త్రీవి, ఈ తొందరపాటు నీకు తగ దమ్మా, కొంచం ఓర్పు వహించు, చట్టాలు ఎన్ని ఉన్నా మన దేశ స్త్రీలు యిటువంటి విషయాలలో పదిమందిలో చులకనై పోతారు." అంటూ తన సలహాను ముగించాడు వకీలు.

జయశ్రీ తల సిగ్గుతో భారంగా ధరణిలోనికి కృంగి పోయింది. 'అయినింటి స్త్రీకి తొందరపాటు తగదు ! మన దేశ స్త్రీలు యిటువంటి విషయాలలో చులకనై పోతారు !' వకీలు మాటలు చెవులలో రింగు మంటూండగా, మనసుకు శూలాలై గ్రుచ్చు కొనగా తనను తానే హేయపడుతూ యిల్లు జేరింది. ఇటీవల సంసారంలోని చికాకులతో సరిగా భోజనం చేయక మనసూ, శరీ రమూ కూడ సరిగాలేని ఆమె, మేడమీది తన గదికి జేరుకొంటూనే స్పృహ తప్పి పడిపోయింది. తిరిగి ఆమెకు తెలివి వచ్చేసరికి

తండ్రీ, భర్తా, లేడీ డాక్టరూ నౌకరూ అందరూ చుట్టూ చేరి వున్నారు.

"ఏం ఫర్వాలేదు. మూడోనెల. కొంచెం జాగ్రత్త. ఆనందంగా వుండు. చాలు" అంటూనే లేడీ డాక్టర్ వెళ్ళిపోయింది.

జయశ్రీ గుండెలు గుభిల్లు మన్నాయి. 'భగవాన్! అస్థిర. ముగా ఉన్న సంసారంలో పిల్లలొకళ్ళు తక్కువయ్యారా!' లోలోన వాపోతూ అయోమయంగా అటూ యిటూ త్రిప్పింది చూపులను.

ఆమెనే చూస్తున్న శ్రీకాంత్ గర్వంగా నవ్వుతూ, రీవిగా మీసం దువ్వుకుంటూంటే అసహ్యంతో ముఖం మరో ప్రక్కకు త్రిప్పుకుంది

కర్తవ్యమూఢయై రాత్రింబవళ్ళూ తనలోతాను క్రుంగిపోయి సాగిన జయశ్రీతో విధి పరిహాసాలు యింకా చాలించలేదు అటు తిరిగి విద్యను ఆరంభించడానికీ అవకాశం లేదు; ఇటు విడాకులూ సాధ్యం కాదు. అన్నిటికీ గర్భస్థ శిశువే ఆటంకం పదుగురిలో పరిహాస పాత్రమైపోతానేమో ననే భయం. శ్రీకాంత్ డబ్బును మంచినీళ్ళ ప్రాయంగా ఖర్చు చేస్తున్నాడు, తననూ, తండ్రినీ హీనాతి హీనంగా చూస్తున్నాడు. అయినా నిర్లిప్తంగా ఊరుకొంటూన్నది ఆమెలోని అహంకారం, ఠీవి, పౌరుషం అతివిచిత్రంగా అదృశ్యమైపోయి ఒక విధమైన నీరస నిర్లిప్తతలు ఆవరించాయి. ప్రతి దానికి తనను కానట్టుగా, తనకు అంటనట్టుగా తన అస్థిత్వమే మఱచి జీవించుదామని ఆమె ప్రయత్నిస్తూన్నా, పరిస్థితులే వచ్చి తమంత తాము కవ్వించి, ఒక్కొక్క కుటుంబ కల హాన్నీ సృష్టించి మనస్సును వికలం చేయసాగాయి.

పదిరోజుల నుండీ అనారోగ్యంగా కన్పిస్తూన్న తండ్రి శ్రీపతి ఆ రోజు వాంతిలో రక్తం కక్కు కోవడంతో బెంబే లెత్తి పోయింది జయశ్రీ. నిర్లిప్తతా నిర్లక్ష్యాలు తాత్కాలికంగా ఆమెను విసర్జించాయి. "నాన్నా! ఏమిటిది?" అని అతడిని పట్టి కుదిపి వేస్తూ వెక్కిళ్ళుపెట్టి ఏడ్చింది.

ఆదే సమయంలో శ్రీకాంత్ ప్రవేశించాడు. తన కోప మంతా మఱచి భర్తను పలుకరించింది జయశ్రీ. ఆపద సమయంలో అవలంబన వెతుక్కోవడం ప్రాణుల సహజం.

"ఏమిటో! నాకు భయంగా వుంది నాన్న నొక్కసారి పరీక్షించండి."

ఆమె ఎంత ఆత్రంతో అర్థించిందో అంత తాపీగా విసుగు దలగా అన్నాడు శ్రీకాంత్ "ఇప్పుడే ఒక ఆపరేషన్ చేసి విసిగి పోయాను. నాకు తీరికలేదు"

"అదేమిటి?"

"అదంతే," అంటూనే తన గదిలోకి వెళ్ళిపోయాడు. నివ్వెరపోయిన జయశ్రీ అతడిని వదలిపెట్టలేదు.

అతడి వెనుకనే గదిలోకి తానూ వెళ్ళింది. "ఆ మాట అనడానికి మీకు నోరెలా వచ్చింది? ఇంత ఆస్థిని మీ నెత్తిన పెట్టి ఇంత ఆసుపత్రికి మిమ్మల్ని అధికారిని చేసి, అలుడిని చేసు కొన్నందుకు యిదేనా మర్యాద?"

"ఊఁ మాటలు మీరుతున్నావ్, జాగ్రత్త!"

"ఏం, మీరక? మీ ప్రవర్తన హద్దులు మీరడంలేదా? తెల్లవారి లేచి ఇందరు రోగుల్ని చూస్తారే! మిమ్మల్ని యింతటి వారిని చేసిన మామగారిని కాస్త చూచి మందివ్వడానికి—అందులోనూ ప్రమాద పరిస్థితిలో వున్నప్పుడు — మీకు తీరికేలేదా? ఇంతటి విశ్వాసరహితులా?"

"నోర్ముయ్. బయటికి వెళ్ళు నన్ను విసిగించక" అంటూనే బీర్వాలోని విస్కీబాటిల్, గ్లాసులూ తీసుకొని ముందుం చుకు కూర్చున్నాడు.

సీసామూత తీస్తూన్న అతడి చేతిని గట్టిగా పట్టుకుంది జయశ్రీ. "ఈ ఇంట్లో కులాసాలకే మీరు అల్లుడా? బాధ్యతలకు కాదా?"

"......" శ్రీకాంత్ నిర్లక్ష్యంగా మాట్లాడక ఊరుకున్నాడు.

"ఛీ, మనుష్యులకే విశ్వాసం వుంటే, ఈ ప్రపంచంలో యిక కుక్కల్ని అంత ప్రేమగా ఎవరు పెంచుతారు?" అన్నది అక్కడే తివాచిపై పడుకున్న కుక్కను చూస్తూ

వెంటనే శ్రీకాంత్ చేతి బలంకొద్ది ఆమె చెంపను చెళ్ళు మన్పించాడు.

అంత బలమైన దెబ్బ ఆమెలో చలనమే కలిగించలేదు. అతడి వైపు అసహ్యంగా చూస్తూ "నీచుడా, పో నా యింట్లో నుంచి. ఈ క్షణం పో, నువ్వు నాకు భర్తవూ కాదు, నేను నీకు భార్యనూకాను."

"నోర్ముయ్, నీ యిల్లు!" నిర్లక్ష్యంగా కనుబొమలెగరేశాడు" "నీ మెళ్లో నేను తాళి కట్టిననాడే నువ్వూ, నీ యిల్లూ అన్నీ నా పర మయ్యాయి. నోరు మూసుకుపడివుండు.''

"స్సరే", బలమైన నిట్టూర్పును అణచుకుంటూ అన్నది. "నేన్ను చేసిన మహా తప్పిదానికి ఈ ప్రాయశ్చిత్తం నాకు కావ లసిందే! అల్పుడిని అధికుడిగా భావించినందుకు ఈ నష్టం నేను భరించాల్సిందే, నువ్వే వుండు యింట్లో, నేనే పోతున్నాను"

* * *

"...... సిగ్గు విడిచి తిరిగి నువ్వే దిక్కని వచ్చానుబావా, ఏమీ అనుకోకు." తన పరిస్థితినంతనూ వివరంగా శ్రీనగేష్‌తో చెప్తూ భోరుమన్నది జయశ్రీ. "నువ్వు వద్దంటూంటే వాదించి నాన్నను ఇక్కడనుండి తీసుకపోయాను. మనోవ్యాధి ఎక్కువై మనశ్శాంతి లోపించి ఈ భయంకర క్షయవ్యాధి అంకురించిందని డాక్టర్ చెప్పాడు. ఇంతకంటె ఆ మతిమాలిన స్థితే నయమేమో. అబ్బా! బాధపడుతూ రక్తం కక్కుకుంటుంటే, బలవంతంగా పీల్చలేక పీల్చలేక గాలి పీలుస్తూంటే చూడలేకుండా వున్నాను." కదిలి కదలి ఏడ్చింది.

నిర్ఘాంతపోయిన శ్రీనగేష్ కొలది నిముషాలపాటు ఏమీ మాట్లాడలేకపోయాడు ఏడుస్తూన్న జయశ్రీ తలను తన గుండె కానించుకొని చేతితో నిమురుతూ, "వద్దు జయా! ఏడవకు. పొరపాటు మనుష్యులం చేయకపోతే మరెవరు చేస్తారు? పొరపాటు అని తెలిసి చేస్తామా? ఏదో ఆశిస్తాం. ఆ పైన దైవ కృప. అంతే" అన్నది శ్రీలక్ష్మి.

జయశ్రీ దుఃఖం, లజ్జ మరింత అధికమయ్యాయి "నన్ను క్షమించు లక్ష్మీ. నిన్ను నిష్కారణంగా అవమానించినందుకే దైవం నన్నిలా శిక్షించాడేమో అనిపిస్తుంది. నువ్వు ఏమని హేళన చేస్తావో నా ప్రస్తుత జీవితాన్ని చూచి — అని భయపడుతూ వచ్చాను. నువ్వింత అమృత హృదయురాలవు గనుకనే పెన్నిధి వంటి భర్తను పొందావు. అహంకారంతో అమృత భాండాన్ని కూలద్రోసుకున్నాను నేను."

"ఇంక ఇటువంటి మాటలువద్దు" శ్రీదేవి కలుగజేసుకొంది. "నువ్వు నాకేమైనా పరాయిదానవా జయా," అన్నది చుబుకం పట్టిఎత్తుతూ.

"అవును జయా!" శ్రీలక్ష్మి సానునయంగా అన్నది. "అత్తయ్య, బావ ఇద్దరూ దైవసమానులు ఎవరినైనా, ఎప్పుడైనా కడుపులో పెట్టుకుదాచి ఆదరించగలరు. నువ్వేమీ బాధపడవద్దు. స్వంత యింట్లో వున్నట్టువుండు. నాన్నగారి ఆరోగ్యం సంగతి మేమిద్దరం చూచుకుంటాం మా సాయశక్తులా ప్రయత్నిస్తాం. నువ్వు కూడా వట్టిమనిషివి కావు. నీ ఆరోగ్యం సంగతి ముఖ్యం." అప్పటికి తనను తాను సంబాళించుకున్న శ్రీ నగేష్ నెమ్మదైన స్వరంతో మనఃపూర్వకంగా అన్నాడు· "ప్రశాంతంగా ఉండడానికి ప్రయత్నించు జయా. మనస్సులో ఏమీ పెట్టుకో నవసరంలేదు, నేను ఎప్పటికీ నీ బావనే."

అన్నీ చూస్తూ, వింటూ, తనకేం సంబంధం లేనట్టు మౌనంగా వుండిపోయాడు, రోజులు లెఖ్ఖపెట్టుకుంటూ జీవిస్తూన్న భయంకర క్షయవ్యాధి పీడితుడు శ్రీపతి.

"ఏమిటి మామయ్యా అలా వున్నావ్? నీకేం భయంలేదు. నేనున్నాను. ఇంతకంటె ముదిరిపోయిన రోగమున్నవాళ్ళే చక్కగా తగ్గి, మళ్ళీ హాయిగా ఎప్పటిలా తిరుగుతున్నారు" అన్నాడు శ్రీనగేష్ మేనమామ నుద్దేశించి.

"ఎందుకురా నగేష్! యింకా నాకంత గౌరవమిచ్చి మాట్లాడుతావ్? నీ విలువ గుర్తించనందుకు నాకింత శాస్తి జరిగింది ధనదాహమున్న నాకు — యింకా యింకా సంపాదించాలనుకున్న నాకు — ఉన్నదే అనుభవించే యోగం లేకపోతోంది భాగ్యంతోటే జీవితమనుకున్నాను కాని, మంచి మనస్సు లేనిదే ఈ భోగ భాగ్యాలు అక్కరకురావని గుర్తింపలేకపోయాను. నాకు యింత కర్మ పరిపాకం స్వాగతమిస్తూంటే దేవుడును బోలిన నీలాంటి అల్లుడెలా లభ్యమౌతాడు? నువ్వే నా అల్లుడవైతే నేడు నా కీగతి పట్టేదా!" క్రుళ్ళిక్రుళ్ళి దుఃఖించాడు శ్రీపతి

* * *

"నువ్వు భర్తవు కావు, నన్ను పిశాచివై పీడిస్తున్నావ్. ఈ మారుమూల సగం చచ్చి, అన్నిటికీ దూరమై బ్రతుకుతూన్న నన్ను ఇంకా వదలిపెట్టకుండా ఎందుకిలా వెదుక్కుంటూ వచ్చావ్? ఇంకా ఏం బాధలు మిగిలాయి నే ననుభవించవలసినవి?" హఠాత్తుగా అవతరించిన భర్త శ్రీకాంత్‌ను ప్రశ్నించింది జయశ్రీ.

"సరే, ఎంత దూరం పోతే మాత్రం — మన సంబంధం ఎక్కడికి పోతుందికాని......" నిర్లక్ష్యంగా సిగరెట్ పీలుస్తూ అన్నాడు శ్రీకాంత్. "భర్తకూడా భార్య, భార్య వెంట భర్తా వెదుక్కుంటూ వెళ్ళడం మనకేం క్రొత్తకాదు ఈ దేశంలో... ఇక బాధలంటావా——అవి కావాలనుకుంటే వస్తాయి లేదా తెలివిగా వుంటే రావు"

"ఈ మెట్ట వేదాంతం నాకనవసరం. ఇక నీకూ నాకూ ఏ సంబంధంలేదు, తండ్రిచచ్చి పుట్టెడు దుఃఖంలోవున్న నన్ను మరి విసిగించకు వెళ్ళు నీప్రాణానికి ఉసూరుమంటూనే నా తండ్రి పోయారు."

"దానికేముంది? ఆయువు తీరింది, పోయాడు." అతి సాధారణంగా అన్నాడు సిగరెట్ నుసిదులుపుతూ. "పోనీలే, పోయిన వాళ్ళకోసం ఎంతని ఏడుస్తాం? ఉన్నది గట్టి ఒక్కతెవూ యిలావుండడం ఏంబాగాలేదు జరిగిందేదో జరిగిపోయింది. పద, మన యింటికి వెళ్ళిపోదాం."

అనుమాన దృక్కులతో చూస్తూఅంది జయశ్రీ· "నెలలతో వున్నదాననైనా ఆలోచించకుండా యింటినొక నరకంచేసి నా యింట్లోంచి నన్నే తరిమేశావ్. తండ్రి చచ్చి పుట్టెడు దుఃఖంలో వున్న నన్ను ఓదార్చాలని కాకున్నా—కనీసం లోకులేమనుకొంటారో ననైనా రాలేదు. చూడలేదు. ఇక యిప్పుడు ఏమంత ప్రేమ ఎక్కువైందని రమ్మంటున్నావనుకోను?"

"మనిద్దరం అనుకోగానే సరా? ప్రేమ వుండకేమౌతుందిలే. వున్నదో లేదో నీకడుపులో పాప చెప్పడంలేదూ?" కొంటెగా గర్వంగా నవ్వాడు శ్రీకాంత్.

జయశ్రీ పూర్వంలాగే చలనరహితంగానే మాట్లాడింది. "అటువంటి మాటలిక మన మధ్యవచ్చే అవకాశంలేదు?....... పాప.·........అవును అదొక్కటే ప్రస్తుతం మనం విడిపోవడానికి గల అడ్డం త్వరలోనే ఆ ఆటంకం తీరిపోతుందిలే. ఇక మాత్రం నాచేత మాట్లాడించక వెళ్ళు. ఆ బిడ్డ కావలిస్తే తీసుకుపోదువుగాని, అప్పుడు కబురంపుతాను."

"బిడ్డ! బేబీ! ఎందుకు నాకు?" విచిత్రంగా నవ్వాడు. "అయినా బిడ్డనిచ్చేస్తాననే ఆడదుంటుందా ఎక్కడైనా? అవునులే, అదొకటి నీకు ఆటంకం దేనికిప్పుడు? ఇంతకూ నగేష్ నిన్ను చాలా బాగా చూచు కుంటున్నాడేమిటి? అతడి భార్య ఊరుకొంటున్నదా?"

"మూర్ఖుడా! ఏమిటి నువ్వు వాగేది?"

"ఏముంది? ప్రస్తుతం భర్తృత్వం శ్రీనగేష్ నిర్వర్తిస్తున్నాడా అంటున్నాను. నేననేదేముంది? లోకులంతా అనుకుంటున్నారు."

జయశ్రీ చలించలేదు "అనుకొనే వాళ్ళంతా కట్టకట్టుకు గంగలో కలుస్తారు. నాకేంబెంగలేదు. వెళ్ళుమరి, వాగక "

వికృత హాసంతో అన్నాడు శ్రీకాంత్. "అంత తేలికగా వెళ్ళడానికా నేను వచ్చినదిమరి? ఓ నాలుగు వేలిలా పారెయ్యి. పోతాను, ప్రస్తుతం డబ్బు చాలా అవసరంగా వుంది "

"నాలుగు పైసలు కూడా యివ్వను."

"మర్యాదగా యియ్యి, లేకుంటే తడాఖా చూపిస్తాను."

"ఇచ్చేది లేదు, లేదు "

"చూడూ " క్రూరంగా కనుబొమ లెగరేస్తూ అన్నాడు: "ధనవంతురాలైన భార్య భర్తకే మనోవర్తి యివ్వాలి తెలుసా, విడాకులిస్తే?"

"తెలుసు, సిగ్గూ శరంలేని వాళ్ళెంతటి హైన్యపు తిండికైనా కక్కుర్తి పడతారని. అదేదో కోర్టులోనే తేల్తుంది. ఇప్పుడే పారేస్తాను. ఇప్పుడు అణాకూడ యిచ్చేది లేదు."

హఠాత్తుగా లేచినిల్చున్నాడు శ్రీకాంత్ "నెమ్మదిగా నువ్వే దార్లో పడతావనుకుంటే మొండితనం జాస్తిగావుందే!" అంటూనే చటుక్కున తలుపు బోల్టుబిగించి, జేబులోనుంచి కాగితం తీశాడు.

"ఏమిటది?" భయంపైకి కన్పింపనీయకుండా అన్నది జయశ్రీ

"ఏమిటా? నీపొగరుకు మందు! పెట్టు సంతకం."

పెట్టను. నా ఆస్తి సంతనూ వ్రాయించుకోవాలని ఎత్తు వేశావన్నమాట! ఆ కాగితాన్ని పరీక్షగా చూస్తూ అన్నది జయశ్రీ.

"అవును పెట్టుత్వరగా, లేకుంటే నీరక్తంతో పెట్టిస్తాను సంతకం జాగ్రత్త. ఇక్కడ యిక నువ్వు అరచి చచ్చినా దిక్కులేదు."

"చచ్చినా ఫర్వాలేదు. చావుకు భయపడను. ఎలాగూ" చావాల్సిందే. చచ్చేముందు నీలాటి అపాత్రుడికి ఎందుకు దానం చేయాలి? ఒక్కనాటికీ అటువంటి తెలివి తక్కువపని చేయను."

"చూస్తానదేమిటో దార్లోకి తేవడం నాకుతెల్సు " కలం ఆమెచేతిలోపెట్టి, బలవంతంగా సంతకం చేయించడానికి ప్రయత్నిస్తున్నాడు శ్రీకాంత్. శక్తికొలదీ పెనగులాడుతున్నది జయశ్రీ.

అంతలో గదిబయటనుండి తలుపులు బలవంతంగా ఎవరో తెరుస్తున్నట్లు శబ్దం రాసాగింది. భార్యను వదిలేసి పారిపోవడానికి దారి వెతుక్కుంటూన్నాడు శ్రీకాంత్. కాని అంతలోనే బయటినుండి తలుపులు భళ్లున తెరచుకొని, శ్రీనగేష్ ప్రవేశించాడు.

"ఓ! నువ్వా ?" శ్రీకాంత్ క్రూరంగా చూస్తూ అన్నాడు. "పరాయిదాన్ని యింట్లో పెట్టుకు కులుకుతున్నావ్, నీ కెంత ధైర్యంరా ?" అంటూనే మీదకు లంఘించాడు.

"ఛీ నోర్మూయ్. అప్రయోజకుడా! చలమూ, బలమూ అతి సున్నితమైన ఆడవాళ్ళ మీదనట్రా ప్రయోగించడం!" ఛీదరించుకున్నాడు శ్రీనగేష్.

ఇద్దరూ ఘోరంగా కొట్టుకుంటున్న సమయంలో పోలీసులు ప్రవేశించారు.

" నిన్ను అరెస్టు చేస్తున్నాం" శ్రీకాంత్ చేతికి సంకెళ్ళు వేయిస్తూ ఇన్స్పెక్టర్ అన్నాడు. "డాక్టర్ శ్రీనగేష్‌గారి హాస్పిటల్‌లో నర్సు మేరీనీ వంచించి, ఆమె మీ సంబంధం బయటపెట్టగలదనే భయంతో గతరాత్రి ఖూనీచేసి పారిపోయావ్. నర్సు మేరీ ఇంతకు గంటక్రితమే హాస్పిటల్‌లో చనిపోతూ మరణ వాఙ్మూలం యిచ్చింది !"

"వట్టిది, అబద్ధం!" వ్యర్థంగా బుకాయించబోయాడు శ్రీకాంత్.

"నడవండి." గర్జించాడు ఇన్స్పెక్టర్. "అక్కడ ఖూనీ చేసి ఇక్కడ భార్యను హింసచేస్తున్నావ్ డబ్బుకోసం. ఆడబ్బుతో ఎక్కడికైనా పరారవాలని! పద పద " .

శ్రీకాంత్ సిగ్గువిడిచి ఏడ్వసాగాడు జయా, ఏంచేస్తావో ! నన్ను విడిపించే పూచీ నీది. శ్రీనగేష్ చేతిలో వున్నాయి యిప్పుడు నాప్రాణాలు. జాగ్రత్త, విడిపించుకుంటావు కదూ నన్ను ?" అంటూండగానే పోలీసులు లాక్కుపోయారు.

" భగవాన్ !" అంతాచూస్తున్న జయశ్రీ స్పృహ తప్పిపోయింది.

● ● ●

'భాగ్యచక్రం'లో పాన్పుపై కళ్ళుతెరచిన జయశ్రీ. ప్రక్కనే ఉయ్యాలలోని పాప ఏడ్పువిని తృళ్ళి పడింది.

"ఆడపిల్ల" ! నవ్వుతూ చెప్పింది ఒక నర్సు "చక్కగా వుంది, తెల్లగా, బొద్దుగా,"

"కాన్పు తేలికగా అయింది. ఏం ఫర్వాలేదిక," ఒక ప్రక్కన శ్రీలక్ష్మి, శ్రీదేవి చిన్నగా మాట్లాడుకుంటున్నారు.

జయశ్రీ విరిప్తంగా నవ్విన నవ్వులో లోకంలోని విషాదమంతా కురిసింది. "ఏమిటీ జీవితాని కర్థం? " తనలో తాను అనుకుంటూన్నట్టు అన్నది.

"తప్పు, అలా అనకు." శ్రీదేవి వారించింది.

కాని ఆమె అలా ఎందుకన్నదో _ ఆ మాటలోని అర్థం, సందేశం ఆ మర్నాడు శ్రీ నగేష్ హాస్పిటల్‌కు వచ్చేవరకూ ఎవరికీ తెలియదు మఱదలితో మాట్లాడి, ధైర్యంచెప్పి వెళ్ళాలని వచ్చిన అతడికి ప్రాణంలేని కట్టె మాత్రం కన్పించింది. ప్రక్కనే ఉయ్యాలలో ఆడుకుంటూన్న పాప ఆ పాప తలచెంతనే ఒక ఉత్తరం._

"బావా !

భాగ్యచక్రం సృష్టించిన నిన్ను హేళన చేశాను భాగ్య చక్రాన్ని చిన్న చూపు చూచాను. భాగ్యచక్రం కారణంగానే నీకు దూరమయ్యాను అహంకారంతో అమృత భాండాన్ని కాల ద్రోసుకున్నాను. ఆ అవివేకానికి ఆమరణాంతం అంగలార్చి, అల్లాడ వలసిందేనా ? ఎవరినైతే అవమానించానో వారి అండనే ఆశ్రయం పొందాల్సివచ్చింది దేనినైతే తృణీకరించానో ఆ భాగ్య చక్రం నీడనే ఈ భార జీవితం గడపవలసి వచ్చింది. ఇంతకంటె అవమానమేముంటుంది ఎవరికైనా ? ఉన్నదానితో తృప్తిపడక ధనదాహంతో ఇతరులను బాధించి అవమానించే వాళ్ళకు నా జీవితం, నా తండ్రి జీవితమే గుణపాఠాలు.

"నీ ఆదర్శాన్నీ, ఆసుపత్రినీ హేళనచేసి, పల్లె జీవితాన్ని హేయపరిచి తానొక పెద్ద ఆసుపత్రి నిర్మించాడు మా నాన్న. ఆ ఆశ మొదలంటా నాశనమైంది. తన పిల్లలు డాక్టర్లు కాలేదు. తను కట్టిన ఆసుపత్రిలో తనకొక గ్రుక్కెడు మంచి నీళ్ళకు కూడా గతిలేకపోయింది తన రోగం తగ్గడానికి పట్టణాలను కాదని ఈ పల్లెటూరికే నీ పాదాల చెంతకే రావాల్సి వచ్చింది. భాగ్యచక్రంలోనే మేమిరువురం తంతిమశ్వాస తీయాల్సి వచ్చింది. ఎంత చిత్రం ! నిన్ను రెండవపెళ్ళి, మూడవ పెళ్ళి అని హేళన చేసినప్పుడు నీ మనస్సెంతో చిత్రవధ ననుభవించి వుండాలి. అందుకే తనకు నేనెన్నవ స్త్రీనో కూడా తెలియనటువంటి భర్త దొరికాడు హీనమైన అభిరుచులతో, నీచమైన కారణాలతో కారాగారాని కెళ్ళాడు ఎంతైనా భర్త. ఆ ప్రలోభంతో సన్మార్గుడవైన నీ చేత ఎక్కడ అబద్ధం పలికింప ప్రయత్నిస్తానో అనే భయంవల్ల నైతేనేం ఈ అవమాన పరంపర ఒక్కసారిగా తటుకోలేనైతేనేం. శాశ్వతంగా నిష్క్రమిస్తున్నాను-మరుజన్మలోనైనా నీ భార్యను కావాలని కోరుకుంటూ. నీ ఆసుపత్రిలో మరణించిన ఆ నర్సు విషయంలో డాక్టరుగా నీ అభిప్రాయాన్ని నిస్సంకోచంగా కోర్టులో చెప్పడానికిక నీకెటువంటి అభ్యంతరమూ వుండబోదు.

"ఇక నా బిడ్డ పసివాళ్ళమీద పెద్ద ఆశలు పెట్టుకోరాదు అంటారు. అది బ్రతికి బాగుంటే-మంచిదే. నీ పెంపకంలో అది చక్కటి మనిషి కాగలదు. ఈ భాగ్యచక్ర నిర్మాణానికి మూలమైన పేరు "భాగ్యలక్ష్మి". ఆ పేరే దానికి పెట్టి పెంచు. పసివాడైన శ్రీధర్‌ను చీదరించుకున్నందుకే నా బిడ్డను నేను చూచుకోలేకుండా పోతున్నాను. ఇవ్వాళ నువ్వూ, శ్రీలక్ష్మి ఎలావున్నారో అలాగే ఈ భాగ్యచక్రంలో శ్రీధర్, భాగ్యలక్ష్మిలు సంతోషంగా తిరుగాడాలి. అర్థమైంది కదూ నీకు నా ఆశ!

"ఇక నా ఆస్తి నా బిడ్డకు నువ్వే అండ. దానికింకేమీ అక్కరలేదు ఆస్తినంతనూ భాగ్యచక్రం అభివృద్ధికోసమే ఉపయోగించు. అనుమతిపత్రం దానితోనే జత చేస్తున్నాను. ఇది ఏనాడో వ్రాసివుంచాను. దేశంలోని ధనవంతులందరూ తమ తమ భాగ్యాలను పల్లెలలో వైద్య సదుపాయం, విద్యాసౌకర్యంలేక మగ్గిపోతున్న జనోద్ధరణకై యీ విధంగా సద్వినియోగంచేస్తే భారత భాగ్యచక్రానికి మరి తిరుగేవుండదు భాగ్యచక్రధారివైన నీకూ, అందుకు ప్రోత్సహించిన అమృతమూర్తి అత్తయ్యకూ, దాని అభివృద్ధికి పాటుపడుతూన్న సుగుణశీల శ్రీలక్ష్మికి నాకడసారి వందనాలర్పిస్తూ

—జయశ్రీ"

సమాప్తము

(32వ పుటనుండి)

నగరానికి చేరువగా సదనానికి భవన నిమిత్తం నాల్గు ఎకరాల భూమిని యిప్పించారు. సదనం యొక్క విస్తృత కార్యక్రమాల దృష్ట్యా చేరువన అనుకొనివున్న భూమిని సహితం యిప్పించ వలసిందిగా కోరడం జరిగింది ఈ భూమి ముందే శ్మశాన భూమిగా వాడుకోడానికి ఉద్దేశించ బడినది. త్వరలో ఈ భూమినికూడా సదనం పొందగలదని ఆశించబడుతున్నది.

రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన 2.20 లక్షల రూపాయల గ్రాంటుతో పబ్లిక్ వర్క్సు శాఖ నిర్మాణం పూర్తి గావించింది

దీనితోపాటు, శిక్షణ ఉత్పత్తి కేంద్రాల నిమిత్తం శాశ్వతమైన షెడ్లు నిర్మించడానికి మంజూరు లభించింది. భవన ప్రాంగణంలో ఒక నూతిని నిర్మించడానికి అంచనా జాబితాలు తయారు గావించబడ్డి పంపబడాయి నూతి నిర్మాణానికి కావలసిన మొత్తానికి మంజూరు రాగలదని ఆశించబడుతున్నది.

భావి ప్రణాళికలు

మహిళలకు శిక్షణ ఇవ్వడానికీ ఉద్యోగ వసతులు కల్పించడానికీ నూతన మార్గాలు అన్వేషించ బడుతున్నాయి. ఈ క్రింది ప్రణాళికలు రూపొందించి, సమర్పించబడ్డాయి. ప్రింటింగ్ ప్రెస్, బుక్ బైండింగ్, ఎక్సర్‌సైజు పుస్తకాల తయారీ, కవర్ల తయారీ రంగువేయడం, ముద్రించడం, గుడ్డల తయారీ, కోళ్ళ పెంపకం, పాడిపరిశ్రమ, రెడీమేడ్ దుస్తుల తయారీ, సీమసున్నం తయారీ యిత్యాదులు యీ ప్రణాళికల్లోని అంశాలు. *

నాడూ-నేడూ

మా వూరు 'మల్లాం'

దువ్వూరు హనుమంతరామరెడ్డి

గూడూరు సమితి సమావేశాల్లో కలుసుకొనే కొందరు సర్పంచ్ మిత్రులు నాతో "ఏమిటయ్యా! ఎప్పుడూ మావూరు-మావూరు అంటావు. నీకు మరో పని లేదా? నీ స్వంత పనులేమీలేవా? మావూరికి ఆపని కావాలి-మావూరికి ఆ అభివృద్ధి కార్యక్రమం కావాలనే తాపత్రయ పడుతుంటావే" అంటూంటారు.

ఆంధ్రకు ఉక్కు కర్మాగారం కావాలని ఆంధ్రులు సాగించే ఆందోళన, చాలినన్ని బియ్యంకోసం కేరళీయులు కోరే కోర్కెలు యిత్యాదులన్నీ అసమంజసాలుకాకుంటే నేనూ మావూరి కనీస సౌకర్యాలకోసం పాటుపడడం అసమంజసం కాదంటాను.

ఇది నా జన్మభూమి నా స్వర్గం. మావూరి అభివృద్ధి నా అభివృద్ధి. మా గ్రామస్థుల ప్రతినిధిగా నన్నెన్నుకున్నారు. నేను మా గ్రామ సేవకు అంకితమైపోయాను.

మీకు వినాలని కుతూహలంగావుంటే, ముప్పైఏళ్ళ మా గ్రామచరిత్రను ఒకసారి పరిశీలిస్తే బాపూజీ కన్న కలలు నిజమవుతున్నాయనడానికి సందేహంలేదు.

నాయుడు పేటకు తూర్పుగా 17 మైళ్ళ దూరంలో బంగాళాఖాత తీరానికి సమీపాన చుట్టూ కందకంలాటి తటాకంతో చక్కగా తీర్చిదిద్దిన వీధులతో విలసిల్లే చిన్న గ్రామం 'మల్లాం'. 30 ఏళ్ళక్రితం యిక్కడ తరచుగా కనుపిస్తూన్నదృశ్యాలు యీనాడు తలచుకుంటూంటే ఒళ్ళు గగుర్పొడుస్తుంది ఎక్కడ చూచినా అనారోగ్యం, అవిద్య, దారిద్ర్యం తాండవిస్తూండేవి. ఇంటింటా మలేరియా వ్యాధిపీడితులుండేవారు. ఉడికీవుడకని చేపలుతిని, చెరువు నీరుత్రాగి, ప్రాథమిక ఆరోగ్యసూత్రాలుకూడా పాటించక కృశించిపోయి బానకడుపులతో, చిక్కిపోయిన చీపురు పుల్లలాంటి కాళ్ళుచేతులతో ప్రజలు దర్శనమిస్తుండేవారు. ఆ రోజుల్లో మల్లాంకు ఏ ఆఫీసరుగాని రావాలంటే భయపడేవారు. త్రాగడానికి నాయుడుపేటనుంచి మరచెంబునిండా నీళ్ళు పట్టుకొచ్చేవారు. ఆహారంగూడా తీసుకోకుండా పండ్లతోనే కాలక్షేపం చేసి, వచ్చిన పని ముగియగానే కాలికి బుద్ధిచెప్పేవారు.

ఆరోజుల్లో ప్రయాణ సౌకర్యాలుగూడా అంతంతమాత్రంగానేవుండేవి మల్లాంకురావడమంటే, అదేదో సప్తసముద్రాల కవతలవుండే ద్వీపానికి వెళ్ళడమన్నట్టేవుండేది.

అలాంటిది యీనాడు 'మావూరు' అన్ని రంగాలోనూ అభివృద్ధి చెందింది అంటే మీకు ఆశ్చర్యంగా వుండవచ్చు. ఒకసారివచ్చి దర్శిస్తే, మీకే బోధపడుతుంది. ఈనాడు యిక్కడ దోమలులేవు. మలేరియావ్యాధి ఎలావుంటుందోకూడా ఈతరంవారికి తెలియదు. ఇక్కడ ఒక ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, ఉన్నత పాఠశాల, పశువైద్యశాలలు వెలిసాయి. ఈక్రింది వివరాలు తెలుసుకున్నారంటే ఈ గ్రామాభివృద్ధి విషయంలో మా గ్రామప్రజల శ్రద్ధాసక్తులు అవిరళకృషి అర్థమౌతాయి.

రోడ్డువసతి

రాకపోకల సౌకర్యానికీ, బస్సు పోవడానికి వీలుగా మెయిన్ రోడ్డునుండి ఊరిని కలుపుతూ ఒక చక్కటి రోడ్డు నిర్మించుకున్నాము. రు. 16,000 లు ఖర్చయిన ఈ రోడ్డు నిర్మాణానికి యీమొత్తంలో ప్రజలు 6-వ భాగం విరాళంగా యిచ్చారు.

పశువైద్యశాల

పశువైద్య సౌకర్యం కలిగించుకొనేనిమిత్తం ప్రజలు రు 3000 ల నగదువిరాళంతో పశువైద్యశాలకు అనువైన మూడు గదుల పక్కా భవనాన్ని 15 వేల రూపాయల ఖర్చుతో నిర్మించుకున్నాం. ఈ భవన నిర్మాణానికి పంచాయితీ రు. 2000- విరాళం యిచ్చింది. ఈ వైద్యశాలలో ప్రత్యేకించి డాక్టరు పనిచేస్తారు.

యువక మండలి

యువజనోత్సాహంతో పొంగులువారే యువకమండలి ఏర్పాటు చేసుకున్నాము మండలి కార్యక్రమాలు నిర్వహించుకునే నిమిత్తం పూర్తివిరాళంతో చక్కని పక్కా-భవనాన్ని నెలకొల్పుకున్నాం.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

ప్రజారోగ్యం విషయంలో కూడా మేము వెనుకబడక రు. 10,000 ల ప్రజా విరాళాన్ని యిచ్చి మంచి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనాన్ని స్థాపించుకున్నాం. నిత్యం రోగులకు చికిత్సచేసే నిమిత్తం డాక్టరు, వారి సిబ్బంది యిక్కడ పనిచేస్తూంటారు.

ప్రాథమిక పాఠశాల భవనం

పిల్లలకు విద్యా గంధం అబ్బాలంటే చక్కని పాఠశాల కావాలికదా! పాఠశాలకు మంచి భవన వసతి వుంటేనే అది

రాణిస్తుంది. 20 వెల రూపాయలు ఖర్చయిన యీ భవనానికి 6_వ వంతు మొత్తాన్ని ప్రజలు విరాళంగా ఇచ్చారు

ఉన్నత పాఠశాల

మరి ఉన్నత విద్యా సౌకర్యాలు లేకుంటే అభివృద్ధికి వచ్చే విద్యార్థులకు అవకాశం లేకపోతుందనే వుద్దేశంతో ఉన్నత పాఠశాలనుకూడా ఏర్పాటు చేసుకున్నాం S.S L C వరకు నిర్వహించబడే ఈపాఠశాలకు అనువైన భవనాన్ని రూ. 10,000 ల నగదు, 5 ఎకరాల భూమిని విరాళంగా యిచ్చి రూపొందించుకొన్నాం.

ఇంకా గ్రామంలో పంచాయతీ తరఫున సమితి గ్రాంటుతోను, ప్రజల శ్రమదాన విరాళాలద్వారానూ బావులు, బాటలు నిర్మించుకున్నాం. సస్య సంరక్షణకై రైతులకు అందుబాటుగా వుంచేందుకు స్ప్రేయర్లు తెప్పించి వుంచాం.

సహకార సంఘం తరఫున రైతులకు ఎరువులు సప్లై అవుతున్నాయి. వడ్డీతో రైతులకు ఋణాలుకూడా ఆ సంఘం యిస్తూంది యువకమండలి సభ్యుల సహకారంతో, శ్రమదానంతో కొన్ని పనులు చేసికోగలిగాము.

అయితే యిప్పటికి జరిగిన కార్యక్రమం జరుగవలసిన దానితో పోల్చుకుంటే బహుస్వల్పమే అవుతుంది. ప్రజారోగ్యానికి సంబంధించినంత వరకు రక్షిత మంచినీటి పథకం చాలా అవసరం. ఆ పథకం మ జూరయి అమలు జరిగిననాడు మా గ్రామానికి పర్వదినం. రోడ్లు, భవనాల శాఖవారి రోడ్డు సరిగా లేక వర్షాకాలంలో ప్రయాణీకులు ఎన్నో ప్రయాసలకు గురి అవుతున్నారు

మావూరి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవాలయం ప్రసిద్ధిగాంచినది. ఆంధ్రప్రదేశ్‌లోని సుబ్రహ్మణ్యేశ్వరాలయాలలో అంతటికీ గొప్పది అపూర్వమైన శిల్పసంపద గలిగి మన ప్రాచీన సంస్కృతికి చిహ్నంగా నిలువగలిగిన ఆలయ శతస్తూప శిలామంటపం శిథిలావస్థలో వున్నది. దాని పునరుద్ధరణకు తగు చర్యలు ప్రభుత్వం తీసుకుంటున్నది.

ఇది ఈ ప్రాంతానికి పెద్ద గ్రామం. చెప్పుకో తగ్గ రైతులున్న గ్రామం సమీపంలో రెండు మైళ్ళలో విద్యుచ్ఛక్తి వుండి కూడా మేము అంధకారంలో వుంటున్నాము — అవును, మాకు వెలుగు కావాలి !!!

ఎక్కువ మంది పట్టభద్రులుండడం మా గ్రామ ప్రత్యేకత। ఒకరు అమెరికాలో యింజనీరింగులో వున్నత విద్య నభ్యసిస్తున్నారు. మరొకరు టెక్స్‌టైలు టెక్నాలజీకి సంబంధించి నైజీరియాలో వుంటున్నారు

ఈ ప్రాంతం నుంచి ధాన్యం, వేరుశెనగ, మిరపకాయలు ఎగుమతి అవుతున్నాయి. అన్నిటికంటే ముఖ్యంగా చవకకర్ర ఎగుమతి ఎక్కువగా జరుగుతూంది. మా గ్రామానికి తూర్పున వుండే గ్రామాలు ఎంతో వెనుకబడి వర్షాకాలంలో బయట ప్రపంచంతో ఎలాంటి సంబంధమూ లేకుండా వుంటున్నాయి ఉదాహరణకు, చైనావాళ్ళు మనదేశం మీద దండెత్తినప్పుడు ఈ ప్రాంతాల్లో వర్షాలు, వరదలు వచ్చినందువల్ల 10_15 రోజుల వరకు ఆ విషయం వాళ్ళ చెవి సోకలేదు.

భవిష్యత్తులో ప్రభుత్వం, ప్రజలు సహకరించుకుంటూ ఈ ప్రాంతాన్ని మరింతగా అభివృద్ధి పరచడానికి పూనుకోగలరన్న ఆశా బీజాలు మాలో అంకురిస్తున్నాయి. ★

25వ పుట నుండి)

వ. సం.	జాతి	యజమాని	పాలదిగుబడి కి. గ్రా.	బహుమతి మొత్తం రూ.. లలో	బహుమతి
5.	గేదెలు	1 శ్రీ రిసాల్‌సింగ్ రోటోలి, రోహటక్ జిల్లా, హర్యానా.	24.89	2,000	యోగ్యతాపత్రం
		2 శ్రీ థండీరామ్ వి. కలన్_ఖాన్‌పూర్, రోహటక్ జిల్లా, హర్యానా.	22.60	1000	..
		3 శ్రీ జాదవీబాయి యన్. పటేల్_సవరకుండ్ల భావనగర్ జిల్లా, గుజరాత్.	22.73	500	..
		4 శ్రీ ప్రభురామ్ ఖండాఖేరి, హెస్సార్ జిల్లా, హర్యానా.	22 06	250 (కన్సోలేషన్)	..
		5 శ్రీ క్రిష్ణలాల్ కేసర్‌దాస్_భవానీ స్టాండు, రోహటక్ హర్యానా.	.. 21 03	250 (కన్సోలేషన్)	..

ఆంధ్ర ప్రదేశ్ వెనుకబడిన తరగతుల కమిషను

ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం ఆంధ్ర ప్రదేశ్ హైకోర్టు మాజీ ప్రధానన్యాయమూర్తి శ్రీమనోహర్ పర్‌షాద్ అధ్యక్షతన ఒక విచారణా సంఘాన్ని (కమిషన్‌ను) నియమించింది శాసనసభ్యులు శ్రీయుతలు టి నాగేశ్వరరావు, టి బి. అప్పారావు, సి. హెచ్. రాజేశ్వరరావు, పి లక్ష్మణరావు, శాసనమండలి సభ్యులు శ్రీయుతులు జి. నాగభూషణం, ఐ. లింగయ్య, హైదరాబాదు కేంద్ర చేనేత సహకార సంఘం అధ్యక్షుడు శ్రీ బి శ్రీరాములు ఈ సంఘ సభ్యులు. విద్యాశాఖ ఉపకార్యదర్శి శ్రీ వి కె. బావా. ఐ. ఏ ఎస్. సభ్యుడు-కార్యదర్శి

ఆంధ్ర ప్రదేశ్‌లోని భారత పౌరులలో ఏదైనా వర్గం వారిని (భారత రాజ్యాంగం 341, 342వ సూత్రాల క్రింద రాష్ట్రపతి జారీ చేసిన ప్రకటన ద్వారా నిర్దిష్టపరచిన నిమ్నజాతులు, నిమ్న తెగల వారు తప్ప) సాంఘికంగానూ, విద్యా విషయకంగానూ వెనుకబడిన తరగతుల వారిగా పరిగణించవచ్చునా అనే అంశాన్ని పరిశీలించడానికి అనుసరించవలసిన ప్రమాణాలను ఈ కమిషను నిర్ధారిస్తుంది వాటి ననుసరించి అట్టి వెనుకబడిన తరగతుల వారి జాబితాను తయారుచేస్తుంది. వారి సంఖ్యనూ, ప్రాంతాలవారీ విభజననుకూడా పేర్కొంటుంది.

ఈ కమిషను సాంఘికంగానూ, విద్యావిషయకంగానూ వెనుకబడి వున్నట్టి తరగతుల వారందరి పరిస్థితులను వారి కాయకష్టానికి సంబంధించిన ఇబ్బందులను గురించి కూడా పరిశీలించి మొత్తం మీద వారి అభివృద్ధికొరకూ, వారి విద్య, ఆర్థిక ప్రయోజనాల ఉన్నతికొరకూ ముఖ్యంగా, (అ) ప్రభుత్వం నిర్వహిస్తున్న విద్యాసంస్థలలోనూ, ప్రభుత్వ సహాయం పొందుతున్న సంస్థలలోనూ సీట్లు ప్రత్యేకిస్తుంది (ఆ) స్కాలర్‌షిప్పులవంటి రాయితీలను సహాయంగా లభింపజేయడం కొరకు ప్రభుత్వం కల్పించదగిన ప్రత్యేక సదుపాయాలను గురించి సిఫార్సులు చేస్తుంది (ఇ) అట్టి ప్రత్యేకింపు శాతం, లేక దామాషా, అట్టి సహాయం పరిమాణం, అట్టి ప్రత్యేకింపు లేక సహాయం లభింప జేయవలసిన కాల పరిమితి విషయంలో కూడా ఈ కమిషను సిఫార్సులు చేస్తుంది

ఈ కమిషను, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలలో తగినంత సంఖ్యలో లేనటువంటి వెనుకబడిన తరగతుల (నిమ్నజాతులు, నిమ్నతెగలు మినహా) జాబితాను సిద్ధంచేసి (అ) అట్టి వెనుకబడిన తరగతుల వారి నియామకాలకొరకు శాశ్వత ప్రత్యేకింపు విషయంలోనూ, అట్టి ప్రత్యేకింపు శాతం, లేక దామాషా విషయంలోనూ, అట్టి ప్రత్యేకింపును అమలులో వుంచవలసిన కాల పరిమితి విషయంలోనూ సిఫార్సులు చేస్తుంది.

కమిషను తనకు అవసరమైన సమాచారాన్ని తాను ఉచితమని తలంచిన రూపంలో, పద్ధతిలో ప్రభుత్వ కార్యదర్శులనుంచీ, శాఖాధిపతుల నుంచీ, కలెక్టర్లనుంచీ లేక యితర సంస్థల, వ్యక్తుల వద్దనుంచీ పొందవచ్చు

కమిషను సమావేశాలు లేక కమిషను తన సభ్యులతో నియమించిన ఉపసంఘం సమావేశాలు అధ్యక్షుడు నిర్ణయించిన విధంగా హైదరాబాదులో కాని, లేక మరేదైనా యితర ప్రదేశంలో కానీ జరగవచ్చు కమిషను తాను అవసరమని భావించిన విధంగా ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలోని ఏదైనా ప్రాంతాన్ని సందర్శించవచ్చు, లేదా తాను నియమించిన ఉపసంఘాన్ని అందుకు నియోగించవచ్చు

విచారణ ప్రారంభించిన తేదీనుంచి మూడునెలల కాలంలో తన నివేదికను సమర్పించడానికి కమిషను ప్రయత్నిస్తుంది

1952వ సంవత్సరపు విచారణ కమిషన్ల చట్టం 5వ సెక్షనులోని (2), (4), (5) సబ్ సెక్షన్ల నిబంధనలనన్నింటినీ ఈ కమిషనుకు వర్తింప జేశారు.

వెనుకబడిన తరగతుల సంక్షేమ పరిశీలకులు

దేశంలో వెనుకబడిన తరగతుల సంక్షేమ పథకాలను పరిశీలించేందుకు భారత ప్రభుత్వం, ప్లానింగ్ కమిషన్ ఉపాధ్యక్షులైన డాక్టరు డి ఆర్ గాడ్గిల్ అధ్యక్షతను, 33 గ్గురితో పరిశీలకుల పట్టీని తయారుచేసింది

నాల్గవ పంచవర్ష ప్రణాళికా కాలంలో (1969-74) 10 సంవత్సరాలవరకు భవిష్యత్తును దృష్టిలో వుంచుకుని ఈ పరిశీలకులు భారత ప్రణాళికా సంఘంవారికి కార్యక్రమాన్ని రూపొందించడంలోను-అమలుపరచడంలోను సలహా యిస్తారు.

భారత గెజెట్‌లో యీ విషయం ప్రకటించబడింది

విషయ సేకరణకు పరిశీలకులు అదనంగా సభ్యులను చేర్చుకోవచ్చు. ఉపసంఘాలను కూడా ఏర్పాటు చేసుకోవచ్చు పరిశీలకులు మొత్తంగాగాని, కొద్దిమందితోగాని అధ్యక్షుని నిర్ణయంతో ఢిల్లీలోగాని మరోచోటనైనాగాని ఎన్నిసార్లైనా సమావేశం జరుపుకోవచ్చు.

పరిశీలకుల జాబితాలో పార్లమెంటు సభ్యులు 10 మంది, స్వచ్ఛంద సంఘాల ప్రతినిధులు 5 గురు, మానవ శాస్త్రం-సాంఘిక శాస్త్రానికి సంబంధించినవారు 5 గురు ఉన్నారు. తతిమ్మా సభ్యులలో సాంఘిక సంక్షేమ శాఖ ప్రతినిధులు, ఆహారం-వ్యవసాయం, సమాజాభివృద్ధి-సహకారం, గ్రామిక-ఉపాధికల్పన, విద్య, నిర్మాణాలు, వసతి, రవాణా, ఆరోగ్యం, దేశాంగ వ్యవహారాలు, పరిశ్రమాభివృద్ధిశాఖల కేంద్ర మంత్రులు ఉన్నారు.

*

ప్రేమ తోట

పిలకా గణపతిశాస్త్రి

జరిగిన కథ

పార్థసారథికి నాటకాలపిచ్చి. రాఘవ నాట్య కళా మండలిద్వారా నాటకాలు వేస్తుండేవాడు నాటకాల పిచ్చిలో పడి అతను సరిగా యింటికే వచ్చేవాడుకాడు. అతని భార్య విజయలక్ష్మి ఎంతగా చెప్పినా అతను వినిపించుకోలేదు. ఒక సారి పార్థసారథి వాళ్ళ నాటకంలో హీరో యిన్‌తో ఏలూరువెళ్ళి చాలా రోజులవరకూ రాలేదు. విజయలక్ష్మి బెంగతో మంచం పట్టింది ఆమె బావ కృష్ణమూర్తికి ఆవిషయం తెలిసి భార్యను వెంటబెట్టుకొని పరామర్శించ డానికి వెళ్ళాడు. దగ్గరుండి మందు అదీ తాగించి తీరికగా కూర్చుని ఆలోచిస్తున్నాడు



తిరిగి ఆరోగ్యం బాగా కోలుకుని ఇప్పటి కష్టాలన్ని పూర్తిగా తొలగిపోయి విజయలక్ష్మి తిరిగి కలకలలాడుతూ సుఖంగా ఉంటుందా? ఆమె సంసారం వెనకటిలాగ సంతోష సౌఖ్యాలతో హాయిగా గడిచిపోతుందా? ప్రస్తుత పరిస్థితులను బట్టి చూస్తే అతనికంతగా నమ్మకం కలగలేదు! అయితే ఆమె సాధ్వి. ఎన్నడు ఎవ్వరికి మనస్సులోనయినా అపకారం తలపెట్టలేదు! తనకి కలిగినంతలోనే ఇరుగు పొరుగు సామాన్య సంసారులకనేక విధాల సాయపడింది ఆఖరికి పని మనిషిని కూడా ఎన్నడు గట్టిగా కసురుకుని ఈసడించలేదు! అటువంటి సాధ్వికి ఆ దైవం అనుకూలిస్తే ఎంతెంతటి గడ్డు కష్టాలయినా ఇట్టే తొలగిపోవచ్చును! లోతుగా మంచి చెడ్డలాలోచించుకుని పార్థసారథి తిరిగి తిన్నబడ వచ్చును! విజయ త్వరలోనే తేలికగా కష్టాలన్ని గడిచి గట్టెక్కగలదేమో! ఎవరు చెప్పగలరు! ఏది ఏమయినా పార్థసారథి తిరిగి వచ్చిన వెంటనే తనకు తెలిసిన సరోజ మోసం సంగతి చల్లగా చెవినివేసి తీరాలని కృష్ణమూర్తి ఇంకొకసారి గట్టిగా నిశ్చయించుకున్నాడు

ఆ విధమయిన ఆందోళనతో, మధనతో, ఆలోచనతో ఇంచుమించుగా రాత్రి రెండు గంటలు దాటిన తరువాతగాని అతనికి నిద్ర పట్టలేదు అందు:త ఆ మరునాడు ఉదయం ఎనిమిది గంటల వరకు అతనికి మెళకువ రాలేదు. సావిత్రి వచ్చి చెప్పిన తరువాత గాని అతనికంత పొద్దెక్కినట్టే తెలియలేదు! తొందరగా స్నానాదులు ముగించుకుని కాఫీ తాగుతూనే తిన్నగా విజయలక్ష్మి నిద్రిస్తున్న గదిలోకి వెళ్ళిపోయాడు.

అప్పటికప్పుడే ఆమె మేలుకుని తెంపరేచరు చూసుకుని దుప్పటి ముసుగు తొలగించుకుని నెమ్మదిగాలేచి కూర్చుంది. కృష్ణమూర్తి డాక్టరిచ్చిన మందు ఒక గ్లాసులోపోసి ఆమె చేతికందించాడు. విజయలక్ష్మి కొంచెం కొంచెంగా అది లోపలికి పుచ్చుకుని విపరీతంగా చేదుగాఉన్నా లక్ష్యపెట్టని చిక్కని చిరునవ్వుతో అతనికేసి చూసింది.

'ఈవేళ నిన్నటికన్న తేలికగా ఉందా,' ఎంతో ఆత్రంగా అడిగాడు కృష్ణమూర్తి. నింపాదిగానే ఉన్నట్టు తల ఊపింది. జ్వరం సంగతి అడిగాడు. రవంత నీరసంగా తొంభై తొమ్మిది మీద రెండు పాయింట్లకన్న ఎక్కువ రాలేదని చెప్పింది. ఆ ప్రత్యుత్తరంతో అతనికి పంచప్రాణాలు ఒక్కమారుగా లేచివచ్చినట్లయింది! జ్వరం నిన్నటికన్న బాగా తగ్గింది. మరి తలనొప్పి కూడా రాలేదు. ముఖ కవళికనుబట్టి చూసినా బాగా తేరుకున్నట్టే కనబడుతున్నది! ఆనాటికి కొంచెం రొట్టె, కాఫీ పుచ్చుకుంటే మరునాడు తప్పక పథ్యం తీసుకోవచ్చునని కృష్ణమూర్తికి అనిపించింది.

ఆవేళ కూడా భార్యాభర్తల నిద్దరిని అక్కడే ఉండిపోవలసినదని వర్ధనమ్మ బ్రతిమాలుకుంది. కృష్ణమూర్తి రెండు మూడు క్షణాలపాటు తటపటాయించినా తరువాత అలాగే అని అంగీకరించాడు. తిరిగి డాక్టరు దగ్గరికి వెళ్ళి మందు తేవడానికి బయలుదేరి స్కూలుకి సెలవు చీటీ పంపించాడు.

ఆ నాటికి కూడా భర్త తిరిగి రాలేదని విజయలక్ష్మి అంతర్యంలో గుంజాటన పడుతున్నదని కృష్ణమూర్తి పసికట్టివేశాడు. ఏదో విధంగా ఆమె నోదార్చవలెనని నిశ్చయించుకుని నవ్వుతూ ఆ సంగతి ప్రస్తావించాడు.

'చూడు విజయా! ఈవేళ సాయంత్రం అయిదు గంటల బండి మీద మీ ఆయన తప్పకుండా తిరిగి వచ్చేస్తాడు! వచ్చి తీరతాడు!'

'నీ కెలాగ తెలిసింది : ఈ మధ్యన జ్యోతిషంగాని నేర్చుకున్నావా ?'

విజయలక్ష్మి కనురెప్పల్ని పైకెత్తి రవంత ఆశ్చర్యపడి అడిగింది.

'జ్యోతిషంకాదు ! ఎందుచేతనోగాని నాకలాగ అనిపిస్తూంది ! ఇప్పటికి నీ జ్వరం తగ్గిపోయింది కదా ! ఇక తప్పకుండా అతనుకూడా ఇంటికి తిరిగి వచ్చివేస్తాడు !'

విజయలక్ష్మి మరి మాట్లాడలేదు ! ఉసూరుమని నిట్టూర్చి నెమ్మదిగా పరుపుమీదికి వాలింది.

ఆవేళ సాయంత్రానికి కూడా పార్థసారథి తిరిగి రాలేదు! కాని మరునాడు పదకొండు గంటలు దాటిన తరవాత తలవని తలంపుగా అకస్మాత్తుగా గుర్రపు బండిదిగి ఇంట్లో అడుగు పెట్టాడు ! ఆ వేళ ఉదయం ఎనిమిదిన్నరకి రావలసిన మెయిలు బాగా లేటయి సుమారు పది గంటలకిగాని స్టేషన్ చేరుకోలేదు ! అతడు తిన్నగావచ్చి గదిలో అడుగుపెట్టగానే విజయలక్ష్మి కన్నులలో, చెక్కిళ్ళలో చిరునవ్వు లొక్కమారుగా చెంగలించాయి ! తా నింట లేనప్పుడు భార్య కంతటి జ్వరంవచ్చిన సంగతి విని పార్థసారథి రవంత నొచ్చుకున్నాడు.

పిల్లలిద్దరిని ఎత్తుకుని ముద్దు పెట్టుకుంటూ, సరి కొత్త రకం నాటకం దుస్తులు కొన్ని కొనుక్కోవలసిన అవసరం వచ్చి హఠాత్తుగా ఏలూరు నుంచి మద్రాసు వెళ్ళినట్టు భార్యతో చెప్పాడు. అంతేగాని సరోజతో కలిసి వెళ్ళినసంగతే ప్రస్తావించలేదు ! అయినా విజయలక్ష్మి అతని ఎదట ఆ విషయమే తలపెట్టక యధాప్రకారంగానే మాట్లాడింది. ఆ తరవాత కొంచం తలనెప్పిగా ఉన్నదని చెప్పి తిరిగి దుప్పటి కప్పుకొని పడుకుంది.

మధ్యాహ్నం భోజనాలయిన తరవాత కృష్ణమూర్తి, పార్థసారథి తాంబూలం వేసుకుంటూ ఏదో లోకాభి రామాయణం ప్రారంభించారు. కృష్ణమూర్తి మాటల్లో మాటకలిపి సరోజ సంగతి యాధాలాభంగా చల్లగా అతని చెవిని వేశాడు. పార్థసారథి రవంత సేపాలోచించి తీవ్రంగా బొమముడి విరిచాడు 'ఇవ్వన్ని ఎవరు చెప్పారు?' అని అడిగాడు. కృష్ణమూర్తి, తాను హైస్కూల్లో టీచర్ల గదిలో విన్నవన్ని చాలా సంగ్రహంగా ఏకరువు పెట్టాడు. ఆ పైన పార్థసారథి తిరిగి వివరాలేవి అడగలేదు. హేలగా వెటకారంగా ఒక అలతి నవ్వుమాత్రమే అతని పెదవిమీద తరళించింది.

'ఆ! ఇవ్వన్ని గిట్టని వాళ్ళెవళ్ళో కల్పించిన కట్టు కథలు ? నేనివి నమ్మను ! సరోజ సంగతి రాఘవ సంగతి నాకన్న వాళ్ళకెక్కువ తెలుసునా ?'

అంతలోనే పార్థసారథి తటాలున ఆ ప్రస్తావన తప్పించివేస, కృష్ణమూర్తి పనిచేస్తున్న హైస్కూల్లో హెడ్మాస్టరు పదవీ విరమణ కాలం పొడిగింపుమీద చెలరేగిన రాజకీయాల గొడవ సంగతి ప్రశ్నించాడు. అంతేగాని మరి సరోజా రాఘవల మాటే ఎత్తనీయలేదు ! ఆ విసుగు పసికట్టిన కృష్ణమూర్తి కికమాట పెగలలేదు ! ఆత్యుకం ఎంతో కించపడినా పైకి అది చూచాయగానయినా వ్యక్తం కానీయక అంతే అంటనట్టేమో సమాధానాలిచ్చాడు ఆనాటి సాయంత్రం భోజనాలయ్యాక కృష్ణమూర్తి సావిత్రి తిరిగి తమ ఇంటికి వెళ్ళిపోయారు. అతడనుకున్నట్టే డాక్టరు సలహామీద విజయలక్ష్మి ఆ మరునాడు మధ్యాహ్నమే పథ్యం పుచ్చుకున్నది.

13

పార్థసారథి మద్రాసునించి తిరిగి వచ్చినప్పటినించి చాలా ఉల్లాసంగా ఉన్నాడు. ఏలూరు నాటకం వ్యవహారం కంట్రాక్టరు గుప్తకి అప్పజెప్పినా అక్కడి ఏర్పాటులన్ని స్వయంగా చూసి వచ్చినదాకా అతనికి తిన్నగా నిద్రపట్టలేదు. సరోజతో కలిసి ఒక పగలంతా అక్కడ ఉండి, గుప్తతో మాట్లాడి పరిస్థితులన్నీ పరిశీలించిన తరవాత పార్థసారథికి పూర్తిగా సంతృప్తికలిగింది జనం నాటకంకోసం ఎప్పుడని ఎదురుచూస్తున్నారని కంట్రాక్టరు అతనితో అన్నాడు అనుకున్న ప్రకారం అన్నీ సవ్యంగా జరిగిపోతే, సరోజకి, తనకి ప్రత్యేకించి రెండు బంగారు పతకాలు బహూకరించబోతున్నట్టు మిగిలినవారిని కూడా అలాగే యథాశక్తిగా సంతోష పెట్టబోతున్నట్టు కూడా చెప్పాడు ఆ మాట మొట్టమొదట అనుకోలేదు. అతని సరసిత, సరదా గమనించి, పార్థసారథి ఎంతో సంతోషించి, మండలి తరపున తమ తరపున కృతజ్ఞత వెల్లడించి అభినందించాడు. దానిమీద కంట్రాక్టరు అది ఒక ఎన్నదగిన విషయం కాదన్నట్టు కొట్టి పారవేశాడు

'పార్థసారథిగారూ ! ఈపిచ్చి ఈనాటిది కాదు బాబూ ! బళ్లో చదువుకుంటున్నప్పటి నుంచి నాటకాలంటే నాకు చాలా సరదా!'

గుప్త తనకు జ్ఞానం వచ్చినప్పటి నుంచి ఆ పట్టణంలో ఆడిన నాటకాల వృత్తాంతాలతోపాటు వింతగాథ లొకటొకటి వెల్లడించడం ప్రారంభించాడు. అతని అపూర్వాసక్తి వల్ల తమ నాటకం తప్పకుండా గొప్పగా రక్తికట్టగలదని పార్థసారథికి అనిపించింది.

సరోజ, పార్థసారథి ఆ రాత్రే మెయిలులో బయలుదేరి మరునాటి ఉదయానికి మదరాసు చేరుకోవాలని అనుకున్నారు. ఆ రోజుల్లో వేర్వేరు రంగుల దీపాల కాంతులు రంగస్థలం మీద ప్రసరింపజేయడం ఇంకా బాగా అమలులోకి రాలేదు. ఆ కొత్త వింత ఏలూరు నాటక ప్రదర్శనానికి ఏర్పాటు చేస్తే బాగుంటుందని పార్థసారథి గుప్తతో అన్నాడు. దానివల్ల నాటకం మరింతగా జనాన్ని ఆకర్షించ గలదని అతడెంతో ఉత్సాహపడ్డాడు వెంటనే అవసరమయిన సొమ్ము పార్థసారథి చేతికందించాడు. అతడంతకు మునుపే సరోజకు, మరి కొందరు నటీనటులకు కొత్త దుస్తులు కొన్ని కుట్టించాడు. కాని సంతృప్తి కలగలేదు ! ఇంకా మరి కొన్ని వింత దుస్తులు కొనాలని సంకల్పించుకున్నాడు. తలవని తలంపుగా గుప్త ఇచ్చిన సొమ్ము కూడా చేతికందింది. వెంటనే సరోజతో కలిసి మదరాసు బయలు దేరాడు. వారిద్దరు అంతకు మునుపే కొంతకాలం క్రితం ఆ పట్టణంలో కొన్నాళ్ళపాటు

హాయిగా గడపాలని నిశ్చయించుకున్నారు. అంతేకాని అకస్మాత్తుగా తలపెట్టలేదు! కాని ఏలూరుదాకా వెళ్ళిన తరువాత సరోజ పనిలో పని, మదరాసు కూడా వెళ్ళాలని ఉబలాట పడింది. పార్థసారథికి ఆ ఆలోచన నచ్చింది.

మదరాసు నుంచి తిరిగి ఇంటికి బయలుదేరేముందు పార్థసారథికి ఇంకా అక్కడ రెండు మూడు రోజులుంటే బాగుండునని అనిపించింది. సరోజ, అతడు కలిసి అక్కడ చాలా సరదాగా కాలక్షేపం చేశారు. సినీమాలు, బీచి షికారులు మొదలయిన వినోదాలతో ప్రతి క్షణం ఎంతో హాయిగా గడిపి వేశారు. ఒకపూట మహాబలిపురం కూడా వెళ్ళివచ్చారు. ఇంతకు మునుపెన్నడు పార్థసారథికి సరోజతో కలిసి అంత స్వేచ్ఛగా, హాయిగా కాలక్షేపం చెయ్యడానికి తగినంత అవకాశం లభించలేదు. అక్కడ గడిచిన కాలం అంతా అతనికి ఒక ఎడతెగని మనోహర స్వప్నంలా స్ఫురించింది. సరోజ కూడా తన ఛలోక్తుల కవ్వింపులతో, నవ్వులతో అతని కెంతో ఉల్లాసం కలిగించింది. ఇద్దరూ కలిసి ఒక స్టూడియోలో ఫొటో తీయించుకున్నప్పుడు చక్కని చిరునవ్వుతో ఒయ్యారం ఒలకబోస్తూ సరసనే ఆనుకుని కూర్చుంది.

ఆపైన ఇద్దరూ గుఱ్ఱపు పందాలకి కూడా వెళ్ళాలని ఉబలాట పడ్డారు. కాని సాధ్యపడలేదు. ఆ తరువాత ఏలూరులో నాటక ప్రదర్శనం దగ్గిరపడిన సంగతి గుర్తుకి వచ్చింది. ఎలాగో అలాగ వీలుచేసుకుని అధమ పక్షం నాలుగయిదు సార్లయినా నాటకం రిహార్సలు జరపాలి. అదీగాక బయలుదేరిననాటి రాత్రికే తిరిగి ఇంటికి వచ్చి వేస్తానని పార్థసారథి మాట ఇచ్చాడు. దానా, దీనా అతనికి వెంటనే ఇంటికి ప్రయాణం కట్టక తప్పలేదు. ఆవేళ సాయంత్రమే ఇద్దరూ మెయిలులో బయలుదేరారు.

మొట్టమొదట అనుకున్నట్టుగానే, నాటక ప్రదర్శనానికి ముందుగానే గుర్తువెనక ఇచ్చిన బయానాకాక ఇంకొక అయిదు వందల రూపాయలు పార్థసారథి చేతి కందించాడు. అందుచేత అతనికి మద్రాసులో ఎప్పుడూ డబ్బుసంగతి ఆలోచించవలసిన అవసరమే కలగలేదు! సరోజ మాట వరసకి పైపైకి వద్దు వద్దని అంటున్నా లక్ష్యపెట్టక ఆ ఉల్లాసంలో వేర్వేరు రంగుల సేలం కంచి పట్టు చీరలు మూడు కొని బహూకరించాడు. ఇంటికి తిరిగి వచ్చిన తరువాత వాటితోబాటు కొన్న ఇంకొక కంచి చీర విజయలక్ష్మి చేతి కందించాడు. కాని పిల్లలిద్దరి మాట మరిచిపోయినట్టు అదే క్షణంలో అతనికి చప్పుక్కున జ్ఞాపకం వచ్చింది! 'అరెరే! ఎంతపని జరిగింది!' అని నాలిక కరుచుకున్నాడు.

కాని విజయలక్ష్మికి ఆ బహూకృతివల్ల కొంచమయినా సంతోషం కలగలేదు! అదే క్షణంలో ఆమె హృదయంలో భర్త సరోజతో కలిసి మద్రాసులో యథేచ్ఛగా చేసిన కులాసా కాలక్షేపం ప్రత్యక్షంగా గోచరించింది. పైపైకి తన కళ్ళ నీళ్ళు తుడవడానికి మాత్రమే ఆ చీర కొని పెట్టినట్టు ఇట్టే కనిపెట్టి వేసింది! అది అయినా సరోజ సలహాతోనే, ఆమోదంతోనే ఎన్నిక చేసినట్టుకూడా అనుమానించింది. దానితో ఆమె గుండెలో వ్యథ, గాయంమీద కారం చల్లినట్టు భగ్గుమనిమండింది. పైగా పసిపిల్లలిద్దరిమాట మరింతగా వేధించి, ఆ సంగతులన్నీ ఆలోచిస్తూంటే కళ్ళమ్మట నీళ్ళ పర్యంతము అయింది! అయినా పైపైకి మాత్రం ఆనందించినట్టే నటించింది. కాని ఆమె ముఖం మీద చిరునవ్వు మాత్రం అంతస్ఫుటంగా పొటమరించలేదు. మనస్సులో అక్కసు నిగ్రహించుకోలేక సరోజ సంగతి గట్టిగా అడగాలని కూడా క్షణకాలం సంకల్పించుకున్నది. కాని అంతలోనే 'నా నోరు జారడం ఒక్కటే మిగులుతుందిగాని ఆయన ఉన్నసంగతి తిన్నగా చెబుతారా? అసలు మనస్సులో మమత లేనప్పుడు లేని పోని గొడవపెడితే మాత్రం లాభమేమిటి' అని మాట్లాడక కూరుకుంది.

ఆ తరువాత పార్థసారథి ఒకటి రెండురోజులు మాత్రమే ఇంటిపట్టున ఉన్నాడు. అంతే! ఆ రెండురోజులు పిల్లలిద్దరిని దగ్గిర కూర్చోబెట్టుకుని హార్మోనియంమీద నాటకం పాటల సంగీత సాధన కొనసాగించాడు. భార్యతో ఆరోగ్యం సంగతి, వర్ధనమ్మతో ఇంట్లో కావలిసిన వస్తువుల మాట సంగతి ప్రస్తావించాడు. ఆ తరవాత తెల్లవారినది మొదలుకొని, నాటకం రిహార్సలు కోసమని పొద్దస్తమానము సరోజ ఇంట్లోనే కాలక్షేపం చేశాడు.

అప్పటికి విజయలక్ష్మి క్రమక్రమంగా తేరుకుని ఇంట్లో తిరగడం మొదలుపెట్టింది. కాని క్రమక్రమంగా మితిమీరిపోతున్న భర్త ధోరణి పరిశీలిస్తూంటే ఆమె కేమి పాలుపోలేదు. మరి భరించలేక అతని దారి కడ్డుపడిన సరోజ సంగతి అంతటితో కట్టిపెట్టమని ఖచ్చితంగా నిలవరించాలని నిశ్చయించుకుంది. దానికిగాని అంగీకరించకపోతే అమ్మమ్మతోను పిల్లలతోను కలిసి ఆరోగ్యం సరిగా లేదన్న మిషమీద వెంటనే పుట్టింటికి వెళ్ళిపోవాలని కూడా నిర్ణయించుకుంది.

కాని మరి కొంత సేపటికి తమాయించుకుంది తానా విధంగా వెళ్ళిపోతే సంసారం అంతా ఏమయిపోతుంది? భర్త మరింతగా బరితెగించి, ఇక రాత్రివేళ కూడా సరోజ ఇంట్లోనే ఉండిపోతే! ఏది ఏమయినా తానొక్క క్షణమయినా పెనిమిటిని చూడకుండా ఉండగలదా? అయ్యో! తనకింక బ్రతుకులో పట్టుగొమ్మ ఏమి ఉంది! ఆ దౌర్బల్యం తలుచుకోగానే విజయలక్ష్మికి జీవితం అంతా ఏదో బరువుగా, పెద్ద కొండ నెత్తిమీద మోపినట్టుగా దుర్భరమైన వ్యథ కలిగింది. పోనీ ఎలాగో అలాగ పడిఉందామంటే ఇల్లంతా ఎడతెగని దిగులుతో ఆజన్మ కారాగారంగా కనబడింది! 'అయ్యో! ఆయన మీద నాకింత మమకారం ఎందుకు కలిగింది? ఇంతటితోనయినా ఇది తుంచివేసుకుంటే సుఖపడి ఉందును కదా?' అని ఆలోచించుకుని మనస్సులో పేరుకొంటున్న విసుగుతో, చిరాకు, వేదనతో తనమీద తానే అసహ్య పడింది. ఉసూరుమని నిట్టూర్చి గుడ్లనీరు కుక్కుకుంది. ఆ విధంగా తన అశక్తత గుర్తించుకున్న పిమ్మట భర్తతో పోట్లాడితే మాత్రం జరిగేది ఏమున్నదని సమాధానపడి మరి కానున్నదేదో కాక మానదని గుండె రాయి చేసుకుంది. పోనీ అలాగే మరి కొంత కాలం కిక్కురుమనకుండా మాట్లాడకూరుకుంటే పెనిమిటికి రవంతయినా మనస్సు కరగక పోతుందా? అని మళ్ళీ కొంచెం సరిపుచ్చుకుంది.

ఇక పార్థసారథి ఏలూరులో నాటకం ఏర్పాటు వ్యవహారం కొత్త కొత్త రంగు దీపాల వింతలు మొదలయిన విశేషాలన్నీ రిహార్సలు సమయంలో సరోజా రాఘవులకే కాక మిగిలిన నటీనటుల కందరికి సవిస్తరంగా వెల్లడించాడు. వారి వారి కివ్వవలసిన ప్రతిఫలంలో కొంత ముందుగానే ముట్టజెప్పగలనని మాట ఇచ్చాడు దానికి వారందరు చాలా సంతోషించారు. సరోజా రాఘవుల సలహా మీద వెంకటనారాయణ కివ్వవలిసిన ప్రతిఫలం కొంత హెచ్చించి ముందు కొంత బయానాగా ఇచ్చాడు. దానితో అతని మనస్సులో చిరకాలం నుంచి పేరుకున్న అసంతృప్తి చాలా వరకు తొలగిపోయింది.

ఇక రాఘవకిన్నాళ్ళనుంచి నెలకి ఇంత ఇవ్వాలని ఎప్పుడు నిర్ణయించడం జరగలేదు అయితే పార్థసారథి అతనికి అప్పుడప్పుడు అందరికన్న కొంత ఎక్కువగానే ముట్టజెపుతున్నాడు. ఆ పైన ప్రముఖ ప్రేక్షకుల బహుమానాలుకూడా అతనికి విరివిగానే అందుతున్నాయి. అందుచేతనే పార్థసారథి ప్రత్యేకించి ఇప్పుడాతని కేమి ఎక్కువ ఇవ్వలేదు. ఏలూరు నాటకం మాట దక్కించిన తరవాత ఏదో ఒక మంచి విలువయిన బహుమతి ఇవ్వాలని సంకల్పించుకున్నాడు. కాని అతనితో ఆ మాట సూచనగా నయినా అనలేదు. దానితో రాఘవ మనస్సులో పార్థసారథి మీద అక్కస్సు కస్సుమని బుసకొట్టింది; కాని సహజమయిన చాకచక్యంతో అది అంతా మనస్సులో అణగించి వేసుకున్నాడు. అణువంతయినా పైకి పొక్కనీయలేదు.

ఆ మరునాడు మధ్యాహ్నం పార్థసారథి మిగిలిన నటీనటులందరి కన్న బాగా ముందుగానే సరోజ ఇంటికి వెళ్లాడు అక్కడ ఇంకొకసారి రిహార్సలు జరపడానికని ఆమె పనిమనిషి సహాయంతో కొన్ని కుర్చీలు, సోఫాలు, ఒక పొడుగాటి బల్ల చుట్టూరా అమర్చింది. పార్థసారథి నాటకంమీద ఆ శ్రద్ధాసక్తుల కానందించి ఒక సోఫాలో కూర్చున్నాడు. గోడమీద వేలాడుతున్న సరోజ సత్యభామ వేషం ఫొటో పరిశీలిస్తూ అందరికన్న ముందుగా రమ్మనడాని కేమి కారణమని ఆలోచన ప్రారంభించాడు. ఎందుచేతనోగాని ఇటీవల ఆమె చాలాకీతనము, చక్కదనము ఇనుమడించాయని పార్థసారథి కనిపించింది. అంతలోనే సరోజ ఫలహారాలుంచిన వెండి పళ్లెంతో అక్కడికి వచ్చింది. మునపటికన్న రవంత పుష్టిగా కులాసాగా ఉండడం మూలాన్నే ఆమె సోయగం హెచ్చి ఉండవచ్చునని అనుకున్నాడు.

సరోజ పళ్లెం బల్లమీద ఉంచి, అక్కరలేదని అంటున్నా కొంచెమయినా తీసుకోవలసినదని మాటిమాటికి బలవంతపెట్టింది. తాను కూడా ఫలహారం ప్రారంభించి, యథాలాభంగా ఏలూరులో నాటకం ఏర్పాట్ల సంగతి ప్రస్తావన ప్రారంభించి అంతలోనే మాట తప్పించివేసింది.

'అన్నట్టు మనం మద్రాసు వెళ్లిన సంగతి మీ ఇంట్లో చెప్పారా ?'

'లేదు, నేను ఏలూరు వెళుతున్నానని మాత్రమే అన్నాను. కొత్త లైట్లు, దుస్తులు కొనడానికి అక్కడినించి నేనొక్కడినీ మద్రాసు వెళ్లినట్టు చెప్పాను అంతే! ఏం? ఎందుకలాగ అడుగుతున్నావు?'

'అబ్బే! ఏమిలేదు. ఆ సంగతి కాస్త రహస్యంగా ఉంచండి! ఇంక ఎవ్వరికి తెలియనీయకండి! నేను మా అమ్మతో తప్ప ఇంకెవ్వరికి చెప్పలేదు!'

ఆమె యాథాలాభంగా అతి సామాన్యవిషయమయినట్టు మాట్లాడింది అయినా పార్థసారధిమనస్సులో జిజ్ఞాస మరింతగా చెలరేగింది.

'ఏం తెలిస్తే మాత్రం? ఇంతలోనే కొంపమునిగిపోయేది ఏమీ లేదు లెద్దూ!'

'పార్థసారథి , మరేం పరవాలేనట్టు చప్పరించివేశాడు. వెంటనే సరోజ అందుకుంది.

'అబ్బే! కొంప మునిగిపోతుందనికాదు, అసలే మా మామయ్య మన మీద అనుమానపడుతున్నారుగదా! అనవసరంగా ఆయనకి తెలియనీయడమెందుకని! ఆనోట, ఆనోటపడి ఆ మాట ఆయనకి తెలుస్తుందేమోనని నా భయం! అంతే!'

పార్థసారథి ఒకటి రెండు నిమిషాలదాకా మరి మాట్లాడలేదు. నెమ్మదిగా ఫలహారంచేస్తూ ఏదో ఆలోచనలో పడ్డాడు. కృష్ణమూర్తి సరోజా రాఘవుల రహస్య సంబంధం సంగతి చెప్పినప్పుడు మొట్టమొదట మనస్సులో ఆశ్చర్యపడ్డాడు. కాని మరు క్షణంలోనే దాని మీద తనకేమి నమ్మకం లేనట్టు కొట్టి పారవేశాడు కాని అప్పటినించి అతని అంతరాలలో పురుగు దొలిచినట్టు దొలిచివేస్తూనే ఉంది. ఇప్పుడు సరోజలో ఎప్పుడు లేనంతటి వింత చలాకీ తనం గమనించగానే ఆ అనుమానం తటాలున స్ఫురించింది. కొంచెం తటపటాయిస్తూ చిరునవ్వు నవ్వుతూ యాధాలాభంగా అన్నట్టు అడిగాడు.

'అయితే సరోజా ! నిన్నొక మాట అడుగుతాను గాని ఏమి అనుకోవుగదా !

ఆమె అతనివైపు క్షణకాలంనిశితంగా చూసింది.

'అడగండి ! దానికేం ! నాకు మీ దగ్గర దాచవలసినంతటి రహస్యాలేమి ఉన్నాయి ! ఇంతకీ ఏమిటా సంగతి ?'

సరోజ ముఖంలో ఆశ్చర్యం చెంగలించింది. పార్థసారథి అందుకున్నాడు.

'అబ్బే ! ఏమిలేదు. అయితే నేనిది నమ్మలేదనుకో !... అయినా ఇలాంటి మాట ఎందుకు పుట్టిందా ! అని కొంచెం ఆశ్చర్యపడ్డాను. అంతే'

సరోజ అతనికేసి అలాగే నిశ్చల నేత్రాలతో బాగా పరిశీలనగా చూసింది. పార్థసారథి కృష్ణమూర్తి ముఖతా తెలిసినవన్నీ అతని పేరు బయటపెట్టకుండా బాగా సంగ్రహంగా వ్యంగ్యంగా తనకంతగా పట్టనట్టు బయట పెట్టాడు. అది వింటూనే సరోజ నిలువునా నిర్ఘాంతపడి తీవ్రంగా బొమ ముడిచింది.

'మీకీ సంగతి ఎవరు చెప్పారు ?'

'అబ్బే ! ఊరికే గాలి ఖబురుగా విన్నాను ! అంతే ! ఎవ్వరూ చెప్పలేదు !'

సరోజ అలాగే నిర్ఘాంతపడి అతనివైపు మరికొంత సేపు రెప్ప వాల్చకుండా చూసింది. పార్థసారథి అనిశ్చిత దృష్టి అర్థం గ్రహించుకోలేక అడిగాడు.

'ఎందుకలాగ చూస్తావు ?'

'ఏమి లేదు ! మీరీ మాట ఎలాగ నమ్మారా ? అని ఆశ్చర్య పడుతున్నాను ! అంతే !'

'అయితే ఇది వట్టి నీలాప నిందే అన్న మాట !'

'నేనిక ఏమంటే మాత్రం లాభమేమిటి ? మీకు బొత్తిగా నమ్మకం లేక పోయాక ?'

సరోజ తల వంచుకుంది. ఆమె చెక్కిళ్లెర్రబడ్డాయి. ఊపిరి అంతా ఒక్క మారుగా వెలువడినట్టు ఒక నిట్టూర్పు విడిచి పెట్టింది. కనుగొలుకులలో కన్నీటి బిందువులు ఒకటి రెండు పొటమరించాయి. ఆ వైఖరి గమనించి పార్థసారథి అన్యాయంగా నింద మోపుతున్నానని కించపడ్డాడు. వెంటనే చిరునవ్వులో బ్రతిమాలుతున్నాడు.

'నీ దగ్గర రహస్యం దాచలేక మనస్సులో ఉన్నది ఉన్నట్టు అడిగాను సరోజా ! ఏమి అనుకోకు !'

'నేనేమి అనుకోవడం లేదు గాని, ఆయిన దానికి, కాని దానికి, అనవసరంగా అనుమానం పెట్టుకోకండి. ఇన్నాళ్ళ నించి అందరం ఎలంతో కలిసి కట్టుగా ఉంటున్నాము కదా ! ఇప్పుడు మీ కింత అనుమానం ఎందుకు కలిగింది ?'

ఆమె గొంతులో రవంత గద్గదిక తొణికిస లాడింది.

అప్పటికి పార్థసారథి అనుమానం పూర్తిగా తొలిగిపోయింది.

'అనవసరంగా, అన్యాయంగా నీ మనస్సు నొప్పించినట్టు న్నాను సరోజా ! నావల్ల పెద్ద పొరబాటే జరిగిపోయింది ! ఏమీ అనుకోకు. నన్ను మన్నించు ! ఈ గొడవంతా పూర్తిగా మరచిపో. అన్నట్టు నువ్విప్పుడు నా కొక ఉపకారం చేసిపెట్టాలి !'

'ఏమిటది ?'

సరోజ అంటీ అంటనట్టుగా అడిగింది.

(సశేషం)

పాఠకుల లేఖలు

"ఆంధ్రప్రదేశ్" ఉగాదిసంచిక సాహితీ, సంస్కృతుల సమ్మేళనముతో ఎంతో ఆకర్షణీయంగా ఆనందదాయకంగా వుంది. ప్రతినెలా ఇలాగేవుంటే ఎంతోబాగుండు ననిపిస్తుంది. "స్వేచ్ఛాగీతి" వంటి కవితలు ప్రచురించడం ఎంతో సముచితము అవసరముకూడా, 'ఉగాది' కవితలు బాగున్నాయి. "అడవిబాపి రాజు" వంటి మహనీయులను గురించిన వ్యాసాలు, విమర్శలు, "ఆంధ్రులు_నాట్యకళ" వంటి కళాత్మక వ్యాసాలు అప్పు డప్పుడు ప్రచురిస్తూ మమ్మలను ముగ్ధులను చేస్తారని ఆశిస్తున్నాము. "పండుగలూ పర్వదినాలూ" శీర్షిక బాగుంది, "స్నేహగీతి" 'ముక్తకాలు' వంటి కవితలు 'స్నేహమతం' వంటి వ్యాసాలు నెలనెలా ప్రచురించినా ఆనందంగా స్వీకరించగలము.

కనక రత్నాచారి
కొరిశపాడు

ఉగాది ప్రత్యేక సంచిక సర్వాంగ సుందరంగా వున్నదను టలో అతిశయోక్తి ఏమీలేదు. ఉగాది పర్వదినంపై ప్రముఖుల గేయకవితలు బాగున్నాయ్.

"బాపిరాజు పాడింది కవిత్వము, గీసిందల్లా చిత్రలేఖనము" అనే విశ్వనాథవారి మాటలు యథార్థములు. రస హృదయుడు, ప్రముఖ చిత్రకారుడు, సంగీత ప్రియుడైన అడవి బాపిరాజుగారిని గూర్చి సవివరంగా తెలిసినందుకు జనసంబంధ శాఖకు, రచయితకూ నాహృదయ పూర్వక అభివందనలు తెలియచేయకుండా వుండలేక పోతున్నాను. "ఆంధ్రులు_నాట్యకళ" అను అంశంపై శ్రీ నటరాజ రామకృష్ణ వ్యాసం పత్రికకు ఆణిముత్యము. 'చైతన్య మూర్తులు' శీర్షికలో ప్రముఖ వ్యక్తులను పరిచయం చేయడం ముదావహం. ఈ శీర్షికను తప్పక కొనసాగించవలెనని నామనవి.

కాంద్రేగుల వెంకట నూకేశ్వరరావు
అనకాపల్లి

"ఆంధ్రప్రదేశ్" ఉగాది సంచికలో ప్రచురించిన శ్రీ దాశరథి, శ్రీ పాతూరి ప్రసన్నంగారి రచనలు మహత్తరముగా నున్నవి. ప్రజోపయోగకరమైన ఇలాటి వ్యాసములు ప్రచురించినందుకు జనసంబంధశాఖకు మా ధన్యవాదములు. ప్రత్యేక సందర్భాలలోనేగాక ప్రతినెల ఇటువంటి వ్యాసములు ప్రచురిస్తారని ఆశిస్తూవున్నాను.

తూములూరు సత్యనారాయణ
ఖమ్మం

"ఆంధ్రప్రదేశ్" మాసపత్రిక 1962 సంవత్సరము జూన్ నెలనుండి నేటివరకు ప్రతిసంచిక కొని చదువుచున్నాను. అప్పటి నుండి ఇప్పటివరకు అన్ని పుస్తకములు నావద్ద ఉన్నవి. వాటిలో కొన్ని వ్యాసములు తీసి బైండింగుకూడా చేయించుకున్నాను. "ఆంధ్రప్రదేశ్" ఎప్పుడువస్తుందా అని ప్రతినెల ఎదురుచూచే పాఠకులలో నేనొకడిని. ఆమధ్య ప్రచురణ ఆపివేసినప్పుడు చాల నిరుత్సాహము కలిగినది.

'టోకియో లేఖలు' చాల ఉపయోగముగా నున్నవి.

పూషడపు తాతయ్య
రేపల్లె తాలూకా



నృత్య శిఖర

—శ్రీమతి పి. సుశీల

హైదరాబాదు నగరంలో క్రమక్రమంగా సాంస్కృతిక చైతన్యం నెలకొంటోంది. లలితకళలు యిప్పుడిప్పుడే మొగ్గ తొడిగి వికసించి సురభిళ పరిమళాలను వెదజల్లుతున్నాయి. సంగీత విద్వాంసులు, నర్తకులు ఆవిర్భవిస్తున్నారు. వారికి శిక్షణ యిచ్చే సంస్థలు ఒక్కటొక్కటిగా నగరంలో తలెత్తుతున్నాయి. నృత్య వికాసానికి, నృత్యశిక్షణకు అంకితమై అనవరతం కృషిచేస్తున్న నృత్య సంస్థలలో గణనీయమైనది—నృత్యశిఖర. ఒకేవ్యక్తి—భరత నాట్యం, కూచిపూడి నృత్యరీతులలో సిద్ధహస్తురాలైన ఒకే ఒక వ్యక్తి—తన కృషినంతా, తన ప్రతిభనంతా నృత్యవికాసానికి అంకితంచేసి నిర్వహిస్తున్న సంస్థ—నృత్యశిఖర. ఆవిడే—సుమతీకౌశల్. తన అపూర్వ నాట్య ప్రదర్శనతో ఆసేతుహిమాచలమూ అసంఖ్యాక ప్రేక్షక జనాన్ని ఆనందాబ్ధిలో ఓలలాడించిన ప్రముఖ నర్తకి ఆమె.

విద్యార్థి అభివృద్ధికన్నా గురువుకు ఆనందకరమైన విషయం మరొకటిలేదు. మార్చి 27 న సుమతి ఆనందం అవధులను దాటింది. ఆనాడు శిష్యురాండ్రు అరవైమందిలో పదహారుమంది విద్యార్థినులు సువిశాలమైన రవీంద్ర భారతి స్టేజిమీద కిటకిట లాడే ప్రేక్షకుల, కళా ప్రియుల, పెద్దల సమక్షంలో నృత్యం చేసి, అందరిమీద ఆనంద తుషారాలను చిలకరించి వారందరిమెప్పునూ పొంద గలిగారు. అది చూసినప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో భవిష్యత్తులో నృత్యకళ ఆశావహంగా ఆమెకు అనిపించింది, కొండంత ధైర్యం ఆవహించింది, ఆనందం పెల్లుబికింది.

కూచిపూడి నృత్యాన్ని సర్వాంగ సుందరంగా, వివరణాత్మకంగా అభివ్యక్తీకరించగల బహుకొద్దిమందిలో శ్రీమతి సుమతీ కౌశల్ ఒకరు. లావణ్యం మూర్తీభవించిన ఆమె విగ్రహం, నాజూకైన విన్యాసం ఆమెను మంచి నృత్య శిక్షకురాలిగా తీర్చిదిద్దాయి. ఆ గుణగణాలు బహుశా ఆమెకు తమ తల్లిగారినుండి సంక్రమించివుండవచ్చు. శ్రీమతి సుమతీ కౌశల్ కృషిలో అన్నిటా ప్రోత్సాహాభినివేశాలను కలిగిస్తూ ఆమెతల్లి ఆమెకు అండగా నిలుస్తుంటారు. సాధారణంగా తను నేర్చుకోవడం ఒకఎత్తు, తను నేర్చినది యితరులకు చెప్పడం మరొకఎత్తు. ఈరెండూ ఏకొద్దిమందికో సాధ్యమౌతాయి. జన్మతః నర్తకి అయిన శ్రీమతి సుమతిలో యీ రెండు గుణాలు మూర్తీభవించాయి. స్వతహాగా ఆమెలో అంతర్లీనంగావున్న యి బోధనా ప్రతిభవల్లనేగాబోలు ఆమె కేవలం నృత్యప్రదర్శనలు యిస్తూ కీర్తి ప్రతిష్ఠల్నీ, సంపదనూ ప్రోదిచేసుకోవాలని భావించక అసంఖ్యాక శిష్యగణాన్ని తయారు చేసి నృత్యకళావ్యాప్తికీ, వికాసానికీ తోడ్పడే ఒక పాఠశాలను నెలకొల్పదలచి వుండవచ్చు. ఆమె నృత్యంనేర్పేతీరు సర్వులను ఆకర్శిస్తుంది.

సాధారణంగా, పరిస్థితుల వత్తిడిలోనే నిజమైన వ్యక్తిత్వం బైటపడుతూవుంటుంది. ఇటీవల సుమతి నిర్వహించిన నృత్య ప్రదర్శన సమయంలో యిలాంటి వత్తిడే ఏర్పడింది. మరోపావు గంటలో నృత్యప్రదర్శన ప్రారంభం కాబోతోంది. జడలో నిండుగా పూలు గుప్పుకో వలసిన అమ్మాయిలు యింకా నలుగురు మిగిలిపోయారు. పూలు అయితే వున్నాయిగాని అవి మాలకట్టినవికావు. విడిపూలవి. మొదటి అర్ధగంటలో డాన్సుచేయాల్సిన అమ్మాయిలంతా—ఆనలుగురు మినహా—అప్పుడే రంగస్థలం వెనక్కుచేరుకున్నారు. వాళ్ళతోపాటు వచ్చిన యిద్దరు ముగ్గురు పెద్ద వాళ్ళు కూడా వొచ్చేశారు. గ్రీన్‌రూమ్ అంతా ఖాళీగావుంది. అలాంటి పరిస్థితులలో ఆ నలుగురు అమ్మాయిలూ బోసి జడలతో గ్రీన్‌రూమ్‌లో దిగాలుపడి నిలుచున్నారు. సుమతి తల్లిగారికి వెంటనే ఏంచేయాలో తోచలేదు. ఆందోళన పడుతున్నారు. ఒకవంక గబగబా పూలన్నిటినీ మాలగా అల్లుతూనే మరోవంక ఎవరైనా కనిపిస్తారేమోనని చూస్తోంది ఆమె. సరిగ్గా ఆసమయానికే సుమతి అక్కడకు వచ్చింది. ఎక్కడైనా దండగుచ్చిన పూలుంటే పంపించమని సుమతిని ఆమె తల్లి అడిగింది. అలాగే లెమ్మని సుమతి తిరిగి వచ్చేసింది. వచ్చిన కొద్ది నిమిషాలకే పూలదండల్ని పంపించింది. ఏంచేసిందో, ఏలా సంపాదించిందో ఏమో పూలదండలు మాత్రం ప్రత్యక్షమయ్యాయి. ఆ నలుగురు పిల్లలకీ పూలదండలు గుప్పి, జడల్ని నిండుగా అలంకరించారు. డాన్సుకి సిద్ధంచేశారు. ఎక్కడా వెలితిగాని, ఆందోళనగానిలేకుండా అంతా సవ్యంగా సాగిపోయింది.

సంగీతం చెవులకు విందు చేస్తుంది. కాని అసలైన నృత్యం అటు చెవికీ, యిటు కంటికీకూడా విందు చేస్తుంది. గాలిలో ఎగిరే లలితమైన గానరవళి మాధుర్యాన్ని ప్రత్యక్షంగానేగాక పరోక్షంగా అంత మధురంగానూ గ్రోలవచ్చు. అయితే నర్తకి పదఘట్టనలకు లయబద్ధంగా శబ్దించే గజ్జెల రవళి, నర్తకి మనోహర సుందర రూపం, అత్యద్భుతమైన హావభావ విన్యాసం ఎట్టివారినిసైతం ఎట్టఎదుటికి రప్పించకుండా వుండలేవు. నర్తకి పదఘట్టనలు, కరణాల కూర్పు, హావభావాభినయము — యివి పాటకు ప్రాణంపోసి ప్రేక్షకులనూ, కళాకారునీ అత్యున్నతమైన ఆలోచనా లోకాలకు తీసుకుపోతాయి. కొద్దిపాటి శిక్షణతోనే నర్తనశాల ఎక్కి, శాస్త్రీయ కళా వైభావాన్ని ఆవలకు నెట్టి, కేవలం రంగు



శ్రీమతి సుమతీ కౌశల్

రంగుల జలతారు మెరుపుల ఆహార్యానికీ, ముఖానికి కొట్టుకునే కోటా రంగులకూ, స్టేజి అలంకరణకూ, సినిమా అను కరణల ప్రలోభాలకూ లొంగిపోతున్న యీనాటి రోజుల్లో అసలైన శాస్త్రీయకళను నేర్పడం ఎంత కష్టమో నిజమైన సృజనాత్మక ప్రతిభను గుర్తించడం కూడా అంతే కష్టం. చిన్న చిన్న పిల్లలలో అణిగివున్న సృజనాత్మక ప్రతిభను సుమతి గుర్తించింది వాటిని వెలికి తీసింది. మహాలక్ష్మి, రాధికలలోని ప్రతిభకు సుమతి సాన బట్టి కళ్ళను చెదిర్చే, కాంతులను జార్చే వజ్రాలను చేసింది కుమారి ప్రణతీమూర్తి ప్రధానంగా సుమతి సృష్టే!

పదహారు మంది అమ్మాయిలు తొలిసారిగా ప్రదర్శనకు సమాయత్తం కావడం చూస్తుంటే 'పెళ్ళిచేసి చూడు, యిల్లు కట్టి చూడు' అన్న సామెత జ్ఞాపకానికి వచ్చింది పెళ్ళి చెయ్యాలన్నా యిల్లు కట్టాలన్నా తేలిగ్గా అయ్యే పని కాదు ఇది కూడా అంతే. అయితే సుమతి అంత ఆర్భాటంగానూ ఒకేసారిగా పదహారు పెళ్ళిళ్ళనూ చేసింది. పెళ్ళికుమారులూ, పెళ్ళిభోజనమూ లేకుండా యీ కార్యక్రమం విజయవంతం కావాలంటే మాటలామరి! అయితే ప్రేక్షకులలో ఎక్కువ మంది సంతృప్తితో, ఆనందంతో నృత్యశిఖర భవిష్యత్తులో అభివృద్ధిచెందాలని ఆకాంక్షిస్తూ తమతమ యిళ్ళకు చేరుకున్నారు

నృత్యశిఖర ఒక ప్రత్యేకత గల నృత్యశిక్షణ పాఠశాల. నర్తనరాణి అయిన సుమతి తన శక్తి యుక్తుల్ని, తన కాలాన్ని ఈ నృత్యశిఖరకే అంకితం చేసింది. ఆమె ఆశయాలను, అభిరుచులను అర్థం చేసుకునే హితులు ఆమెకు యింటా బయటా అనేకులు వుండడం ఆమె అదృష్టం. నృత్యశిఖర భవిష్యత్తులో రుక్మిణీదేవి నెలకొల్పిన కళాక్షేత్రంలా రూపొందగలదని ఆమె హితులు, అభిమానులు ఆకాంక్షిస్తున్నారు. వారి ఆకాంక్షను సఫలం చేయడం సుమతికి అసాధ్యమేమీకాదు ★

శ్రీ సోంపల్లె చెన్నకేశ్వరాలయం

– రావుల సూర్యనారాయణమూర్తి

ఆంధ్రప్రదేశ్ శిల్పకళాసంపద అతిపురాతనమైనది. మహమ్మదీయుల దాడులలో అనేక దేవాలయాలు చిన్నాభిన్నమైనప్పటికీ, ప్రాచీన దేవాలయాలు కొన్ని ఆ దాడులకు తట్టుకొని శిల్పకళా వైభవాన్ని వేనోళ్ల చాటుతున్నాయి. భక్తి, శృంగారం, భౌతిక చింతనం–ఈ విధంగా మానవస్వభావాన్ని శిల్పంలో రూపొందించిన అద్వితీయక్షేత్రాలు మానవుడి భావనావైచిత్రిని ప్రస్ఫుటం చేస్తూ, వాటిని దర్శిస్తున్నంత సేపూ ఏదో స్వాప్నికానుభూతిని కలిగిస్తాయి. అలాంటి అతిసుందరమూ, ఆకర్షణీయమూ అయిన దేవాలయాలలో శ్రీ చెన్నకేశ్వరాలయం ఒకటి. చిత్తూరు జిల్లాలోని మదనపల్లికి అనంతపురం వైపున 26 మైళ్ల దూరాన సోంపల్లెలో గల ఈ ఆలయం చూడడానికి చిన్నదే అయినా సౌందర్యవిలసితమైన ఎన్నో శిల్పాలకు ఆలవాలం. సిద్ధహస్తులైన శిల్పవరేణ్యుల అనల్ప శిల్పకళానైపుణ్యాలకు కాపురమై వెలసిన విజయనగరాన్ని పాలించిన శ్రీ కృష్ణదేవరాయల ఆధ్వర్యంలో దేవాలయ నిర్మాణ కళ వున్నత శిఖరాల నందుకున్నది. అనేకరకాలైన ఆలయాలను, కళాఖండాలను సృష్టించడంలో విజయనగర రాజులు అమోఘమైన

శ్రద్ధాసక్తులను, నిపుణతను ప్రదర్శించారు. వీరి శిల్ప కళాఖండాలలో కూడా భారత దేశపు తదితర కళారీతుల లాగ మత సంబంధమైన అంశాలకు అత్యధిక ప్రాధాన్య మివ్వబడింది. పురాతన శిల్ప శోభకల శ్రీ చెన్నకేశ్వరాలయం అందుకు మచ్చుతునక.

అద్భుత కళాకౌశలంతో మనకు దర్శనమిచ్చే ఆ దేవాలయం 16 వ శతాబ్దం పూర్వార్థంలో నిర్మించబడ్డట్లు వ్యక్తమవుతున్నది. అనుపమాన భాగ్యవైభవ సౌందర్యాలు కల మహానగరం విజయనగరాన్ని పాలించిన అశేష శేముషీధురంధరుడైన శ్రీకృష్ణదేవరాయలు (క్రీ. శ 1509-1530) మరో నాలుగు గ్రామసీమలతో పాటు సోంపల్లెను కాశిని నాయుడుగా పిలవబడే బాసి నాయుడు, ముల్లప్ప నాయుడుఅనే సోదరులకు దత్తం చేశాడు. ఆ విధంగా ఆ ప్రాంతాన్ని పాలిస్తున్న పాళెగాడు కాశిని నాయుడుకు శ్రీ చెన్నకేశ్వరస్వామి పట్ల భక్తి విశ్వాసాలు అపారం. దైవమూర్తిని సేవించి జన్మ ధన్యం చేసుకోడానికీ, సుందర శిల్పాలను తిలకించి నేత్ర సాఫల్యంపొంది సౌందర్యతృష్ణను తీర్చుకోడానికీ నిలయమైన సోంపల్లె ఆలయ నిర్మాణానికి ఆయనే ప్రధానకారకుడు. ప్రకృతి సౌందర్య భరితమైన పరిసరంలో దేవతామూర్తిని ప్రతిష్ఠ సలిపిన ఆ మహనీయుల ఆదర్శము గొప్పది ఆ మహాక్షేత్రంలో యిమిడి వున్న అనేక ఆధ్యాత్మిక రహస్యాలను బహిరంతర్దృష్టికల ఉపాసకులు భావించాలి.

శ్రీ చెన్నకేశ్వరాలయంలో శిల్పసౌందర్యం జగన్మోహనమై వెలుగొందుతున్నది. రాల సౌందర్యానికి నివాసభూతమై తేజరిల్లే ఆ ఆలయంలోని మండపాల మనోజ్ఞ శిల్పాలు యాత్రికులకు పవిత్ర పురాతన స్మృతులు జ్ఞప్తికి తెస్తాయి. ఆలయంలో శ్రీ చెన్నకేశ్వరస్వామి ప్రతిమగల గర్భగృహం వున్నది. దానికిసరిగ్గా ఎదురుగా కొద్దిదూరంలో ఏకశిలానిర్మితమైన 62అడుగుల ఎత్తుగల ధ్వజస్తంభం వున్నది. ఆ మహోన్నత శిలాధ్వజస్తంభం శిల్పాలు స్వర్గ సౌందర్యాన్ని కళ్లకు కట్టుతాయి. నలువైపులా శిల్ప కళామండితమై ప్రకాశించే ఈ ధ్వజస్తంభమంత ఎత్తుగల మరో ఏక శిలా స్తంభం దక్షిణాపథంలో ఎక్కడాలేదు. కళాశోభితమైన శిలాఖండం ప్రాతి పదికగాగల ఈ ధ్వజస్తంభం పూర్తి యెత్తు యింకా ఎక్కువ వుండవచ్చని పురావస్తు పరిశోధకుల అంచనా. పునాది పటిష్ఠత కోసం కొంతభాగాన్ని భూమిలో పాతిపెట్టారని వారు భావించడమే దీనికి కారణం.

దేవాలయంలో ప్రవేశించగానే సజీవ శిల్ప కళావైచిత్రికి దర్పణమైన రథం కనుపిస్తుంది. దానికి అతి సమీపంలో ముఖమంటపం వున్నది అక్కడ కుడ్యాల మీద అతి సుందరంగా చెక్కబడ్డ రామాయణ యితివృత్త దృశ్యాలు చూపరులను ముగ్ధులను చేస్తాయి. శిల్పుల ఊహాశక్తిని, నైపుణ్యాన్ని చాటి చెప్పే ఆ కుడ్యచిత్రాలలో సూక్ష్మవివరాలు దృగ్గోచరమవుతాయి ముఖమంటపం నుంచి మహా మంటపానికి తిరుగగానే హృదయాలు వ్యథామయమవుతాయి. మండపద్వారానికి యిరుపార్శ్వాల గల ద్వారపాలకుల పాదాలను మాత్రమే విడిచిపెట్టి మిగిలిన శిల్పాలను దుండగులు ధ్వంసం చేశారు ప్రధాన దేవాలయంచుట్టూ కళావిలసితమైన కళ్యాణ మండపం, మహామండపం, అర్ధమండపం, ముఖమండపం కడురమ్యంగా సాక్షాత్కరిస్తాయి ఆలయ ప్రవేశద్వారానికి సమీపంలో సౌందర్యం తాండవించే పళుపాంక మంటపమూ, దానికి ఉత్తరాన ఉయ్యాల మండపమూ వున్నాయి. గర్భాలయాన్ని చేర్చి పెరుందేవి తాయారు గుడివున్నది.

శ్రీచెన్నకేశ్వరాలయ నిర్మాణంలో నిమగ్నులైన సిద్ధశిల్పులకూ, యితర పనివారలకూ పాలను సరఫరాచేసిన భక్తుడి పేరిట వెలసిందే పళుపాంక మండపం. అంతే కాకుండా సోంపల్లెగ్రామం ఆవిర్భవించడానికి ఆది కారకులైన యాదవులపట్ల గౌరవ పురస్సరంగా కూడా ఆమండపం నిర్మిత మయింది ఈమండపం లోని శిల్పాలు చెప్పుకోదగ్గవి కాకపోయినప్పటికి సౌష్ఠవానికీ, సూక్ష్మతకూ నిదర్శనాలుగా నిలుస్తాయి.

రమణీయమైన ప్రకృతితో రతనాలసీమగా ప్రసిద్ధి చెందిన రాయలసీమ 1953 లో దుర్భర కాటక పరిస్థితులకు గురయింది. దేవాలయం చెడగొట్టబడ్డ శిల్పాలతో జీర్ణావస్థలో వున్నప్పటికీ అప్పటివరకూ శ్రీచెన్నకేశ్వర స్వామికి నిత్యార్చనలు సాగుతునే వుండేవి. ఆకరువుతో అర్చకుల దీక్షాదక్షతలు కూడా సన్నగిల్లాయి. దానితో దీనావస్థలో పడ్డ దేవాలయంపై దొంగలు కన్నువేశారు. మూలవిరాట్ ప్రతిష్ఠించబడ్డ పీఠంక్రింద నిక్షిప్తపరచబడ్డ బంగారం వున్నదనే ఆశతో శ్రీస్వామి ప్రతిమను పీఠంతో సహా పెకలించి ముందుకు జరిపివేశారు. వారి ఆశలు అడియాసలు కావడమే కాకుండా, ఆ ఆలయం అప్పటి నుంచీ పూజా పునస్కారాలకు దూరమైపోయింది అద్భుతంగా చెక్కబడ్డ శిల్పాలతో విశిష్టరీతికి చెందిన ఈ దేవాలయంలో శిలాప్రతిమలు దుండగీంద్ర అత్యాచారాలకు ఆహుతయిపోయాయి, అలనాటి అమర శిల్పుల నైపుణ్యానికి ప్రత్యక్ష తార్కాణంగా నిలచిన శ్రీ సోంపల్లె చెన్నకేశ్వరాలయాన్ని దర్శిస్తే అనిర్వచనీయమైన అనుభూతి కలుగక మానదు.

(31 వ పుట తరువాయి)

వారికి లభించే భృతిలో కొంత భాగాన్ని దేశసేవకులకు ప్రత్యేకించాలి.

మత సామరస్యం, ప్రాంతీయ సౌహార్దం, వివిధ కులాల మధ్య ప్రేమాభిమానాలు పెంపొందించాలి. హరిజనులతో సోదరభావంతో వ్యవహరిస్తూ వారి జీవితాల నుండి అంటరానితనం రూపుమాపాలి.

నూలు వడకుట నేర్చుకోవాలి. ఖాదీ వస్త్రాలు ధరించాలి. ప్రతిరోజు కాకపోయినా ప్రతివారం కొంత సమయాన్ని తమ సమీపంలోని గ్రామసేవకు వినియోగించాలి. సెలవుల కాలంలో ప్రతిరోజూ కొంత సమయాన్ని దేశసేవకు వినియోగించాలి.

దేశాన్ని క్షామానికి గురిచేస్తూ విపరీతమైన ఖర్చులతో కూడిన విద్యను అభ్యసించే అవకాశం పొందిన విద్యార్థులు ఆ చదువు సారాన్ని తిరిగి దేశానికి వారు అందజేయాలి. జాతిలోగల మంచిని సంరక్షిస్తూ, సంఘంలో తలెత్తిన చెడును దూరంచేసే సంస్కర్తలుగా విద్యార్థులు రూపొందాలి.

★

సాహితీ సదనం

అపజయం
(నవల)

కన్నడమూలం: త్రివేణి. అనువాదం: శర్వాణి.

ప్రచురణ : దేశీ బుక్ డిస్ట్రిబ్యూటర్స్, శరత్ బిల్డింగ్స్
విజయవాడ–2.

వెల: మూడు రూపాయలు

ఈ నవల, వెనక యీ రచయిత్రి రచించిన 'అపస్వరం' నవలకు తర్వాతి భాగమైనా స్వతంత్ర నవలగా కూడా చదువుకోవచ్చు. మనస్తత్వ చిత్రణ ప్రధానంగాగల నవల. ఒక ప్రధాన సంఘటన చుట్టూ యీ నవల తిరుగుతుంది. అయితే ఆ ప్రధాన సంఘటన యీ నవలలో జరుగదు. దాని ఛాయ మాత్రం మాటి మాటికీ యీనవలలో కదులుతుంది. శామూ, మీరల ముద్దుల కూతురు అయిదేళ్ళపిల్ల 'వీణ' చనిపోతుంది. శామూ, మీరలు ఆ బాధను తట్టుకోలేక పోతారు. ఏ మాత్రం ఉత్సాహంలేక దిగులుగా, నిర్జీవంగా బ్రతుకుతుంటారు. ఇక్కడి నుంచే యీ నవల ప్రారంభ మవుతుంది.

శాము, మీరల మానసిక సంఘర్షణే యీ నవలలో అంతటా ప్రధానంగా కనిపిస్తుంది. మీర చదువుకున్నది. డాక్టరు చదవాలనుకుని, వివాహం జరగడం వల్ల ఆ చదువుకు అంతటితో స్వస్తి చెప్పింది. శాము, ఆమె చదివినంత చదువుకోలేదు. డబ్బుంది, సంస్కారముంది. స్వగ్రామంలో వుండి వ్యవసాయం చూసుకుంటున్నాడు. మీర సాంసారిక జీవితంలో ప్రవేశించాక భర్త ఆదరణచూసి ఎంతో మురిసిపోయింది. మొదట్లో తను డాక్టరు కావాలన్న కోరికకు పెళ్ళి ఒక ప్రతి బంధకం అయ్యిందన్న బాధ ఆమెలో వున్నా, రాను రాను ఆ బాధతాలూకు ఛాయ కూడా ఆమె దరిదాపుల్ని చేర లేదు. వీణ పుట్టడంతో ఆమె జీవితం మరింత ఆనంద మయమయ్యింది. కాని ఆడుతూ పాడుతూ వుండే వీణ అయిదేళ్ళపాటు వాళ్ళను ఆడించి లాలించి, అకస్మాత్తుగా మరణించింది. వీణ మరణం వాళ్ళకు గొడ్డలి పెట్టయ్యింది. ఈ బాధనుంచి తట్టుకోవడం వాళ్ళకు సాధ్యంకాలేదు. శాము ఎంతయినా పురుషుడు. కుమార్తె మరణం వల్ల కలిగిన మనస్తాపం నుంచి క్రమ క్రమంగా కోలుకున్నాడు. అది మీరకు సాధ్యం కాలేదు. తిరిగి చదువుకోవడం వల్ల వీణను మర్చి పోవచ్చునని ఆమె భావించింది. అందుకు సిద్ధమైంది.

ఈ నిర్ణయమే యీ కథంతటికీ మూలాధారమైంది. శాము, మీరల మధ్య మానసికంగానే కాక, శారీరకంగానూ అగాధం ఏర్పడ్డానికి కారణమైంది.

శాము దేవుడు లాంటివాడు. గంగి గోవులాంటి వాడు. భార్య అంటే అతనికి విపరీతమైన ప్రేమ. ఆమె కోర్కెను కాదనే సాహసం అతని మంచి మనసుకు లేదు. నిజానికి మీర, పట్నం వెళ్ళి డాక్టరీ చదవడం అతనికి యిష్టంలేదు. కాని ఆమె సంతోషానికి అతను ఏమైనా చేయగలడు అందుకే అతను అంగీకరించాడు. మీర ఆశయం నెరవేరింది. డాక్టరయ్యింది. పల్లెకు తిరిగి వచ్చింది.

అయితే నవలలో యిక్కడో మెలిక వుంది తనకు మరిక పిల్లలు పుట్టరు. శాము ఆస్తికి వారసుడైన వంశాంకురం వుండక పోతే యీ ఆస్తి ఎవరు తినను ? అందుకే ఆమె మరో పెళ్ళి చేసుకోమని భర్తను అస్తమానం వేధించడం మొదలుపెట్టింది. మీరను తన జీవితంలో దేవతలా చూసుకుంటున్న శాము తన హృదయంలో మరొకరిని ఎలా ప్రతిష్ఠించగలడు. కాని మీర సాధించి వివాహం చేయించింది. తనే పెద్దరికాన్ని వహించి పెళ్ళి చేసింది. కాని ఆవివాహమే ఆమెను భర్తనుంచి దూరంచేసింది. వచ్చిన అమ్మాయి మీరను సరిగా అర్థంచేసుకోలేదు అనుక్షణం మీర అవమానానికి గురి కావలసి వస్తోంది. చివరికి ఆమె తన ప్రియాతి ప్రియమైన భర్తను సహితం వదిలి పట్నం వెళ్ళి డాక్టరుగా బ్రతకాలని నిశ్చయించుకుంది.

ఈ నవల ప్రారంభమూ, ముగింపూ రెండూ కూడా చాలా చక్కగా వున్నాయి. కథనం అతి స్వభావికంగా వుంది. మానసిక చిత్రణలో అత్యద్భుతమైన ప్రతిభను రచయిత్రి చూపించ గలిగింది. మీర మనస్తత్వ చిత్రణలోకన్న శాము మనస్తత్వ చిత్రణలో రచయిత్రి ప్రతిభ మరింతగా బయట పడింది. రచయిత్రి చిత్రించిన అంతసంఘర్షణ ఆసక్తికరంగా ఉత్సుకతతో నవలను చదివించడానికి తోడ్పడింది. ఈకథకు సమాంతరంగా మరో మరాఠీ అమ్మాయి ప్రేమగాథ కూడా నడుస్తుంది. మీర, వాళ్ళ ప్రణయానికి దోహదం చేస్తుంది. తను మాత్రం వీటన్నిటికీ దూరంగానే నిలిచిపోతుంది. ఆమె జీవితంలోని విషాదం అదే. కథ ప్రారంభంలో పాఠకుడి సానుభూతి శాము మీద నిలిచినా చివరకు, రచయిత్రి ఆశించినట్టు, మీర మీదికి ఫోకస్ అవుతుంది.

శర్వాణి అనువాదం కూడా చక్కగా వుండి తెలుగు జీవితాన్నే పరిశీలిస్తున్న అనుభవాన్ని కలిగిస్తుంది ఈ నవల.

\- రాజు

స్వీకారం

చైతన్య భారతి

(కవితల కదంబం)

చైతన్య భారతీ ప్రచురణలు

వెల : రూ. 1–50

ప్రతులకు : పురాణం రామచంద్ర, లింగంపల్లి, హైద్రాబాద్

కార్మిక కల్యాణం

ఇ. ఎస్. ఐ. విస్తరణ విభాగానికి గవర్నరు ప్రారంభోత్సవం

సనత్‌నగర్ వద్ద 60 పడకలతో ఉద్యోగుల రాష్ట్ర భీమా (ఇ. యస్. ఐ.) ఆస్పత్రి విస్తరణ విభాగానికి ప్రారంభోత్సవం చేస్తూ రాష్ట్ర గవర్నరు శ్రీ ఖండూభాయ్ దేశాయ్, మహిళా శిశు సంక్షేమ మనేది రాష్ట్రం, కుటుంబం- ఈ రెంటి సమిష్టి బాధ్యతన్నారు.

కవాడిగుడా వద్ద 13 సంవత్సరాల క్రితం మొట్టమొదటి సారిగా ఇ.యస్.ఐ. చికిత్సాలయానికి తాను ప్రారంభోత్సవం గావించిన రోజులు గుర్తుకు తెచ్చుకుంటూ గవర్నరు, ఆ సంస్థ క్రమేపీ అభివృద్ధి చెందుతున్నందుకు హర్షాన్ని వెలిబుచ్చారు. నాటి ఆరోగ్య శాఖామంత్రి కీ॥ శే॥ మెహిదీనవాజ్‌జంగ్, కార్మికమంత్రి డా॥ జి. యస్. మెల్కోటేలను ప్రశంసిస్తూ, వారిలో నిజమైన మానవ సేవాతత్పరత పుంజీభవించి వున్నదన్నారు.

ఆంధ్రలో ఒకలక్ష పైచిలుకు కుటుంబాలకు సేవచేసి వుండడమనేది ఇ. యస్. ఐ. జీవిత చరిత్రలో పేర్కొనదగిన ఘట్టమన్నారు. మహిళలకు, పిల్లలకు విద్యగరపడం, ఆరోగ్యకరమైన మార్గాల్లో పెంపకం జరగకపోతే దేశం అభివృద్ధి చెందదన్నారు.

రాష్ట్రంలో ప్రభుత్వాసుపత్రులకంటే, ఇ.యస్.ఐ. ఆస్పత్రులు ఎక్కువ శ్రద్ధతో చూడబడుతున్నవని, ఎక్కువ వసతులు కలిగివున్నాయని రాష్ట్ర ఆరోగ్య శాఖామంత్రి శ్రీ పి వి. నరసింహారావు అన్నారు. వైద్య కళాశాలలో సమానంగా బోధనావసతులు కలిగించేటట్లు చూచేందుకు వారు హామీయిచ్చారు.

వసతులకై అభ్యర్థన

ఆస్పత్రిని చక్కగా ఉపయోగించుకొన వలసిందిగా జన సంబంధ శ్రామికమంత్రి శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ శ్రామికులను ఉద్బోధించారు. ఖాళీ మెడికల్ సర్టిఫికేట్లు యిస్తుండే పద్ధతిని గూర్చి ప్రభుత్వానికి తెలుసునని, యోగ్యులైన శ్రామికులు, వారి కుటుంబంలోని వ్యాధిపీడితులైన వారి యోగక్షేమాల దృష్ట్యా యిట్టి పద్ధతిని విసర్జించాలన్నారు.

అంతకుపూర్వం ఆస్పత్రి సూపరింటెండెంటు డా॥ జె. హరిచరణ్ స్వాగత పత్రాన్ని సమర్పిస్తూ 27 లక్షల రూపాయలు ఖరీదుచేసే 210 పడకలతో ఆస్పత్రి అప్‌గ్రేడ్ చేయబడిందని, 45,000 కుటుంబాల ఆరోగ్య విషయమై ఆస్పత్రి శ్రద్ధ తీసుకొంటున్నదని అన్నారు. అధికంగా బోధనా సౌకర్యాల్ని కల్పించవలసిందిగాకోరుతూ డా॥ దాస్ ; ప్రీనేటల్, పోస్టునేటల్ విభాగాలను సమగ్ర కృషి నిమిత్తం కుటుంబ నియంత్రణ విభాగానికి తరలించడం జరిగిందన్నారు.

ప్రజలకు సహాయం

పౌష్టికాహార పరిశోధనాగారం

హైదరాబాదులోని పౌష్టికాహార పరిశోధనాగారానికి చెందిన ఎక్స్‌టెన్షన్ బ్లాకుకు ఏప్రెల్ 17న ముఖ్యమంత్రి శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి ప్రారంభోత్సవం చేశారు.

ఈ బ్లాకులో ఐసోటోప్ లేబరేటరీలు, పరిపాలనా విభాగం, అంతర్జాతీయ కోర్సులకు సంబంధించిన లేబరేటరీలు, యితర విభాగాలు వుంటాయి.

ఈ సంస్థలో జరిగిన ఫలితాలను పంచాయతీరాజ్ శాఖ విస్తృత ప్రచారం చేయగలదన్న ఆశాభావాన్ని ముఖ్యమంత్రి వ్యక్తం చేశారు.

ఈ లేబరేటరీలను సందర్శించడం తనకు ఇదే తొలిసారని, యీ సందర్శనవల్ల ఎన్నోవిషయాలు తెలిసాయని అన్నారు. ప్రభుత్వం, లేబరేటరీల మధ్య అవగాహనా వాతావరణాన్ని నెలకొల్పినందుకు లేబరేటరీ డైరెక్టరును ముఖ్య మంత్రి అభినందించారు.

ఈ లేబరేటరీల పనులను గూర్చి దీని డైరెక్టరు డా॥ సి. గోపాలన్ వివరిస్తూ ఒక ఏడాదికి సరిపడ విటమిన్ 'ఎ' ను తీసుకోవడంవల్ల గ్రుడ్డితనం రాకుండా కాపాడుతుందని యీ లేబరేటరీ పరిశోధించినదని అన్నారు. మేహపాద నిరోధానికి యిక్కడ పరిశోధన జరిగి, విజయవంతమైన ఫలితాలు సాధించబడినాయని కూడా ఆయన తెలియజేశారు.

శిక్షణలో అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యత

దేశంలోని వికలాంగుల పాఠశాలలకు భారత ప్రభుత్వం ఏటా రూ. 5.5 లక్షలు కేటాయిస్తున్నది.

దేశంలో వికలాంగ బాలల సంక్షేమార్థం మూడు జాతీయ సంస్థలున్నాయి. 1. డెహరాడూన్‌లో గ్రుడ్డివారి జాతీయకేంద్రం, 2. హైద్రాబాదులో వయోజన బధిరుల శిక్షణ కేంద్రం 3. క్రొత్త ఢిల్లీలోని మానసిక జాడ్యంగల పిల్లల మోడల్ పాఠశాల.

ఈ సంస్థలలో అభివృద్ధికి సంబంధించిన వృత్తి శిక్షణావకాశాలుకూడా ఉన్నాయి. రూ. 500/- కంటే తక్కువ ఉమ్మడి రాబడి ఉన్నవారల పిల్లలకు-భోజనం, వసతి, గుడ్డలు, శిక్షణ ఉచితంగా ఏర్పాటు చేయబడుతుంది. మిగిలిన వారికి నామమాత్రంగా రుసుము వసూలు చేస్తారు.

కొద్దిగా గుడ్డి, చెముడుఉన్న బాలలకుకూడా, డెహరాడూన్‌లోను, హైద్రాబాదులోను పాఠశాలల్ని ఏర్పరచడానికి, సాధారణ పాఠశాలల్లో గుడ్డిబాలల్ని జేర్చుకోడానికి ప్రతిపాదనలున్నాయి.

దెహ్రాడూన్‌లోని గుడ్డివారల జాతీయ కేంద్రం కలుగజేసే సమగ్ర విద్యావకాశాలలో వినోదాత్మకమైన చదువుకూడా ఉన్నది. ఈ కేంద్రం నిర్వహించే సేవలు ఆరు రకాలు – 1. గుడ్డిబాలలకు ఆదర్శపాఠశాల, 2. గుడ్డి వయోజనుల శిక్షణాకేంద్రం, 3. జాతీయ గ్రంథాలయం, 4. ఆచ్ఛాదిత వర్క్‌షాప్, 5. బ్రెలీ పరికరాలు తయారుచేసే వర్క్‌షాప్, 6. బ్రెలీ ముద్రణాలయం.

గ్రుడ్డి బాలల ఆదర్శ పాఠశాలలో బాల బాలికలు 70 మందికి వసతి ఉంది సుమారు 150 మంది మగవాళ్లు, 35 మంది ఆడ వాళ్ళు (18–40 మధ్యసంవత్సరాలవారు) గుడ్డి వయోజనుల శిక్షణా కేంద్రంలో ఇంజనీరింగు, ఇంజనీరింగేతర వృత్తుల్లో శిక్షణ పొందు తున్నారు. బ్రెలిటైపింగ్ విధానంలో శిక్షణా, పాటల శిక్షణ, గుడ్డి శిక్షణా కేంద్రాలలో శిక్షణ గరపేవారికి శిక్షణకూడా ఈ కేంద్రం నిర్వహిస్తున్నది. బయటవున్న గుడ్డివారికి బ్రెలీ పుస్తకాలు చదువుకోవడానికి గ్రంథాలయం. తపాలా ఖర్చులు పెట్టుకొని సరఫరా చేస్తున్నది. అవసరమైన బ్రెలీ పరికరాలు యిక్కడే తయారవుతున్నాయి. బ్రెలీ ముద్రణాలయం ఒక హిందీ త్రైమాస పత్రికను నడపడమేగాక, బ్రెలీ వాఙ్మయాన్నికూడా ప్రకటిస్తున్నది.

హైద్రాబాదు శిక్షణాకేంద్రంలో చెవిటివారికి 2 సంవత్సరాల ఇంజనీరింగ్ కోర్సున్నూ, 16 నుండి 25 సంవత్సరాల యువకులకు పని అవకాశాలున్నూ ఉన్నాయి.

మానసికంగా పెరగని బాలలకు, సాధారణ విద్యతోపాటు అల్లికలు మొదలైనవి, చేతిపనులు, కండరాల సమైక్య కదలిక కనువైన శిక్షణను న్యూఢిల్లీ నమూనా పాఠశాలలో ఇస్తారు.

ఔదార్యఘట్టాలు

గవర్నరు ఔదార్యం

ఆంధ్రప్రదేశ్ గవర్నరు శ్రీ ఖండూభాయ్‌దేశాయ్, తాము గవర్నరుగా పనిచేసినంత కాలం తమ జీతంలో పదవవంతు మొత్తాన్ని స్వచ్ఛందంగా తగ్గించుకోడానికి నిశ్చయించారు.

పన్నుల చెల్లింపులో గిరిజనుల ముందంజ

పూర్తిగా పన్నులను చెల్లించడంలో ఆదిలాబాదు జిల్లాలోని గిరిజనులు యితర బ్లాకులకంటే ముందంజ వేశారు. ప్రభుత్వంతో వ్యవహరించే విషయాలలో గిరిజనులు చాలా బాధ్యతతో ప్రవర్తిస్తారని కలెక్టరు శ్రీ అల్లాయార్‌ఖాన్ ఉట్నూరు సమితి సభ్యులకు తెలియజేశారు.

పశ్చిమ గోదావరినుండి కొత్తరకం అరటి పండు

'భాస్కర్ కేలా' తాజా అరటి పండు భారతదేశ రకాలలో ఉన్నతమైనదని పేర్కొనవచ్చు. పశ్చిమ గోదావరి జిల్లా పేరిచెర్ల గ్రామ వాస్తవ్యులు శ్రీ పేరిచెర్ల భాస్కరరాజుగారు మనజాతికి అందిచ్చిన బహుమానమే ఈ పండు. శ్రీ రాజుగారు తోట కృషిలో ఎంతో ఆసక్తిగల అభ్యుదయరైతు.

ఈ కొత్తరకం అరటిపండు మనంతినే అరటి రకాలలో పెద్దది ఎన్నో లక్షణాలుగల ఈ రకాన్ని 143 రకాలలో కనుగొని శ్రద్ధతో వారి తోటలో పెంచారు శ్రీ భాస్కరరాజుగారు. ఈ రకంలో ప్రత్యేక లక్షణాలు గమనించి దాన్ని వేరు పరచి వారి మెట్లపాలెం తోటలో 8 సంవత్సరాలు కృషి చేశారు. 14 అంగుళాల బారు, మూడు నుండి నాలుగువందల గ్రాముల బరువు కలిగి మేలిమి బంగారం రంగుతో గింజలు లేని 150 అరటిపళ్ళ గెలదిగగానే శ్రీ రాజు తన 8 సంవత్సరాల కృషి చరితార్థమైందనుకొన్నారు.

ఈ పండు అతి మధురమైనది. తినడానికి ఉపయోగించే ఇతర రకాలు ఏవీ దీనికి సాటిరావు. తెల్లచక్రకేళీ, అమృతపాణి, రసాతలి, హారిచల్ మొదలైన మంచి రకాల మిశ్రమమే కావచ్చును. పండు వాసన కూడా కమ్మగా వుంటుంది. విదేశీ పండు 'గ్రాస్ మైకేల్' కంటే శ్రేష్ఠమైనదని, ఈ పండును రుచిచూచిన విదేశీ నిపుణులు అన్నారు. కేరళ రాష్ట్రంలోని 'నేంద్రం' పండుకన్నా మిన్న అనీ, దానికంటే పెద్దదనీ, గెలలో ఎక్కువ పండ్లు దిగుబడి కూడా వున్నదని తెలుస్తున్నది.

ఈ రకం పండును శ్రీ రాజు ఆషామాషీగా కనుగొనలేదు. తోటల పెంపకం, ముఖ్యంగా అరటితోట పెంచడంలో చిన్నప్పటి నుంచి శ్రద్ధగల వ్యక్తి. 1957 నుండి భారత ప్రభుత్వ వ్యవసాయశాఖ తాలూకు భారతీయ వ్యవసాయ పరిశోధక మండలి ఏటా ఏర్పరచే అఖిలభారత పండ్ల పదర్శనలలో శ్రీరాజు మొదటి బహుమానాలు గెలువని సంవత్సరమే లేదు.

ఈ మధ్య శ్రీరాజు భారతరాజధానికి వెళ్ళారు. అధ్యక్షులు శ్రీ జాకీరుహుస్సేను, ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధి, ఆహార వ్యవసాయశాఖా మంత్రులు శ్రీ జగజీవన్‌రామ్, శ్రీ అన్నాసాహెబ్ షిండేలను కలుసుకొని కొన్ని పండ్లను బహూకరించారు. ఆ పెద్దలు వీరి కృషిని మెచ్చుకొంటూ అభినందనలను తెలియజేశారు.

నిన్ను గురించి...

నీలో గొప్పతనాన్ని
నీ చేతల్లో నిస్స్వార్థాన్ని
నీ గుండెలోపల మే మంటే పొంగే
నిరవధిక ప్రేమ ప్రవాహాన్ని
నిశ్శబ్దంగా నిస్సంశయంగా
గుర్తించి తరించిన భాగ్యం మాది.
నీలో ఆవేశాన్ని రేపిన
ఉత్తుంగ శిఖర రమ్య హిమాద్రీ
నీలో ఆవేగం నింపిన
ఉచ్ఛలత్తరంగ కరాళ వార్ధీ
నీలో జ్ఞానాభయ పవిత్రతల పెంచిన
నిర్మల త్రివేణీ సంగమ స్థలీ
ఇన్నీ పొందిన యేదేశం నీదో
ఆ దేశానికి చెందిన వాళ్ళం మేము.

కల్లా కపటం తెలీని
పిల్లల్లాంటి ప్రజలు
కుట్రలూ కుతంత్రాలూ పన్నుతూ
కుళ్ళుతనం వెలిబుచ్చే జనులు
దేశం కోసం ప్రాణాలిచ్చే
ధీరులూ విజ్ఞానులూ
స్వార్థం గూడు తమ చుట్టూ కట్టుకున్న
సంఘంలోని గొంగళీ పురుగులు
అందరూ నీవాళ్ళే!

ఎల్లరూ మెట్టి ఊపిరి పీల్చి జీవించేది
చల్లని నీ తల్లి నేల ఒడిలోనే
అందుకే యీ మనుషులంటే
అంతులేని ప్రేమ నీకు

నలభై కోట్ల సుమాల్ని
కలిపి కట్టిన మంగళ తోరణంలా
వెయ్యంచుల సుదర్శనాయుధం
విరజిమ్మే కాంతి సమూహంలా
ఎటుచూచినా కనిపించే
పటువైన నీ ఆత్మ జ్యోతి
ప్రతి మనిషి కళ్ళల్లోనూ వెలగగా
ప్రతి వ్యక్తి హృదయంలోనూ రగలగా
పదే పదే నా స్మృతికి వచ్చే నీకు
ఇదే నా భక్తి శ్రద్ధల
ఎఱ్ఱ గులాబీ దండ

—నాయని కృష్ణకుమారి

సీరియల్

తిరస్కృతి

— వాసిరెడ్డి సీతాదేవి

జరిగిన కథ

సత్యం, సూర్యం అన్నదమ్ములు. సత్యం చిత్రకారుడు. సూర్యం పట్నంలో చదువుకుంటున్నాడు. సరళ చిన్నప్పుడే తల్లి దండ్రులను కోల్పోయి ఆ యింట ఆశ్రయం పొందింది. సరళను సత్యానికి యిచ్చి పెళ్ళి చెయ్యాలని చిన్నప్పటినుంచీ అనుకుంటు న్నారు. అయితే సూర్యం నాజూకు చూస్తే సరళకు వ్యామోహం కలిగింది.



4

తెల్లవారే సూర్యం ప్రయాణం. శాంతమ్మ హడావిడికి అంతులేదు. వద్దంటున్నా ప్రయాణంలో తినటానికి రెండు మూడు రకాల పిండి వంటలుచేసి డబ్బాలకు సర్దింది। కలకత్తా లో మనకు భోజనం దొరకదు. కనుక, నోరు మరీ చవి చచ్చిపోయినప్పుడు తినటానికని, నాలుగు చిన్న జాడీలనిండా నాలుగు రకాల పచ్చళ్లు పెట్టి వాసెన్లు కట్టింది.

"ఇవన్నీ అంతదూరం మోసుకు పోవాలంటే కష్టం. అయినా ఇవి ఎంతకాలం ఉంటాయి ? ఆ తరవాతయినా ఆ భోజనానికి అల వాటు పడాల్సిందేగా ?" అంటూ వాదించటానికి ప్రయత్నించాడు సూర్యం.

"ఉండనియ్, ఆ భోజనం అలవాటు అయిందాకా అన్నా ఇవ ఉంటాయిగా ?" అంది తల్లి. 'తల్లిమనస్సు— తను చెప్పి లాభం లేదని' ఊరుకున్నాడు సూర్యం. ఒక హార్లిక్స్ సీసాలో సాంబారు కారం, మరో సీసాలో నెయ్యీ పోసింది.

ఆ సాయంత్రం సత్యం అలవాటు ప్రకారం పొలాలవైపు షికారు వెళ్ళాడు. సూర్యం మాత్రం గదిలో కూర్చొని ఒంటరిగా ఏదో ఆలోచిస్తున్నాడు. సరళ చిన్నగా సూర్యం దగ్గరకు వచ్చి మౌనంగా నిల్చింది.

సూర్యం చూసీ చూడనట్లే ఉరుకున్నాడు. నాలుగు రోజులుగా మనస్సులో జరుగుతున్న సంఘర్షణతో నలిగిపోయివున్న సరళ హృదయం, సూర్యం ముభావంగా ఉండటం మరీబాధించింది.

సూర్యం కూర్చున్న కుర్చీకి వెనగ్గా వెళ్ళి నిల్చొని చిన్నగా 'బావా' అంది సరళ.

సూర్యం కళ్ళు మూసుకొనే 'ఊ' అన్నాడు. సరళకు ఎక్కడలేని దుఃఖమూ ముంచుకొచ్చింది.

"పోనీయ్‌లే, నీకు మాట్లాడడానికే అంతకష్టంగా ఉంటే" ఆ పైన గొంతుపెగల్లేదు. గిర్రున తిరిగి వెళ్ళిపోబోతున్న సరళ చెయ్యిని పట్టుకొని ఆపాడు సూర్యం.

"నన్నొదులు, వెళ్ళనియ్" మాటలు దుఃఖాన్ని వెనక్కి నెడుతూ బలవంతంగా బయట పడ్డాయి.

"ఎందుకంత కోపం? నువ్వేగా నాలుగు రోజులుగా నాతో సరిగా మాట్లాడకుండా అమ్మ చుట్టూ, అన్నయ్య చుట్టూ తిరుగుతూ తప్పించుకుంటున్నావు?" అన్నాడు సూర్యం లేచి సరళను దగ్గరకు లాక్కుంటూ. నదిలోని వరదలా ఆమె మనస్సులోని దుఃఖం పొంగి పొర్లింది. సూర్యం గుండెలకు అతుక్కుపోయి వెక్కి వెక్కి ఏడవసాగింది.

సూర్యం గాబరాబడ్డాడు. "ఏమిటి సరళా? ఎందుకీ ఏడుపు? ఎవరైనా ఏమన్నా అన్నారా?" ఆత్రంగా అడిగాడు సూర్యం.

"లేదు" అన్నట్లు ఏడుస్తూనే సూర్యం గుండెల మీదనే తల ఊపింది.

"ఊరుకో। కళ్లు తుడుచుకో। చూడు, అమ్మగానీ నాన్నగానీ చూస్తే బాగుండదు."

సరళ సూర్యంనుంచి దూరంగా జరిగి కళ్ళు తుడుచుకో సాగింది. ఒక వైపు తుడుచుకుంటూ ఉంటే మరోవైపు కన్నీటి ధార ప్రవహిస్తూనే ఉంది.

"ఊరుకో సరళా ఎందుకంతగా ఏడుస్తున్నావు?" బ్రతిమాలు తున్నట్లు అడిగాడు.

"మరి నేను పిలిస్తే ఎందుకు పలకలేదు?" అంది కళ్లు మరోసారి తుడుచుకుంటూ.

"చెబుతాను ముఖం కడుక్కురా" అన్నాడు సూర్యం.

సరళ పవిటచెంగుతో ముఖం తుడుచుకుంది.

"ఆడవాళ్లు ఏడ్చి కళ్లు తుడుచుకున్నాక చాలా అందంగా వుంటారు. ముఖ్యంగా నీలాంటి అందమైన వాళ్ళయితే యిక ..."

"ఇక చాల్లే ఊరుకో, నీకంతా తమాషాగానే ఉంటుంది." ఉలుక్కుంటూ అంది సరళ.

"ఒక కథ చెప్పనా?" అన్నాడు సూర్యం.

"ఇప్పుడేం కథ!" విసుగ్గా అంది సరళ.

"కథంటే కథ కాదులే. నువ్వు అడిగావే నేనెందుకు మాట్లాడలేదని, దానికి సమాధానం చెబుతాను" అన్నాడు సూర్యం సరళను కొంటెగా చూస్తూ. సరళ చూపులు పక్కకు మరల్చు కుంటూ "చెప్పు" అంది. 'కొంటె బావ ఎలా చూసాడో! అందుకే చిన్న బావంటే తనకు ఇష్టం' అనుకుంది మనస్సులోనే.

"ఒక వేటగాడు ఒక లేడిని చంపి, దాన్ని కాల్చి మాంసం తింటూ ఏడుస్తున్నాడంట"

"ఎందుకూ?" సరళ కుతూహలంగా ప్రశ్నించింది.

"మరి చెబుతాను విను! ఆదారే పోయే ఓ పెద్ద మనిషి "ఎందుకు నాయనా ఏడుస్తున్నావు?" అని ప్రశ్నించాడట. అందుకు ఆ వేటగాడు ఏమన్నాడంటే "ఈ మాంసం తింటూంటే, లేడి రూపం నా కళ్ళకు కట్టినట్లయింది బాబూ. అది ఎంత అందంగా ఉందనుకున్నారు? దాని అందాన్ని తలుచుకుంటే ఏడుపొస్తుంది. ఒక్కసారి ఇది బ్రతికివస్తే, చస్తే మళ్ళీ చంపను" అన్నాట్ట.

"కథ బాగానేవుంది కాని నేను అడిగిన దానికీ ఈ కథకూ ఏమిటో సంబంధం?" అంది సరళ.

"చెప్పమన్నావా? నాలుగు రోజుల నుంచి నాతో సరిగా మాట్లాడకుండా నన్ను చిత్రవధ చేశావు. ఇప్పుడొచ్చి నాముందు ఏడుస్తున్నావు. అందుకే ఎక్కడో చదివిన ఈ కథ గుర్తొచ్చింది" అన్నాడు సూర్యం ముసిముసిగా నవ్వుతూ.

"సంతోషించాంలే" అంటూ మూతి సున్నాచుట్టింది సరళ.

"నిజంచెప్పు. ఎందుకేడ్చావు?"గంభీరంగా మారింది సూర్యం ముఖం ఆప్రశ్న వేస్తున్నప్పుడు.

"అన్నీ చెప్పాలేం! పెద్దచదువులు చదువుతున్నావు. ఆమాత్రం అర్థం చేసుకోలేవూ?" చిరుకోపంగా అంది సరళ.

సూర్యం ఓనిమిషం ఆశ్చర్యంగా సరళ ముఖంలోకి చూశాడు. అంతలోనే ఏదో భావం చీకటి గదిలో ఒక్కసారిగా ప్రవేశించిన వెలుగులా సూర్యం మెదడులో వ్యాపించింది. ఆ వెలుగు కళ్లలో ప్రతిబింబించింది. వెంటనే ఉల్లాసంగా రెండు చేతులతో సరళ రెండు భుజాలను పట్టుకొని ఊపుతూ "నిజమేనా సరళా! నేను ఊహించింది నిజమేనా?" అన్నాడు.

"నువ్వేమి ఊహించావో నాకెలా తెలుస్తుందీ." అంటూ సరళ సూర్యం చేతుల్ని విడిపించుకో సాగింది.

సూర్యం ఆమెను ఇంకా గట్టిగా పట్టుకుంటూ ఆత్రంగా అడిగాడు. "చెప్పు సరళా, నేనువెళుతున్నాననేనా ఏడుస్తున్నావ్?"

"పాపం ఎంత ఆశ?" కొంటెగా అన్న సరళ మాటల్ని నిజంగానే అనుకున్న సూర్యం సరళను ఒక్క సారిగా వదిలేశాడు.

"ఏంబావా చేతులు కాలాయా? అలా అకస్మాత్తుగా నిప్పు కణంలా వదిలేశావ్ నన్ను." అంది సరళ పకపకా నవ్వుతూ.

"చాల్లే సంతోషించాం, చాల చమత్కారంగా మాట్లాటం కూడా నేర్చుకున్నావ్." అంటూ విసుక్కున్నాడు కోపంగా.

"మరీ అంత కోపం అయితే ఎలా బావా! ఇప్పుడు నేను ఏమన్నాననీ?" అంది సరళ కోపంతో ఎర్రబడిన సూర్యం ముఖం లోకి చూస్తూ ఉల్లాసంగా. సరళ దగ్గరగా వెళ్ళి సూర్యం జుట్టును గుప్పెడు నిండా తీసుకొని లాగుతూ చెరప సాగింది. సూర్యం విసుగ్గా చెయ్యిని తోసేశాడు.

"ఇల్లాంటి పనులు నీ కాబోయే మొగుడి దగ్గర చెయ్యి." అన్నాడు దూకుడుగా సూర్యం.

"ఇప్పుడు నేను చేస్తుంది అదేగా!" అనేసి చటుక్కున నాలుక కరచుకుంది. సిగ్గుతో సరళ బుగ్గలు గులాబీ రేకులా ఏరుపెక్కాయి.

సూర్యం ఓ నిముషం సరళ ముఖంకేసి చూసి ఆవేశంగా దగ్గరకు లాక్కోబోయాడు. సరళ చిక్కకుండా దూరంగా వెళ్ళి నిల్చుంది.

ఇద్దరూ రెండు నిమిషాలు మధుర స్వప్నాల్లోకి జారి పోయారు.

"సరళా!" అన్నాడు మృదువుగా సూర్యం.

"ఏం!" అన్నట్లు చూసింది సరళ.

"అమ్మా నాన్నా ఒప్పుకోకపోతే? అసలు వాళ్ళతో ఎలా చెప్పడం? ఎవరు చెప్పాలి?" అన్నాడు తనలో తనే మాట్లాడు కుంటున్నట్లు.

"అదే నేనూ అనుకుంటున్నాను. అయినా ఇంకెవరు చెబుతారు, నువ్వే చెప్పాలి." అంది సరళ.

"అమ్మబాబోయ్! నావల్లకాదు. నువ్వే చిన్నగా అవకాశం చూసి చెప్పు."

"నా వల్లకాదు బావా, నేను పెద్దబావను చేసుకోను అని చెప్పలేను."

"అయితే మరి పెద్ద బావనే చేసుకో. మధ్యలో ఈగొడవంతా ఎందుకూ?"

"కోప్పడకు బావా! నువ్వే ఈ సారి సెలవలకు వచ్చినప్పుడు చెప్పు," అంది బతిమాలుతున్నట్లు.

"ఊహుం లాభంలేదు. నేను చెబితే నాలుగు తిట్టి ఊరు కుంటారు. అంతే. ఫలితం ఉండదు."

"మరి ఎలాగ?" దిగులుగా అంది సరళ బుగ్గన చెయ్యి పెట్టుకొని.

ఇద్దరూ ఆలోచనల్లోకి జారిపోయారు.

"ఏమిట్రా అలా ఎదురెదురుగా కూర్చొని ఆలోచిస్తున్నారు? అంత తీరని సమస్య ఏదో నాకూ చెప్పండి మీతోపాటు కూర్చుని నేనూ ఆలోచిస్తాను" అంటూ సత్యం ఎదురుగా నిల్చున్నాడు. ఇద్దరూ ఉలిక్కిపడ్డారు. సత్యాన్ని చూసి గాబరా పడ్డారు. తప్పు చేసి దొరికిపోయిన వాళ్ళలా దిక్కులు చూడసాగారు.

"ఏమిటలా తప్పుచేసినవాళ్ళలా గాబరా పడతారు?" చిరు నవ్వుతోనే ఇద్దర్నీ మార్చి మార్చిచూస్తూ అడిగాడు సత్యం.

"అబ్బే ఏంలేదు అన్నయ్యా ఇద్దరం ఎదురుగా కూర్చున్నా మని కూడా మర్చిపోయి ఆలోచిస్తున్నాం. అందుకు..."

"ఏం బావా ఇవ్వాళ ఇంత త్వరగా వచ్చేశావ్?" అంది సరళ తన గాబరాను అణచుకుంటూ

"కుంచెలు మర్చిపోయాను" అంటూ సత్యం తన గదిలోకి వెళ్ళిపోయాడు.

"పెద్ద బావ ఏమనుకున్నాడో!" అంది సరళ అదోలా ముఖంపెట్టి.

"అనుకోనియ్. ఏమన్నా అనుకుంటే మనపని మరీ సులభం అవుతుంది" అన్నాడు సూర్యం నిర్లక్ష్యంగా.

"అంటే?" అంది సరళ విస్మయంగా సూర్యాన్ని చూస్తూ.

"అవును సరళా! అన్నయ్యకు ఏ కొంచెం అనుమానం వచ్చినా తనే మన వివాహాన్ని చేయిస్తాడు" అన్నాడు సూర్యం.

సరళ జవాబివ్వలేదు. ఏదో ఆలోచిస్తుంది. ఇంతలో ఏదో బ్రహ్మాండమైన ఆలోచన వచ్చిన వాడిలా ఉల్లాసంగా చిన్నగా ఈల వేశాడు సూర్యం.

సరళ తలెత్తి ఆశ్చర్యంగా సూర్యం ముఖంలోకి చూసింది.

"అంత తెల్లముఖం వేస్తావేం సరళా! నాకు బలే ఆలోచన వచ్చిందిలే" అన్నాడు ఉల్లాసంగా సూర్యం.

"ఏమిటది?" ఆత్రంగా అడిగింది సరళ.

"ఒక పని చెయ్యాలి. అది నీ వల్లనే అవుతుంది. చేస్తా నంటే చెబుతాను."

"ముందు ఏమిటో చెబితేగా నేను చెయ్యగలనో లేదో తెలుస్తుంది"

"అంత నీరసంగా మాట్లాడతావేం. అసలు నీకే ఇష్టం లేదు. ఇదంతా ఓ ఆటలావుంది నీకు" చిరాగ్గా అన్నాడు సూర్యం.

"చంపక చెప్పుబాబూ. నా వల్లనయ్యే పని అయితే తప్పక చేస్తాను" అంది సరళ కొంచెం విసుగ్గా.

తమని చూసి సత్యం ఏమనుకున్నాడో నన్నబాధ పీడించ సాగింది సరళను. మనసు మనస్సులోలేదు. అకస్మాత్తుగా తను పెద్దబావకు అన్యాయం చేస్తున్నానేమోననే భావం లీలగా హృదయంలో తళుక్కుమంది.

"నీకంత ఇష్టంలేకపోతే ఏమీ అక్కర్లేదులే, రేపు నాదారిన నేను పోతాను." అన్నాడు కోపంగా సూర్యం.

"లేదు బావా! చెప్పు, ఏంచెయ్యమంటావు?"

"నేను వెళ్ళిపోయాక, చిన్నగా ఒకరోజు అన్నయ్యకు చెప్పేయ్."

"ఏమని" ఉలిక్కిపడి అడిగింది సరళ.

"మనిద్దరం ప్రేమించుకుంటున్నామనీ, వివాహం చేసుకో వాలనుకుంటున్నామనీ. మిగతా కార్యం అన్నయ్యే చేస్తాడు." అన్నాడు సూర్యం తన ఆలోచనకు తానే ఆనందిస్తూ.

సరళ ఆశ్చర్యంతో స్థంభించి పోయింది. ఆమె మొహంలో బాధ, కళ్ళల్లో అశాంతి అలుముకున్నాయి. సూర్యం అంటే అసహ్యం అనిపించింది

"ఏమిటి సరళా అలా అయిపోతున్నావు? నీపేరుకూడాచెప్ప కుండా అన్నయ్య నిన్ను చేసుకోవడం తనకే ఇష్టంలేనట్టు అమ్మకూ నాన్నకూ చెప్పి ఒప్పిస్తాడు నిజం సరళా, అన్నయ్య విషయంలో నీకు భయం అక్కర్లేదు"

సరళ హృదయం అంతా జుగుప్సతో చీదర చీదరగా అయింది.

"నువ్వు ఇంత స్వార్థపరుడివని నేను అనుకోలేదు. మన స్వార్థంకోసం పెద్దబావ మంచితనాన్ని అంతదారుణంగా ఉపయో గించుకోవటమా? ఎంత నీచమైన పని బావా ఇది. ఒక్కసారి ఆలోచించు." అంది సరళ ఆర్ద్రత అలుముకున్న కంఠంతో.

"అవును. నేను స్వార్థపరుణ్ణే. నావస్తువును దక్కించు కోవటానికి నేను ఏమయినా చేస్తాను. ఎవర్నయినా కష్టపెడతాను. మీరంతా నిస్వార్థులు, మంచివాళ్ళు. ఎవర్నీ బాధపెట్టరు. మిమ్మల్ని మీరు బాధపెట్టుకుంటారు. నన్ను నేను చేతులారా బాధపెట్టుకోను" అంటూ విసురుగా బయటకు వెళ్ళిపోయాడు సూర్యం.

సరళ దిగాలుపడి గోడకానుకొని కూర్చుంది తను అంత నీచానికిఒడిగట్టలేదు తను ఆవిషయం పెద్దబావతో చస్తే చెప్పలేదు. మరి చెప్పకపోతే? సూర్యానికి కోపం వచ్చింది. చిన్నబావకు

పంతంఎక్కువ. వెళ్ళిపోయి తనమీద కక్ష తీర్చుకోవడానికి ఏ కాలేజీ అమ్మాయితోనో వివాహం చేసుకొని తీసుకొస్తే! తను సహించగలదా ?_సరళకు దుఃఖం పొంగుకొచ్చింది.

5

సరళ పక్కమీద అశాంతిగా పొర్లుతుంది. హృదయంలో ఆవేదన అంతకంటే అశాంతితో పొర్లుతుంది తెల్లవారి సూర్యం బావ వెళ్ళిపోతాడు. అతనికి బాగా కోపం వచ్చింది. కాని తను పెద్దబావను అంత దారుణంగా తన స్వార్థంకోసం ఉపయోగించు కోవటమా! అదిమాత్రం తనవల్లకాదు.

రాత్రంతా సరిగా నిద్రపట్టకపోవటంవల్ల సరళకు ఒళ్ళంతా నొప్పులుగావుంది. కళ్ళు మండిపోతున్నాయి. శాంతమ్మ హడావిడిగా ఇల్లంతా కలయ తిరుగుతుంది. సత్యం, తమ్ముడికి సామాను సర్దుకోవటంలో సాయపడుతున్నాడు.

బాత్ రూంలో కాళ్ళూ చేతులూ కడుక్కొని బయటకు వచ్చిన సూర్యానికి తుండు అందించింది సరళ. సూర్యం మౌనంగా అందుకున్నాడు.

"ఏంబావా! నామీదకోపం ఇంకా తగ్గలేదా ?" ప్రశ్నించింది సరళ దీనంగా. సూర్యం మాట్లాడకుండా మొహం తుడుచుకో సాగాడు.

"నాతో మాట్లాడవా బావా ?"

సూర్యం తలెత్తి చూశాడు. సరళ సోగకళ్ళలో నీరు గిర్రున తిరిగింది.

"సరళా! ఏమిటలా వున్నావు? రాత్రంతా నిద్రపోలేదూ. ఆత్రంగా అడిగాడు సూర్యం.

సరళ మాట్లాడలేదు.

"సరళా నాకోసం ఒకపని చేస్తావా ?"

"ఏమిటి ?"

"ఇక్కడ అన్నయ్యతో నీ పెళ్ళి ప్రయత్నాలు మొదలు పెట్టగానే నాకు రాస్తావా?"

దిగులుగా చూసింది సరళ.

"చెప్పు" అన్నాడు సూర్యం సరళ చేతిని తన చేతిలోకి తీసుకుంటూ.

సరళ మౌనంగా వుండి పోయింది.

"అంటే నువ్వు నన్నే చేసుకోవడం ఖాయం, అవునా?" ఉత్సాహంగా అన్నాడు సూర్యం.

సరళ సిగ్గుతో తల దించేసుకొంది.

"సరళా?" సూర్యం స్వరం ఏదో కొత్తగా వినిపించి. సరళ ఆశ్చర్యంగా అతని ముఖంలోకి చూసింది. చూపులుకూడా అదోలా ఉండి సరళ హృదయానికి గిలిగింతలు పెట్టాయి.

"సరళా! ఈ సంతోష సమయంలో నాకో బహుమతి ఇస్తావా?" చిలిపిగా చూస్తూ అన్నాడు సూర్యం.

"ఛీ బావా! అంటూ తుర్రున పరుగెత్తుతూ ఎదురుగా వస్తున్నసత్యాన్ని కొట్టుకొని పడబోయింది. పడబోతున్న సరళను పట్టుకున్నాడు సత్యం. సత్యం అలా పట్టుకున్నప్పుడు సరళకు ఏదో కొత్త అనుభూతి కలిగినట్లయింది. గాబరాగా సత్యం ముఖంలోకి చూసింది.

"ఏమిటి, మరీ చిన్నపిల్లలా! కాస్తయితే పడిపోయేదానివే." ఆ మందలింపులో ఎంతో మమతా, అభిమానం కొట్టొచ్చినట్లు కనిపించాయి సరళకు.


చిన్నగా, తప్పు చేసినదానిలా అక్కడనుంచి వెళ్ళిపోయింది సరళ. అలా వెళుతున్న సరళను చూస్తూ ఏదో ఆలోచిస్తూ ఓక్షణం నిలుచుండిపోయాడు సత్యం. త్రోవలో అన్నకు ఎదురైన సూర్యంకూడా కొంచెం గాబరాపడ్డాడు.

"ఏం తమ్ముడూ ఏదోలా వున్నావు?" సత్యం, సూర్యం ముఖంలోకి నిశితంగా చూస్తూ అడిగాడు.

"అబ్బే ఏం లేదు." అంటూనే అన్న కళ్ళల్లోకి చూస్తే ధైర్యంలేని సూర్యం అక్కడ నుంచి తప్పుకున్నాడు.

"త్వరగా తెములు రైలు టైం అవుతుంది. రంగన్న బండికూడా వచ్చింది." వెళ్ళిపోతున్న తమ్ముడితో అని సత్యం బాత్ రూం వైపు నడిచాడు బరువుగా.

(సశేషం)



బుద్ధ జయంతి

బుద్ధుడు కరుణామయ మూర్తిగా జన హృదయాలలో వెలుగుతూనే ఉన్నాడు. నేటికీ హృదయ తాపాన్ని అణిచేందుకు ప్రేమను పెంపొందించి అహింసను పాటించేందుకు త్యాగమూర్తి అయిన బుద్ధుని భావము సర్వకాలాల్లోను అనుసరించతగ్గదే కదా! ఆనాడు ఒక శాంతి దీపం వెలిగించి నూతన దృక్పథాన్ని, నూతన దృక్పథమే కాదు వినూత్న సందేశామృతాన్ని ప్రసాదించిన శాక్యకుల ప్రదీపకుడైన సిద్ధార్థుని జన్మదినం, మహా పర్వదినం: జగత్కల్యాణార్థం ఈ మహనీయుడు ప్రభవించి హింసా ప్రపూర్ణ ప్రపంచానికి తన దివ్య సందేశ సుధాంజనాన్ని అందించి కారుణ్య దీప్తులు ప్రసరించిన అత్యంత పుణ్యదినం; ఇంతేకాదు ఎన్నో కష్టాలను ఎదుర్కొని బాధా సంతప్త హృదయాలకు దుఃఖ నివారణ మార్గాన్ని బోధించిన ఆ పవిత్ర మూర్తి మహాపరినిర్వాణం చెందిన పూజనీయమైన దినంకూడా వైశాఖ పూర్ణిమనాడే.

కాగా, గౌతమ బుద్ధుని జీవితంలో ఈ పై మూడు ప్రధాన సంఘటనలు వైశాఖ పూర్ణిమనాడే అవడంవల్ల అది మూడు విధాలుగా పవిత్రంగా భాసిస్తోంది అందరికీ. ప్రపంచంలోని బౌద్ధులందరూ శ్రద్ధాసక్తితోనూ, ఆనందోత్సాహాలతోనూ దానాలు ధర్మాలు చేస్తారు. ఈ మహా పురుషుణ్ణి స్మరించి ధార్మిక జీవనానికి పునరంకితులౌతారు.

అది కపిలవస్తు నగర పరిసర ప్రాంతంలోని లుంబినీవనం. అక్కడి మహా భూరుహచ్ఛాయలో మాయాదేవి నోముల పంటగా పరమ తేజోమూర్తి ప్రభవించాడు. బాల్యంనుంచి భూత దయతో ప్రదీపం చెందింది అతని మనస్సు. శుద్ధోదన సార్వభౌముడు ఎన్నో జాగ్రత్తలు తీసుకొన్నప్పటికీ, ఎన్ని కట్టుదిట్టాలు చేసినప్పటికీ సిద్ధార్థుని దృక్పథంలో దుఃఖదేవత పడనే పడింది. దేన్ని అతడు చూడరాదో అదే అతని కంట పడింది. ఇకనేముంది. అప్పటినుంచి అతనిలో ఆనందం అంతరించి పోయి ఆలోచనా విమగ్నుడై పోయాడు. రాను రాను అతని మనస్సాగరంలో భావకల్లోల తరంగాలు చెలరేగిపోయాయి. అతనిలో నిరంతర సత్యాన్వేషణ ప్రారంభమయింది. దుఃఖం అతణ్ణి ఆవేశించింది-అంతే, ఇక దుఃఖ నివృత్తికోసం సిద్ధార్థుడు వజ్ర సంకల్పుడయ్యాడు.

ఈ కరుణా సముద్రుని నిరంతర సాధనకు దోహదకారి అయింది దుఃఖమే. లోక కల్యాణంకోసం బుద్ధుడు అనుభవించినట్లు మరెవ్వరూ అనుభవించలేదేమో దుఃఖాన్ని. నిజానికి, సిద్ధార్థునికి వ్యక్తిగతంగా దుఃఖాన్ని అనుభవించవలసిన అవసరం లేనే లేదు; సమస్త రాజభోగాలను, అతిలోక సుందరి అయిన తన యశోధరను, తన రాహులుని, ఇంతెందుకు తన సువిశాల సామ్రాజ్యాన్ని త్యజించి మహాభినిష్క్రమణం చేయవలసిన అవసరం ఏముంది కనక? లోకంలో అణగారిన దుఃఖమంతా తన దుఃఖమే అనుకొన్నాడు. దుఃఖ సంతరణమే అతని పరమధ్యేయమైపోయింది అప్పటినుంచీ.

గయలో ఆ అశ్వత్థ వృక్ష చ్ఛాయలో దీక్షా విమగ్నుడయ్యాడు. దుఃఖ కారణం తెలుసుకోడానికి అతడు మహా తపస్వి అయినాడు. ఆయన లక్ష్యం ఎంత మహోన్నతమైందో అది అంత కష్టసాధ్యమైపోయింది. అయినప్పటికీ తన దృఢ నిశ్చయం సడలలేదు. దేహం శుష్కించిపోయినా, తన తపోనిష్ఠచే సత్య దర్శన రూపమైన మహానుభూతిని సాక్షాత్కరింపచేసుకొన్నాడు. తన మార్గానికి విరాగం, విచారం, భూత దయ ప్రధాన అంశములైనాయి. ఈ మూడింటికీ వినయం; సత్యం; సేవ ఫల రూపాలయినాయి. వంచన, చౌర్యం; ద్యూతక్రియ మొదలైన చెడు మార్గాలు అవలంబించేవారికి, హింస ఆచరించేవారికి, నైతిక ప్రవర్తన లోపించినవారికి పై మార్గాలు సత్య పథాన్ని చూపగలుగుతాయి. సత్య పథాన్ని చూపడమేకాదు, వారిని సంస్కరిస్తాయి.

ఆనాడు కళింగయుద్ధంలో అశోకుడు రక్తపాతానికి పూనుకొన్నాడు. యుద్ధంలో లక్షలాది వీరులు మరణించారు. వేలమంది ఖైదీలుగా పట్టుపడ్డారు. ఎక్కడ చూచినా అసహాయుల హా హా కారాలు; వారి ఆర్తనాదాలు ప్రబలి అశోకుణ్ణి నిర్విణ్ణుణ్ణి చేశాయి. అతని హృదయం ఈ దుఃఖం చూచి మారిపోయింది. ఈ హరాత్పరిణామంతో తాను ఇక ఎన్నడూ జీవహింస చేయనని శపథం చేశాడు. ఇక అతనికి బుద్ధుని మార్గమే శరణ్యం అయిపోయింది. ధర్మచక్ర ప్రవర్తనకోసం తన జీవితమంతా సేవచేశాడు.

బుద్ధుని ధర్మ సిద్ధాంత బోధనలు, హిందూ దేశంలోనే కాక, ఖండాంతర దేశాల్లో వ్యాపించి యిప్పటికీ నిలిచిఉన్నాయి. ఆయన బోధనల్లో విశ్వాసం ఉన్నవారు-బుద్ధం శరణం గచ్ఛామి, ధర్మం శరణం గచ్ఛామి, సంఘం శరణం గచ్ఛామి "అనే త్రిరత్నాల్ని" స్మరిస్తూ ధర్మ బోధనలు చేస్తుంటారు. ఆనాటి బౌద్ధ సంఘారామాలెన్నో విద్యా కేంద్రాలుగా విలసిల్లి భారతీయ సాంస్కృతిక పురోభివృద్ధికి పాటుపడ్డాయి.

ఐహిక బంధ విముక్తికోసం పాటుపడి, శాంతి మార్గం చూపి తరుణోపాయాన్ని సాధించిన ఈ మహనీయుడు, మానవోత్తములలో మానవోత్తముడు. అసలు బుద్ధుని నామధేయం విశ్వ శాంతికే పర్యాయ పదం. ఆయన ప్రవచించిన ధర్మబోధనలు నేటి యుద్ధజ్వాలాజ్వలిత సంక్షుభిత ప్రపంచానికి శిరోధార్యమై ఉన్నాయి. ప్రపంచం శాంతిని తృణీకరించినప్పుడు ప్రజాకోటి మూర్ఛిల్లక తప్పదు. కారుణ్యాన్ని చిలికిన బుద్ధుని అహింసా సందేశమే మన భారతావని దివ్యవాణి. ఆయన అందించిన ప్రేమామృత సందేశం, దుఃఖోద్వేగ భరంతో కంపించిపోయే మానవ లోకకల్యాణ సంధాయకం. అంతర్జాతీయ విద్వేష జ్వాలలు చల్లారి, ప్రజలు నిర్భీకులై బ్రతకాలంటే, ప్రశాంత గంభీర మూర్తి బుద్ధమూర్తినుంచి ప్రసరించిన శాంతి మార్గమే శరణ్యం. ఈ మార్గాన్ని అనుసరించినప్పుడే లోకకల్యాణం సాధ్యపడుతుంది.

—ఇవటూరి కామేశ్వరరావు

బసవేశ్వరస్వామి అష్ట శత వార్షికోత్సవం

బసవేశ్వరస్వామి వారి అష్టశత వార్షికోత్సవం ఏప్రిల్ 30న హైదరాబాదులో ఘనంగా జరిగింది. ఆంధ్రప్రదేశ్ గవర్నరు శ్రీ ఖండూభాయ్ దేశాయ్ యీ ఉత్సవాలను ప్రారంభించారు. ఈ ఉత్సవ కార్యక్రమానికి రివెన్యూ శాఖా మంత్రి శ్రీ వి. బి. రాజు అధ్యక్షత వహించారు.

బసవేశ్వరుడు ప్రవచించిన బోధనలను ఆచరణలోనూ, ఆలోచనలోనూ ప్రజలు అనుసరించాలని గవర్నరు తమ ప్రారంభోపన్యాసంలో పేర్కొన్నారు. ఎనిమిది శతాబ్దాల క్రిందట బసవేశ్వరుడు కులాలు, వర్గాల మధ్య చూపించబడుతున్న వ్యత్యాసాల్ని దర్శించి వాటిని తొలగించడానికి పాటుబడ్డారని గవర్నరు తెలియజేశారు.

ప్రజలే శిక్షవిధించడానికి పూనుకోవడం మంచిదికాదని, ఎవరైనా తప్పు చేసినప్పుడు వారిని శిక్షించడానికి న్యాయస్థానాలు వున్న విషయాన్ని విస్మరించ వలదని రెవెన్యూ మంత్రి ప్రజలను హెచ్చరించారు. దొంగతనాలు చేసిన వ్యక్తులను ప్రజలే హింసించే సంఘటనలను ఆయన పేర్కొని, యీ విధమైన ఘోరణిని నాగరికత గల వ్యక్తులు గర్హించాలని అన్నారు. హరిజనులవంటి బీద, బలహీన వర్గాలవారికి ప్రభుత్వం రక్షణ కల్పించగలదని మంత్రి హామీ యిచ్చారు.

హైదరాబాదు నగర వీరశైవ సమాజం కార్యదర్శి శ్రీ పి. సిద్ధన్న సభికులకు స్వాగతం చెప్పారు.

డా॥ దివాకర్ల వేంకటావధాని, శ్రీ పి. జి. పురాణిక్, శ్రీమాన్వీ నరసింగరావు, శ్రీ కంబల కృష్ణమూర్తి, డా. శ్రీదేవి ఈ సందర్భంలో ప్రసంగించారు.

అంతకుముందు కల్నల్ ఆర్. ఎన్. వడయార్, బసవేశ్వరుని గూర్చిన గ్రంథాల ప్రదర్శనకు ప్రారంభోత్సవం చేశారు. 'వీరశైవ ధర్మం' అనే గ్రంథాన్ని శ్రీ మడమ బొంతప్ప ఆవిష్కరించారు. స్వామిబసవతీర్థ జెండా ఎగురవేశారు.



బసవేశ్వర స్వామి వారి 8వ శత వార్షిక జయంత్యుత్సవాలకు ఏప్రెల్ 30న హైదరాబాదులో ఆంధ్రప్రదేశ్ గవర్నరు శ్రీ ఖండూభాయి దేశాయ్ ప్రారంభోత్సవం చేశారు. ఈ ఉత్సవానికి రాష్ట్ర రెవెన్యూ మంత్రి అధ్యక్షత వహించారు.

దేశోద్ధారకునికి శ్రద్ధాంజలి

ప్రసిద్ధ జాతీయవాది, ప్రముఖ దానశీలి, ఆంధ్రపత్రిక వ్యవస్థాపకులు అయిన విశ్వదాత కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారి శతజయంత్యుత్సవ సందర్భంగా ముఖ్యమంత్రి శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి, ప్రముఖ నాయకులు శ్రద్ధాంజలి ఘటించారు.


ముఖ్యమంత్రి యీ సందర్భంలో ప్రసంగిస్తూ రాష్ట్రంలోని మూడు విశ్వవిద్యాలయాలలోనూ పంతులుగారి పేరున బంగారు పతకాలను ఏటా జర్నలిజంలో ఉత్తమ స్థాయి విద్యార్థులకు యివ్వాలని, పంతులు గారి కాంస్య విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని శతజయంత్యుత్సవ సంఘం నిశ్చయించిందని తెలియ జేశారు.

నాగేశ్వరరావు పంతులుగారి స్మృతి చిహ్నంగా ఒక తపాలా బిళ్ళను విడుదల చేయవలసిందిగా యీ సంఘం కేంద్ర ప్రభుత్వాన్ని కోరినట్టు కూడా ఆయన పేర్కొన్నారు.

ఈ సభకు అధ్యక్షత వహించిన పార్లమెంటు సభ్యుడు శ్రీ తెన్నేటి విశ్వనాథం, వివిధరంగాలలో నాగేశ్వరరావుగారు చేసిన సేవలను ఉటంకిస్తూ ముఖ్యంగా నాగేశ్వరరావుగారు రాజకీయ రంగంలో చేసిన అనవరతకృషిని విస్మరించలేమని అన్నారు. విజయవాడ, మద్రాసులలో వీరి స్వగృహాలు అనేక ముఖ్యమైన కాంగ్రెసు సమావేశాలకు వేదికలుగా వుండేవని తెలియజేశారు.

నాగేశ్వరరావుగారు ప్రారంభించిన 'ఆంధ్ర పత్రిక' ఆంధ్ర ప్రజల సాంస్కృతిక, రాజకీయ పునరుజ్జీవనానికి కారణభూతమైనదనీ, భారతదేశం విదేశీ ప్రభువులపాలనలో దాస్యశృంఖలా బద్ధమైయున్న సమయంలో ఆయన లక్షలాది ఆంధ్ర యువకులను తమ రచనలతో ఉత్తేజితులను చేసి స్వాతంత్ర్య పోరాటానికి సమాయత్తంచేశారని ఆయన చెప్పారు.

నాగేశ్వరరావుగారు దానశీలి, దేశభక్తుడే గాక గాంధీజీకి నిజమైన అనుయాయి అనీ, హరిజనుల అభ్యున్నతికై ఆయన చేస్తున్న సేవలకు గాంధీజీ అభినందనలను కూడా అందుకోగలిగారనీ నాగేశ్వరరావుగారి నుండి సహాయం పొందని సాంస్కృతిక సంస్థగాని, సాహిత్య సంస్థగాని ఆంధ్రదేశంలోనే లేదనీ శాసన మండలి అధ్యక్షులు శ్రీ గొట్టిపాటి బ్రహ్మయ్య అన్నారు



దేశోద్ధారకుని శతజయంతి ఉత్సవాల సందర్భంగా రవీంద్ర భారతిలో మే 6వ తేదీన రెవెన్యూ మంత్రి శ్రీ వి. బి. రాజు ప్రసంగిస్తున్న దృశ్యం. ఈ ఉత్సవానికి పార్లమెంటు సభ్యులు శ్రీ తెన్నేటి విశ్వనాథం అధ్యక్షత వహించారు.

మాతృదేశ సేవకు నాగేశ్వరరావు గారు ఆచరించి చూపిన బాటను యీ నాటి యువకులు అనుసరించ వలసిందిగా రెవెన్యూ మంత్రి శ్రీ వి బి రాజు యువకులను హెచ్చరించారు.

శ్రీ జి. కృష్ణ, డా. దివాకర్ల వేంకటావధానిగార్లు కూడా యీ సందర్భంలో ప్రసంగించారు.

ప్రభుత్వ సంగీత కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీ ఆంజనేయులు ఆధిపత్యం వహించగా ఆ కళాశాల విద్యార్థినులు పదహారు మంది వీణల విందుచేస్తూ వీణా వాద్యకచ్చేరీ జరిపారు. ప్రఖ్యాత గాయకుడు శ్రీ ఘంటశాల వెంకటేశ్వర్రావు దేశోద్ధారకునిపై కొన్ని పాటలు పాడారు.

జాతీయ నేర నిరోధక వారోత్సవం

జాతీయ నేర నిరోధక వారోత్సవం ఏప్రెల్ 16న ప్రారంభమైంది. ఈ సందర్భంగా రాష్ట్రపతి డా॥ జాకిర్‌హుస్సేన్ ఒక సందేశాన్ని యిస్తూ శాంతి భద్రతల పరిరక్షణ కేవలం పోలీసు వారొక్కరి బాధ్యతే కాదనీ, ప్రజలుకూడా యిందులో భాగస్వాములేనని పేర్కొన్నారు.

ప్రజా స్వామ్యం అంటే కేవలం పరిపాలనా వ్యవస్థ కాదని న్యాయం అత్యున్నత ప్రమాణంలో వెల్లి విరిసే ఒకానొక జీవన వ్యవస్థ అని రాష్ట్రపతి అన్నారు. ప్రజాస్వామ్యం కుల మత, వర్ణ విచక్షణ లేకుండా అందరికీ సమానావకాశాలను కలిగించడంతోపాటు వారికి కొన్ని కొన్ని బాధ్యతలను అప్పగిస్తుందనీ అలాంటి బాధ్యతలలో ముఖ్యమైనవి చట్టానికి బద్ధులై వుండడం, శాంతి భద్రతలను పరిరక్షించడం అని కూడా ఆయన తమ సందేశంలో పేర్కొన్నారు.


మూక వుమ్మడి విధ్వంసక చర్యల సందర్భంలో పోలీసువారు తీసుకునే కఠిన చర్యలకుగాను పోలీసు వారినే చివరకు ప్రభుత్వం యిబ్బందికి గురి చేస్తుందేమోనని వారు భయపడక్కర లేదని ముఖ్య మంత్రి శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి రాష్ట్ర పోలీసు శాఖకు హామీ యిచ్చారు.

ఘోషా మహల్‌లోని పోలీసు మైదానంలో జాతీయ నేర నిరోధక వారోత్సవం ప్రారంభం సందర్భంగా జరిగిన సభకు ముఖ్య మంత్రి అధ్యక్షత వహించారు నేర నిరోధక విషయంలోనూ, పరిశోధన విషయంలోనూ పోలీసు వారికి ప్రజలు తోడ్పడేందుకు ముందుకురాని ధోరణికి ఆయన తమ విచారాన్ని వ్యక్తం చేశారు. నాగరికత సమాజంలో పౌరునికి యీ విషయంలో పోలీసు వారికన్న ఎక్కువ బాధ్యత వున్నదని ముఖ్యమంత్రి అన్నారు.

ప్రభుత్వ ఆస్తులకు నష్టం వాటిల్లకుండా తల్లి దండ్రులు, ప్రజలు సహకరించ వలసిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు.

గత దశాబ్దిలో అఖిల భారత స్థాయిలో సగటు నేరాలతో పోల్చిచూస్తే మన రాష్ట్రంలో నేరాలు అతి తక్కువ సంఖ్యలో వున్నాయని ముఖ్య మంత్రి పేర్కొంటూ రాష్ట్ర పోలీసు శాఖ సేవలను ఆయన అభినందించారు. ఈ నేర నిరోధక వారోత్సవ సందర్భంగా ఒక ప్రదర్శనను ఏర్పాటు చేసినందుకు ఆయన ప్రదర్శన నిర్వాహకులను అభినందించారు.

ఈ ఉత్సవాలను ఆంధ్ర ప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయ మూర్తి శ్రీ పి. జగన్మోహనరెడ్డి ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంలో ఆయన మాట్లాడుతూ ఏనేరంకూడా ప్రజల సహకారం లేనిదే పరిశోధించడం సాధ్యం కాదనీ, పోలీసు వారినిగూర్చి ప్రజలు సరిగా అవగాహన చేసుకునే విధంగా పోలీసువారు ప్రవర్తించాలనీ, ప్రజలలో తమయెడ నమ్మకాన్ని కలిగించాలనీ ఆయన అన్నారు.



హైదరాబాదులోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ఏప్రెల్ 14వ తేదీన జరిగిన పోలీసు శాఖ మేళా ఉత్సవాల్లో రాష్ట్ర గవర్నరు శ్రీ ఖండూ భాయ్ దేశాయ్ ప్రసంగిస్తున్న దృశ్యం.

యాత్రలు

దక్షిణ దేశయాత్ర

జనసంబంధ శాఖ నిర్వహించిన దక్షిణ దేశయాత్రలో మొత్తం ముప్పయిమంది పాల్గొన్నారు. మే 16 న వీరు పర్యటన ప్రారంభించారు. వీరిలో ఎనిమిదిమంది మహిళలు కూడా వున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాలకు చెందినవారు వీరు. జనసంబంధ శాఖామంత్రి శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ సూచన, ప్రోత్సాహాల మేరకు యీ పర్యటన ఏర్పాటు చేయబడింది.

రాష్ట్ర రోడ్డు రవాణాసంస్థ బస్సులో యీ పర్యటన జరిగింది. మొత్తం పర్యటించిన దూరం 3500 కిలో మీటర్లు మొత్తం పదిహేను రోజుల పర్యటన. ఈ పర్యటనకు ఎక్కువమంది ఖమ్మం జిల్లా నుంచి వచ్చారు. ఈ దక్షిణ దేశ పర్యటనకు గాను బస్సు ఛార్జీ, భోజన వసతి కలుపుకుని మొత్తం ఒక్కొక్క వ్యక్తికి రూ 450 లు వసూలు చేయబడ్డాయి.

ఈ పర్యటనలో అనేక సుప్రసిద్ధ పుణ్యక్షేత్రాలు, ప్రసిద్ధ కళా ప్రాంతాలు, ముఖ్యనగరాలు వున్నాయి. కర్నూలు, అనంతపురం, లేపాక్షి, హిందూపూర్, నందికొండలు, బెంగుళూరు, శ్రీరంగపట్నం, మైసూరు, ఉదకమండలం, కోయంబత్తూరు, పాల్‌ఘాట్, తిరుచూరు, ఎర్నాకుళం, కొచ్చిన్, అలప్పి, క్విలన్, తిరువేంద్రం, కోవలంబీచ్, కన్యాకుమారి. తిరుచెందూరు, మండపం, రామేశ్వరం, తిరుచునాపల్లి, శ్రీరంగం, తంజావూరు, కాళహస్తి యీ పర్యటనలో చేర్చబడిన ప్రాంతాలు.

జనసంబంధశాఖ కార్యాలయం లోని సమాచార కేంద్రంలో మే 16 న జరిగిన ఒక కార్యక్రమంలో యీ దక్షిణదేశ యాత్రికు లకు వీడ్కోలు యివ్వడం జరిగింది.



జనసంబంధశాఖ నిర్వహించిన దక్షిణ దేశయాత్రలో పాల్గొన్న యాత్రికులు

ఈ సందర్భంలో రాష్ట్ర జనసంబంధశాఖ సంచాలకుడు మాట్లాడుతూ యీ పర్యటన వల్ల యితర ప్రాంతాల ప్రజల ఆచార వ్యవహారాలను అవగాహన చేసుకోవడానికి ఆస్కారం కలుగుతుందని చెప్తూ, యీ పర్యటన విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఈ పర్యటన ముగిసిన పిమ్మట యీ పర్యటన విషయంలో తగు సలహాలను యివ్వవలసిందనీ, అవి భవిష్యత్తులో మరింత సమర్థవంతంగా యిటువంటి పర్యటనలను జరిపించడానికి తోడ్పడగలవని జనసంబంధశాఖ సంచాలకుడు పర్యాటకులకు సూచించారు.

ఈ ర్యటన బృందానికి నాయకత్వం వహిస్తున్న రాష్ట్ర జనసంబంధశాఖ సహాయ సంచాలకుడు (ఫిల్మ్స్, ఫొటోగ్రఫీ) శ్రీ సి. వి నరసింహారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోనూ, బయటా పర్యటనలను అభివృద్ధి పరచడానికి అనేక చర్యలను ప్రభుత్వం తీసుకున్నదనీ, యీ విధంగా దేశంలోని వివిధ ప్రాంతాలకు పర్యటనలను ఏర్పాటుచేయడం ఆవిధమైన చర్యలలో ఒకటనీ అన్నారు

యాత్రిక విభాగ సహాయ సంచాలకుడు శ్రీ మహరాజ్ కరన్ వందన సమర్పణచేశారు.

ఆతిథ్య పథకం

ఆదరణ, ఆప్యాయతల్ని చూపించడంలో హైదరాబాదు నగరం పెట్టింది పేరు. ప్రతి ఒక్కరినీ ఆదరించి, ప్రజలమధ్య, దేశాల మధ్య సదవగాహనను, సత్సంబంధాలను మెరుగు పరచడంలో అమితంగా యీ పట్టణం తోడ్పడుతున్నది

ప్రతిరోజూ ఎంతోమంది దేశీయ యాత్రికులు, విదేశీయ యాత్రికులు హైదరాబాదుకు విచ్చేస్తుంటారు. కొంతమంది హైదరాబాదులోని కుటుంబీకులయింట అతిథులుగా, పేయింగ్ గెస్టులుగా వుండేందుకు ఎంతో ఆసక్తిని కనబరుస్తుంటారు. అటువంటివారు అతిథులుగా వుండేందుకు అనువైన కుటుంబాలు హైదరాబాదులో అనేకంవున్నాయి ఆతిథ్య పథకంక్రింద అతిథులకు ఆతిథ్యం యిచ్చే కొన్ని కుటుంబాల జాబితా ఒకటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వజనసంబంధశాఖయాపొందించదల్చింది. ఈవిధంగా ఆతిథ్యం యిచ్చేందుకు ఆసక్తి కలవారు తమ పూర్తి చిరునామాను, యితర వివరాలను హైదరాబాదు, ముకరంజాహి రోడ్డులోని జనసంబంధ శాఖ సంచాలకునికి అందజేయవచ్చు. అట్టివారి పేరు, చిరునామాలను ప్రస్తుతం ఈ శాఖ ప్రచురిస్తున్న సిటీ గైడ్‌లో అచ్చు వేయడం జరుగుతుంది.

విజయవాడలో యాత్రికుల హోటలుకు ప్రారంభోత్సవం

విజయవాడలో మే 2 న 'మనోరమ' హోటలుకు ముఖ్యమంత్రి శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి ప్రారంభోత్సవం చేశారు. ఆ హోటలులో యాత్రికులకై చేసిన చక్కటి ఏర్పాట్లను చూసి ముఖ్యమంత్రి హోటలు యాజమాన్యం వారిని అభినందించారు. దేశంలో వున్న ఉత్తమమైన హోటళ్ళతో యీ మనోరమ హోటలు సరిపోల్చదగ్గదని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. విజయవాడ పట్టణంలోని అపరిశుభ్రతను ముఖ్యమంత్రి విమర్శించారు. విజయవాడను ఒక చక్కటి ఆకర్షణీయమైన, ఆరోగ్య ప్రదమైన నగరంగా తీర్చి దిద్దేందుకు పురపాలక సంఘానికి తోడ్పడవలసిందిగా విజయవాడ పౌరులకు ఆయన విజ్ఞప్తిచేశారు.

ఈ ఉత్సవానికి జనసంబంధ, శ్రామికమంత్రి శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ అధ్యక్షత వహించారు హోటలును ఆయన పరిశీలించిన పిమ్మట, అది పర్యాటకుల హోటలుకు వుండవలసిన అన్ని ఉన్నత ప్రమాణాలనూ కలిగివున్నట్టు తమ సంతృప్తిని ప్రకటించారు.

ఈ విధమైన ఖరీదైన హోటళ్ళను నిర్మించేవారికి ప్రభుత్వం సహాయపడగలదని జనసంబంధ, శ్రామిక మంత్రి తెలియజేశారు.

మనోరమ హోటలు డైరెక్టరు శ్రీ జి. కామరాజు ముఖ్యమంత్రికి, జన సంబంధ శ్రామిక మంత్రికి స్వాగతం పలికారు శ్రీ భోజరావు వందన సమర్పణ కావించారు.

*

చిత్రసీమ

జకోస్లవేకియా చలనచిత్రోత్సవం

నగరంలో ఏప్రెల్ 12 మొదలుకొని ఒక వారంరోజులపాటు జకోస్లవేకియా చలన చిత్రోత్సవానికి చిత్రాణి టాకీసులో జనసంబంధశాఖ సంచాలకుడు శ్రీ బి ఎన్. రామన్ ప్రారంభోత్సవం చేశారు

ఈనాడు ప్రపంచంలో ముఖ్యమైన స్థానాన్ని జకోస్లవేకియా చలనచిత్రాలు ఆక్రమిస్తున్నాయి అవి ఎక్కడ పోటీలకు వెళ్ళినా ప్రథమ బహుమతులను గెలుచుకుంటున్నాయి. కార్లొవరీ అంతర్జాతీయ చలనచిత్రోత్సవాన్ని ఆస్కార్, మాస్కో అంతర్జాతీయ చలన చిత్రోత్సవాలతో సరి సమానంగా పేర్కోవచ్చు అని జనసంబంధ శాఖ సంచాలకులు శ్రీ రామన్ అన్నారు. జకొస్లవేకియా చలనచిత్ర ప్రతినిధి వర్గానికి నిర్మల్ కళా ఖండాలను శ్రీ రామన్ బహూకరించారు.

ఈ చలన చిత్రోత్సవ సందర్భంగా జరిగిన సభకు హైదరాబాదు రాష్ట్ర చలనచిత్ర వాణిజ్య మండలి అధ్యక్షుడు శ్రీ రమేష్‌చంద్ర లాహోటి అధ్యక్షత వహించారు జనసంబంధ శాఖ ఉప సంచాలకుడు శ్రీ వి వి. మాణిక్యాలరావు ప్రేక్షకులకు స్వాగతం చెప్పారు. జనసంబంధ శాఖ సహాయ సంచాలకుడు శ్రీ సి వి. నరసింహారెడ్డి వందన సమర్పణ చేశారు.



జనసంబంధశాఖ సంచాలకుడు శ్రీ బి.ఎన్. రామన్ ఏప్రెల్ 12 న చిత్రాణీ టాకీసులో జకోస్లవేకియా చలనచిత్రోత్సవానికి ప్రారంభోత్సవం చేస్తూ ప్రసంగిస్తున్న దృశ్యం

హైదరాబాద్ రాష్ట్ర చలన చిత్ర వాణిజ్య మండలి సత్కారం


జకోస్లవేకియా చలన చిత్ర ప్రతినిధి వర్గం గౌరవార్థం హైదరాబాదు బోటు క్లబ్‌లో ఏప్రెల్ 13 న హైదరాబాద్ రాష్ట్ర చలన చిత్ర వాణిజ్య మండలి ఒక సమావేశాన్ని ఏర్పాటు చేసింది. హైదరాబాదు రాష్ట్ర చలన చిత్ర వాణిజ్య మండలి అధ్యక్షుడు శ్రీ రమేష్ చంద్ర లాహోటీ అతిథులకు స్వాగతం చెప్పారు.

భారత, జకోస్లవేకియా దేశాల మధ్య చలన చిత్రాల మార్పిడివల్ల యీ యిరు దేశాల మధ్య స్నేహ బాంధవ్యాలు మరింతగా బలపడగలవని ఈ సందర్భంలో మాట్లాడుతూ జన సంబంధ శాఖ మంత్రి శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ అన్నారు.

జాతీయ ప్రయోజనాలను వెలుగులోకి తేవడంలో చలన చిత్ర పరిశ్రమ భారత దేశంలో ప్రముఖ పాత్ర వహిస్తున్నదని ఆయన తెలియ జేశారు. భారత దేశంలో కొన్ని మంచి మంచి చలన చిత్రాలు తయారు చేయబడు తున్నాయనీ, యివి యితివృత్తం దృష్ట్యానూ, టెక్నిక్ దృష్ట్యానూ అభివృద్ధి చెందిన ఏ యితర దేశాల చలన చిత్రాలకూ ఏవిధంగానూ తీసిపోవని అన్నారు. బంగారు నంది బహుమతి గెలుచుకున్న చక్రవర్తి చిత్రవారి 'సుడిగుండాలు' ను గూర్చి ప్రత్యేకంగా పేర్కొని, అది భారతీయ చలన చిత్ర పరిశ్రమలోనే విశిష్టమైనదని అన్నారు. భారత, జకోస్లవేకియా దేశాల మధ్య స్నేహ బాంధవ్యాల పటిష్ఠతకు తరచు యీ విధమైన చలన చిత్రాల మార్పిడి వుండాలని ఆయన సూచించారు.

జకోస్లవేకియా ప్రతినిధి వర్గం నాయకుడు, చలన చిత్ర నిర్మాత అయిన శ్రీ ఇరిక్ స్వబెక్ మాట్లాడుతూ జకోస్లవేకియాలో చలన చిత్రాలు జాతీయం చేయబడ్డాయనీ, అక్కడ లాభ నష్టాలు లేని సమాన ప్రాతి పదికమీద చలన చిత్రాలు నిర్మింప బడతాయని అన్నారు. 35 మి. మీ. థియేటర్లతో పాటు అనేకమైన 16 మి. మీ. థియేటర్లు అక్కడ వున్నాయని ఆయన పేర్కొన్నారు. భారత దేశంలోని ముఖ్య నగరాలలో జకోస్లవేకియా చలన చిత్రోత్సవాన్ని నిర్వహిస్తున్నందుకు ఆయన భారత ప్రభుత్వానికి తన కృతజ్ఞతలను తెలుపు కున్నారు.

సారథీ స్టూడియో వారుకూడా స్టూడియో ఆవరణలో జకోస్లవేకియా చలనచిత్ర ప్రతినిధుల గౌరవార్థం విందు ఏర్పాటు చేశారు. మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ శ్రీనివాసరావు, అన్నపూర్ణపిక్చర్స్ ప్రొడ్యూసర్ శ్రీ డి. మధుసూదనరావు ప్రతినిధులకు స్వాగతంచెప్పి స్టూడియో అంతా చూపించారు. ఆతర్వాత అతిథులకు తెలుగు చలన చిత్రాలలోని కొన్ని కొన్ని భాగాలను, సుడి గుండాలులోని కొన్ని భాగాలను చూపించారు.



జకోస్లవేకియా చలన చిత్ర ప్రతినిధి వర్గానికి ఏప్రెల్ 12 వ తేదీన బేగంపేట విమానాశ్రయంలో హైదరాబాద్ రాష్ట్ర చలన చిత్ర వాణిజ్య మండలి అధ్యక్షుడు శ్రీ రమేష్‌చంద్ర లాహోటీ, సినీ నటుడు శ్రీ అక్కినేని నాగేశ్వరరావు, జనసంబంధశాఖ ఉప సంచాలకుడు శ్రీ వి. వి. మాణిక్యాలరావు స్వాగతం చెప్పారు



జనసంబంధశాఖా మంత్రి శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ హైదరాబాదులోని ముషిరాబాదు ప్రాంతంలో సుదర్శన్ టాకీసుకు ఏప్రెల్ 18 న శంఖు స్థాపన జరిపినప్పటి చిత్రం

టోకియో లేఖలు

అట్లూరి వెంకటేశ్వర రావు

టోకియో,
20-12-1963

చిరంజీవులయిన బాబులకు మీ నాయన దీవించి వ్రాయునది ఏమనగా—

ఈ ఉత్తరంలో మీరు కోరిన విధంగా గ్రామీణ జీవితాన్ని గూర్చి విపులంగా తెలియపరుస్తాను.

గొడవలు లేని ఎన్నికలు

ఈ దేశంలో సాధారణ ఎన్నికలు ఈ సంవత్సరం నవంబరు ఇరవై ఒకటవ తేదీన జరిగినవి. ఈ దేశంలో పదికోట్ల జనాభాలో సుమారు ఐదు కోట్ల మందికి ఓట్లున్నవి. ఇక్కడ ఎన్నికలు చాలా ప్రశాంతంగా జరిగినవి. ఎన్నికలు జరిగినవని పేపర్లలో చదివి తెలుసుకోవలసినదే! ఎన్నికలకు సంబంధించిన పత్రములు గోడల మీద అంటించనీయరు. లౌడ్ స్పీకర్ల సహాయముతో ప్రజలను ఓట్లు వేయమని అడగరు అసలు ఎన్నికల రోజున శలవు కూడా లేదు ఉదయము ఏడు గంటలనుండి సాయంత్రము ఎనిమిది గంటల వరకు పోలింగు బూత్‌లు తెరిచి ఉంటాయి అందువల్ల ప్రతి ఒక్కరూ ఏవో ఒక సమయంలో వీలు చూసుకొని అచ్చటికి వెళ్ళి ఓట్లు వేసి వస్తారు శలవ లేనప్పటికీ సుమారు నూటికి డెబ్బయ్ మంది మొన్నటి ఎన్నికల్లో ఓట్లు వేశారు ప్రతి పౌరునికి తన బాధ్యత పూర్తిగా తెలుసు ఎవరికి ఓటు వేయవలెనో ఎవరి ఒత్తిడి లేకుండా తనంత తాను నిర్ణయించుకొనే శక్తి ఇక్కడి ఓటరుకు ఉన్నది. అందువలన ఎవరి ఆదేశముల అవసరము లేకయే వారు ఓట్లు వేసి. వారి ప్రతినిధులను ఎన్నుకొంటారు ఇరవై రెండవ తేదీ సాయంత్రము లోపుగా అన్ని ఫలితాలను ప్రకటించారు ఈ విధ గా, ప్రపంచంలో ఏ దేశములోను ఎన్నికలు యింత నిరాడంబరంగా జరుగవు.

చిన్నదేశం-పెద్ద జనాభా

జపాను దేశం చాలా చిన్నది ఇక్కడ జనాభా చాలా ఎక్కువ. ఉన్న భూమి చాలా భాగం కొండలు, గుట్టలు, అడవులు. మిగిలిన కొద్ది భాగం కూడా చదునైనది కాదు నదులన్నీ కొండలలో పుట్టి సముద్రంలో కలిసిపోతున్నాయి అవి మన దేశంలో వలె చదునైన ప్రదేశంలో ప్రవహించుట లేదు అట్లు చదునైన ప్రదేశంలో ప్రవహించక పోవుట వలన ఇక్కడ వ్యవసాయమంతా వర్షముమీద ఆధారపడి వున్నది పైగా శీతకాలము ఎక్కువగా మంచుకురియుట వలన మూడు నెలలు ఎటువంటి పంటలు పండవు ఇక్కడి రైతులకు సరాసరి రెండు, మూడు ఎకరముల కంటేఎక్కువ వుండదు ఈ కొద్ది భూమినీ జాగ్రత్తగా సేద్యం చేసుకొని వీలయినంత ఎక్కువ పంట పండించుటకు ప్రయత్నించెదరు.

యంత్రాలతో వ్యవసాయము

ఇక్కడ రైతులు, కూలీలు అను రెండు తెగలు లేవు. ప్రతి రైతూ ఒక కూలీ ప్రతి కూలీ ఒక రైతు రైతు తన యింటిలోని వారి సహాయంతో తన కొద్దిపాటి నేలను సేద్యం చేస్తాడు. ఇక్కడ వ్యవసాయపు పనులు చేయుటకు కూలీలు దొరకరు. అందువలన వీలయినంత వరకు చిన్న యంత్రాల సాయంతో చేయుదురు. ఇచ్చట రైతులకు ఎద్దులుగాని, గేదెలుగాని ఉండవు. ఎద్దులను గేదెలను ఉంచుటకు సరిపోవు స్థలముగాని వాటిని మేపగల స్తోమతగాని వాళ్ళకు లేదు వారికి కావలసిన పాలు ప్రభుత్వం ద్వారా అందరికీ దొరకుటచే ప్రతి రైతు గేదెలనుగాని, ఆవులనుగాని పోషించవలసిన అవసరం లేదు వ్యవసాయపు పనులకు



ఎరువుకనిమిత్తం పొలంలో వదిలివేసిన గడ్డి

చిన్న యంత్రాలను ఉపయోగించుట వలన ఎడ్లను ఉంచుకొను అవసరంలేదు ఇట్లు ఎడ్లుగాని, ఆవులుగాని, గేదెలుగాని లేకపోవుటచే రైతుల ఇండ్లన్నియు చాలా శుభ్రముగా ఉంటాయి రైతుల పనికూడ చాల సులువగుచున్నది పొలములో పండిన వరిగడ్డి అక్కడే ఉంచి ఎరువు క్రింద వాడుకొంటారు ముందు పుటలోని చిత్రంలో ఎరువు కొరకు వదిలేసిన వరి గడ్డి కుప్పలను చూడండి

ప్రతి పల్లె ఒక పట్టణమే

ప్రతి పల్లెటూరికి మంచి రోడ్లు, రైలు స్టేషను, స్కూలు, ఆసుపత్రి, పోస్టాఫీసు లాంటి అన్ని సౌకర్యాలు వున్నవి దాదాపు అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉన్నది అందువల్ల పల్లెటూరు కూడ పట్టణం వలెనే ఉంటుంది. రేడియోలోను, టెలివిజనులోను వాతావరణ వార్తలు ప్రకటిస్తారు ఆ వార్తల ప్రకారము రైతులు వారి పనులను ఏర్పాటు చేసుకొంటారు ఇక్కడ రైతులు తాము ఉపయోగించు యంత్రాలను నడుపుటకు, అవి చెడిపోయిన బాగుచేసు కొనుటకు కావలసిన సాంకేతిక జ్ఞానాన్ని కలిగి ఉంటారు ఇక్కడి స్త్రీలు కూడ అన్ని పనులు నేర్చుకొని ఉందురు. ప్రతివారు తమ వృత్తికి కావలసిన పుస్తకములు చదివి అన్ని విషయాలు విపులంగా తెలుసుకొని వ్యవహరింతురు.



జపాను యువకర్షకుడు

ఒకరిపై ఆధార పడి యుండుట వారికి చాలా చిన్నతనము. తరువాయి పుటలో ఒకరైతును, అతని భార్యనుచూడండి. వారు సహజమైన దుస్తులతో పొలంలో పనిచేయుచున్నప్పుడు తీసిన చిత్రము.

కోళ్ళ పెంపకం-కుటీర పరిశ్రమ

ఇక్కడ కోళ్ల పెంపకం ఒక కుటీర పరిశ్రమ ఆ విధంగా కోళ్లను పెంచేవారు దానికి సంబంధించిన పుస్తకాలను చదివి, అమెరికా దేశం నుండి దిగుమతి అయిన మేలు రకపు కోళ్లను జాగ్రత్తగా పెంచుతురు ఇక్కడ స్థలము తక్కువగా ఉండడం వల్ల కోళ్లను బయటకు వదలరు. ఈ కోళ్ళను గూళ్ళలోనే ఉంచి వాటికి కావలసిన ఆహారం, నీరు అన్నీ ఏర్పాటు చేస్తారు వాటికి వెల్తురు బాగా వచ్చుటకు వాటిగూళ్ళలో కూడా విద్యుత్ దీపాలను ఏర్పాటు చేస్తారు. చలికాలంలో కోళ్ళ గూళ్ళ చుట్టు హీటర్లు ఏర్పాటుచేసి వాటికి చలి తగులకుండ జాగ్రత్త పడుదురు కోళ్ళకు తగు సౌకర్యాలు ఏర్పాటు చేసి అవి వీలయినన్ని ఎక్కువ గ్రుడ్లను పెట్టునట్లు చూస్తారు

సహకార సంఘాలు - సర్వతోముఖాభివృద్ధి

ఈదేశంలో రైతు, సహకారసంఘం నుండి చాల సహాయం పొందుతున్నాడు ప్రతి రైతు సహకార సంఘంలో సభ్యుడు రైతుకు కావలసిన యంత్రాలు, ఎరువులు, విత్తనాలు ఈ సంస్థ ద్వారా అందజేయబడును రైతువద్ద పండిన వస్తువులు ఈ సంస్థ ద్వార పంపిణీ యగును రైతువద్ద పండిన వస్తువులను ఈసంస్థ కొని, అతనికి న్యాయమైన ధరలకు ముట్టచెప్పును.

ప్రభుత్వం నుండి రైతులకు అందజేయబడు సహాయం ఈ సంస్థద్వారానే వచ్చును. ఈ సంస్థలను ప్రజలచే ఎన్నుకోబడిన ప్రతినిధులు నిర్వహిస్తారు. ఇక్కడ సహకార సంఘాలు చాల ఆదర్శ ప్రాయంగా పని చేస్తున్నవి. వీటిని చూసి మన దేశంలో కూడ ఇటువంటి సంస్థలను ఎక్కువ ఏర్పాటు చేసి సమర్థవంతంగా నిర్వహిస్తారని ఆశిస్తున్నాను.

కలసి మెలసి కష్టించే కుటుంబాలు

ఇక్కడ ప్రతి రైతుకు సగటున భూమి రెండు మూడు ఎకరాల కంటె ఎక్కువ ఉండదని ఇంతకుముందు వ్రాశాను. ఆ భూమి ఇంకను చిన్నభాగము కాకుండా ఇక్కడి ప్రజలు అనేక ప్రయత్నాలు చేస్తున్నారు. ఒక కుటుంబంలోని పిల్లలందరికి ఆ భూమి మీద హక్కు ఉన్నది కాని ఇక్కడి ఆచారం ప్రకారం ఆ భూమి పెద్ద కొడుకుకే దక్కుతుంది సామాన్యంగా పెద్ద కుమారుడు పెద్ద చదువులకు వెళ్ళడు. మామూలు చదువు పూర్తయిన పిదప తండ్రితో కలిసి వ్యవసాయపు పనులను చూసుకొంటాడు. తండ్రి మిగిలిన కుమారులకు పరిశ్రమలో ఉద్యోగాలు వచ్చుటకు తగిన చదువు చెప్పించుతాడు. వారు స్వయం కృషి పై జీవనము జరుపుటకు కావలసిన అన్ని సదుపాయాలను కల్పిస్తాడు. అందువల్ల మిగిలిన వారు భూమి మీద ఉన్న హక్కును పెద్ద కుమారునికే వదలివేస్తారు. ఆడపిల్లలకు భూమిమీద హక్కు ఉన్నప్పటికీ వారి వివాహ సమయంలో కొన్ని బహుమతులు ఇచ్చి ఆ భూమిని విభజించకుండా ఉంచుటకు ప్రయత్నిస్తారు. ఇప్పుడు యువకులందరు పరిశ్రమల్లో చేరుటకే ఎక్కువ ఉత్సాహ పడుతున్నారు.

పంచాయతీ ప్రాధాన్యం

గ్రామ పంచాయతీ అనుమతిలేనిదే భూమిని అమ్మడానికి గాని కొనడానికి గాని వీలులేదు. గ్రామ జీవితంపై పంచాయతీ ప్రభావము చాల ఎక్కువగా ఉండును. ఇక్కడ చట్టాలు వేరుగా నున్నను ప్రాంతీయ ఆచారాలకు పంచాయతీ సభ్యుల అభిప్రాయాలకు విలువ ఎక్కువ ఇస్తారు. వారి వివాదాలన్నీ కోర్టుల అవసరం లేకుండానే పంచాయతీ సలహా ప్రకారం పరిష్కారమవుతాయి. సాధారణంగా వివాదాలే ఉండవు. వారు ఇంకొకరి వస్తువులకుగాని ఆస్తులకుగాని ఆశించరు. అందువల్ల భూమిధర వాటి అమ్మకము మొదలైనవన్నీ స్థానిక పంచాయతీ అనుమతితో జరుగును. భూమిని కౌలుకిచ్చే పద్ధతి ఇక్కడ లేదు. వ్యవసాయం చేసేవారికే భూమి. అందువల్ల వ్యవసాయమే వృత్తిగా గలవారికి తప్ప మిగిలినవారికి భూమియందు ఆసక్తి లేదు.

కులాలు, వర్గాలు లేని కొత్త సమాజం

ఈ దేశంలో కులాలు లేవు. ఇక్కడి పదికోట్ల మంది ప్రజలు ఒకే కులమువారు. వృత్తులనుబట్టిగాని, ఆస్తులనుబట్టిగాని వర్గభేదము లేదు. ఎవరి అభిరుచులను బట్టి వారు వృత్తులను ఎంచుకుంటారు. ప్రతి వృత్తికి కనీసపు అర్హతలు అవసరము. అందువలన వంశ పారంపర్యముగా వృత్తులను అనుసరించరు. ప్రతి వృత్తికి కొన్ని పరీక్షలు ఉండును. ఆ పరీక్షల్లో ఉత్తీర్ణులు కానియెడల ఆ వృత్తికి పనికిరారు. చివరకు పంటను వృత్తిగా ఎంచుకొనువారు కూడ సర్టిఫికేటు పొంది ఉండవలెను. ఆ సర్టిఫికేటు లేనివారిని ఎవరు ఆ వృత్తిలో నియమించరు. చాకలివారు కూడ సర్టిఫికేటులను దుకాణములలో ప్రదర్శించవలెను. అందువలన చాకలివాని కుమారుడు ఆ వృత్తి ఎంచుకొనదలచిన, దానికి కావల్సిన సర్టిఫికేటు పొందిన పిదపే ఆ వృత్తిలో జేరవలెను. అటులనే మంగలివృత్తి కూడ. ఈ వృత్తి మంచిది, ఆ వృత్తి చెడ్డది అనుభావము వీరిలో లేదు. ఏ వృత్తిలోనివారయినను వ్యక్తిగత స్వభావము బట్టి గౌరవింపబడుదురు. వారి శక్తిసామర్థ్యములనుబట్టి, చదువునుబట్టి, అభిరుచులను బట్టి తగిన వృత్తులను ఎంచుకొంటారు.

ఇల్లాలు రాగానే ఇంకొక ఇల్లు

ఇక్కడ ఇళ్లు చాలా చిన్నవని చెప్పాను. అందువలన పిల్లలు పెద్దవారయి, తమంతట తాము వేరే ఇల్లుతీసికొని కుటుంబాన్ని పోషించుశక్తి వచ్చువరకు పెండ్లి చేసుకొనరు. పెండ్లయిన వెంటనే వేరే ఇంకొక ఇంటికి తప్పక వెళ్ళిపోతారు. అందువల్ల మగపిల్లలు 25 లేక 26 సంవత్సరాలు వచ్చువరకు పెండ్లివిషయాలనుగూర్చి ఆలోచించరు. బాగా వయస్సు ముదిరిన తరువాత పెండ్లి చేసికొనడం వల్ల సామాన్యంగా వారికి ఇష్టం వచ్చిన వారినే చేసుకొంటారు. ఈ విషయంలో తల్లిదండ్రుల జోక్యము ఏమీ ఉండదు కాని వారి పెళ్లిళ్లు తల్లిదండ్రులే జరిపిస్తారు. అనగా వారి నిర్ణయాన్ని పెద్దలకు తెలిపి వారి అనుమతితో వివాహం చేసికొంటారు.



జపాను దంపతులతో రచయిత

హళ్లూ పెళ్లూలేని పెళ్లిళ్లు

ఇక్కడ పెండ్లి చాల నిరాడంబరంగా జరుపుతారు. ఇండ్లు చాల చిన్నవగుటవల్ల ఇటివద్ద పెళ్లిళ్లు చేయరు. ప్రతి గ్రామంలోను పెళ్లిళ్లు జరుపుటకు ఒక సత్రములాంటి ప్రదేశము ఉంటుంది. అక్కడ దాదాపు ఇరవై మంది బంధు మిత్రుల సమక్షంలో చాల నిరాడంబరంగా పురోహితునిచే పెండ్లి జరుపబడును. వివాహానంతరము ఒక చిన్న విందు ఏర్పాటు చేస్తారు. వివాహానికి వచ్చిన పెద్దలందరు విందారగించి ఎవరి ఇండ్లకు వారు వెళ్లిపోతారు. విందు ఏర్పాట్లన్ని హోటలులో చేస్తారు. అందువల్ల ఇంటిలో ప్రయాసపడవలసిన అవసరం లేదు. పెండ్లికి వచ్చేఅతిథులు పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెల ముఖ్య స్నేహితులు, వారి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు మాత్రమే. ఇంకెవరినీ పిలువరు. ఈ పెండ్లికి అయిన ఖర్చులు పెండ్లి కుమార్తె తరపువారు పెండ్లి కుమారుని తరపు వారు చెరిసగము భరిస్తారు.

ఇంతవరకు జపాను దేశంలోని ప్రజల జీవితాన్ని పిల్లలు పుట్టినప్పటినుండి వివాహం అయ్యేవరకు అనేక దశలలో వారినిత్య కృత్యాలనుగూర్చి, సాంఘిక పరిస్థితులు, విద్యాభ్యాసము మొదలయిన వాటిని గూర్చి వ్రాశాను. ఈ ఉత్తరాలు సాయంతో ఇక్కడ ప్రజలను గూర్చి పూర్తిగా అర్థం చేసికొని ఉంటారని భావిస్తున్నాను. మన పురాణాల్లో వర్ణించిన రామరాజ్యం వంటిదే ప్రత్యక్షంగా ఇక్కడ నాకు కనుపించింది. అందువల్ల వీరివద్దనుండి నేర్చుకొనవలసిన విషయాలు చాలాఉన్నవి. ఈ అద్భుత దేశాన్ని గూర్చి ఇంకెంతో తెలుసుకొని మనదేశాన్ని గూడ జపానువలె అభివృద్ధి చేయాలనే కుతూహలాన్ని మీలో నేను వ్రాసిన సంగతులు ఏమాత్రం గల్గించినా నా ఉత్తరాల ప్రయత్నం నూటికి నూరుపాళ్లు సఫలం అయినట్లే.

ఇట్లు,
మీ ప్రియమైన నాన్న

(సంపూర్ణం)

చైతన్యమూర్తులు

ఆది శంకరులు

భగవత్పాదులైన ఆది శంకరులు, భారతీయ వేదాంతాన్ని ప్రబోధించిన మహా ప్రవక్తలలో ఒకరు ఆయన వేదాంతిమాత్రమే కాదు. గొప్ప భక్తుడు, కవి కూడాను ఉపనిషత్తుల వేదాంత తత్త్వాన్ని మథించిన ఆయన, ఒనందరి మత విశ్వాసాలకు అనుగుణమైన సమన్వయ విధానాన్ని అనుసరించారు. ఆది శంకరులు సంస్కర్తలు కూడాను

తమ ప్రబోధనలను తరతరాల పర్యంతం అందించ గలగడానికై ఆయన దేశమంతటా మఠాలను, ఆశ్రమాలను స్థాపించారు. నేటి ఆచార్యులు, అధిపతులు వారి దివ్య ప్రబోధాలను వ్యాప్తి చేస్తున్నారు.

బసవేశ్వరుడు

కర్నాటక దేశానికి చెందిన యోగిపుంగవుడైన బసవేశ్వరుని ఎనిమిదవ శత వార్షికోత్సవాలు 1967 డిశంబరు 26న ప్రారంభమై 1968 మే మాసాంతం వరకు జరుగుతాయి. బసవేశ్వరుడు భారత దేశంలోని ప్రముఖ మతాధిపతులలో, మత బోధకులలో ఒకరు.



హిందూసమాజం ఛిన్నాభిన్నంగా అనేక కులాల క్రింద విడివడి వుండడం బసవేశ్వరునికి అమితమైన మనస్తాపం కలిగించింది. ఇది దేశ సమైక్యతకే ప్రతిబంధకం అని ఆయన భావించారు. కులాల పద్ధతికి వ్యతిరేకంగా ఆయన ఉద్యమాన్ని లేవదీశారు. 'ఏకేశ్వరవాదాన్నీ, సర్వమానవ సౌభ్రాతృత్వాన్నీ బోధించారు. బసవేశ్వరుని ఉన్నత భావాలు వివిధకులాల ప్రజలను ఆకర్షించాయి. వారంతా బహుళ సంఖ్యలో ఆయన అనుయాయులయ్యారు. మనిషి ఏ కులంలో, ఏ వర్గంలో పుట్టాడు అన్నది ప్రశ్న కాదనీ, అతడు నిష్కల్మషమైన మనసును కలిగివున్నాడా, భగవద్భక్తి కలిగి వున్నాడా లేదా అన్నదే లెక్కింపదగినదని ఆయన భావించారు, బోధించారు.

వేర్పాటు ధోరణి పనికిరాదని ఆయన తన అనుయాయులను హెచ్చరించారు. ఆరాధన అనేది ఏ ఒక్క కులానికే పరిమితమైనది కాదనీ, కుల వర్గ ప్రమేయం లేకుండా ప్రజలందరు భగవంతుని కొలవడానికి అర్హులేనని ఆయన నొక్కి చెప్పారు.

బసవేశ్వరుడు కన్నడభాషలో అనేక గేయాలను రచించారు. దేవునియెడ ఆయన అపారమైన భక్తికీ, మానవుల ఎడ ఆయనకుగల అనంతమైన ప్రేమకూ ఆ గేయాలు తార్కాణాలు. అవి వినేవారి హృదయాలలోకి సూటిగా ప్రవేశిస్తాయి.

క్రీ. శ. 1167లో బసవేశ్వరుడు తమ ముప్పయ్ అరవ ఏట కూడల సంగమంలో పరమపదించారు

గోపాలకృష్ణ గోఖలే

దేశ క్షేమానికై ఆత్మీయంగా, స్వార్థరహితంగా జీవితాన్ని అంకితం చేయడం, సత్యభావమునందు ఆదరము, విచక్షణా భావముతో పరిస్థితులను ఎదుర్కొని, తద్వారా సాధ్యమైనంత మంచినీ సత్ఫలితాలనూ సాధించాలనే దృఢసంకల్పం ఇవి గోపాలకృష్ణ గోఖలే ప్రధాన లక్షణాలు.



గోఖలే, అతని గురువు రెనెడే, చాలమంది అతని సహచరులు భారతదేశానికి బ్రిటిష్‌వారితోగల సంబంధం దైవికమని భావించారు. ఈ విధమైన వారి నమ్మకం బ్రిటిష్‌వారి సామ్రాజ్య తత్త్వాన్ని అంగీకరించడంమాత్రం గాదు. సంకుచిత సామ్రాజ్య తత్త్వానికి తన్ను శత్రువుగా గోఖలే ఇదివరకే ప్రకటించుకొన్నాడు. బ్రిటిష్‌వారి సంబంధం కొనసాగే విషయంలో గోఖలే అతని మిత్ర

బృందం అంగీకారం చూపారంటే అది కేవలం వారి పరిపాలనా అంతస్తుకు మాత్రమే పరిమిత మయ్యేవరకే గాని యితరత్రా కాదు. వారి విధంగా లక్ష్యాన్ని ఏర్పరచుకొనడం స్వాతంత్ర్యానికి విముఖులై కాదు కాని, ఆ స్వాతంత్ర్య సాధనకై అనుకూల వాతావరణాన్ని సృష్టించేందుకే.

గోఖలే స్థాపించిన సర్వెంట్సు ఆఫ్ ఇండియా సొసైటీ ఒక రాజకీయ పక్షంగాదు అది దేశ సేవాసక్తులయందు సోదర భావం పెంపొందించే ఒక సంస్థ. వర్గ, మత తత్వాలంటే గోఖలేకు గిట్టవు. పటిష్ఠమైన జాతి సమైక్యతకోసమై వారు చాల పరితపించేవారు.

గోఖలే కావించిన బడ్జెటుపై ఉపన్యాసాలు, పాలిసీ విషయాలపై వారు వెల్లడించిన అభిప్రాయాలు, దేశ సమస్యల పట్ల వారికున్న శాస్త్రీయ దృక్పథానికి తార్కాణాలు. ఆయన నిర్మాణాత్మకమైన సత్యవాది —మహాత్మాగాంధీ ఆయనను రాజకీయ గురువుగా ఎంచుకున్నారు.

రవీంద్రనాథ్ టాగూర్

భారతీయ పునరుజ్జీవనానికి దోహదంచేసిన మహామహులలో రవీంద్రనాథ్‌టాగూర్ ఒకరు తన కాలంమీద వెలుగులను వెదజల్లి చరిత్రసృష్టించినవ్యక్తి ఆయన. టాగూర్ వంటివ్యక్తి చరిత్రలో అరుదుగా అగుపిస్తారు. ఆయన జీవించిన కాలంలోగానీ, భవిష్యత్తులోగాని అటువంటివ్యక్తిని మళ్ళీ మనం చూడలేమని అనడం అతిశయోక్తి ఎంతమాత్రమూ కాదు.



టాగూరు ప్రతిభావ్యుత్పత్తులు అపూర్వమైనవి. సాహిత్యం లోని అన్నిశాఖల్లోనూ, సంగీతంలోనూ, నృత్యంలోనూ, చిత్రలేఖనంలోనూ ఆయన విశేషప్రతిభ ప్రత్యక్షంగా తొంగిచూస్తూ వుంటుంది. ఆసియాలో ఇటీవలికాలంలో ప్రభవించిన కవులందరిలోకీ ఆయన అగ్రగామి. ఆయనరచనలు అనేక భాషలలోకి అనువదింపబడ్డాయి అనేక దేశాలలోని రచయితలను, పండితులను, కళాభిమానులను, సాహితీవేత్తలను ఆయనరచనలు ఉద్దీప్తంచేశాయి.

అపూర్వ ప్రతిభా సంపత్తి, సృజనాత్మక శక్తిగల కళాకారుడు ఆయన. అందుకే ఆయన కవిత్వంలోనూ, సంగీతంలోనూ చిత్రలేఖనంలోనూ అంతవరకూ వాడుకలోవున్న అనేక సాంప్రదాయాలను త్రోసిరాజని నూతన సృష్టిచేశారు. మానవ సౌభ్రాతృత్వం, సర్వమానవ సమానతా భావాలతో విశ్వాసాన్నీ, నమ్మకాన్నీ కలిగించేందుకు తనలోని సృజనాత్మక కళా ప్రతిభల్ని ఆయన వినియోగించుకున్నారు.



మోతీలాల్ నెహ్రూ

భారత దేశపు ప్రసిద్ధ కవి రవీంద్రనాథ్ టాగూర్, ప్రముఖ నాయకుడు మోతీలాల్ నెహ్రూ ఒకే సంవత్సరంలో ఒకే నెలలోనేగాక ఒకే తేదీన కూడా జన్మించారు. దేశ చరిత్రలోనే అపూర్వమైన సంఘటన ఇది వారు ఉభయులు జన్మించిన చిరస్మరణీయమైన దివసం 1861 మే 6వ తేదీ. మహర్షి దేవేంద్రనాథ్‌కు తనయుడూ, జవహర్ లాల్ నెహ్రూకు జనకుడూ

అయిన ఇద్దరు మహా పురుషులు ఉద్భవించిన రోజు-అది దేశానికి పర్వదినం

"స్వరాజ్య పార్టీ అధినేతగా నాటి కేంద్ర శాసనసభలో ప్రతిపక్ష నాయకుడుగా మోతీలాల్ నెహ్రూ సుప్రసిద్ధుడు. ఆయన ప్రధమ శ్రేణికి చెందిన పార్లమెంటేరియన్. విఖ్యాత రాజకీయ నాయకుడు. రాజకీయ విజ్ఞతలోనూ, అనర్గళమైన వక్తృత్వం లోనూ, పార్లమెంటరీ వ్యవహారాలలోనూ, వీటన్నింటినీ మించి విశిష్ట వ్యక్తిత్వంలోనూ ఆయన కాంగ్రెసు (స్వరాజ్య పార్టీ విభాగము)లోని తమ సహచరులలో మిన్నగా భాసించారు."

ఆంధ్ర రత్న

ఆంధ్రమాత ఆదర్శపుత్రులలో ఆంధ్ర రత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్యగారు ఒకరు చరిత్రలో చెరిగిపోని ముద్రవేసిన ఆదర్శమూర్తి ఆయన. బహుముఖ ప్రజ్ఞాశాలి తన జీవితాన్ని యావత్తూ ప్రజాసేవకూ, దేశసేవకూ వినియోగించి అతి చిన్న వయసులోనే స్వర్గస్థులయ్యారు.ఆయన విద్యావేత్త. పాండిత్యమూ, విజ్ఞానమూ ఆయనలో మూర్తీభవించాయి.

దుగ్గిరాల గోపాలకృష్ణయ్యగారు సమాజానికి దూరంగా మెలగలేదు. ప్రజల మనిషి ఆయన. అసంఖ్యాకుల్ని ఉత్తేజితుల్ని చేసి విప్లవాన్ని కూడా తీసుకురాగల సమర్థులు. ఎవరినైనా ఆకర్షించగల రూపం ఆయనది. ఒకసారి ఆయన గెడ్డం పెంచారు. ఆ రోజుల్లో ఆయన రూపమే చరిత్రలో ఒకానొక ఉద్యమానికి ఉత్తేజవంతమైన చిహ్నంగా నిలిచింది. ఆయన కళ్ళల్లో కాంతి, ఆయన కంఠంలో మేఘ ఘర్జన నిండివుండేవి ఆయన కంఠం విప్పితే జనాన్ని ఉత్తేజపరచి ప్రభంజన సదృశంగా వారిని ఆవేశంతో ఊపివేయగలరు. చిన్నతనంలోనే ఆయన స్వర్గస్థులయినా, అప్పటికే పూర్ణవ్యక్తిత్వాన్ని ప్రతిష్ఠించుకుని ఆంధ్రదేశ చరిత్రలో యితిహాసాన్ని సృష్టించినవారయ్యారు.

శ్రీ సురవరం ప్రతాపరెడ్డి

సుప్రసిద్ధులైన ఆంధ్రమాత పుత్రరత్నాలలో శ్రీ సురవరం ప్రతాపరెడ్డిగారొకరు. వారు బహుముఖ ప్రజ్ఞాశాలి. అమోఘమైన వారి మేధాశక్తి, ఆధునిక తెలంగాణా రాజకీయాలపైన, సాహిత్యం, పత్రికానిర్వహణం, చరిత్ర పరిశోధనలపైన చెరగని ముద్రవేసింది. ఆంధ్రప్రదేశ్‌లో గ్రంథాలయోద్యమ వ్యాప్తికై కృషి సల్పిన వారిలో శ్రీ రెడ్డిగారొకరు. తెలంగాణా ప్రాంతంలో వారితో సన్నిహిత సంబంధంలేని సంస్థ లేదనడంలో అతిశయోక్తి లేదు. ఆ సంస్థలన్నీకూడా శ్రీ రెడ్డిగారి పరిణతి చెందిన సలహా సంపత్తుల నందుకొని వృద్ధిలోకి వచ్చినవే.

శ్రీ బడే గులామ్ అలీ ఖాన్

ఏప్రెల్ 23న హైదరాబాదులో బడేగులామ్‌అలీ ఖాన్ మరణించడంతో దేశం ఒక గొప్ప హిందూస్థానీ సంగీత విద్వాంసుని కోల్పోయినట్టయ్యింది. హిందుస్థానీ సంగీత సాంప్రదాయానికి చెందినవారు ఆయన. వారి మరణంతో సంగీత చరిత్రలోనే ఒక శకం అంతరించి పోయినట్టయ్యింది. బహుముఖ ప్రజ్ఞావంతుడైన సంగీత విద్వాంసుడాయన.

సంగీతం ఆయన రక్తంలోనే వుంది. వారి తండ్రిగారు కాశ్మీరు మహారాజుగారి ఆస్థాన విద్వాంసుడు. బడేగులామ్ అలీ కూడా తండ్రివలె చక్కటి విద్వాంసులు. అయిదేళ్ళ వయసులోనే ఆయన సంగీతాన్ని అభ్యసించారు. 1925 లో లక్నోలో జరిపిన సంగీత కచ్చేరితో వారికి విస్తృతమైన కీర్తి ప్రతిష్ఠలు వచ్చాయని చెప్తారు.

బడేగులామ్ అలీ గానం ఎంత సరళమో అంత క్లిష్టమైనది. హృదయంలో అనుభూతినీ, ఆలోచనలనూ రేకెత్తించగలశక్తి వారి గానానికి వున్నది. సామాన్య జనాన్నికూడ తన గానంతో ఆకట్టుకోగల ప్రతిభావంతుడాయన. ప్రభుత్వమూ, ప్రజలూ ఆయనను ఘనంగా సన్మానించారు, గౌరవించారు. ఆఫ్ఘనిస్థాన్‌లో స్థిరపడవలసిందిగా ఆదేశపు రాజు కోరిన కోర్కెను బడేగులామ్ అలీ తిరస్కరించారు. పాకిస్థాన్‌లో వుండాలనికూడా ఆయన తలచలేదు.

భారతదేశంమీద ఆయనకు వున్న భక్తి ప్రపత్తులకు యీ దేశం ప్రేమతో కృతజ్ఞతను తెలుపుకోగలిగింది.

శ్రీ మంతెన వెంకటరాజు

సుప్రసిద్ధ స్వాతంత్ర్య సమర యోధుడు శ్రీ మంతెన వెంకటరాజు ఏప్రెల్ 17న తమ 64 వ యేట గుంటూరు జిల్లాలోని మంతెనవారి పాలెంలో పరమపదించారు.

వెంకటరాజుగారు మూడు దశాబ్దాలపాటు సర్వశ్రీ టంగుటూరి ప్రకాశంపంతులుగారు, డా.పట్టాభిగారు, కొండావెంకటప్పయ్యగారు, కళావెంకట్రావుగారు, బులుసు సాంబమూర్తిగారి వంటి అతిరథ మహా యోధులతో సన్నిహితంగా కలిసి తిరిగారు. స్వాతంత్ర్య పోరాట కాలంలో అగ్రశ్రేణిలో లెక్కింప దగినవారు వీరు. అనేక మంది యువకులకు ఉత్సాహ ప్రోత్సాహాలను కలిగించిన వ్యక్తి. స్వాతంత్ర్య సమర పోరాట కాలంలో వీరు అనేకసార్లు కారాగార వాసం అనుభవించారు. 1942లో క్విట్ ఇండియా ఉద్యమంలో ఎంతో ఉత్సాహంగా పాల్గొని సుప్రసిద్ధులైనారు. 1946 లో బాపట్ల నుండి ఉమ్మడి మద్రాసు రాష్ట్ర విధాన సభకు ఎన్నికయ్యారు. 1956 నుండి 1962 వరకు వీరు ఆంధ్ర ప్రదేశ్ విధాన సభ సభ్యులుగా వున్నారు.

డా॥ లక్కరాజు సుబ్బారావు


ప్రసిద్ధ న్యాయవాది డా॥ లక్కరాజు సుబ్బరావు తమ 85 వ ఏట కాకినాడలో మే 3 వ తేదీన స్వర్గస్థులైనారు. అనేక సందర్భాలలో డా॥ సుబ్బారావు ఆంధ్ర విశ్వవిద్యాలయానికి వైస్-ఛాన్సలర్‌గా వ్యవహరించారు. ప్రకాశం మంత్రి మండలి నియమించిన భూసంస్కరణల సంఘానికి వీరు అధ్యక్షులుగా పని చేశారు.

★

ఆంధ్రప్రదేశ్‌లో ఉప రాష్ట్రపతి పర్యటన



ఉపరాష్ట్రపతి శ్రీ వి. వి. గిరి ఏప్రిల్ 6వ విజయవాడలోని గాంధీ కొండపైన గాంధీజీ జీవితానికి సంబంధించిన 'కాంతి-శబ్ద' ప్రసార కార్యక్రమానికి ప్రారంభోత్సవం చేశారు



నెల్లూరులో ఏప్రిల్ 5 న శ్రీ పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని ఆవిష్కరించినప్పటి చిత్రం



విజయవాడలో ఏప్రిల్ 6 న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చేనేత కార్మికుల సమావేశానికి ప్రారంభోత్సవం జరిపినప్పటి దృశ్యం



నెల్లూరులో ఏప్రిల్ 5 న 'యానాది కాలనీ' కు శంకుస్థాపన జరిపినప్పటి చిత్రం

నగరంలో

పూజ్యపాదులు శ్రీ కంచి కామకోటి పీఠాధిపతి

పూజ్యపాదులు శ్రీకంచి కామకోటి పీఠాధిపతులైన జగద్గురు శ్రీ శంకరాచార్యుల వారు 34 సం॥ల తర్వాత తిరిగి జంట నగరాలను సందర్శించడమనేది గత నెల పేర్కొన దగిన విశేషం.

వరుస క్రమంలో ఆదిశంకరుల నుండి 68 వ ఆచార్యులైన వీరి రాక విశేషంగా ప్రజల నాకర్షించింది. ఆచార్యులవారి అమూల్య సందేశామృతం గ్రోలి తరించే భాగ్యానికై స్త్రీలు, పురుషులు, పిల్లలు సికింద్రాబాద్ లోని పద్మారావు నగరానికి తండోపతండాలుగా చేరుకొన్నారు. ఎదుటి వారిని ముగ్ధులను గావించే శ్రీ ఆచార్యుల వారి వినమ్రతా, మానవతా భావాలను నగరప్రజలు వేనోళ్ళ కీర్తించారు.

సనాతన భారతీయ సంప్రదాయానికి అంకితమైపోయిన అనేక మందికి జగద్గురువుల సూక్తులు ఉపశమనాన్ని కలిగించాయి. చిన్న స్వాములు శ్రీ జయేంద్ర సరస్వతులవారు గూడా జగద్గురువుల వెంట విచ్చేశారు.

రాజధాని నగరంలో వరి పరిశోధనా శిబిరం

అఖిల భారత సమీకృత వరి అభివృద్ధి ప్రాజెక్టు (ఐ. సి. ఎ. ఆర్) వారు హైదరాబాద్ లో, వరి పరిశోధక ప్రయోగశాల నొకదాన్ని 1968 ఏప్రిలు లో నెలకొల్పారు. రాష్ట్ర వ్యవసాయ శాఖలనుండి, వ్యవసాయ విశ్వవిద్యాలయాల నుండి, పరిశోధనా సంస్థలనుండి, విదేశీ సంస్థలనుండి, అంతర్జాతీయ పరిశోధనా సంస్థ నుండి దాదాపు 100 మంది ప్రతినిధులు యిందు పాల్గొన్నారు. అఖిల భారత వ్యవసాయ పరిశోధనా సమితి మేనేజింగ్ డైరెక్టర్ డా॥ బి. పి. పాల్ కూడా విచ్చేశారు.

మహిళల హాస్టలు భవనానికి ముఖ్యమంత్రి శంకుస్థాపన

ఈ భవన నిర్మాణానికి దాదాపు 55 లక్షల రూపాయలు ఖర్చు కాగలదని అంచనా. హైద్రాబాద్ లోని కమలానెహ్రూ మహిళల పాలిటెక్నిక్ హాస్టలు భవనానికి ముఖ్యమంత్రి శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి మే 3 వ తేదీన శంఖుస్థాపన గావిస్తూ భారత దేశంలో మహిళల విద్యకు గల ప్రత్యేక ప్రాముఖ్యతను గురించి వక్కాణించారు.

మహిళల పాలిటెక్నిక్ ప్రధానభవనాన్ని అనుకొనివున్న 5 ఎకరాల స్థలంలో ఈ వుత్సవాన్ని ఏర్పాటు చేశారు. ఈ స్థలాన్ని ప్రభుత్వం విరాళంగా యిచ్చింది. ముఖ్యమంత్రి యింకా యిలా అన్నారు. "మనదేశంలో మహిళల విద్యకు అత్యంత ప్రాధాన్యత ఉంది. హాస్టల్ భవన నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం కొంత మొత్తాన్ని గ్రాంటుగా యిస్తే, రాష్ట్ర ప్రభుత్వం 10 లక్షల రూపాయల విలువచేసే 5 ఎకరాల స్థలాన్ని విరాళంగా యిచ్చింది. అనంతపురంలో మహిళల కళాశాలను స్థాపించేందుకు నేను వాగ్దానం చేశాను. ఎన్ని అవాంతరాలున్నా నా వాగ్దానాన్ని నిలబెట్టుకుంటాను"

హైదరాబాదులోని వనితా విద్యాలయానికి స్థలాన్ని విరాళంగా యిప్పించే విషయంలో చేయబడిన ప్రతిపాదనలు కూడా సానుభూతితో పరిశీలింప బడగలవని ముఖ్యమంత్రి హామీయిచ్చారు.

తాను ఎగ్జిబిషన్ సొసైటీకి అధ్యక్షుడుగా వున్నప్పుడు ప్రారంభింపబడిన పాలిటెక్నిక్ సంస్థ కావడం మూలాన, ఈ సంస్థకు కావలసిన సహాయాన్ని అందజేయడం తన నైతిక బాధ్యతని అన్నారు.


ఎగ్జిబిషన్ సొసైటీ ప్రస్తుత అధ్యక్షులూ, రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రీ అయిన శ్రీ పి. తిమ్మారెడ్డి ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు.

కర్షకుల విశ్రాంతి భవనానికి ప్రారంభోత్సవం


వ్యవసాయశాఖ మంత్రి శ్రీ పి. తిమ్మారెడ్డి ఉస్మాన్ గంజ్ వద్ద, నూతనంగా నిర్మించిన కర్షకుల విశ్రాంతిభవనానికి ఏప్రిల్ 23 వ తేదీన ప్రారంభోత్సవం జరిపారు. హైదరాబాదులోని వ్యవసాయోత్పత్తుల విక్రయ సంఘంవారు లక్షరూపాయల ఖర్చుతో ఈ విశ్రాంతి భవనాన్ని నిర్మించారు. తాము పండించిన వుత్పత్తులను హైదరాబాదులో విక్రయింప దలచిన రైతులు, నామమాత్రమైన రుసుము చెల్లించి, నిర్భయంగా ఈ విశ్రాంతి భవనంలో మకాం చేయవచ్చు.

కమ్యూనిటీ హాలుకు ప్రారంభోత్సవం


లోక్ సభ స్పీకర్ శ్రీ ఎన్. సంజీవరెడ్డి, మే 13 న సైదాబాదులో రు. 25,000 ల ఖర్చుతో మునిసిపల్ కార్పొరేషన్ నిర్మించిన కమ్యూనిటీ హాలుకు ప్రారంభోత్సవం చేశారు. మునిసిపల్ కార్పొరేషన్ నిర్మించిన కమ్యూనిటీ హాలులలో యిది 63వది. 1965 ఆగస్టులో యీ హాలుకు శంకుస్థాపన జరిగింది. వివాహాలు, యితర సమావేశాలకు రు. 10/- ల చార్జీపై యీ హాలులను ప్రజలకు యిస్తుంటారు. 28 కమ్యూనిటీ హాలులలో ఇండోర్ ఆటలను కూడ నిర్వహిస్తున్నారు.



సనత్ నగర్‌లోని ఇ. ఎస్. ఐ. ఆసుపత్రిలో అదనంగా నిర్మించిన 60 పడకల విభాగానికి గవర్నరు ప్రారంభోత్సవం చేశారు




లీగ్ ఆఫ్ అరబ్ స్టేట్స్ మిషన్ ముఖ్య ప్రతినిధి శ్రీ అబ్బాస్ షేక్ ఎల్ నసర్ ఏప్రిల్ 28 న గవర్నరును కలిసినప్పటి చిత్రం




సారస్వత పరిషత్తు హాలులో ఏప్రిల్ 27 న 'అంతర్ భారతి' కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ గవర్నరు ప్రారంభోత్సవం జరిపినప్పటి చిత్రం




సేద్యపు నీటి విషయాల మంత్రి శ్రీ కీలం సిద్దారెడ్డి ఏప్రిల్ 16 న మైసారంలోని నిజాం బోయిస్ టౌన్‌లో వార్షికోత్సవ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు



హైద్రాబాదులో ఏప్రెల్ 3 న 'జర్నలిస్టుల కాలనీ' కి ముఖ్య మంత్రి శంకుస్థాపన చేశారు. ఆ నాటి ఉత్సవానికి రెవెన్యూమంత్రి శ్రీ వి. బి. రాజు అధ్యక్షత వహించారు



నల్లకుంటలోని 'కమలానెహ్రూ ఆర్ట్ సెంటర్' వార్షికోత్సవ సందర్భంగా ఏప్రెల్ 16 న విద్యాశాఖ మంత్రి శ్రీ టి. వి. రాఘవులు ప్రసంగిస్తున్న దృశ్యం



వర్తమాన నర్తకి కుమారి బి. ఎన్. రమాదేవి ఇటీవల రవీంద్రభారతిలో నృత్య ప్రదర్శన యిచ్చిన సందర్భంలో ముఖ్యమంత్రి, సహకారశాఖా మంత్రి, ఆమె గురువుగారైన నటరాజ రామకృష్ణగార్లతో.

జిల్లాలనుంచి

అగ్నిబాధితులకు ఆర్థిక సహాయం

గోపువరపు గూడెంలో జరిగిన అగ్నిప్రమాదానికి గురి అయిన 70 మంది మృతులకు చెందిన సన్నిహిత బంధువులకు రూ. 200/-ల చొప్పున రాష్ట్రప్రభుత్వం ఆర్థిక సహాయం మంజూరు చేసింది. ఈ ప్రమాదంలో గాయపడిన 60 మందికి కూడ ఒక్కొక్కరికి రూ. 100/-ల చొప్పున ప్రభుత్వం యిచ్చింది. మచిలీపట్నం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న యీ క్షతగాత్రులకు కృష్ణాజిల్లా కలెక్టరు డబ్బు అందచేశారు

దానికితోడు యీ అగ్నిప్రమాదానికి గురి అయిన పేదలకు దాతలయిచ్చిన ఆహార పదార్థాలు, వస్త్రాలనుకూడా పంపిణీ చేశారు.

ఇతోధిక వ్యవసాయ పరిశ్రమలకై విజ్ఞప్తి

వరంగల్లు జిల్లా పరిషత్తు అధ్యక్షులు శ్రీ పి. ధర్మారెడ్డి, ఏప్రెల్ 29న జిల్లా వ్యవసాయ పరిశ్రమల సమావేశానికి ప్రారంభోత్సవం చేశారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన జిల్లా కలెక్టర్ శ్రీ ఎం. ఎ. హలీం ప్రసంగిస్తూ, ప్రాంతీయ అభివృద్ధి పథకంక్రింద కేటాయించిన రూ. 4 కోట్లలో ఒకకోటి రూపాయలు జిల్లాలో వ్యవసాయ పరిశ్రమల నిమిత్తం కేటాయించారని అన్నారు. వ్యవసాయ పరికరాలు, విద్యుచ్ఛక్తి, ఆయిల్ ఇంజన్ల పరిశ్రమలనుగూర్చి యీ సమావేశంలో చర్చించారు.

జిల్లా పరిషత్తు అతిధి గృహానికి ప్రారంభోత్సవం

రాష్ట్ర కమ్యూనికేషన్స్ శాఖామంత్రి శ్రీ జె. వి. నర్సింగరావు, మే 8 న విశాఖపట్నంజిల్లా పరిషత్తు అతిధిగృహానికి ప్రారంభోత్సవంచేశారు. యాత్రికులకు సౌకర్యం కల్పించే నిమిత్తం జిల్లా పరిషత్తులు అతిథి గృహాలను నిర్వహించాల్సిన ప్రాముఖ్యతను గూర్చి ఆయన నొక్కిచెప్పారు జిల్లా పరిషత్తు అధ్యక్షులు శ్రీ సాగి సీతారామరాజు అధ్యక్షత వహించారు.

బర్మానుంచి వచ్చిన భారతీయులకు కొత్తకాలనీ

బర్మానుంచివచ్చిన భారతీయులకు వసతి కల్పించే నిమిత్తం విశాఖపట్నంలో గృహాలను నిర్మించడానికి స్థలాన్ని ఎన్నికచేశారు. దీనికై రు. 12 లక్షలు ఖర్చు అవుతుంది. నిధుల కేటాయింపు నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి వ్రాసింది. మే 6 న విశాఖపట్నం సందర్శించిన జనసంబంధ, శ్రామిక మంత్రి శ్రీ కొండాలక్ష్మణ్ బాపూజీని, బర్మా ఆంధ్రుల సంఘంతరపున శ్రీ ఎం. వెంకటేశ్వర్లు: శ్రీ టి. వి. సుందరం, శ్రీ అర్జునరావు కలుసుకుని గృహాల నిర్మాణం, ఋణాల పంపిణీలకు సంబంధించిన విజ్ఞాపన పత్రాన్ని అందజేశారు బర్మానుంచివచ్చిన దాదాపు 5000 మంది నిర్వాసితులు విశాఖపట్నంలో ఉన్నారు. శ్రామిక మంత్రి ప్రసంగిస్తూ రు 200 నుండి 300 లకు ఉన్న వ్యక్తిగత ఋణాలను రు 2000 లకు పెంచారని అన్నారు.

గ్రామలక్ష్మి శిక్షణ శిబిరం

సిద్ధిపేట పంచాయతీ సమితి, దుద్దేడలో మే నెలలో రెండు రోజులపాటు గ్రామలక్ష్మి శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు.

గోకినేపల్లికి రక్షిత మంచినీటి సరఫరా

ఖమ్మం పంచాయతీ సమితిలోని గోకినేపల్లి గ్రామంలో మే 7 వ తేదీన రక్షిత మంచినీటి సరఫరా పథకానికి ప్రారంభోత్సవం జరిగింది జిల్లా పరిషత్తు అధ్వర్యంలో ఇటువంటి పథకం అమలు జరగడం యిదే ప్రథమం గ్రామంలో మొత్తం 12 కుళాయిలను అమర్చారు వాటిలో రెండింటిని హరిజనవాడలో నెలకొల్పారు వీటిద్వారా గ్రామానికి రక్షిత మంచినీటిని సరఫరా చేస్తారు.

ధర్మశాలలకు ప్రారంభోత్సవం

కరీంనగర్ జిల్లాలోని వేములవాడలో మే నెలలో రాష్ట్రపరిశ్రమల శాఖా మంత్రి శ్రీ బి వి. గురుమూర్తి రెండు ధర్మశాలలకు ప్రారంభోత్సవం చేశారు. వేములవాడ శ్రీ రాజ రాజేశ్వర దేవస్థానంవారి ఆధ్వర్యంలో సుమారు రూ. 61,300 ల ఖర్చుతో ఈ ధర్మశాలలను నిర్మించారు. సికింద్రాబాదు వాస్తవ్యులు శ్రీ వంగల హనుమంతరావు రూ. 25,000 ల విరాళం యిచ్చారు.


నిజామాబాదులో బాల విహార్

నిజామాబాదులో సుమారు ఒక లక్ష రూపాయల ఖర్చుతో నిర్మించిన బాల విహార్ భవనానికి, మే 3వ తేదీన శ్రీమతి రాఘవమ్మ బ్రహ్మానందరెడ్డి ప్రారంభోత్సవం చేశారు.


నిజామాబాదులోని జిల్లా హెడ్క్వార్టర్స్ ఆసుపత్రిలో కొత్తగా నిర్మించిన బాలల వార్డు భవనానికి కూడా శ్రీమతి రాఘవమ్మ బ్రహ్మానందరెడ్డి ప్రారంభోత్సవం జరిపారు. ఈ భవన నిర్మాణానికి సుమారు రూ. 32,000 లు ఖర్చయ్యింది.

పంచాయతీ ఘర్ ప్రారంభం


ఆర్మూర్ పంచాయతీ సమితిలోని ఖుదవాస్‌పూర్ గ్రామంలో మే 4 వ తేదీన, నిజామాబాదు జిల్లా పరిషత్తు అధ్యక్షుడు శ్రీ కె. ఆర్. రాజారెడ్డి పంచాయతీఘర్‌ను ప్రారంభించారు.



శ్రీమతి రాఘవమ్మ బ్రహ్మానందరెడ్డి నిజామాబాదులో
బాలవిహార్‌కు మే 3 వ తేదీన ప్రారంభోత్సవం
జరిపినప్పటి చిత్రం





ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఏప్రెల్
7 వ తేదీన సంగారెడ్డిలో ఊరేగింపు
జరిగినప్పటి దృశ్యం



ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి ఏప్రెల్ 21 న భువనగిరిలో పశుగ్రాస మిశ్రమ యంత్రానికి ప్రారంభోత్సవం చేశారు

PUBLISHED BY THE SANCHALAK OF JANA SAMBANDHA SHAKA, ANDHRA PRADESH. AND PRINTED BY THE DIRECTOR OF PRINTI
GOVERNMENT OF ANDHRA PRADESH, AT THE GOVERNMENT CENTRAL PRESS, HYDERABAD.




Regd. No. H. 133